

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 132

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

శనివారం 2-8-2025



సుంకాలు ఇక అధికారికం

భారత్‌పై ప్రకటించిన 25 శాతం సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారిక ముద్ర వేశారు.

- వివరాలు 6లో▶



'ఎఫ్-35' కొనుగోళ్లు బంద్!

అమెరికా నుంచి ఎఫ్-35 ఫైటర్ జెట్స్ సహా రక్షణ పరికరాల కొనుగోలును భారత్ నిలిపివేయనున్నట్లు తెలిసింది.

- వివరాలు 6లో▶



రష్యా సమీపంలోకి...

అమెరికా శుక్రవారం రెండు అణు జలాంతర్గాములను రష్యా సమీపంలో మోహరించింది.

- వివరాలు 6లో▶

కాళేశ్వరం నివేదికపై కమిటీ

అధ్యయనానికి ఇరిగేషన్, న్యాయ, జీఏడీ శాఖల కార్యదర్శులతో త్రిసభ్య కమిటీ

- నివేదికను అధ్యయనం చేసి సారాంశాన్ని సిద్ధం చేసే బాధ్యత
- 4వ తేదీన ఇదే సింగిల్ పాయింట్ ఎజెండాగా మంత్రివర్గ సమావేశం
- సీఎం రేవంత్‌రెడ్డికి కమిషన్ నివేదిక అందించిన మంత్రి ఉత్తమ్
- కేబినెట్‌లో చర్చ తర్వాత అసెంబ్లీలోనూ చర్చకు పెట్టే యోచన
- ఆ తర్వాతే బాధ్యులపై చర్యలకు సిద్ధం కావాలని సర్కారు భావన



పీసీ ఘోష్ కమిషన్ నివేదికతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, వేం నరేందర్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, సీఎస్ రామకృష్ణారావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజీల నిర్మాణంలో సాంకేతిక లోపాలు, అవినీతిపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ (పీసీ ఘోష్) కమిషన్ సమర్పించిన నివేదికపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, న్యాయశాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతిని కమిటీలో సభ్యులుగా నియమించింది. నివేదికను అధ్యయనం చేసి.. దాని సారాంశం (జిస్ట్) సిద్ధం చేసే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించింది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా తీసుకోవాల్సిన చర్యలను ఖరారు చేసేందుకు త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ నెల 4వ తేదీన ఈ నివేదికపై చర్చించడానికి సింగిల్ పాయింట్ ఎజెండాతో మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఆ సమావేశంలో నివేదికపై విస్తృతంగా చర్చించి తదుపరి తీసుకోవాల్సిన చర్యలను ఖరారు చేసే అవకాశం ఉంది.

సీఎం చేతికి నివేదిక

జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డికి నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి కాళేశ్వరం కమిషన్ నివేదికను శుక్రవారం సీల్డ్ కవర్లలో అందజేశారు. నివేదికను అందుకున్న వెంటనే దానిపై అధ్యయనం కోసం కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశాలు జారీచేశారు. 4న జరిగే మంత్రివర్గ సమావేశంలోపు నివేదిక సారాంశాన్ని ఈ కమిటీ అందించనుంది. కేబినెట్‌లో చర్చించిన తర్వాత రానున్న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో నివేదికను ప్రభుత్వం సభ ముందుంచే అవకాశాలు ఉన్నాయి. శాసనసభలో దీనిపై చర్చించాకే తదుపరి చర్యల దిశగా అడుగులు పడతాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, నివేదిక అందించే సమయంలో అక్కడే ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సీఎం కొద్దిసేపు

మిగతా 3వ పేజీలో ▶

కష్టం మీది... అధికారం మాది!

- కమ్యూనిస్టుల సహకారం వల్లే మేం అధికారంలోకి వచ్చాం
- మరోసారి మేము గెలిచేందుకు సహకారం అందించండి
- నేడు ఆవారాగాళ్లు కూడా జర్నలిస్టు ముసుగేసుకుంటున్నారు
- నవ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి

- వివరాలు 10లో▶

గత ప్రభుత్వ వైఫల్యంతోనే వైటీపీఎస్ పనుల్లో జాప్యం

- యూనిట్-1ను జాతికి అంకితం చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మంత్రులు లక్ష్మణ్, ఉత్తమ్, కోమటిరెడ్డిలతో కలిసి సమీక్ష

3 లో



వైటీపీఎస్‌లోని యూనిట్-1ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో ఉత్తమ్, గుత్తా, కోమటిరెడ్డి, అడ్లూరి తదితరులు



రేవంత్ మౌనం వల్లే లోకేశ్ బరితెగింపు

ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్‌రెడ్డి లోపాయికారీ ఒప్పందం

- సాగునీటి రంగంపై లోకేశ్‌కు అవగాహన లేక అభాసుపాలు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు గండికొడితే బీఆర్‌ఎస్ పార్టీ సహించదు
- బనకచర్లను ఎట్లా అడ్డుకోవాలో మాకు తెలుసు
- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు

10 లో

బీఆర్‌ఎస్‌కు ఎంపీలు ఉంటే లోక్‌సభలో కొట్లాడేవారు

- బనకచర్లపై రాజకీయ, న్యాయపరమైన పోరాటం
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేలా సభ
- సుప్రీం తీర్పు నేపథ్యంలో ఉపఎన్నికలు ఖాయం
- కాంగ్రెస్, బీజేపీ ఎంపీల చేతగానితనంతో తెలంగాణకు అన్యాయం



ముఖ్య నేతలతో కొనసాగుతున్న కేసీఆర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: బనకచర్ల లింకు ప్రాజెక్టును నిర్మించి తీరుతామని ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని ఎండగట్టాలని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌కు లోక్‌సభలో డజను మంది ఎంపీలు ఉంటే బనకచర్ల అంశంపై గట్టిగా కొట్లాడేవారని పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీల చేతగానితనంతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బనకచర్లపై రాజకీయ, న్యాయపరమైన పోరాటానికి బీఆర్‌ఎస్ సన్నద్ధం కావాలని ఆదేశించారు. సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పాటు బహిరంగ సభ నిర్వహించాలనే అభిప్రాయాన్ని కేసీఆర్ వ్యక్తం చేశారు. ఎర్రవల్లి నివాసంలో మూడు రోజులుగా ముఖ్య నేతలతో భేటీ నిర్వహిస్తున్న కేసీఆర్ శుక్రవారం కూడా సమావేశం కొనసాగించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు

మిగతా 10వ పేజీలో ▶

పార్లమెంట్‌లో ఆగని రగడ

- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై వెంటనే చర్చించాలని విపక్షాల పట్టు
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా

6 లో

ఓట్ల చౌర్యంపై అణు బాంబు లాంటి సాక్ష్యం ఉంది

- అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు శిక్ష అనుభవించాల్సిందే
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ స్పష్టీకరణ

6 లో

ఆరోపణలు పట్టించుకోవద్దు: ఈసీ

6 లో



శుక్రవారం పార్లమెంట్ వెలుపల నిరసన తెలుపుతున్న విపక్ష ఎంపీలు. చిత్రంలో టీఆర్ బాలు, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గే, ఎ. రాజా తదితరులు

న్యూస్‌రీల్

సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక



ఉపరాష్ట్రపతి పదవి ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 9న పోలింగ్ జరపనున్నట్లు ఎన్నికల కమిషన్ శుక్రవారం ప్రకటించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం ఉమ్మడి అభ్యర్థిని బలపచాలని చూస్తోంది.

- వివరాలు 6లో▶

అత్యాచారం కేసులో ప్రజ్వల్ రేవణ్ణ దోషి



పనిమనిషిపై రేప్ కేసులో మాజీ ప్రధాని హెచ్.డి.దేవేగౌడ మనవడు, జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు శుక్రవారం దోషిగా నిర్ధారించింది. నేడు శిక్ష ఖరారు చేయనుంది.

- వివరాలు 6లో▶

కేసీఆర్, హరీశ్ సంతకాలతోనే బనకచర్ల



గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఏపీకి తాకట్టు పెట్టిందని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. కేసీఆర్ తప్పును సరిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

- వివరాలు 10లో▶

బోధపడని 'పీఎంశ్రీ'



బోధనలో విప్లవాత్మక మార్పు లు తెచ్చే పీఎంశ్రీ(ప్రధాన్‌మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలు గాడిన పడడం లేదు. రాష్ట్రంలో గతేడాది నుంచి 'నూతన విద్యావిధానం 2020'లో భాగంగా కేంద్రం పీఎంశ్రీని అమలు పరుస్తోంది.

- వివరాలు 5లో▶



71వ జాతీయ సినీ అవార్డులు

తెలుగు చిత్రం మెరిసింది

ఏడు అవార్డులతో హవా

తెలంగాణ పల్లె పాటను జాతి యావత్తూ మెచ్చింది...
హనుమంతుడి శక్తేంతో తెలిసింది...
ఆడపిల్ల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తే అదరగొట్టాల్సిందే...
బేబీ ప్రేమ మలుపులు తీసుకుంటే... అవార్డు దాకా పోవాల్సిందే...
ప్రేమ పాట పాడితే... అవార్డు రావాల్సిందే...
తెలుగు చిత్రం అవార్డుల పరంపరతో మురిసిపోవాల్సిందే.

71వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తెలుగు చిత్రం మెరిసింది... ఏడు అవార్డులు దక్కించుకుని హవా చాటింది. 'భగవంత్ కేసరి' ప్రాంతీయ ఉత్తమ చిత్రం విభాగంలో అవార్డు దక్కించుకోగా, 'హను-మాన్, బలగం, బేబీ' చిత్రాలు సాంకేతిక విభాగాల్లో సత్తా చాటాయి. నటన విభాగంలో బాల నటి సుకృతీ వేణి బండ్రెడ్డి అవార్డు దక్కించుకుంది. మొత్తం ఏడు అవార్డులతో తెలుగు సినిమా మురిసింది. షారుక్‌ఖాన్, విక్రాంత్ మెస్సీ జాతీయ ఉత్తమ నటులుగా ఎంపికవ్వగా రాణీ ముఖర్జీ జాతీయ ఉత్తమ నటిగా ఎంపికైంది.

12 లో



గొర్రెల స్కామ్

రూ.1,000 కోట్లపైనే!

స్వాధీనం చేసుకున్న ఆధారాల ప్రకారం అంచనా వేస్తున్నాం

- గొర్రెలు కొనకుండానే.. లబ్ధిదారులు లేకుండానే నిధులు మళ్లించారు
- 200 మ్యూల్ బ్యాంకు ఖాతాల్లోకి గొర్రెల కొనుగోలు సొమ్ము పంపారు
- ఈ ఖాతాలకు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో లింక్‌లు గుర్తించాం
- నాటి మంత్రి తలసాని ఓఎస్డీ కల్యాణ్ ఇంట్లో సోదాల్లో కీలక పత్రాలు
- వివరాలు వెల్లడించిన ఈడీ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం



సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకంలో రూ.వెయ్యి కోట్లకుపైనే గోల్‌మాల్ జరిగినట్టు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అంచనాకు వచ్చారు. ఈ మేరకు ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. మొత్తం 200లకు పైగా మ్యూల్, డమ్మీ బ్యాంక్ అకౌంట్లతో ప్రభుత్వ అధికారులు, ప్రైవేట్ వ్యక్తులు, బ్రోకర్లు కలిసి సర్కార్ ఖజానాకు గండి కొట్టినట్టు ఈడీ వెల్లడించింది. గొర్రెల పంపిణీ పథకం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం ఎనిమిది ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో పలు కీలక ఆధారాలు లభించినట్టు ఈడీ అధికారులు తెలిపారు. నాటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఓఎస్డీగా ఉన్న జి.కల్యాణ్‌కుమార్, కొందరు వినియోగదారులు, మరో మధ్యవర్తి ఇంట్లో ఈ సోదాలు చేసినట్టు పేర్కొన్నారు. సోదాల్లో భాగంగా 200 డమ్మీ, మ్యూల్ అకౌంట్లకు చెందిన బ్యాంక్ డాక్యుమెంట్లు, చెక్, పాస్ బుక్స్, డెబిట్ కార్డులు, 31 మొబైల్ ఫోన్లు, 20కి పైగా సిమ్ కార్డులను స్వాధీనంచేసుకున్నట్టు తెలిపారు. ఈ అకౌంట్ల ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌కు జరి గిన లావాదేవీల లింకులను కూడా ఈడీ అధికారులు గుర్తించారు. గొర్రెల పంపిణీ పథ కంలో కొల్లగొట్టిన కోట్ల రూపాయలను దారి మళ్లించేందుకు బెట్టింగ్ యాప్స్‌ను ఉపయోగించినట్టు ఈడీ ఆధారాలు సేకరించింది.

రూ.2.1 కోట్లతో మొదలై.. రూ.వందల కోట్లకు


గొర్రెల పెంపకం, అభివృద్ధి పథకం (షీప్ రియరింగ్ డెవలప్‌మెంట్ స్కీం-ఎస్‌ఆర్‌డీఎస్) కేసు ఆది నుంచి కీలక మలుపులు తిరుగుతోంది. తమ వద్ద కొనుగోలు చేసిన

మిగతా 2వ పేజీలో ▶





అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ).. నిపుణుల నియామకాల్లో తొలి స్థానంలో నిలిచి మన దేశం ప్రపంచం ఔరా అనిపించేలా చేసింది. మొత్తం ఏఐ నైపుణ్యాల్లో.. అత్యధిక నైపుణ్యాలున్న దేశం అమెరికా కాగా, రెండో స్థానంలో భారత్ ఉంది. అంటే అగ్రరాజ్యంతో నువ్వా నేనా అన్నట్టు భారత్ పోటీపడుతోంది. పేటెంట్లు.. అందులో మళ్లీ ఏఐ పేటెంట్ల విషయంలో మాత్రం మనం చాలా వెనకబడి ఉన్నాం.



ఏఐ.. తగ్గేదేలే!

ప్రపంచంలో అత్యధిక ఏఐ నైపుణ్యాలు కలిగిన ఐటీ ఇంజనీర్లు ఉన్న దేశాల్లో యూఎస్ టాప్–1లో నిలిచింది. మొత్తం ఏఐ నైపుణ్యాల్లో.. ఈ దేశంలోని ఐటీ ఇంజనీర్లలో సగటున 2.63 శాతం నైపుణ్యాలు ఉన్నాయి. మనదేశంలో ఇది 2.51 శాతంగా ఉంది. ఈ విషయంలో యూకే, జర్మనీ, బ్రెజిల్, కెనడా, ఫ్రాన్స్, స్పెయిన్ మన కంటే వెనుకబడి ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐటీ ఇంజనీర్లలో ఏఐ నిపుణుల వాటా 1 శాతమే. భారత్‌లో లింక్డ్‌ఇన్ ప్లాట్‌ఫామ్‌పై గత ఏడాది జరిగిన మొత్తం నియామకాల్లో 33.39 శాతం ఏఐ సంబంధ రోల్స్ ఉండడం విశేషం. ఈ స్థాయిలో ఏఐ రిక్రూట్‌మెంట్ జరగడంతో ప్రపంచంలోనే మనం టాప్‌లో నిలిచాం. ఏఐ పబ్లికేషన్ల విషయంలో కూడా 2013– 23 మధ్య 9.22 శాతం వాటాతో అమెరికా కంటే మనమే ముందున్నాం. ఈ విషయంలో చైనా 23.20 శాతంతో మొదటి స్థానంలో ఉంది.

అగ్రరాజ్యంతో పోటీపడుతున్న భారత్

నియామకాల్లో ప్రపంచంలో మనమే మేటి.. అత్యధిక ఏఐ నైపుణ్యాలతో రెండో స్థానం

3 టాప్ ఐటీ కంపెనీల్లో నియామకాల జోరు

పనిచేస్తున్న ఏఐ నిపుణులు 2.5 లక్షలకుపైనే


2024లో ఏఐలో ప్రైవేట్ పెట్టుబడులు దేశాలవారీగా (బిలియన్ డాలర్లలో)

యూఎస్	109.08
చైనా	9.29
యూకే	4.52
స్వీడన్	4.34
కెనడా	2.89
ఫ్రాన్స్	2.62
జర్మనీ	1.97
యూఏఈ	1.77
ఇజ్రాయెల్	1.36
దక్షిణ కొరియా	1.33
భారత్	1.16

- సాక్షి, స్పెషల్ డెస్క్

మొత్తం ఏఐ నైపుణ్యాల్లో.. అత్యధిక నైపుణ్యాలున్న దేశం అమెరికా కాగా, రెండో స్థానంలో భారత్ ఉంది. లింక్డ్‌ఇన్ వేదికపై ఐటీలో ఆయా దేశాల నైపుణ్యాల శాతం..

యూఎస్	2.63
భారత్	2.51
యూకే	1.4
జర్మనీ	1.32
బ్రెజిల్	1.31
కెనడా	1.3
ఫ్రాన్స్	1.23
స్పెయిన్	1.1



1.0 ప్రపంచ సగటు

2024లో లింక్డ్‌ఇన్ ప్లాట్‌ఫామ్‌పై మొత్తం నియామకాల్లో ఏఐ వాటా శాతాల్లో

భారత్	33.39
బ్రెజిల్	30.83
సౌదీ అరేబియా	28.71
స్లోవేనియా	28.21
రొమేనియా	27.31
కెనడా	26.13
సింగపూర్	24.97
యూఏఈ	24.88
యూఎస్	24.73

పరిశోధకుల్లో వెనకడుగే..

అంతర్జాతీయంగా ఏఐ పరిశోధకుల్లో టాప్–2 శాతంలో మనవాళ్లు లేకపోవడం నిరాశపరుస్తోంది. ఈ విషయంలో యూఎస్, చైనా ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. మరో ముఖ్యమైన విషయం.. మన ఏఐ నిపుణులు మనదేశం నుంచి తరలిపోవడం. గత ఏడాది లింక్డ్‌ఇన్ ప్లాట్‌ఫామ్‌పై.. భారత్‌లో సగటున ప్రతి 10,000 మంది ఏఐ నిపుణులకుగాను 1.55 మంది మన దేశం నుండి నిష్క్రమించారు. ఇలా అత్యధికులు వెళ్లిపోతున్న దేశంగా ఇజ్రాయెల్ తరువాత మనదేశం ఉందని 'స్టాన్‌ఫోర్డ్ ఏఐ ఇండెక్స్ 2025' నివేదిక వెల్లడించింది.

పేటెంట్లలో చైనా జోరు..

ఏఐ పేటెంట్లలో కూడా మన దేశం వెనుకబడి ఉంది. 2024లో ప్రైవేట్ ఏఐ పెట్టుబడుల్లో కేవలం 1.16 బిలియన్ డాలర్లను మాత్రమే భారత్ ఆకర్షించింది. యూఎస్ ఏకంగా 109.08 బిలియన్ డాలర్ల నిధులను అందుకుంది. నిపుణులు, విస్తృతి పెరిగినప్పటికీ చాట్‌జీపీటీ లేదా డీప్‌సీక్ వంటి ప్రపంచవ్యాప్తంగా పేరొందిన చాట్‌బాట్‌లు రూపొందించే స్థాయిలో భారత్ పురోగతి సాధించలేదు. ప్రతిభను అగ్రశ్రేణి పరిశోధన, పేటెంట్ పొందిన ఆవిష్కరణలు, బిలియన్ డాలర్ల ఏఐ ఉత్పత్తులను అందించేలా మలచడంలో పర్యావరణ వ్యవస్థ లేకపోవడం భారత్‌కు ప్రతికూలాంశంగా నిపుణులు చెబుతున్నారు.

పేటెంట్స్ అందుకున్న తీరు
(ఆధారం: వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్. మొత్తం పేటెంట్స్ 2024 నవంబర్ నాటికి, ఏఐ పేటెంట్స్ 2024 జూలై నాటికి)

దేశం	మొత్తం పేటెంట్స్	ఏఐ పేటెంట్స్
చైనా	16,77,701	38,210
యూఎస్	5,98,085	6,276
దక్షిణ కొరియా	2,43,310	4,155
జపాన్	3,00,133	3,409
ఈయూ	1,99,429	3,100
భారత్	90,298	1,350

తరలిపోతున్నారు.. లింక్డ్‌ఇన్ ప్లాట్‌ఫామ్‌పై.. ఒక దేశం నుంచి ఇతర దేశాలకు తరలివెళ్తున్న ఏఐ నిపుణుల శాతం 10,000 మందికి..

ఇజ్రాయెల్	2.1
భారత్	1.55
హంగేరీ	1.15
తుర్కియే	0.49
దక్షిణ కొరియా	0.36

టాప్ కంపెనీల్లో..: దేశంలోని టాప్ - 5 ఐటీ కంపెనీల్లోని మూడింటిలో ఏఐ నిపుణుల జోరు పెరిగింది. ఈ కంపెనీల్లో మొత్తంగా 2.5 లక్షలకుపైగా.. అడ్వాన్స్‌డ్ ఏఐ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులు పనిచేస్తున్నారు.

కంపెనీ	ఉద్యోగులు	
	మొత్తం	అడ్వాన్స్‌డ్ ఏఐ నైపుణ్యాలు
టీసీఎస్	6.13 లక్షలు	1.14 లక్షలు
విప్రో	2.33 లక్షలు	87వేలు
హెచ్‌సీఎల్ టెక్	2.23 లక్షలు	42వేలు

తెలంగాణలో యూరియా కొరత లేదు

ఈ ఖరీఫ్ సీజన్‌లో అవసరానికి మించిన సరఫరా.. లోక్‌సభలో కేంద్రమంత్రి అనుప్రియా పటేల్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో యూరియా కొరత లేదని..ప్రస్తుత ఖరీఫ్ సీజన్(2025)లో అవసరానికి మించిన సరఫరా జరిగిందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎరువుల విషయంలో ఎక్కడైనా కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు కనిపిస్తే..ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ తెలిపారు. బీజేపీ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు శుక్రవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. 'తెలంగాణలో యూరియా కొరత లేదు. 2025 ఖరీఫ్‌నకు అవసరమైన 20.20 లక్షల మెట్రిక్ టన్నులకంటే ఎక్కువగా, అంటే 22.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. విక్రయాలు 20.08 లక్షల మెట్రిక్ టన్నులుగా నమోదయ్యాయి'అని అనుప్రియ పటేల్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాలకు బ్లాక్ మార్కెట్, నిల్వలపై చర్యలు తీసుకునే అధికారం ఉందని కేంద్రమంత్రి గుర్తు చేశారు. కృత్రిమ కొరతపై కేంద్రస్థాయిలో వచ్చిన ఏదైనా ఫిర్యాదు రాష్ట్ర ప్రభుత్వానికి పంపి వెంటనే చర్యలు తీసుకునేలా చూసే బాధ్యత కేంద్రానికి ఉంటుందని చెప్పారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో నిమ్ కోటెడ్ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది

రామగుండం ఎరువుల కర్మాగార యూనిట్‌లో నిమ్–కోటెడ్ యూరియా ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోందని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ వెల్లడించారు. కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 2024–25లో 94.13 శాతం సామర్థ్య వినియోగం నమోదైందని కేంద్రమంత్రి తెలిపారు. ప్రస్తుతం కీలక పరికరం మరమ్మతుల కారణంగా 92 శాతం సామర్థ్యంతో మాత్రమే ఉత్పత్తి జరుగుతోందని, త్వరలో పూర్తిస్థాయిలో యూనిట్ పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని అనుప్రియా పటేల్ వెల్లడించారు.

మరిన్ని పార్లమెంట్ వార్తలు సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా న్యాయవాది తుహిన్ కుమార్ గేదెల నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు న్యాయమూర్తి పోస్టుకు తుహిన్ కుమార్ పేరును సిఫారసు చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం గత నెల 2న తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ఈ సిఫారసుకు రాష్ట్రపతి తాజాగా ఆమోదముద్ర వేశారు. తుహిన్ కుమార్ నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. న్యాయమూర్తిగా తుహిన్ కుమార్ వచ్చే వారం ప్రమాణం చేసే అవకాశం ఉంది.

కవిత దీక్షకు అనుమతి నిరాకరణ



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 4 నుంచి 72 గంటల పాటు నిర్వహించతలపెట్టిన నిరాహార దీక్షకు పోలీసులు నిరాకరించారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత తెలిపారు. దీక్షకు అనుమతిపై ఏవేవో సాకులు చెబుతున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు బీజేపీ బీసీ మహాధర్నా

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ... శనివారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీసీల మహాధర్నా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు, కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొంటారు.

బీసీ రిజర్వేషన్లకు ఢిల్లీ వెళ్దాం రండి: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రెస్‌మీట్లు, ఇందిరాపార్కు వద్ద ధర్నాలు ఇంకెంతకాలం చేస్తారు? ఢిల్లీకి వెళ్దాం రండి అని మాజీ ఎంపీ హనుమంతరావు (వీహెచ్) పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు ఎలాగైనా అవుతుందని, ఈ అమలు దేశవ్యాప్తంగా కావాలని ఆకాంక్షించారు. రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో జరిగే ఆందోళన కార్యక్రమంలో బీసీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. రాహుల్ గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి.. ప్రజల సమస్యలు తెలుసుకున్నారన్నారు. అందులో భాగంగానే బీసీలకు న్యాయం చేసేలా రిజర్వేషన్ పెంపునకు కృషి చేస్తున్నారని వీహెచ్ పేర్కొన్నారు.

గొర్రెల స్కామ్ రూ.1,000 కోట్లపైనే!

▶ మొదటి పేజీ తరువాయి

గొర్రెల యూనిట్లకు సంబంధించి రూ.2.1 కోట్ల డబ్బు తమకు ఇవ్వకుండా పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు అక్రమంగా ఇతర అకౌంట్లకు మళ్లించారని కొందరు గొర్రెల విక్రేతలు ఇచ్చిన ఫిర్యాదుతో తొలుత ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఓఎస్డీగా ఉన్న జి.కల్యాణ్‌కుమార్ పశుసంవర్ధక శాఖ కార్యాలయంలోని కొన్ని రికార్డులను ధ్వంసం చేసి తీసుకెళ్లాడు. ఈ రెండు కేసుల ఆధారంగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసిన దర్యాప్తు ప్రారంభించారు. కల్యాణ్‌కుమార్ సహా ఫిష్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ మాజీ సీఈఓ రాంచందర్‌నాయక్, మాజీ అసిస్టెంట్ డైరెక్టర్లు రవికుమార్, కేశవసాయి, శ్రీనివాస్‌రావు, బ్రోకర్లు సహా మొత్తం17 మందిని ఏసీబీ అరెస్ట్ చేసింది. ఏసీబీ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ప్రారంభించిన ఈడీ అధికారులు పీఎంఎల్‌ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్–2002) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కుంభకోణంలో తొలుత రూ.2.1 కోట్ల మేర అవినీతి బహిర్గతమైంది. ఆ తర్వాత కాగ్ ఇచ్చిన నివేదికతో రూ.253.93 కోట్లకు ఈ కుంభకోణం చేరింది. తాజాగా ఈడీ అధికారుల సోదాల్లో లభించిన ఆధారాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో కలిపి మొత్తం రూ.వెయ్యికోట్లకుపైనే అవినీతి జరిగినట్టు వెలుగులోకి వచ్చింది.

గొర్రెల పంపిణీ చేయకుండానే.. నిధులు పంచుకుతిన్నారు

గొర్రెల పంపిణీ పథకంలో 'నీకిది నాకది'(కిక్‌బ్యాక్) తరహాలో ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులు, సంస్థల ఖాతాల్లోకి భారీగా నిధులు మళ్లించినట్టు ఈడీ ఆధారాలు సేకరించింది. ప్యాసింజర్ వాహనాలు, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు సహా నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్లతో బిల్లులు, గొర్రెల యూనిట్లకు డూప్లికేట్ ట్యాగ్‌లు, మృతి చెందిన వారి పేర్లతో యూనిట్లు కేటాయించడం వంటి అక్రమాలను గుర్తించింది. గొర్రెల స్కీమ్ నిధులు డిపాజిట్ అయిన లబ్ధిదారుల్లో చాలామంది ఈ పథకం ప్రారంభానికి ముందు గొర్రెల వ్యాపారంలో లేరని ఈడీ అధికారులు నిర్ధారించారు. ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు జరగలేదని గుర్తించారు. కేవలం కాగితాలపైనే గొర్రెల కొనుగోలు, నకిలీ వాహనాలు, లబ్ధిదారుల పేర్లతో ప్రభుత్వ నిధులను నకిలీ సరఫరాదారుల ఖాతాల్లోకి మళ్లించారని తేల్చారు. నకిలీ సరఫరాదారులకు చెల్లింపులు, గొర్రెలను మళ్లీమళ్లీ చూపించి ప్రభుత్వ నిధులను కొల్లగొట్టి భారీ అక్రమాలకు తెర తీసినట్టు ఈడీ అధికారులు ఆధారాలు సేకరించారు. లబ్ధిదారుల వివరాలు సరిగ్గా నిర్వహించకపోవడం, రవాణా వాహనాల బిల్లు, చెల్లింపుల రికార్డులు, ఇన్‌వాయిస్‌లు సరిగ్గా లేని రికార్డులను ఈడీ స్వాధీనం చేసుకుంది.

బెట్టింగ్‌యాప్ వ్యవహారంతో కొత్త మలుపు

ఇప్పటి వరకు గొర్రెల కొనుగోళ్లలో అక్రమాలు..గొర్రెల పంపిణీ పేరిట లబ్ధిదారులకు చేరకుండానే నిధుల మళ్లింపునకు పరిమితమైన ఈ కుంభకోణంలో ఈడీ తాజా తనిఖీలతో బెట్టింగ్‌యాప్‌ల లింక్ బయటపడింది. గొర్రెల కొనుగోలు కుంభకోణం నిధుల మళ్లింపునకు వాడిన డమ్మీ, మ్యూల్ అకౌంట్లకు చెందిన బ్యాంక్ డాక్యుమెంట్లు, చెక్, పాస్‌బుక్స్, డెబిట్ కార్డులు ఓ ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్‌తో లింక్ అయినట్టు అధికారులు గుర్తించారు. గొర్రెల కొనుగోలు డబ్బును విదేశాలకు చేర్చేందుకు లేదంటే దారి మళ్లించేందుకు ఈ బెట్టింగ్ యాప్స్‌ను వాడుకున్నారా? అన్న కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

తాజా సోదాల్లో కీలక ఆధారాలు

కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని జి.కల్యాణ్‌కుమార్ ఇంటితోపాటు రాంచందర్‌నాయక్, రవికుమార్, కేశవసాయి, శ్రీనివాస్‌రావు, లోలోనా ది లైవ్ కాంట్రాక్ట్ సంస్థ యజమానులు మొయిద్దీన్, ఇక్రముద్దీన్ ఇళ్లు, ఆఫీసులు సహా మొత్తం 8 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారి అయిన కల్యాణ్‌కుమార్ ఇంట్లో పలు కీలక ఆధారాలు ఈడీ అధికారులు గుర్తించారు. డమ్మీ, మ్యూల్ అకౌంట్లకు చెందిన బ్యాంక్ డాక్యుమెంట్లు, చెక్, పాస్‌బుక్స్, డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధ, గురువారాల్లో కల్యాణ్‌కుమార్‌తోపాటు మరో ఇద్దరిని బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి పిలిపించిన అధికారులు.. వారిని వేర్వేరుగా విచారించారు. కల్యాణ్‌కుమార్ అరెస్టుకు ఈడీ అధికారులు చర్యలు ప్రారంభించినట్టు తెలిసింది.

అమెరికాలో తెలుగు యువకుడికి జైలు శిక్ష.. ఆందోళనతో ఆత్మహత్య?



లింగాలఘణపురం: అమెరికాలోని ఓక్లహోమ్ రాష్ట్రంలోని ఎడ్మండ్ నగరంలో ఉంటున్న జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన కుర్రెముల సాయికుమార్ (31) బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడటంతో అక్కడి కోర్టు 35 ఏళ్ల శిక్ష విధించింది. దీంతో మానసిక ఆందోళనకు గురైన సాయికుమార్ జూలై 26న జైలులోనే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు గత నెల 31న అమెరికా బయల్దేరారు. సాయికుమార్ పదేళ్ల కిందట అమెరికా వెళ్లి అక్కడే ఉద్యోగం చేస్తూ ఓక్లహోమ్‌లో ఉంటున్నాడు. 2023లో అక్కడి ఎఫ్‌బీఐ సోషల్ మీడియా మేనేజింగ్ యాప్‌లో నిందితుడి అకౌంట్‌పై విచారణ జరపగా 13–15 ఏళ్ల బాలుడిగా నటిస్తూ బాలికలతో నమ్మకంగా ఉంటుండేవాడు. అతని అభ్యర్థనను తిరస్కరించిన వారిని బెదిరించడం, మానసికంగా వేధించడం, అసభ్య చిత్రాలు తీసి పంపించినట్లు ఆరోపణలు రావడంతో సాయికుమార్‌ను అరెస్ట్ చేశారు. అతను 19 మంది మైనర్లను లైంగికంగా వేధించినట్లు కోర్టులో నిరూపితమవడంతో 35 ఏళ్ల జైలు శిక్ష పడగా ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

ఫార్మా సిటీపై రేవంత్ నమ్మక ద్రోహం

సీఎం అన్నదమ్ముల కోసమే ఫ్యూచర్ సిటీ: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఫార్మా సిటీ భూముల వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డి నమ్మక ద్రోహానికి పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపించారు. ఫార్మా సిటీ భూములను ఇతర అవసరాలకు మళ్లించడం నీచమైన చర్యగా అభివర్ణించారు. రైతుల అనుమతి లేకుండా.. ఫార్మా భూముల్లో సర్వే చేయడం ఫాసిస్టు చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తున్న రైతులపై అక్రమ కేసులు పెడుతూ సీఎం రేవంత్ రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సీఎం అన్నదమ్ముల కోసమే ఫ్యూచర్ సిటీ ఏర్పాటు జరుగుతోందని ఆరోపించారు. ఒకవైపు ఫార్మాసిటీని రద్దు చేస్తామని ప్రకటిస్తూ, మరోవైపు కొనసాగిస్తామని ప్రభుత్వం హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని తెలిపారు. సీఎం తన స్నేహితులకు దోచిపెట్టేందుకు.. చీకటి ఒప్పందాలతో తెరపైకి తెచ్చిన ఫ్యూచర్ సిటీపై బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.



జస్టిస్ మొహియుద్దీన్, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ రామకృష్ణారెడ్డి, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్‌లను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఎప్పటికీ హెచ్‌సీఏఏలో భాగస్వాములమే

నూతన జడ్జీల వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: తాము న్యాయమూర్తులుగా పదోన్నతి పొందినా.. ఎప్పటికీ హైకోర్టు బార్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ)లో భాగస్వాములమేనని నూతన జడ్జీలు వ్యాఖ్యానించారు. గురువారం న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మొహియుద్దీన్, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ రామకృష్ణారెడ్డి, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్‌లను.. బార్ అసోసియేషన్ శుక్రవారం సాయంత్రం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త న్యాయవాదులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు జగన్, కార్యదర్శులు విజారత్ అలీ, ఇంద్రసేనారెడ్డి, ఏఎస్‌జీ నర్సింహ శర్మ, పీపీ పల్లె నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పాలసీ గడువు ముగియక ముందే కొత్త దరఖాస్తులు

మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: మద్యం ద్వారా సమకూరే ఆదాయాన్ని పెంచుకునేందుకు ఎక్సైజ్ పాలసీ గడువు ముగియకముందే రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. నవంబర్ వరకు పాలసీ గడువు ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ, పాలసీ విధానాలను మారుస్తూ దరఖాస్తు ధరను రూ.3 లక్షలకు పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి శుక్రవారం తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. బెల్టు షాపులు మూసివేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా మద్యం షాపులు తెరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆరోపించారు.

ఆ విద్యార్థికి పరిహారం చెల్లించండి

స్పోర్ట్స్ కోటా సీటు నిరాకరణపై శాట్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: స్పోర్ట్స్ కోటాలో ఇంజనీరింగ్ సీటు నిరాకరించినందుకు విద్యార్థికి పరిహారం చెల్లించాలని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్)ను హైకోర్టు ఆదేశించింది. అలాగే పాలిటెక్నిక్ పూర్తి చేసిన తర్వాత నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందే విద్యార్థులకు రిజర్వ్ చేసిన సీట్లలో ఒకటి పెంచి పిటిషనర్‌కు స్పోర్ట్స్ కోటా కింద రావాల్సిన కాలేజీలో సీటు ఇవ్వాలని సూచించింది. యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం కల్చర్ (స్పోర్ట్స్) డిపార్ట్‌మెంట్ 2020, సెప్టెంబర్ 22న విడుదల చేసిన జీవో నంబర్–2 ప్రకారం స్పోర్ట్స్ కోటా కింద బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లో ప్రవేశం కోరుతూ మియాపూర్‌కు చెందిన విద్యార్థి శ్రీశ్వాన్ దరఖాస్తు చేసుకున్నాడు. స్పోర్ట్స్ కోటా కింద ప్రవేశానికి ఎప్‌సెట్ కన్వీనర్ నిరాకరించారంటూ విద్యార్థి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'శ్రీశ్వాన్.. జేఎన్టీయూ పరిధిలోని కాలేజీలో సీఎస్సీ బ్రాంచ్‌లో సీటు పొందారు. స్పోర్ట్స్ కోటాలో సీటు ఇచ్చి ఉంటే ఇంకా మంచి కళాశాలలో సీటు వచ్చేది' అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అతను ప్రస్తుతం చదువుతున్న కాలేజీ, ఇప్పుడు చేరబోయే కాలేజీ ఫీజు వ్యత్యాసం, రవాణా ఖర్చు వివరాలను రెండు వారాల్లో శాట్‌కు అందజేయాలని పిటిషనర్‌ను ఆదేశించారు. ఆ వివరాలు అందిన తేదీ నుంచి నాలుగు వారాల్లో పరిహారాన్ని చెల్లించాలని శాట్‌కు స్పష్టం చేశారు.

బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో పెట్టాలి

జంతర్‌మంతర్‌లో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ధర్నా



మీడియా సమావేశంలో చిరంజీవులు, బీసీ విద్యార్థి సంఘం నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి, 9వ షెడ్యూల్‌లో పెట్టాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులుతో బీసీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు విలేకరులతో మాట్లాడారు. తమిళనాడు తరహాలో బీసీ బిల్లును అమలు చేసి 9వ షెడ్యూల్‌లో పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో లింగం యాదవ్, అశోక్, కదారి రమేశ్, సురేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 1ని ఎస్సీ వర్గీకరణ విద్రోహ దినంగా పాటించాలి

మాల సంఘాల నేతల డిమాండ్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాల సంఘాల నాయకులు

కవాడిగూడ (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఏ రాష్ట్రాలు పట్టించుకోకపోయినా సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల ఓట్ల కోసం ఆగమేఘాల మీద వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాలల గొంతు కోశాడని మాల సంఘాల నేతలు ఆరోపించారు. ఆగస్టు 1న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విద్రోహ దినంగా పాటిస్తూ శుక్రవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలలు నల్ల బ్యాడ్జీలు ధరించి నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు రాజు ఉస్తాద్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, వివిధ సంఘాల నేతలు మంచాల లింగస్వామి మాట్లాడుతూ మాలలకు రోస్టర్ పాయింట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారని, వర్గీకరణ చట్టంలో మాల, మాల ఉపకులాలను మూడో గ్రూపులో పెట్టారని పేర్కొన్నారు. దీంతో ఎంసెట్, నీట్ అడ్మిషన్లలో శాతవాహన, యూనివర్సిటీ, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగాల్లో మాలలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సర్వయ్య, దాసరి విశాల్, కరణం కిషన్, మాల సంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఫాల్కన్ కుంభకోణంలో రూ.18.14 కోట్ల ఆస్తులు జప్తు

దర్యాప్తు ముమ్మరం చేసిన ఈడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ స్కీమ్ కుంభకోణం కేసులో ఈడీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఫాల్కన్ అనుబంధ సంస్థ క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ చైర్మన్, ఎండీ అమర్‌దీప్‌కుమార్‌కు చెందిన రూ.18.14 కోట్లు విలువ చేసే 12 స్థిరాస్తులను అటాచ్ చేసినట్టు ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అందులో వివరాల మేరకు..బ్రిటానియా, అమెజాన్, గోద్రేజ్ సహా ప్రముఖ కంపెనీల్లో ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో హైటెక్ సిటీలోని హుడా ఎన్‌క్లేవ్‌లో ఫాల్కన్ (క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్) కార్యకలాపాలు నిర్వహించింది. ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో స్కీములను ఆఫర్ చేసి భారీ వడ్డీ రేటు చెల్లిస్తామని ప్రకటనలు ఇచ్చారు. 2021 నుంచి డిపాజిట్లు సేకరించారు. ఇలా దేశవ్యాప్తంగా 6,979 మంది నుంచి రూ.1,700 కోట్లు వసూలు చేశారు. రూ.850 కోట్లు తిరిగి చెల్లించారు. మరో రూ.850 కోట్లు మోసం చేశారు. దీనిపై తొలుత సైబరాబాద్ ఈఓడబ్ల్యూ నమోదు చేసిన మూడు ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ప్రారంభించింది. మార్చి 5న ఫాల్కన్ గ్రూప్ చైర్మన్, ఎండీ అమర్‌దీప్‌కుమార్‌కు చెందిన చార్టర్ ఎయిర్ క్రాఫ్ట్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో సీజ్ చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్టు ఈడీ అధికారులు తెలిపారు.

సొంతవారు వెయిటింగ్.. బయటివారికి పోస్టింగ్

పురపాలక శాఖలో 32 మంది కమిషనర్లు వెయిటింగ్

డిప్యుటేషన్‌పై వచ్చిన వారికి కమిషనర్లుగా చాన్స్

కొన్ని చోట్ల ఇన్‌చార్జీలుగా చక్రం తిప్పుతున్న మేనేజర్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో జూన్‌లో భారీ సంఖ్యలో జరిగిన మున్సిపల్ కమిషనర్ల బదిలీలు కొత్త సమస్యను తెరమీదకు తెచ్చాయి. సాధారణ బదిలీలపై ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తూ బదిలీలు, పదోన్నతుల ద్వారా 129 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేశారు. అయితే, ఈ బదిలీల్లో మున్సిపల్ శాఖకు చెందిన కమిషనర్లతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల నుంచి 'ఆన్ డ్యూటీ'పై వచ్చిన వారికి కూడా పోస్టింగులు దక్కాయి. మరోవైపు మున్సిపల్ శాఖకు చెందిన 32 మంది కమిషనర్లకు ఎలాంటి పోస్టింగులు ఇవ్వకుండా 'వెయిటింగ్'జాబితాలో పెట్టారు. కొన్ని మున్సిపాలిటీల్లో మేనేజర్లుగా ఉన్న వారికే మున్సిపల్ కమిషనర్లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పదోన్నతులు, ఆన్‌డ్యూటీపై వచ్చిన వారికి బదిలీల్లో ప్రాధాన్యత దక్కడంతో సొంత శాఖకు చెందిన కమిషనర్లు పోస్టింగు కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వెయిటింగ్‌లో ఉన్న 32 మంది కమిషనర్లలో 25 మంది స్పెషల్ గ్రేడ్, గ్రేడ్ వన్ కమిషనర్ హోదాలో ఉన్న వారే కావడం గమనార్హం. వీరిలో కొందరికి '100 రోజుల ప్రణాళిక'ఇన్‌చార్జీలుగా బాధ్యతలు అప్పగించినా నామమాత్రంగా విధులు నిర్వర్తిస్తున్నారు. తమకు భవిష్యత్తులో పోస్టింగు వచ్చినా వెయిటింగ్ పీరియడ్‌కు సంబంధించిన వేతనాలు తిరిగి పొందడంలో ఆర్థిక శాఖ నుంచి ఇబ్బందులు ఎదురవ్వతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వెయిటింగ్ జాబితాలో ఉన్న ఇద్దరు స్పెషల్ గ్రేడ్ కమిషనర్లు పదవీ విరమణ గడువుకు చేరువలో ఉన్నారు. పోస్టింగ్ లేకుండా రిటైర్ అయితే తమకు దక్కాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందకుండా పోతాయనే ఆందోళనలో వారు ఉన్నారు.

బయటి నుంచి వచ్చినవారిదే హవా

రాష్ట్రంలో మున్సిపల్ కమిషనర్లు గ్రేడ్1, 2, 3తో పాటు స్పెషల్ గ్రేడ్, సెలక్షన్ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్నారు. వీరి లో గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షల ద్వారా నేరుగా ఎంపికైన వారితో పాటు కొందరు మేనేజర్ల స్థాయి నుంచి, మరికొందరు సెక్రటేరియట్ సర్వీసుల నుంచి పదోన్నతులపై కమిషనర్లుగా వచ్చారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, రవాణా తదితర శాఖలకు చెందిన వారు కూడా 'ఆన్‌డ్యూటీ'పేరిట తమ పర పతి ఉపయోగించి మున్సిపల్ కమిషనర్లుగా పోస్టింగులు దక్కించుకున్నారు. అయితే, పదోన్నతులు, ఆన్ డ్యూటీలు ఇవ్వడంలో మున్సిపల్ కమిషనర్ల ఖాళీలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం. దీంతో సొంత శాఖకు చెందిన వారిని వెయిటింగ్ జాబితాలో చేర్చి, బయటి నుంచి వచ్చినవారికి పోస్టింగులు ఇచ్చారు. పోస్టింగుల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సిఫారసులు, ఒత్తిళ్లతో పాటు ఇతర అంశాలు కూడా కీలక భూమిక పోషించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ తరహాలో పోస్టింగులు పొందిన వారు గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు కీలక మున్సిపాలిటీల్లో తిష్ట వేశారనే విమర్శలు ఉన్నాయి. పదోన్నతులు, ఆన్‌డ్యూటీ ద్వారా కమిషనర్లుగా పోస్టింగులు పొందిన వారికి పురపాలన, పట్టణాభివృద్ధిపై అనుభవం లేకపోవడం కూడా క్షేత్ర స్థాయిలో పలు సమస్యలకు దారితీస్తోంది. గత నెలలో జరిగిన బదిలీల్లో జరిగిన లోపాలను సరిదిద్దేందుకు వెయిటింగ్ జాబితాలో ఉన్న కమిషనర్లకు పోస్టింగులు ఇచ్చే ప్రతిపాదనలు ప్రస్తుతం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

కాళేశ్వరం నివేదికపై కమిటీ

▶ మొదటి పేజీ తరువాయి

చర్చించినట్లు తెలిసింది.

ప్రణాళిక లోపమేనా?: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ 2023 అక్టోబర్ 21న కుంగిపోగా.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం బుంగలు ఏర్పడి నీళ్ల సీపేజీ అయిన విషయం విదితమే. ఈ నిర్మాణ లోపాలతోపాటు అవినీతి ఆరో పణలపై విచారణ కోసం 2024 మార్చి 14న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఘోష్‌తో విచారణ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బరాజ్‌లకు సంబంధించి ప్రణాళిక, నమూనాలు, నాణ్యత, నిర్వహణ ప్రధాన లోపాలు కాగా, స్థల ఎంపిక కూడా ఇందుకు కారణమన్న అభిప్రాయాన్ని కమిషన్ నివేదికలో వ్యక్తంచేసినట్లు చెబుతున్నారు. బరాజ్‌ల నిర్మాణంలో పాలుపంచుకున్న ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు, చీఫ్ ఇంజనీర్లు, ఎస్‌ఈలు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, నీటిపారుదల శాఖ కార్యదర్శులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు సహా దాదాపు 150 మందిని విచారించిన తరువాత ఈ నివేదికను రూపొందించారు. ప్రధానంగా తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ లొకేషన్ మార్పుపై నిర్ణయం ఎవరు తీసుకున్నారు? అనే అంశంపై కమిషన్ స్పష్టతనిచ్చిందని అంటున్నారు.

కటకటాల్లోకి 'కుబేరులు'!

- కుబేర సినిమా పైరసీ నిందితుల అరెస్టు

సాక్షి, హైదరాబాద్: నాగార్జున, ధనుష్ ప్రధాన తారాగణంగా నటించిన కుబేర సినిమా విడుదల అయిన రోజే పైరసీ చేసిన ముఠా గుట్టును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. సినిమా థియేటర్‌లో ఈ చిత్రాన్ని రికార్డు చేసిన యువకుడితో పాటు సహకరించిన వారినీ అరెస్టు చేశారు. ఈ పైరసీ వెనుక అంతర్జాతీయ ముఠా పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని అదనపు సీపీ (నేరాలు) పి.విశ్వప్రసాద్ శుక్రవారం పేర్కొన్నారు. జూన్ 20న కుబేర చిత్రం విడుదలైన కొన్ని గంటలకే దీని హెచ్‌డీ ప్రింట్ 1తమిళ్‌బ్లాస్టర్స్, 1తమిళ్‌ఎంవీ వెబ్‌సైట్లలోకి చేరింది. దీనిని తీవ్రంగా పరిగణించిన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) స్పందించింది. దీని అంతర్భాగమైన యాంటీ వీడియో పైరసీ సెల్ ఆయా వెబ్‌సైట్లలో ఉన్న సినిమాను అధ్యయనం చేసింది. గతంలో రీళ్ల ఆధారంగా సినిమాలు ప్రదర్శితం అయ్యేవి. అయితే ప్రస్తుతం డిజిటల్ ఫార్మాట్‌లో శాటిలైట్ లింకేజ్ ద్వారానే థియేటర్లలో స్క్రీన్ల పైకి వస్తున్నాయి. పైరసీని నిరోధించడానికి, దాని మూలాలను కనిపెట్టడానికి ఆయా సినిమాలకు ఓ వాటర్ మార్క్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి థియేటర్‌లో, ప్రతి షోలో ప్రదర్శితమయ్యే సినిమాకు ఇది మారిపోతూ ఉంటుంది. సినిమా ప్రదర్శితం అయ్యేప్పుడు అకస్మాత్తుగా ఇది తెరపైకి వచ్చి వెళుతుంటుంది. దీన్ని సాధారణ ప్రేక్షకులు గుర్తించలేకపోయినా... ఎవరైనా ఆ సినిమాను రికార్డు చేస్తే ఇది కూడా రికార్డు అవుతుంది. పైరసీ వెబ్‌సైట్లలో ఉన్న సినిమాను అధ్యయనం చేసే యాంటీ వీడియో పైరసీ సెల్ ఆ వాటర్‌మార్క్ ద్వారా సదరు చిత్రాన్ని ఏ థియేటర్‌లో, ఏ షోలో రికార్డు చేశారో గుర్తిస్తుంది. కుబేర చిత్రాన్ని సినిమా విడుదలైన రోజే పీవీఆర్ సెంట్రల్ థియేటర్‌లోని స్క్రీన్–5లో రికార్డు చేసినట్లు తేల్చింది. ఈ ఆధారాలతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ సబావత్ నరేష్ దర్యాప్తు చేపట్టారు. సైబర్ క్రైమ్ పోలీసులు ఆ రోజు ఆ థియేటర్, ఆ స్క్రీన్ వద్ద, హాలు లోపల ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్‌ను సంగ్రహించి అధ్యయనం చేశారు. ఈ రికార్డింగ్స్‌ను జేబులో ఇమిడిపోయే హెచ్‌డీ కెమెరాలతో చేస్తుంటారు. ఈ నేపథ్యంలో కుబేర చిత్రం రికార్డు అయిన తీరు ఆధారంగా ఏ సీటులో కూర్చుని రికార్డు చేశారనేది గుర్తించారు. ఆ ప్రాంతంలో సీట్లకు టిక్కెట్ బుక్ చేసుకున్న వారి వివరాల ద్వారా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. ఇతడికి సహకరించిన వ్యక్తినీ కటకటాల్లోకి పంపారు. వీరికి అంతర్జాతీయ లింకులు ఉన్నట్లు గుర్తించారు. విదేశాల్లో ఉన్న ఆ వెబ్‌సైట్ నిర్వాహకులు ఈ సినిమా వీడియోను పంపగా... ప్రతిఫలంగా క్రిప్టో కరెన్సీ రూపంలో నగదు పొందినట్లు ఆధారాలు సేకరించారు. ఈ క్రిప్టో కరెన్సీని నిందితులు జెబ్ పే, కాయిన్ డీసీఎక్స్ తదితర ప్లాట్‌ఫామ్స్‌లో ఎక్స్ఛేంజ్ చేసుకున్నట్లు గుర్తించారు. కొన్ని పేమెంట్ గేట్‌వేస్‌లో గేమింగ్‌లకు సంబంధించిన లింకులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు విశ్వప్రసాద్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముందే ఫీజు చెల్లింపు నిబంధన దారుణం

- బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ఎస్సీలు ఇంజనీరింగ్ కాలేజీలో చేరాలంటే.. ముందే ఫీజు కట్టాలని నిబంధన విధించడం ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఇంజనీరింగ్ విద్యలో ఎస్సీలకు నూతన మార్గదర్శకాలను తీసుకొచ్చి.. వారికి విద్యను దూరం చేస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన ఆరోపించారు. ఫీజు నిబంధన ఎస్సీలకు మాత్రమే ఎందుకని, రూ.లక్షల ఫీజు విద్యార్థులు ఎలా కడతారని ప్రశ్నించారు. మంచి ర్యాంక్ వచ్చినా.. ఫీజు కడితేనే ప్రవేశం కల్పిస్తామని కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వ వైఫల్యంతోనే వైటీపీఎస్ పనుల్లో జాప్యం

- యూనిట్–1ను జాతికి అంకితం చేసిన డిప్యూటీ సీఎం భట్టి
- మంత్రులు లక్ష్మణ్, ఉత్తమ్, కోమటిరెడ్డిలతో కలిసి పనుల పురోగతిపై సమీక్ష



శిలాఫలకాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్, మంత్రులు లక్ష్మణ్, కోమటిరెడ్డి, ఉత్తమ్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ: గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యంతోనే యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనుల్లో ఆలస్యం జరిగిందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క చెప్పారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) యూనిట్–1లో విద్యుత్ ఉత్పత్తిని ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు లక్ష్మణ్‌కుమార్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. పవర్‌స్టేషన్‌లో మొత్తం ఐదు యూనిట్లు ఉండగా.. రెండో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని ఈ ఏడాది జనవరి 21 సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఒక్కో యూనిట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 800 మెగావాట్లు. ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, మిగతా మూడు యూనిట్లను డిసెంబర్ నాటికి పూర్తి చేసి, వచ్చే ఏడాది జనవరి 26 నుంచి పూర్తిగా జాతికి అంకితం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ప్రభుత్వం రెండేళ్లపాటు పర్యావరణ అనుమతులపై క్లియరెన్స్ తీసుకురాకపోవడంతోనే ప్రాజెక్టు పనులు ఆలస్యమయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక సమయాన్ని నిర్దేశించుకోని అనుకున్న కార్యాచరణ ప్రకారం సంవత్సరం, నెల, వారానికి చేయాల్సిన పనులపై కేలెండర్ ప్రకారం ముందుకు వెళ్లామని చెప్పారు. సంవత్సర కాలంలోనే రెండు యూనిట్లు పూర్తి చేశామని తెలిపారు. విద్యుత్ ఉత్పాదనతోపాటు వైటీపీఎస్‌లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల ఏర్పాటు, పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రి, అంబులెన్స్ సేవలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బందికి క్వార్టర్స్ నిర్మిస్తున్నామని, ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ముందుకెళుతున్నట్టు చెప్పారు. రహదారులు దెబ్బతినకుండా సీసీ రోడ్డు పనులు మొదలుపెట్టామన్నారు. భూములు కోల్పోయిన వారికి గత ప్రభుత్వం పరిహారాన్ని గాలికి వదిలేస్తే..తాము ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి ఉద్యోగాలు, పునరావాస కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. పులిచింతల ప్రాజెక్టు కింద నష్టపోయిన కొందరు రైతులకు కూడా వైటీపీఎస్‌లో ఉద్యోగాలు, పరిహారం అందచేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, హైడల్ డైరెక్టర్ బాలరాజు, కోల్ డైరెక్టర్ నాగయ్య, థర్మల్ డైరెక్టర్ వై.రాజశేఖరరెడ్డి, ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిత్తల్, జెన్‌కో సీఎండీ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: 2026 హజ్ యాత్రకు దరఖాస్తు గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి సజ్జాద్‌అలీ తెలిపారు. గత నెల 7 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై 31 తేదీతో ముగిసింది. అయితే, దరఖాస్తులు తక్కువగా రావడంతో ఈ గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించామన్నారు. 2026 హజ్ యాత్ర వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం కేంద్ర హజ్ కమిటీ విజయవాడ నుంచి విమాన సర్వీస్ ప్రారంభించిందన్నారు. యాత్రికుల సౌకర్యార్థం హజ్‌హౌస్‌లో దరఖాస్తుల స్వీకరణ కోసం 8 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 040 23298793 నంబర్ లేదా కేంద్ర హజ్ కమిటీ వెబ్‌సైట్ ను సంప్రదించాలన్నారు.

మార్కులు తక్కువొచ్చాయని మందలించినందుకు..

- తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ: మార్కులు తక్కువ రావడంతో చదువు పట్ల శ్రద్ధ వహించాలని టీచర్లు, తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని ఇంటి బాత్‌రూమ్ కిటికీ నుంచి దూకా ఆత్మహత్య చేసుకుంది. కేపీహెచ్‌బీ కాలనీ మంజీరా ట్రినిటీ హోమ్స్‌లో గురువారం రాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. మంజీరా ట్రినిటీ హోమ్స్‌లోని 17వ అంతస్తులో నివాసం ఉంటున్న హరినారాయణ మూర్తి చిన్న కుమార్తె లాస్యప్రియ(13) స్థానిక అడ్డగుట్ట నారాయణ హైస్కూలులో 9వ తరగతి చదువుతోంది. గురువారం ఉదయం టీచర్లు తల్లిదండ్రులకు ఫోన్ చేసి సాయంత్రం 4 గంటలకు పేరెంట్స్ మీటింగ్ ఉంది రమ్మని చెప్పడంతో లాస్యప్రియ తల్లి మీటింగ్‌కు వెళ్లింది. అక్కడ విద్యార్థిని చదువు పట్ల శ్రద్ధ వహించట్లేదని టీచర్స్ చెప్పడంతో పాటు ఇంటి వద్ద కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. ఇంటికి వచ్చిన తర్వాత తండ్రికి విషయం చెప్పడంతో రాత్రి 8 గంటల సమయంలో అందరూ కలిసి భోజనం చేస్తుండగా చదువు పట్ల శ్రద్ధ పెట్టాలని తండ్రి కూడా లాస్యప్రియకు సూచించాడు. అనంతరం లాస్యప్రియ పడుకునేందుకు తన గదిలోకి వెళ్లి గడియపెట్టుకుంది. కొద్దిసేపటి తర్వాత గది బాత్‌రూమ్ కిటికీ అద్దాలు తొలగించి కిందకి దూకేసింది. 17వ అంతస్తు నుంచి దూకడంతో శరీరం ఛిద్రమైంది .పెద్ద శబ్ధం రావడంతో స్థానికులు గమనించి వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా..వారు కూతురి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. చిన్నపాటి విషయానికే ఆత్మహత్యకు పాల్పడిందని తల్లడిల్లిపోయారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అఖిల పాపాత్ములందు నీవెంత అధమ పాప యుతుడవైనప్పటికి, పాపమను సముద్రమును జ్ఞానమను చిన్న ఓడచే దాటగలవు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 2 ఆగస్టు 2025

ఫిరాయింపుల జాడ్యం ఆగేనా?!

చట్టాలు కాగితాలకూ... ఆదర్శాలు ఉపన్యాసాలకూ పరిమితమవుతూ రాజ్యాంగ విలువలకు గ్రహణం పడుతున్న వేళ సర్వోన్నత న్యాయస్థానం ఒక విలువైన తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలంటూ తెలంగాణ శాసనసభ స్పీకర్‌ను ఆదేశించింది. అదే సమయంలో అటువంటి ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉంటుందని తెలియజేసింది. పదో షెడ్యూల్ 6(1) పేరా చెప్తున్నదాని ప్రకారం ఇలాంటి అంశాలపై నిర్ణయం తీసుకునేటప్పుడు స్పీకర్ ఒక ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తున్నట్టేనని, అందువల్ల రాజ్యాంగ అధికరణలు 226, 227 ప్రకారం హైకోర్టులూ, 136 అధికరణ ప్రకారం సుప్రీంకోర్టూ స్పీకర్ చర్యల్ని సమీక్షించవచ్చని ధర్మాసనం చెప్పటం విశేషం. ఈ విషయంలో 122, 212 అధికరణల కింద స్పీకర్లకు రాజ్యాంగపరమైన రక్షణ ఉండబోదని కూడా తేల్చింది. అసెంబ్లీలు మొదలుకొని పార్లమెంటు వరకూ ఫిరాయింపుల జాడ్యం ఇటీవలి కాలంలో బాగా ముదిరింది. కమ్యూనిస్టులు, వైఎస్సార్ కాంగ్రెస్ వంటి ఒకటి రెండు పక్షాలూ తప్ప ఈ జాడ్యానికి దూరంగా ఉన్న పార్టీలు అతి స్వల్పం. స్వల్ప మెజారిటీతో గద్దెకెక్కినా, సంఖ్యాబలానికి అంతో ఇంతో తక్కువున్నా ఫిరాయింపుల్ని ప్రోత్సహించటం అలవాటైపోయింది.

రాజీవ్ గాంధీ ప్రధానిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 52వ రాజ్యాంగ సవరణ ద్వారా 1985లో ఫిరాయింపుల నిరోధక చట్టం అమల్లోకొచ్చింది. అయితే ఆచరణలో అది ప్రభావవంతంగా లేదని గ్రహించి 2003లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉండగా 91వ రాజ్యాంగ సవరణ ద్వారా దాన్ని పటిష్ఠపరిచారు. చిత్రమేమంటే దేశంలో మూడొంతుల ముప్పాతిక ఫిరాయింపులకు ఈ రెండు పార్టీలే కారణం. అందుకు మణిపూర్ మొదలుకొని కర్ణాటక, మహారాష్ట్రల వరకూ ఎన్నయినా ఉదాహరణలు చూపించొచ్చు. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన కేసు తెలంగాణలో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు సంబంధించింది. ఆ ఫిరాయింపుల్ని సవాలు చేసిన బీఆర్ఎస్, అధికారంలో ఉండగా తానూ అదే పని చేసింది. ఇక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ దిగజారుడు తనాన్ని ప్రోత్సహించటంలో ఆరితేరినవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయాక తెలంగాణలో తన పార్టీ తరఫున నెగ్గినవారిని పార్టీలో చేర్చుకుని మంత్రి పదవులిచ్చారని ఆవేశంతో రెచ్చిపోయి మాట్లాడిన బాబు... ఒకటి రెండు నెలలయ్యేసరికి ఏపీలో తానూ అదే పని నిస్సిగ్గుగా చేశారు. అప్పట్లో వైఎస్సార్ కాంగ్రెస్ తరఫున నెగ్గిన 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి వారిలో నలుగురికి మంత్రి పదవులు కట్టబెట్టారు. ఈమధ్య వైఎస్సార్ కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ, శాసనమండలి సభ్యులు కొందరిని లోబర్చుకుని పార్టీకీ, చట్ట సభల సభ్యత్వానికీ రాజీనామా చేయించారు. విలువల గురించి అతిగా మాట్లాడే అలవాటున్న బీజేపీ ఇందుకు తోడ్పడటమేకాక... తానూ లాభపడింది. ఏపీ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీరాజ్ సంస్థల్లో ప్రజాస్వామ్యం ఎలా ఖూనీ అవుతున్నదో అందరూ గమనిస్తూనే ఉన్నారు.

చట్టసభలను కేవలం శాసనాలు చేసే వేదికలుగా మాత్రమే పరిగణించటం సరికాదు. అయిదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పు, వారి ఆకాంక్షలు ఆ చట్టసభల పనితీరులో ప్రతిఫలించాలి. ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శప్రాయులుగా ఉండాలి. అధికారం వచ్చింది మొదలు ప్రతిపక్షాన్ని బలహీనపరచటం ఎలా, కక్ష తీర్చుకోవటం ఎలా అనే అంశాలే నిత్యకృత్యమైతే అందువల్ల అంతిమంగా ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడుతుంది. ఈ విషయంలో సభాధ్యక్షుల పాత్ర ఎంతో కీలకమైనది. వారు తటస్థంగా, సమర్థంగా వ్యవహరిస్తే చాలావరకూ ఈ జాడ్యం పోతుంది. చట్టసభల ఔన్నత్యం పెరుగుతుంది. చాలా సందర్భాల్లో వారు పాలకపక్షాలకు అనుకూలంగానే వ్యవహరిస్తున్నారు. పార్లమెంటు మొదలుకొని అసెంబ్లీల వరకూ సమావేశాల ప్రత్యక్ష ప్రసారాలు అందుబాటులో కొచ్చాయి గనుక ఇప్పుడేదీ రహస్యం కాదు. అధ్యక్షస్థానంలో ఉన్నవారి వ్యవహార శైలి ఎలా ఉంటున్నదో అందరూ ఆ క్షణంలోనే పసిగడుతున్నారు. సభాధ్యక్షులు తలుచుకుంటే ఫిరాయింపుల సమస్య పరిష్కారం పెద్ద కష్టం కాదు. కానీ అది సజావుగా సాగటం లేదు. 2014లో తమ పార్టీ నుంచి ఫిరాయించినవారిపై అటు లోక్‌సభలోనూ, ఇటు అసెంబ్లీలోనూ వైఎస్సార్ కాంగ్రెస్ ఫిర్యాదు చేస్తే రెండు చోట్లా స్పందన ఒకేలా ఉంది. ఆ చట్టసభల గడువు ముగిసే సమయానికి కూడా స్పీకర్లు నిర్ణయం ప్రకటించలేకపోయారు. ఇలాంటి పరిస్థితులున్నప్పుడు రాజ్యాంగ న్యాయస్థానాలు కళ్లు మూసుకుని ఉండగలవా? ఫిరాయింపుదార్లపై చర్య తీసుకునే విషయంలో స్పీకర్లకున్న నిర్ణయాధికారాన్ని పార్లమెంటు సమీక్షిస్తే మంచిదని ధర్మాసనం అభిప్రాయపడింది. కానీ ఆ చట్టంలోని లొసుగులతో అందరూ లాభపడుతున్నప్పుడు దీన్ని ఆశించటం అత్యాశేనేమో!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.అష్టమి ఉ.5.49 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** విశాఖ పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ఉ.9.36 నుండి 11.22 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.42 నుండి 7.27 వరకు, **అమృత ఘడియలు:** రా.8.14 నుండి 10.03 వరకు.

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం: 6.30
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

రెండు విశ్వాసాలు



విజయం సాధించిన మనుషులు రెండు గట్టి విశ్వాసాలతో తమ ప్రస్థానాన్ని ప్రారంభిస్తారు: వర్తమానం కంటే భవిష్యత్ మరింత బాగుంటుంది. దాన్ని అలా మార్చగలిగే శక్తి నాకుంది.
– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

సూపర్ పవర్



మీ అతిపెద్ద సూపర్ పవర్ ఏమిటంటే, మీ జీవితంలో ఎలాంటి గందరగోళం జరుగుతున్నా మంచి మూడ్‌లో ఉండగలిగే సామర్థ్యం.
– రాజ్ శమానీ, రచయిత

దెబ్బ తీయడమే!



1950ల నుంచీ ఇండియా పట్ల అమెరికా విదేశాంగ విధానంలో కనబడే ఒక స్థిరమైన పాయ ఏమిటంటే, ఇండియా వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని నాశనం చేయడం!
– జోరావర్ దౌలత్ సింగ్, అంతర్జాతీయ సంబంధాల నిపుణులు

మళ్లీ మళ్లీ స్నేహం



రష్యా–ఇండియా–చైనాను ట్రంప్ ఒక దగ్గరకు చేర్చుతున్నారని అనుకోవడం తప్పు. మోదీ నేతృత్వంలోని ఇండియా ట్రంప్ అల్లరినైనా భరిస్తుందిగానీ చైనాతో సంబంధాలను సాధారణీకరించుకోదు. చైనా పట్ల సౌహార్ద పునఃస్థాపనా కౌశలం అనేది ఇండియా విదేశాంగ విధానపు నిత్య లక్షణం.
– ప్రవీణ్ సహానీ, ఆర్మీ మాజీ ఉన్నతాధికారి

పన్నులే పన్నులు



పని చెయ్యి, పన్నులు కట్టు! ఖర్చు చెయ్యి, పన్నులు కట్టు! పొదుపు చెయ్యి, పన్నులు కట్టు! కేవలం బతికి ఉండు, పన్నులు కట్టు!! ఇది ఎప్పటికి అంతమయ్యేను?
– అలెక్సాండ్రా హాక్, ఆంట్రప్రెన్యూర్

రెండూ లేవు!



పాకిస్తాన్‌లో చమురు ఉందని ట్రంప్ అనుకుంటున్నారా? అది... కరాచీలో ట్రాఫిక్ నియమాలు ఉంటాయని అనుకోవడం లాంటిది.
– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

పట్టాలెక్కాల్సిన సంస్కరణలెన్నో!

విశ్లేషణ



మదన్ సబ్నవీస్

ప్రభుత్వం గత పదేళ్లుగా పెట్టుబడి వ్యయాన్ని రక్షణతోపాటు మరో రెండు రంగాలపై కేంద్రీకరించింది. ఆ రెండూ రోడ్లు, రైల్వేలు. తిరిగి రైల్వేలలో కూడా వేగంగా వెళ్ళే అధునాతన రైళ్ళను ప్రవేశపెట్టడం, నూతన మార్గాలను జోడించడం, మెట్రో వ్యవస్థలను అభివృద్ధి చేయడంపైన చాలా వరకు దృష్టి పెట్టారు. రైల్వేలపై ప్రభుత్వ వ్యయం కొనసాగే అవకాశం ఉంది. రైళ్ళ విషయంలో ఆదర్శంగా తీసుకోదగిన ఇతర దేశాలలోని సేవలను మన దేశంలో కూడా అందించే విధంగా సంస్కరణలపై దృష్టి పెట్టడానికి ఇదే అనువైన సమయం.



- రైల్వేల విషయం వచ్చేసరికి వేగవంతమైన, అధునాతన రైళ్లను ప్రవేశపెట్టడం, కొత్త మార్గాలను జోడించడం, మెట్రో వ్యవస్థలను అభివృద్ధి చేయడం వంటివాటి పైనే చాలా వరకు దృష్టి పెడుతున్నారు. అవి సేవలలో గుణాత్మకమైన మార్పు తెచ్చిన మాట నిజమే. ప్రభుత్వ మూలధన వ్యయం రైల్వేలపై ఇక ముందు కూడా కొనసాగనుంది కనుక, ఆదర్శప్రాయంగా తీసుకోదగిన ఇతర దేశాలలో రైల్వే సేవలు ఏ విధంగా ఉన్నాయో అటువంటి సేవలను మనకూ అందించే విధంగా కృషి చేయడానికీ, పనిలో పనిగా సంస్కరణలు తీసుకురావడానికీ ఇదే అనువైన సమయం.

ముఖ్యంగా రెండు విభాగాలు ఈ సందర్భంగా మదిలో మెదులుతాయి. రైల్వేల పనితీరుకు సంబంధించి నిర్దిష్ట కోణాలలో మొత్తంగా వ్యవస్థలను సంస్కరించవలసి ఉంది. ఇది మొదటగా చేయాల్సిన పని. దీనివల్ల ప్రయాణికులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన సేవలందుతాయి. భద్రతా పెరుగుతుంది. రెండు: రైల్వే స్టేషన్ల ప్రైవేటీకరణ. ఫలితంగా, రైల్వేలకు కొంత రాబడి దక్కుతుంది. నూతన రాబడి మార్గాలను సృష్టించుకునేందుకు ఉన్న ఆస్తులను వినియోగించుకునే కేటగిరీలోకి ఇది వస్తుంది.

తీసుకోవాల్సిన భద్రతా చర్యలు

గత ఏడాది నుంచి చోటుచేసుకుంటున్న వివిధ సంఘటనల పాఠాలు భద్రతపైన కూడా దృష్టి పెట్టాలని హెచ్చరిస్తున్నాయి. అందుకే: 1. సబర్బన్ రైళ్ళ బోగీలకు ఆటోమేటిక్ తలుపులను అమర్చాలి. దీనివల్ల రైళ్ళలో వెళుతున్నప్పుడు ప్రయాణికులు గాయపడే అవకాశాలు తగ్గుతాయి. 2. సుదూరాలకు పయనించే రైళ్ళలో జనరల్ బోగీలు వాటి సామర్థ్యానికి మించి కిటకిటలాడుతూ ఉంటాయి. ఇది ప్రయాణికుల మధ్య సిగపట్లకు, కొండొకచో ప్రమాదాలకు కారణమవుతోంది. అన్ని టికెట్లనూ రిజర్వేషన్ల ప్రాతిపదికనే విక్రయించాలి. 3. పట్టాలు, సిగ్నలింగ్ వంటివాటిలో లోపాల వల్ల సంభవిస్తూ వచ్చిన ప్రమాదాలను నివారించేందుకు భద్రతా పరికరాలను ప్రథమ శ్రేణికి చెందిన వాటినే వినియోగించాలి. 4. విసర్జించినవి సాఫీగా వెళ్ళిపోయేందుకు వీలుగా మరుగుదొడ్ల వ్యవస్థలను ఆధునీకరించేందుకు బోగీలను పూర్తిగా మార్చాలి లేదా తగిన మార్పులు చేపట్టాలి. 5. విమానాశ్రయాల మాదిరిగానే అన్ని రైల్వే స్టేషన్ల చుట్టూ పూర్తిగా కంచెను ఏర్పాటు చేయాలి. ప్రహరీని దాటి ప్రయాణికులు మాత్రమే లోపలికి ప్రవేశించే వీలుండాలి. 6. చివరగా, ప్రభుత్వం మూలధన వ్యయంలో కొంత భాగాన్ని ప్లాట్‌ఫారాల నిడివిని, ఎత్తును పెంచేందుకు వినియోగించాలి. దీంతో ప్రయాణికులు చాలా బోగీలున్న రైళ్ళను కూడా సురక్షితంగా ఎక్కగలుగుతారు, దిగగలుగుతారు.

ఇవన్నీ ప్రాథమిక పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉపయోగపడే సూచనలు. బడ్జెట్‌లో తగు కేటాయింపులతో సులభంగా ఈ సదుపాయాలు కల్పించుకోవచ్చు.

చేయాల్సిన కొన్ని సంస్కరణలు

రైల్వే స్టేషన్ల ప్రైవేటీకరణ మరో పార్శ్వం. విమానాశ్రయాల విషయంలో అనుసరించిన పద్ధతినే వీటికీ వర్తింపజేయవచ్చు. సదుపాయాలు పెంచి యూజర్ చార్జీలు వసూలు చేసుకోవచ్చు. చార్జీలు పెంచినా, అవి ప్రయాణికుల సంఖ్యపై అరుదుగానే ప్రభావం చూపడం మన దేశంలో గమనించవచ్చు. దేశంలోని చాలా ప్రాంతాలను రైల్వేలే అనుసంధానపరుస్తూండటం దానికి కారణం.

1. ప్రయాణికులకు మాత్రమే స్టేషన్ల లోపలికి ప్రవేశం ఉండాలి. టికెట్ కోడ్ చూపిస్తేనే తలుపులు తెరచుకునేటట్లు చేయవచ్చు. విజిటర్ల సంఖ్యను వీలైనంత పరిమితం చేయాలి. ప్రయాణికులలో అన్ని వయసులవారు ఉంటారు కాబట్టి, వారికి తోడుగా వచ్చేవారిని నివారించడం సాధ్యం కాకపోవచ్చు. ప్లాట్ ఫారమ్ టికెట్ ధరను పెంచితే, వీడ్కోలు పలకడానికి వచ్చేవారి సంఖ్య దానంతట అదే తగ్గుతుంది. 2. పోర్టర్ల వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలి. నిర్ణయించిన ధరలను పోర్టర్లకు తప్పనిసరి చేయాలి. అదే సమయంలో, లిఫ్టులు, ఎస్కలేటర్లను ప్రవేశపెడితే, ప్రయాణికులు వారి లగేజీని వారే తీసుకెళ్ళగలుగుతారు. 3. స్టేషన్ల వద్ద దోపిడీకి వీలు కల్పిస్తున్న మరో అంశం ట్యాక్సీలు. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌తో ప్రీ–పెయిడ్ సౌకర్యాన్ని అన్ని స్టేషన్ల వద్ద కల్పించాలి. ఫలితంగా, ఎంత వసూలు చేస్తున్నారో తక్షణం తెలిసిపోతుంది. 4. రుచికి, శుచికి పూచీ వహించే విధంగా అల్పాహార శాలలను పునర్వ్యవస్థీకరించాలి. దుకాణాల సంఖ్య, ధరల విషయాన్ని స్టేషన్ డెవలపర్‌కు విడిచి పెట్టవచ్చు. ప్రయాణికులలో అత్యధిక సంఖ్యాకుల ఆర్థిక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తినుబండారాల ధరలను తక్కువ స్థాయిలో నిర్ణయించడం సముచితంగా ఉంటుంది. కావాలంటే, ఉన్నత తరగతుల బోగీల్లో ప్రయాణించేవారికి వేరే దుకాణాలు పెట్టవచ్చు.

కనులకు ఇంపుగా, అనుభవానికి పసందుగా ఉండే ఈ ప్రధాన రూపాంతరీకరణకు డబ్బులు ఖర్చయ్యే మాట నిజమే. విమానయాన సంస్థల మాదిరిగానే యూజర్ చార్జీల ద్వారా ఆ డబ్బును తిరిగి రాబట్టుకోవచ్చు. స్థూలంగా చెప్పాలంటే, ఈ ఏడాది దాదాపు 350 కోట్లమంది సుదూరాలకు వెళ్ళే రైళ్లలో ప్రయాణిస్తున్నారు అనుకుందాం. వారిలో 300 కోట్ల మంది ద్వితీయ తరగతిలో, 50 కోట్ల మంది అప్పర్ క్లాస్‌లో ప్రయాణిస్తారని భావిద్దాం. హయ్యర్ క్లాసుల వారి నుంచి సగటున రూ. 200, సెకండ్ క్లాస్ వారి నుంచి రూ. 50 చొప్పున వసూలు చేసినా ఏడాదికి రూ. 25,000 కోట్ల ఆదాయం అదనంగా లభిస్తుంది.

ఈ విషయంలో రకరకాల సమీకరణాలు రూపొందించుకోవచ్చు. ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామి మధ్య వాటిని పంచుకోవచ్చు. ఒకవేళ రైల్వే స్టేషన్లను ప్రైవేటు వ్యక్తులకు వేలం వేస్తే వారే ఆ లెక్కలు చూసుకుంటారు. ఈ రెండు ఐడియాలను వచ్చే పదేళ్ళలో దేశవ్యాప్తంగా అమలుపరచే దిశగా కృషి చేయాలి. అది తప్పకుండా సత్ఫలితాలను ఇస్తుంది.

వ్యాసకర్త 'బ్యాంక్ ఆఫ్ బరోడా'లో చీఫ్ ఎకనామిస్ట్, 'కార్పొరేట్ క్విర్క్స్: ద డార్కర్ సైడ్ ఆఫ్ ద సన్' పుస్తక రచయిత ('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

ఇండియన్ ఎకానమీ 'డెడ్ ఎకానమీ'నా?

'ఇండియన్ ఎకానమీ... డెడ్ ఎకానమీ' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించడం, వెనువెంటనే రాహుల్ గాంధీ ఆ వ్యాఖ్యలను సమర్థించడం; శశిథరూర్, రాజీవ్ శుక్లా లాంటి కాంగ్రెస్ నేతలే రాహుల్ వ్యాఖ్యల్ని తప్పు పట్టడం... తాజా పరిణామాలు.



క్రూడాయిల్ ధరలలో తగ్గుదల, డిజిటల్ సంస్కరణలు, పాలనలో అవినీతి తగ్గడం... ముఖ్యంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు నేరుగా అందేలా చెయ్యడం కూడా ద్రవ్యోల్బణ నియంత్రణకు తోడ్పడ్డాయి.

నిజానికి ఏ ప్రభుత్వం పనితీరును అయినా అంచనా వేయడానికి కీలక అంశం ద్రవ్యోల్బణం. అది ముఖ్యంగా... పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలను ప్రభావితం చేస్తుంది. యూపీఏ రెండో హయాంలో ప్రజల్లో ఏర్పడిన ఆగ్రహానికి ఒక కారణం... దేశంలోని ద్రవ్యోల్బణం. ఇది అప్పట్లో గరిష్ఠంగా 12 శాతానికి చేరుకుంది. ఆ తరువాత ప్రతిపక్ష నేతలు... ఆర్థిక మాంద్యాన్ని, ద్రవ్యోల్బణాన్ని ఆయుధంగా మలచుకుని మోదీ ప్రభుత్వాన్ని బద్నాం చెయ్యాలని పదేపదే ప్రయత్నించారు. కానీ... వాళ్ళు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, ద్రవ్యోల్బణం అనేది 2019 ఎన్నికల్లో గానీ, 2024 ఎన్నికల్లో గానీ ప్రముఖ ఎన్నికల నినాదంగా మారలేదు. ద్రవ్యోల్బణాన్ని నిర్ధారించటానికి మన దేశంలో... 2012 వరకు హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ)ని అనుసరించారు. ఆ తర్వాత నుంచి కంజ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (సీపీఐ)ని అనుసరిస్తున్నారు.

ఎన్డీయే హయాంలో సగటు సీపీఐ ద్రవ్యోల్బణం 5.03 శాతంగా ఉంది. ఇది ఆర్బీఐ ద్రవ్యోల్బణం లక్ష్యం 4 శాతం నుండి 6 శాతానికి మధ్యలో ఉంది. డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం రేటు ఇంకా తక్కువగా... 3.1 శాతమే ఉంది. కాబట్టి ఇది ఆల్ టైమ్ రికార్డ్ అన్నమాట! మోదీకి ముందు ప్రధానిగా పని చేసిన మన్మోహన్ సింగ్ పాలనా కాలంతో పోల్చినా కూడా ఇది ఎంతో మెరుగైన స్థితి. తక్కువ సమయంలో ద్రవ్యోల్బణం అంతగా నియంత్రణ అయిందంటే, దాని పైన ప్రభుత్వ ప్రభావం ఉందనే కదా! దీర్ఘకాలిక ద్రవ్యోల్బణ సమస్యను అధిగమించడంలో మోదీ ప్రభుత్వం తెచ్చిన అనేక సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థకు సహాయపడ్డాయి. అంతకుముందు, భారతదేశంలో ఒక రాష్ట్రం నుంచి ఇంకో రాష్ట్రానికి వస్తువుల రవాణాలో... పర్మిట్లు, పన్నుల పరంగా ఆలస్యం చోటు చేసుకునేది. జీఎస్టీ రావడంతో పరిస్థితి మారిపోయింది. దీనివల్ల రవాణా వేగంగా జరిగి ఇంధన ఆదా పెరిగింది.

క్రూడాయిల్ ధరలలో తగ్గుదల, డిజిటల్ సంస్కరణలు, పాలనలో అవినీతి తగ్గడం... ముఖ్యంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు నేరుగా అందేలా చెయ్యడం కూడా ద్రవ్యోల్బణ నియంత్రణకు తోడ్పడ్డాయి. ప్రజలకి డబ్బులివ్వడం కంటే... వాళ్లకి పనికొచ్చే నాణ్యమైన ఇళ్ళను 'పీఎమ్ ఆవాస్ యోజన' ద్వారా ప్రభుత్వమే కట్టించి ఇవ్వడం, టాయిలెట్‌లు కట్టించి ఇవ్వడం లాంటి ప్రత్యక్ష ప్రయోజన కార్యక్రమాలు ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడ్డాయి. కార్పొరేట్ పన్ను తగ్గింపులు, పీఎల్ఐలతో సహా అనేక పథకాలతో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడంలో కేంద్రం సఫలమైంది. ఇవన్నీ పటిష్ఠమైన ఆర్థిక క్రమశిక్షణతో వచ్చాయి. వాటి కారణంగానే ప్రపంచంలోని బలమైన ఆర్థిక వ్యవస్థలలో 4వ స్థానానికి మనం ఎగబాకాం. దీన్ని దృష్టిలో పెట్టుకునే ప్రస్తుత పరిస్థితులపై ఎవరైనా ఒక అంచనాకు రావాలి.

– శ్యాంప్రసాద్ రెడ్డి కోర్ళపాటి I సామాజిక విశ్లేషకుడు

బోనస్‌కై పోరాడాలి!

ఇన్ బాక్స్

నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2025–26 ఖరీఫ్ సీజన్‌కు 14 పంటలకు ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ)లు దేశ రైతాంగాన్ని నిరుత్సాహపరిచేవే. స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం సమగ్ర ఖర్చుల మీద అదనంగా 50% లాభం కలిపి ఈ కనీస మద్దతు ధరలను నిర్ణయించక పోవటం సరికాదు. అందుకే ఈ ధరలు దేశ రైతాంగానికి నష్టాన్ని మిగిల్చేవిగానే ఉన్నాయి.

ఖరీఫ్ పంటల్లో వరిపై ప్రస్తుతం ఎమ్ఎస్‌పీ క్వింటాలుకు కేవలం రూ. 69 మాత్రమే పెరిగింది. వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సీఏసీపీ) అంచనా వేసిన జాతీయ సగటు ధర ప్రకారం వరికి క్వింటాలుకు రూ. 3,135 ధర ప్రకటించాలి. కానీ, ప్రకటించిన ఎంఎస్‌పీ కేవలం రూ. 2,369 మాత్రమే. అంటే క్వింటాలుకు రూ. 766 నష్టం జరుగుతున్నది. ఈ పెరిగిన ధరలు కూడా రైతు పంట కోసం చేసిన ఖర్చు కంటే చాలా తక్కువగా ఉన్నాయి. జొన్న పంటకు ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌పీతో పోలిస్తే రైతుకు రూ. 1,110 నష్టం జరుగుతున్నది.

నిజానికి సీఏసీపీ అంచనా వేసిన ఖర్చు కంటే కూడా వాస్తవ ఉత్పత్తి వ్యయం చాలా ఎక్కువ. నిత్యం పెరుగుతున్న ఇన్ పుట్ వ్యయం రైతుల ఖర్చులను ఇంకా పెంచుతోంది. దీంతో గిట్టుబాటు ధరలు లేక రైతులు ఏటికేడాది అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. దేశంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభానికి ఇదే కారణం.

కనుక, కనీస మద్దతు ధరలు స్వామినాథన్ సిఫారసుల ప్రకారం సమగ్ర ఖర్చుల ప్రాతిపదికన (సి2+50%) నిర్ణయించాలనీ, కనీస మద్దతు ధరల చట్టం చేయాలనీ, తద్వారా రైతు ఆదాయం పెరిగేలా చూడాలనీ... రైతాంగం సమైక్యంగా పోరాడాలి.



కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరకూ వాస్తవంగా రైతులకు అయిన ఖర్చులకూ మధ్య వ్యత్యాసం ఉంటే... రాష్ట్రాలైనా తమ తమ పరిధిలో ఉన్న రైతులకు ఆ వ్యత్యాసాన్ని బోనస్ రూపంలో అందించి ఆదుకోవాలని రైతాంగం పోరాడాలి.

– కెచ్చెల రంగారెడ్డి I అఖిల భారత ఐక్య రైతు సంఘం తెలంగాణ అధ్యక్షులు


సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

డేటా పాయింట్


ఈవీ చార్జింగ్ స్టేషన్లు

కేంద్ర విద్యుత్ శాఖ గణాంకాల ప్రకారం, దేశంలో ప్రస్తుతం 29,277 విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు (ఈవీసీఎస్) ఉన్నాయి. ఇందులో తెలంగాణలో 1,066, ఆంధ్రప్రదేశ్‌లో 793 ఉన్నాయి.

ఈ స్టేషన్లు ఎక్కువ సంఖ్యలో ఉన్న టాప్ రాష్ట్రాలు:



యుగాలు దాటిన చిరంజీవి



జ్యోతిర్మయం

హనుమంతుడు త్రేతాయుగానికి చెందిన రామ భక్తుడు. వాయుదేవుని అనుగ్రహం వల్ల అంజనాదేవి, కేసరి దంపతులకు జన్మించాడు. ఆంజనేయుడనీ, వాయు నందనుడనీ, హనుమంతుడనీ పలు నామాలతో మారుతిని కీర్తిస్తారు. భగవద్భక్తులుగా ప్రసిద్ధిచెందిన వారెందరో మనకు తెలుసు. కానీ, ఊరూరా దేవాలయాలున్నది రామభక్త హనుమకే! బుద్ధి వికాసానికీ, దేహ బలానికీ, మనో బలానికీ, వ్యాధి నివారణకూ భక్తులు నమ్మకంతో ఆంజనేయుని పూజిస్తారు. హనుమ అనుగ్రహం ఉంటే రామానుగ్రహం సులభతరమవుతుంది. శ్రీరాముడు మెచ్చిన భాషణ కళ హనుమది.

ద్వాపర యుగంలో పాండవులలో భీముడు వాయుదేవుని అనుగ్రహంతోనే జన్మించాడు. మహా బలుడు, హనుమ సోదరుడు, భీముడు... సౌగంధిక కమలాలను తీసుకురావటానికి గంధమాదన పర్వత ప్రాంతానికి వెళుతున్నప్పుడు ఒక గుహలో నిద్రిస్తున్న హనుమ భీముని శంఖారావం విని, ఇది తన సోదరుని శంఖారావమే అని గుర్తించి, భీముని వినోదంగా పరీక్షించటానికి అతడు ముందుకు వెళ్ళటానికి వీలు లేకుండా పెద్ద వృక్షాలను దారి కడ్డంగా పడవేసి, నిద్రిస్తున్నట్లు నటిస్తాడు. భీముడు ఆయన్ని మేల్కొలిపి తనకు దారి ఇమ్మంటాడు. 'కడలి దాటిన హనుమలా నిన్ను దాటి దూకిపోగలను, హనుమతో సమానమైన శక్తి సామర్థ్యాలున్న వాణ్ణి' అంటాడు.

హనుమ, 'నేను వృద్ధుణ్ణి. నా తోకను కొంచెం అవతలికి నెట్టి ముందుకు వెళ్ళ'మంటాడు. భీముడు బలాన్నంతా ఉపయోగించి కదల్చలేక విఫలుడై సిగ్గుపడతాడు. ఆయనెవరో తెలపమని ప్రార్థిస్తే... వాయుదేవుని అనుగ్రహంతో జన్మించిన హనుమను తానేనని, నువ్వు నా సోదరుడవని చెపుతాడు. శ్రీరామచంద్రుడు తన సేవలకు మెచ్చి, తనను ఆయన హృదయంలో నిలుపుకొని నరులచేత తన కీర్తి అంటే, రాముని కీర్తి ఎంతకాలం ప్రశంసించ బడుతుందో అంతకాలం చిరంజీవివై వర్ధిల్లమని అనుగ్రహించాడని చెపుతాడు. అలా స్వయంగా రాముడే చిరంజీవిగా హనుమను దీవించాడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి



సాక్షి, హైదరాబాద్: విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి చెప్పారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన ప్రజలతో ముఖా ముఖి కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. ప్రజా పాలనలో ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నానన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలపై వినతులు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ముందుకు వెళ్తున్నామని యశస్వినీరెడ్డి చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గంలో కూడా పల్లెబాట కార్యక్రమం మొదలుపెట్టానని, ప్రతి సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకునేలా ఇప్పటికే 20 గ్రామాలు తిరిగానన్నారు.

అన్నా.. పిల్లలు పైలం!



జగదేవ్‌పూర్ (గజ్వేల్): అప్పుల బాధతో యువ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ కృష్ణారెడ్డి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బునారి నరేందర్(34) రేవతి దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. తనకున్న అరెకరంతోపాటు.. 3 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి, సాగు చేస్తున్నాడు. రెండు, మూడేళ్లుగా పంట నష్టం రావడంతో.. పంటకు చేసిన అప్పులు, పిల్లల చదువులకు సుమారు రూ.పది లక్షల వరకు అప్పులయ్యాయి. వ్యవసాయం చేస్తూనే గోదాముల్లో హమాలీగా కూడా నరేందర్ పని చేస్తున్నాడు. కాగా అప్పు తీర్చేందుకు ఇటీవల తనకున్న భూమిలో 8 గుంటల భూమి విక్రయించాడు. అయినా అప్పులు తీరకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం హైదరాబాద్‌లోని అన్న దేవేందర్‌కు ఫోన్‌చేసి గోడు చెప్పుకోగా.. ఆయన తమ్ముడికి మనోధైర్యం కలిగించాడు. అయినా నరేందర్ వినకుండా చనిపోతాను.. పిల్లలు పైలమంటూ పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌డీపీఎస్‌పై వారంలో 3 రోజులు ప్రత్యేక తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోకి నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాలు (ఎన్‌డీపీఎస్) రాకుండా అడ్డుకోవడానికి వారంలో మూడు రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. రహదారులు, రైళ్లలో తనిఖీలు విస్తృతం చేయాలని అధికారులను ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దులు, రహదారులపై వాహనాల తనిఖీలు, రైళ్లు, రైల్వే స్టేషన్లలోనూ విస్తృతంగా నిఘా పెట్టాలని సూచించారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దులో గంజాయి రవాణాను అడ్డుకోవడానికి ప్రణాళిక విడుదల చేశారు. ఈనెల 2, 3, 4 తేదీల్లో ఈ స్పెషల్ డ్రైవ్‌లో టీమ్‌లు పాల్గొని తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. జూలైలో 405 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను, 32 గ్రాముల హెరాయిన్, 755 గ్రాముల ఓపీఎం, నల్లమందు, 28 గ్రాముల చెరస్, 1.7 కేజీల ఆల్ప్రాజోలం, తొలిసారిగా మ్యాజిక్ మష్రూమ్స్‌ను పట్టుకున్నట్లు తెలిపారు.



గతేడు వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు డిజిటల్ క్లాస్ రూంలు, సైన్స్ ల్యాబ్‌లు మంజూరయ్యాయి. పది కంప్యూటర్లు, 25 ల్యాప్‌టాప్‌లు, ఎల్‌ఈడీ తెర వచ్చాయి. ఇంటర్నెట్ కనెక్షన్ లేకపోవడంతో డిజిటల్ పాఠాలకు విద్యార్థులు దూరమవుతున్నారు. సామగ్రి వినియోగంలోకి రాలేదు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో ప్రత్యామ్నాయంగా మరో గదిలో ఏర్పాటు చేశారు.



ఇది కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం సావర్ఖేడ ప్రాథమిక పాఠశాల. పీఎంశ్రీ కింద అదనపు తరగతి గది నిర్మాణం గతేడు మొదలు కాగా, ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగయ్య బోధనలో ప్రత్యేకత చాటుతున్నారు. ఇలాంటి చోట్ల త్వరితగతిన సౌకర్యాలు మెరుగుపరిస్తే విద్యార్థులకు మరింత మేలు జరగనుంది.

బోధపడని 'పీఎంశ్రీ'

- నూతన విద్యావిధానం అమలులో ఆటంకాలు
- గతేడాదిగా రాష్ట్రంలో అమలు చేస్తున్న కేంద్రం
- ఎంపికైన పాఠశాలల్లో అసంతృప్తిగానే పనులు
- హెచ్‌ఎం, టీచర్ల కొరవతో కొన్నిచోట్ల మెరుగు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బోధనలో విప్లవాత్మక మార్పులు తెచ్చే పీఎంశ్రీ(ప్రధాన్‌మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలు గాడిన పడడం లేదు. రాష్ట్రంలో గతేడాది నుంచి 'నూతన విద్యావిధానం 2020'లో భాగంగా కేంద్రం పీఎంశ్రీని అమలు పరుస్తోంది. మండలం/బ్లాక్ స్థాయిలో కనీసం ఒక ప్రీప్రైమరీ, ఒక ప్రైమరీ, హైస్కూల్ స్థాయి స్కూళ్లు ఇలా.. రెండు దశల్లో మొత్తం 794 స్కూళ్లు ఎంపికయ్యాయి. ఐదేళ్లపాటు (2022- 23నుంచి 2026-27)విద్యార్థులకు 21శతాబ్దపు నైపుణ్యాలకు అనుగుణంగా గుణాత్మక విద్యను అందించాలి. కేంద్ర, రాష్ట్ర వాటాలు (60:40%) కలిపి రూ.447.64 కోట్లు మంజూరైతే రూ.123 కోట్లకుపైగా ఖర్చయ్యాయి. అయితే ఆశించిన బోధన సాగడం లేదు. స్కూల్ హెచ్‌ఎం, తోటి ఉపాధ్యాయులు చొరవ తీసుకున్న చోట్ల కొంత ఫలితాలు కనిపిస్తున్నాయి.

నూతన ఒరవడిలో అభ్యసన

పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో పుస్తకానికే పరిమితం కాకుండా, ఆరు ప్రధానాంశాల్లో 9 రకాలుగా విద్యార్థులను తీర్చిదిద్దాలి. ఎలిమెంటరీ స్కూల్ పిల్లలకు ఆటలు, బొమ్మలతో ఆహ్లాదకర వాతావరణాన్ని ఇవ్వాలి. ప్రాథమిక, హైస్కూల్ పరిధిలో స్మార్ట్‌క్లాస్ రూంలు, డిజిటల్ లైబ్రరీ (అటల్ టింకరింగ్ ల్యాబ్) సైన్స్, మాథ్స్ ప్రయోగశాలలు, ఆర్ట్ స్టూడియోలు, ఆహ్లాదకరమైన వాతావరణంలో అభ్యసనలు మెరుగుపర్చుతూ బోధించాలి. శాస్త్రీయ దృక్పథంతో, తర్క జ్ఞానం, సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ, బహుభాషల అధ్యయనం, సమస్యల సాధన, నైతిక ప్రవర్తన, సామాజిక బాధ్యత, క్రీడా, తదితర నైపుణ్యాలు పెంపొందించాలి. విజ్ఞాన యాత్రలతో అనుభవపూర్వక చదువును అందించాలి. స్థానిక పరిశ్రమలతో అనుసంధానం చేస్తూ నైపుణ్యాభివృద్ధి చేయడం, ఆత్మస్థైర్యం పెంచేలా కరాటే శిక్షణ, దినపత్రికల పఠనం, చర్చలు, సంగీతం, యోగా, ఇతర కళలు నేర్పించాలి.

నిర్మాణాల్లోనే ప్రయోగశాలలు

స్కూళ్లలో కంప్యూటర్, అటల్ టింకరింగ్ సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి. అయితే చాలాచోట్ల నిర్మాణ దశల్లోనే ఉన్నాయి. మొదటి విడత నిధుల విడుదల ఆలస్యంతో నిర్మాణాల్లో జాప్యం జరిగాయి. చాలా స్కూళ్లలో ఇంకా ఇంటర్నెట్ సౌకర్యం లేదు. అదనపు తరగతులు సిద్ధం కాలేదు. గతేడు విజ్ఞాన యాత్రలు చేశారు. ఇటీవల సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఇంకా కొన్ని చోట్ల ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయి. ట్యాబ్‌లతో, ఎల్‌ఈడీ తెరలపై కొన్ని చోట్ల బోధిస్తున్నారు. కంప్యూటర్లు, ట్యాబ్‌లు, ఎల్‌ఈడీ తెరలు, క్రీడా సామగ్రి, సంగీత పరికరాలు వచ్చాయి. అయితే శిక్షకులు లేక వినియోగంలోకి రావడం లేదు. కొన్ని చోట్ల ప్రీ ప్రైమరీ స్కూల్‌లో టీచర్, ఆయాను ఏర్పాటు చేసుకుంటున్నారు.

సదుపాయాలు పెరిగాయి



పీఎంశ్రీతో మా పాఠశాలలో మౌలిక సదుపాయాలు పెరిగాయి. సైన్స్ ల్యాబ్స్, లైబ్రరీ అందుబాటులోకి వచ్చాయి. సైన్స్, మ్యాథ్స్ సర్కిల్స్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతోంది. క్రీడలు, కళల్లో శిక్షణ, క్షేత్రస్థాయి పరిశీలనలతో, స్కూల్ గార్డెన్‌తో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతోంది.

– బి.అక్షిత, పదోతరగతి, జెడ్పీహెచ్‌ఎస్(బాలికల) పాఠశాల, జన్నారం, మంచిర్యాల జిల్లా.



ఇది నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శంకర్‌భవన్‌లోని పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాల. ఇప్పటి వరకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. మొత్తం 514 మంది విద్యార్థులకు బాలికలు 172మంది ఉండగా రెండే బాత్రూమ్‌లు ఉన్నాయి. పీఎంశ్రీ నిబంధనలో తప్పనిసరిగా విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు ఉండాలి. అయితే ఇంకా మౌలిక వసతులే మెరుగుపడలేదు.




ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మన్నూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో రూ.7.43 లక్షలతో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటు, క్రీడా, సంగీత పరికరాలు కొనుగోలు చేశారు. అయితే ఇంటర్నెట్ కనెక్షన్ లేక కంప్యూటర్లు వినియోగంలోకి రాలేదు.

ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ కన్నుమూత



లక్ష్మీనారాయణ (ఫైల్)

నాంపల్లి (హైదరాబాద్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తులనాత్మక అధ్యయన శాఖ పూర్వ అధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపాధ్యక్షులు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ (78) మృతి చెందారు. గత కొంతకాలంగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శుక్రవారం ఉదయం అమెరికాలోని కాలిఫోర్నియాలో తన కుమారుడు వంశీ నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సత్యసాయి జిల్లా కదిరి మండలంలో ఆయన జన్మించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయన శాఖ అధ్యక్షులుగా పనిచేసి పదవీ విరమణ చెందారు. కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా కూడా పనిచేశారు. ఆయన కేవలం అధ్యాపకులే కాకుండా కవిగా, నాటక రచయితగా, విమర్శకులుగా, అనువాదకులుగా పనిచేశారు. తెలుగు, కన్నడ, ఇంగ్లిషు భాషల్లో పలు గ్రంథాలకు అనువాదం చేశారు. భైరప్ప కన్నడలో రచించిన 'పర్వ'నవలను అత్యంత సమర్థంగా తెలుగులోకి అనువదించి, కేంద్ర సాహిత్య అకాడమీ ద్వారా అనువాద సాహిత్య పురస్కారం అందుకున్నారు. ఇందిరా గోస్వామి హిందీలో రచించిన 'విషాద కామరూప'నవలను కూడా తెలుగులోకి అనువదించారు. లక్ష్మీనారాయణ మృతితో గొప్ప సాహితీవేత్తను కోల్పోయామని తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సంతాపం తెలియజేశారు. ఆయన మృతి తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. అలాగే తెలుగు విశ్వవిద్యాలయం శ్రీశైలం ప్రాంగణం పూర్వ పీఠాధిపతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ సంచాలకులు ఆచార్య పెదారపు చెన్నారెడ్డి, కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.




శ్రీశైలం ఆనకట్ట వద్ద పాల నురుగులా పరవళ్లు తొక్కుతున్న కృష్ణవేణి

ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ..

దోమలపెంట/నాగార్జునసాగర్: శ్రీశైలం ప్రాజెక్టులో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో శ్రీశైలం ప్రాజెక్టుకు 2,52,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు స్పిల్ వే ద్వారా 1,85,459 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 23,607, సుంకేసుల నుంచి 43,494 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. దీంతో శ్రీశైలం ఆనకట్ట ఎనిమిది గేట్లు పైకెత్తి స్పిల్ వే ద్వారా 2,15,424 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ.. 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 30,277 క్యూసెక్కులు.. మొత్తం 65,592 క్యూసెక్కుల నీళ్లు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.5 అడుగుల నీటిమట్టం వద్ద 201.5822 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

సాగర్‌లో 26 గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. 26 రేడియల్ క్రస్ట్ గేట్లలో 24 గేట్లను ఐదు అడుగులు, రెండు గేట్లను పది అడుగులు ఎత్తి 2,39,157 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పాదనతో 29,191 క్యూసెక్కులు దిగువ కృష్ణా నదిలోకి వదులుతున్నారు.



సాగర్‌లో 26 గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

'పీఎం కుసుమ్'కు నిబంధనలే అడ్డంకి

- సబ్సిడీ లేకపోవడంతో ముందుకు రాని రైతులు
- రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్ల కొర్రీలు
- భూమి మార్టిగేజ్‌కు అనాసక్తి
- సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు తక్కువగానే దరఖాస్తులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పీఎం కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్) పథకానికి నిబంధనలే అడ్డంకిగా మారాయి. రైతులు పొలాల్లో సౌరశక్తి ప్లాంట్ల ఏర్పాటుతో ఆదాయాన్ని సమకూర్చుకునేలా ఈ పథకం రూపొందించారు. సోలార్ ప్లాంట్లను రైతుల బంజరు, వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ సబ్సిడీ లేకపోవడం, రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్ల కొర్రీలు అవరోధంగా నిలుస్తున్నాయి.

దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యమైనా ..

వ్యవసాయ క్షేత్రాల్లో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుతో రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడం.. ఇదే సమయాన తరగని ఇంధన వనరులను ప్రోత్సహించడం పీఎం కుసుమ్ పథక ఉద్దేశం. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు 5 కి.మీ. పరిధిలో ఉన్న భూముల్లో 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల వరకు ప్లాంట్ల ఏర్పాటుకు వెసులుబాటు ఉంది. తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం రైతుల ప్లాంట్ల నుంచి విద్యుత్‌ను డిస్కమ్‌లు కొనుగోలు చేస్తాయి. రైతులే కాక నీటి వినియోగదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాల బృందాలు, గ్రామ సంస్థలకు అవకాశం కల్పించి ఈ ఏడాది జనవరి 22 నుంచి మార్చి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ ఏడాది డిసెంబర్ వరకు అగ్రిమెంట్లు పూర్తి కావడంతోపాటు 2026 మార్చి చివరి నాటికి సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఉత్పత్తి ప్రారంభించాలన్నది లక్ష్యం.

ఇవీ అవరోధాలు

- దరఖాస్తు చేసుకున్న రైతు ఒక్క మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు నాలుగు ఎకరాల భూమి అవసరం. ఇది విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఐదు కి.మీ. పరిధిలోనే ఉండాలి. సబ్‌స్టేషన్ నుంచి ప్లాంటు వరకు లైన్, స్తంభాల ఏర్పాటు ఖర్చు రైతులే భరించాలి. కానీ సదరు రైతు భూమి చివరలో ఉంటే మార్గమధ్యలోని భూముల రైతులు లైన్ వేయడానికి అనుమతించడం లేదు.
- ఒక మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన రూ.3.50 కోట్ల రుణం ఇవ్వడానికి బ్యాంకర్లు అనేక రకాల కొర్రీలు పెడుతున్నారు. భూమి మార్టిగేజ్ నిబంధన రైతులను వెనుకంజ వేయిస్తోంది. ఏజెన్సీ ఏరియాలో 1/70 యాక్ట్ అమల్లో ఉండడంతో మార్టిగేజ్‌కు అవకాశం ఉండదు.
- ఒక్కో ప్లాంట్ జీవితకాలం ఇరవై ఐదేళ్లు. తీసుకున్న రుణం 10–13 ఏళ్లలో పూర్తయినా అప్పటివరకు చేసిన కష్టమంతా కిస్తీలు చెల్లించడానికే సరిపోతుందని చెబుతున్నారు. రుణం తీరిన తర్వాత లాభం వచ్చినా అప్పటి వరకు ప్లాంట్ నిర్వహణ ఎలా అన్న ప్రశ్న వేధిస్తోంది.
- ఒక్కో యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 పైసలు చెల్లించడానికి డిస్కంలు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అదే డిస్కంలు ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తే రూ.8కి పైగా వెచ్చిస్తున్నారు. తమ నుంచి కూడా రూ.5 చొప్పున కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.
- ప్యానళ్ల కొనుగోలుపై కేంద్ర జీఎస్టీ, రాష్ట్ర జీఎస్టీ రూ.లక్షల్లో పడుతుండగా.. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రీయింబర్స్ చేస్తుంది. కేంద్రం మాత్రం జీఎస్టీలో ఎలాంటి మినహాయింపు ఇవ్వడం లేదు.
- ఖర్చు తగ్గించుకోవడానికి పక్కపక్కనే భూమి ఉన్న రైతులు ఒకే లైన్ వేసుకుంటామన్నా నిబంధనలు అనుమతించడం లేదు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో వెసులుబాటు ఇస్తున్నా ఎస్‌పీడీసీఎల్ పరిధిలో అంగీకరించడం లేదని సమాచారం.



315 దరఖాస్తులకు పీపీఏ..

టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో 17 జిల్లాలు ఉండగా.. మొత్తం 492 దరఖాస్తులకు గాను 635.30 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు ఎల్‌ఓఏ (లెటర్ ఆఫ్ అవార్డు) జారీ చేశారు. ఇందులో 315 దరఖాస్తులకు సంబంధించి 406.50 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) పూర్తయ్యింది. ఇంకా 177 దరఖాస్తులపై 228.80 మెగావాట్ల పీపీఏ పూర్తి చేయాల్సి ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ పథకం కింద 248 మంది 359.1 మెగావాట్ల ఉత్పత్తి కోసం దరఖాస్తు చేసుకొని, 80 మంది 120.6 మెగావాట్లకు సెక్యూరిటీ డిపాజిట్ సైతం చెల్లించారు. అయితే ఓ ప్రైవేట్ సంస్థ రైతుల నుంచి భూములు లీజుకు తీసుకొని ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 100 పైగా దరఖాస్తులు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సదరు సంస్థ 1,500 వరకు దరఖాస్తులు ఇచ్చినట్టు సమాచారం. కానీ భూమి మార్టిగేజ్ చేయడం, సబ్సిడీ లేకపోవడంతో ఈ సంస్థ ముందుకు రావడం లేదని తెలిసింది.



రెండు తలల గొర్రె పిల్ల జననం

బోనకల్: ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాయన్నపేటలో శుక్రవారం రెండు తలల గొర్రె పిల్ల జన్మించింది. గ్రామవాసి రామడుగు శేషగిరిరావుకు చెందిన మందలో ఒక గొర్రె ఇలా జన్మనిచ్చింది. గొర్రె పిల్ల ఆరోగ్యంగానే ఉందని యజమాని శేషగిరిరావు తెలిపారు.

25 శాతం సుంకాలు ఇక అధికారికం



అన్నంత పనీ చేసిన ట్రంప్

- అధికారిక ఉత్తర్వులపై సంతకం
- భారత్‌పై పెంపు, పాక్‌పై 10% తగ్గింపు
- 69 దేశాలకు వడ్డింపులు, వారంలో అమల్లోకి

వాషింగ్టన్/న్యూఢిల్లీ: తంపులమారి ట్రంప్ అన్నంత పనీ చేశారు. భారత్‌పై తాజాగా ప్రకటించిన 25 శాతం సుంకాలపై అమెరికా అధ్యక్షుడు అధికారిక ముద్ర వేశారు. ఈ మేరకు ఉత్తర్వులపై గురువారం సంతకం చేశారు. అంతేగాక పదుల కొద్దీ దేశాలపై కూడా సుంకాల కొరడా ఝళిపించారు. తద్వారా అంతర్జాతీయంగా మరోసారి వాణిజ్య కల్లోలానికి తెర తీశారు. తాజా జాబితాలో లేని దేశాలకు 10 శాతం టారిఫ్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అత్యధికంగా సిరియాపై 41 శాతం, పలు దేశాలపై అత్యల్పంగా 10 శాతం టారిఫ్‌లు వడ్డించారు. ఇవి ఆగస్టు 7 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే పాకిస్తాన్‌పై మాత్రం టారిఫ్‌లను 29 నుంచి 19 శాతానికి తగ్గించడం విశేషం. తాజాగా టారిఫ్‌లు విధించిన జాబితాలో 69 దేశాలున్నాయి. మరిన్ని దేశాలు తమతో చర్చలు జరుపుతున్నా, వాటి ప్రతిపాదనలు పరస్పర వర్తక లోటును పూడ్చేలా లేవంటూ ట్రంప్ పెదవి విరిచారు. ఈ నేపథ్యంలో త్వరలో మరిన్ని టారిఫ్ పెంపుదలలు ఉంటాయని వైట్‌హౌస్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. దీనిపై అధ్యక్షుడే ప్రకటన చేస్తారన్నారు. ఉత్తర అమెరికా వర్తక ఒప్పందం కింద అమెరికాలోకి ప్రవేశించే కెనడా, మెక్సికో ఉత్పత్తులకు సుంకాల బాదుడు నుంచి మినహాయింపు ఇచ్చారు. అయితే అమెరికాలోకి ఫెంటానిల్ భారీ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కెనడా విఫలమవుతోందని వైట్‌హౌస్ ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన ఉత్పత్తులపై టారిఫ్‌లను 25 నుంచి 35 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించింది. మెక్సికోకు మాత్రం పలు ఉత్పత్తులపై విధించిన 30 శాతం టారిఫ్‌లను సంప్రదింపులకు వీలుగా 90 రోజుల గడువిచ్చారు. అయితే ఆటోయేతర, లోహేతర వస్తువులకు మాత్రం గడువు ఇవ్వలేదు. మెక్సికో నుంచి ఉక్కు, అల్యూమినియం, రాగిపై 50 శాతం టారిఫ్‌లు, ఆటో ఉత్పత్తులపై 25 శాతం తప్పవని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. ట్రంప్ కొద్ది నెలల క్రితం ప్రపంచ దేశాలపై ప్రకటించిన టారిఫ్‌లు ఆగస్టు 1 నుంచే అమల్లోకి రావడం తెలిసిందే. భారత ఆర్థిక వ్యవస్థ మృతప్రాయమైనది అంటూ బుధవారం ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. మన ఎగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్టు తాజా ఉత్తర్వుల్లో ఆయన పునరుద్ఘాటించారు. రష్యా నుంచి భారీగా చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నందుకు ప్రకటించిన పెనాల్టీ శాతాన్ని మాత్రం తాజా ఉత్తర్వుల్లో వెల్లడించలేదు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాల్లో అమెరికా ప్రమేయాన్ని అంగీకరించేందుకు భారత్ ఇప్పటికే ససేమిరా అనడం తెలిసిందే. అమెరికాపై భారత్ సుంకాలు దారుణంగా ఉన్నాయంటూ ట్రంప్ ఇటీవలే విమర్శించడం, దేశ ప్రయోజనాలను అన్ని రకాలుగా కాపాడతామని కేంద్రం ప్రకటించడం తెలిసిందే. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల నడుమ చర్చలు కొనసాగుతుండగానే బుధవారం ట్రంప్ 25 శాతం సుంకాలు బాదారు. ఇక అమెరికాకు ఎగుమతులపై 15 శాతం టారిఫ్‌లకు దక్షిణ కొరియా ఇప్పటికే అంగీకరించింది. వాటిపై 25 శాతం బాదుడు తప్పదంటూ ట్రంప్ తొలుత హెచ్చరించారు. దాంతో ఆయన నిర్ణయించే అమెరికా ప్రాజెక్టుల్లో 350 బిలియన్ల మేరకు పెట్టుబడికి ఒప్పుకుంది. ఇక అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన చైనాపై టారిఫ్‌లను ట్రంప్ ఏ మేరకు నిర్ణయిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఆగస్టు 12 నాటికి ఒప్పందం కుదుర్చుకోవాల్సిందిగా ఆ దేశానికి ఆయన ఇప్పటికే అల్టిమేటమివ్వడం తెలిసిందే. ఇరు దేశాల నడుమ పలు అంశాలపై వర్తక విభేదాలు కొనసాగుతున్నాయి.

దేశం	టారిఫ్ (శాతాల్లో)
భారత్	25
సిరియా	41
మయన్మార్	40
స్విట్జర్లాండ్	39
కెనడా	35
ఇరాక్	35
దక్షిణాఫ్రికా	30
బంగ్లాదేశ్	20
మలేసియా	19
ఈయూ	15
ఇజ్రాయెల్	15
జపాన్	15
మారిషస్	15
బ్రిటన్	10

దేశ ప్రయోజనాలు కాపాడతాం: కేంద్రం

ట్రంప్ వ్యాఖ్యలు, తాజా ఉత్తర్వులపై కేంద్రం ఆచితూచి స్పందించింది. ''ద్వైపాక్షిక వాణిజ్య భాగస్వామ్యం అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచింది. ఇరు దేశాలు విశ్వసించే ఎజెండాకు కట్టుబడి ఉన్నాం. ఈ బంధం సజావుగా సాగుతుందని విశ్వసిస్తున్నాం'' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు ప్రతీకారంగా జరిమానా విధిస్తామన్న ట్రంప్ ప్రకటనను మీడియా ప్రస్తావించగా ఈ విషయంలో జాతి ప్రయోజనాలకు అనుగుణంగా మాత్రమే నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రష్యా సమీపంలోకి... అణు జలాంతర్గాములు!

అమెరికా అనూహ్య నిర్ణయం ● 'డెడ్ హ్యాండ్' హెచ్చరికలకు ప్రతిగానే



మాస్కో: అగ్ర రాజ్యాలు అమెరికా, రష్యా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. శుక్రవారం అమెరికా రెండు అణు జలాంతర్గాములను రష్యా సమీపంలో మోహరించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహాయకుడు, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ ద్మిత్రీ మెద్వెదెవ్ చేసిన 'డెడ్ హ్యాండ్' హెచ్చరికలకు ప్రతిస్పందనగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ''అవి మతిలేని, రెచ్చగొట్టే ప్రకటనలు. నిజంగానే అలాంటి పరిస్థితి తలెత్తే ఆస్కారముంటే దీటుగా స్పందించేందుకే ఈ నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. రెండు సబ్‌మెరైన్లను సరైన ప్రదేశాల్లో మోహరించాల్సిందిగా ఆదేశించా'' అని వివరించారు.

ఏమిటీ డెడ్ హ్యాండ్?

ఇది రష్యా (నాటి సోవియట్ యూనియన్) అభివృద్ధి చేసిన ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి వ్యవస్థ. ఆ దేశంపై ఎవరన్నా అణు దాడి చేస్తే అందుకు ప్రతిగా ఆటోమేటిగ్గా అణు దాడులు జరుపుతుంది. దేశ నాయకత్వం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయినా తనంత తానుగా స్పందించి దాడులకు దిగటం దీని ప్రత్యేకత.

భూమిపై ఎక్కడైనా కొట్టగల క్షిపణి: రష్యా

మాస్కో: అత్యాధునిక హైపర్‌సోనిక్ క్షిపణులను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నట్టు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. ఈ ఏడాది చివర్లో వాటిని బెలారస్‌లో మోహరించే యోచన ఉందని తెలిపారు. రష్యాకు అత్యంత సన్నిహిత దేశమైన బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకోతో కలిసి సెయింట్ పీటర్స్‌బర్గ్ సమీపంలో పుతిన్ మీడియాతో మాట్లాడారు. ''ఈ క్షిపణులకు సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. సంవత్సరాంతానికి ఉత్పత్తి మొదలవుతుంది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ఒరెష్నిక్, దానికి సంబంధించిన ఆయుధ వ్యవస్థలను గత అక్టోబర్‌లో పుతిన్ రంగంలోకి దించారు. ఆ సందర్భంగా ఒరెష్నిక్ సామర్థ్యాలను ప్రస్తుతించారు. ''సంప్రదాయ, అణు వార్‌హెడ్లు రెండింటినీ మోసుకెళ్లగలగడం దీని ప్రత్యేకత. లక్ష్యం భూమిపై ఎక్కడున్నా ఇప్పటికైనా ఈ క్షిపణులు ఆదుకోవాల్సిందే. ఇవి దాదాపుగా మాక్10 వేగంతో దూసుకెళ్తాయి.

'ఎఫ్-35' కొనుగోళ్లు బంద్!

ట్రంప్ దూకుడుకు కళ్లెం వేయనున్న భారత్ ● యుద్ధ విమానాలు కొనుగోలు చేయొద్దని నిర్ణయం



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలకు భారత ప్రభుత్వం ప్రతిచర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తమ ఉత్పత్తులపై ఏకంగా 25 శాతం సుంకాలు విధించడం, రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తే అదనపు జరిమానాలు విధిస్తామని హెచ్చరించడం భారత్‌ను పునరాలోచనలో పడేశాయి. ట్రంప్ దూకుడుకు విరుగుడుగా అమెరికా నుంచి రక్షణ పరికరాల కొనుగోలును విరమించుకోవాలని ఇండియా నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రధానంగా ఎఫ్-35 యుద్ధ విమానాల కొనుగోలును పూర్తిగా నిలిపివేయనున్నట్లు తెలిసింది. ట్రంప్ ఇటీవల భారత్‌పై కారాలు మిరియాలు నూరుతున్నారు. సోషల్ మీడియాలో వరుసగా పోస్టులు చేస్తున్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇండియాపై అమెరికా అధ్యక్షుడి మాటల దాడి మరింత తీవ్రమైంది. పాకిస్తాన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను వైట్‌హౌస్ ఆహ్వానించి, విందు ఇచ్చారు. ఇండియా ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్‌లు విధించనున్నట్లు తాజాగా ప్రకటించారు. ఒకవైపు భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగానే ట్రంప్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. భారత్‌తో తమకు వాణిజ్య లోటు ఉందని, దీన్ని కచ్చితంగా తగ్గిస్తామని ట్రంప్ తేల్చిచెప్పారు. ఈ పరిణామాలన్నీ భారత్‌కు ఇబ్బందికరంగా మారాయి.

అమెరికాతో చర్చలు జరుపలేదు

రక్షణ రంగంలో భారత్-అమెరికా మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. అమెరికా రక్షణ పరికరాలు, ఆయుధాలు, సైనిక రవాణా విమానాలను భారత్ ఉపయోగిస్తోంది. మరోవైపు ఎఫ్-35 యుద్ధ విమానాలను భారత్‌కు విక్రయించాలని డొనాల్డ్ ట్రంప్ గట్టి పట్టుదలతో ఉన్నారు. తద్వారా వేల కోట్ల డాలర్లు ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇరు దేశాలు చేసిన సంయుక్త ప్రకటనలో ఎఫ్-35 యుద్ధ విమానాల అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అయితే, ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో ఈ యుద్ధ విమానాల కొనుగోలుపై భారత ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు బ్లూమ్‌బర్గ్ సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ట్రంప్ ఆఫర్‌ను తిరస్కరిస్తున్నట్లు తెలిపింది. సమీప భవిష్యత్తులోనూ వీటిని కొనే అవకాశం లేదని పేర్కొంది. మరోవైపు ఎఫ్-35 యుద్ధ విమానాల కోసం అమెరికా ప్రభుత్వంతో అధికారికంగా ఎలాంటి చర్చలు జరుపలేదని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తేల్చిచెప్పారు. ఇదిలా ఉండగా, వాణిజ్య లోటుపై ట్రంప్ అభ్యంతరాల నేపథ్యంలో అమెరికా నుంచి సహజ వాయువు, కమ్యూనికేషన్ పరికరాలు, బంగారం కొనుగోళ్లు పెంచాలని భారత ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతీకార చర్యల్లో భాగంగా అమెరికా ఉత్పత్తులపై భారీగా సుంకాలు పెంచే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతానికి అందుకు దూరంగా ఉండాలని భారత ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. అమెరికాతో నెలకొన్న సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని అంచనా వేస్తోంది.

అక్టోబర్‌లో పాక్‌కు అందనున్న అమెరికా చమురు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మొట్టమొదటిసారిగా అమెరికా నుంచి కొనుగోలు చేసిన ముడి చమురు అక్టోబర్‌లో ఆ దేశానికి అందనుంది. హ్యూస్టన్ నుంచి బయలుదేరే చమురు నౌక కరాచీకి చేరుకోనుంది. పాకిస్తాన్‌లో భారీగా ఉన్న చమురు నిల్వలను వెలికితీసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండు రోజుల క్రితం ప్రకటించడం తెల్సిందే. ఈ నేపథ్యంలోనే పాక్‌కు అందే మొట్టమొదటి చమురు ట్యాంకర్ విషయం వెల్లడైంది. ట్రంప్, మోదీ మధ్య సంబంధాలు దెబ్బతిన్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో పాకిస్తాన్‌తో అమెరికా పాత బంధాన్ని పునరుద్ధరించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్ స్వతంత్రంగా తీసుకునే నిర్ణయాలు అమెరికా ఆశించినట్లుగా లేకపోవడంతో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు ప్రాంతీయ సమీకరణాలను మార్చే అవకాశాలు కన్పిస్తున్నాయి.



అత్యాచారం కేసులో ప్రజ్వల్ రేవణ్ణ దోషి

- 14 నెలల్లో తీర్పు ఇచ్చిన ప్రత్యేక కోర్టు
- నేడు శిక్ష ఖరారు చేయనున్న న్యాయస్థానం

బెంగళూరు: మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ మనవడు, జేడీ(ఎస్) మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను అత్యాచారం కేసులో కోర్టు దోషిగా తేల్చింది. పని మనిషిపై అత్యాచారం కేసులో ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు శుక్రవారం ఆయనను దోషిగా నిర్ధారించింది. శనివారం శిక్షను ఖరారు చేయనుంది. వేగంగా విచారణ ముగిసి.. కేసు నమోదైన 14 నెలల్లోనే తీర్పు వెలువడింది. తీర్పు వెలువడగానే ప్రజ్వల్ రేవణ్ణ కోర్టులో భావోద్వేగానికి గురయ్యారు. తీర్పు తరువాత కోర్టు గది నుంచి బయటికి వచ్చిన ఆయన ఏడుస్తూ కనిపించాడు. ప్రజ్వల్‌పై మూడు అత్యాచారం కేసులు, ఒక లైంగిక వేధింపుల కేసు నమోదైంది. లైంగిక వేధింపుల కేసులో విచారణ పూర్తయ్యింది. హసన్‌లో రేవణ్ణ కుటుంబానికి చెందిన ఫామ్‌హౌస్‌లో సహాయకురాలిగా పనిచేసిన 48 ఏళ్ల మహిళ అత్యాచారం కేసు పెట్టింది. ప్రజ్వల్ తనపై రెండుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని, వీడియో తీసి బెదిరించే వాడని ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ డిసెంబర్ 31 2024లో ప్రారంభమైంది. బాధితురాలు ధరించిన చీర, విచారణ సమయంలో కీలక సాక్ష్యంగా పనిచేసింది. చీరపై స్పెర్మ్ ఉందని ఫోరెన్సిక్ నిర్ధారించింది. ఈ కేసులో ప్రజ్వల్‌కు కనీసం పదేళ్ల జైలు శిక్ష లేదా జీవిత ఖైదు పడే అవకాశం ఉంది.

పార్లమెంట్‌లో ఆగని రగడ

- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై వెంటనే చర్చించాలని విపక్షాల పట్టు
- ఉభయసభలు సోమవారానికి వాయిదా

న్యూఢిల్లీ: బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)పై పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు పదో రోజు సైతం యథావిధిగా ఆందోళన కొనసాగించాయి. దీనిపై వెంటనే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉభయసభల్లో నిరసనలు, నినాదాలతో హోరెత్తించాయి. దీంతో లోక్‌సభ, రాజ్యసభ పలుమార్లు వాయిదా పడ్డాయి. శాంతించాలని, సభా కార్యకలాపాలకు సహకరించాలని పదేపదే విజ్ఞప్తి చేసినా వారు వినిపించుకోకపోవడంతో ఉభయసభలను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ప్రకటించారు. అంతకుముందు రాజ్యసభలో వెల్‌లోకి దూసుకొచ్చిన ప్రతిపక్ష సభ్యులను మార్షల్స్ అడ్డుకున్నారు. దీనిపై విపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌ను పారామిలటరీ దళం అదుపులోకి తీసుకుందని మండిపడ్డారు. మరోవైపు లోక్‌సభలో రిప్రజెంటేషన్ ఆఫ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఇన్ అసెంబ్లీ కానిస్టిట్యూయెన్స్ ఆఫ్ ద స్టేట్ గోవా బిల్లు-2024, ఇండియన్ పోర్ట్స్ బిల్లు-2025, మర్చంట్ షిప్పింగ్ బిల్లు-2024ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

స్పీకర్ ఓం బిర్లాకు విపక్షాల లేఖ

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై తక్షణమే లోక్‌సభలో ప్రత్యేక చర్చ నిర్వహించాలని కోరుతూ స్పీకర్ ఓం బిర్లాకు ప్రతిపక్ష సభ్యులు లేఖ రాశారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ సవరణ ప్రక్రియ నిర్వహించడంపై వారు అనుమానాలు వ్యక్తంచేశారు. దేశంలో గతం ఇలాంటి పరిణామం ఎప్పుడూ జరగలేదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ నిర్వహిస్తామని ఎన్నికల సంఘం సంకేతాలిస్తోందని గుర్తుచేశారు. ఈ ప్రక్రియ ఉద్దేశం పట్ల సందేహాలున్నాయని వెల్లడించారు. స్పీకర్‌కు రాసిన లేఖపై రాహుల్ గాంధీ(కాంగ్రెస్), టీఆర్ బాలు(డీఎంకే), సుప్రియా సూలే(ఎన్సీపీ), లాల్‌జీ వర్మ(సమాజ్‌వాదీ పార్టీ) తదితరులు సంతకాలు చేశారు.

హరివంశ్‌కు మల్లికార్జున ఖర్గే లేఖ

రాజ్యసభలో వెల్‌లో భద్రతా సిబ్బంది తమను అడ్డుకోవడం పట్ల విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. అక్కడ సీఐఎస్ఎఫ్ సిబ్బంది కనిపించడం తమను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ మేరకు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌కు ఖర్గే శుక్రవారం లేఖ రాశారు. ప్రజాస్వామ్య పద్ధతితో నిరసన తెలిపే హక్కుకు కాలరాసే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. భవిష్యత్తులో సీఐఎస్ఎఫ్ సిబ్బంది రాజ్యసభ వెల్‌లోకి రాకుండా నియంత్రించాలని హరివంశ్‌ను కోరారు. పార్లమెంట్ ఉభయసభల లోపల భద్రతపై ప్రభుత్వానికి సంబంధం లేదని, అది సభాపతుల పరిధిలోని అంశమని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టంచేశారు.

అణు బాంబు లాంటి సాక్ష్యం ఉంది



- ఓట్ల చౌర్యానికి పాల్పడుతున్న అధికారులు శిక్ష అనుభవించాల్సిందే
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఎన్నికల సంఘం(ఈసీ) తీరుపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార బీజేపీకి మేలు చేయడమే లక్ష్యంగా ఈసీ ఓట్ల చౌర్యానికి పాల్పడుతోందని ఆరోపించారు. ఈ ఓట్ల చోరీని నిరూపించడానికి తమ వద్ద అణు బాంబు లాంటి సాక్ష్యం ఉందని స్పష్టంచేశారు. ఈ అణు బాంబు పేలితే దాక్కోవడానికి ఈసీకి దేశంలో ఎక్కడా చోటు దొరకదని అన్నారు. ఓట్ల చౌర్యానికి పాల్పడుతున్న అధికారులు ఎప్పటికైనా శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. రాహుల్ గాంధీ శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ఓట్ల చౌర్యంపై తమ వద్ద 100 శాతం సాక్ష్యం ఉందన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) పూర్తయ్యి ముసాయిదా జాబితాను విడుదల చేసిన రోజే ఎన్నికల సంఘంపై రాహుల్ ఆరోపణలు గుప్పించడం గమనార్హం. కొందరి ఓట్లు తొలగించడం, కొత్తగా ఓటర్లను చేర్పించడం సాధారణ విషయం కాదని ఆయన పేర్కొన్నారు. బీజేపీ కోసమే ఈ తతంగం సాగుతోందన్నారు. 2023లో జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో, గత ఏడాది జరిగిన లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగినట్లు తమకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. మహారాష్ట్రలో ఓట్ల చౌర్యం జరిగిందన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరిట ఎన్నికల ముందు కొత్తగా కోట్లాది మంది ఓటర్లను జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. దీనిపై పూర్తి వివరాలు ఇవ్వాలని కోరితే ఎన్నికల సంఘం స్పందించలేదని విమర్శించారు. అందుకే తామే సొంతంగా ఆరు నెలలపాటు పరిశోధన చేశామని, అణు బాంబు లాంటి సాక్ష్యం లభించిందని వ్యాఖ్యానించారు. ఓట్లను దొంగతనం చేయడం దేశ ద్రోహం కంటే తక్కువేమీ కాదన్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులు పదవీ విరమణ చేసి ఎక్కడున్నా సరే వెతికి పట్టుకుంటామని తేల్చిచెప్పారు. దేశానికి వ్యతిరేకంగా పని చేసిన వ్యక్తులకు శిక్ష తప్పదన్నారు.

రాహుల్ ఆరోపణలు పట్టించుకోవద్దు

ఓటర్ల జాబితా రూపకల్పనలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న వరుస ప్రకటనలపై ఎన్నికల సంఘం శుక్రవారం స్పందించింది. బాధ్యతారహితమైన, నిరాధార ఆరోపణలు పట్టించుకోవద్దని.. పారదర్శకంగా, నిజాయతీగా విధులు నిర్వర్తించాలని తమ అధికారులకు సూచించింది. ఓట్ల చౌర్యం అంటూ ప్రతిరోజూ వస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని తేల్చిచెప్పింది. ఆరోపణల గురించి పట్టించుకోకుండా ఎన్నికల ప్రక్రియ కొనసాగించాలని ఈసీ పేర్కొంది. దేశంలో ఎన్నికలు పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు స్పష్టంచేసింది.

ప్రతి ఇంటికీ సంస్కృతాన్ని చేర్చాలి

ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ పిలుపు

నాగపూర్: సంస్కృత భాష భారతీయ భాషలన్నింటికీ తల్లి లాంటిదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భగవత్ అన్నారు. దేశంలో ప్రతి ఇంటికీ సంస్కృతం చేరాలని, రోజువారీ సంభాషణలు ఈ భాషలో జరగాలని చెప్పారు. మన ప్రాచీన భాష గురించి ప్రతి ఒక్కరీ తెలుసుకోవాలని సూచించారు. ఈ భాషను బతికించుకోవాలని, మరింత సుసంపన్నంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. మన మనసులోని భావాలను చక్కగా వ్యక్తీకరించడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుందన్నారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో కాళిదాస్ సంస్కృత యూనివర్సిటీలో నూతన భవనాన్ని మోహన్ భగవత్ శుక్రవారం ప్రారంభించారు. సంస్కృతం మరింత పరిఢవిల్లాలంటే నిత్యజీవితంలో ఉపయోగించాలని చెప్పారు. భాషను అర్థం చేసుకోవడానికి, దాన్ని మాట్లాడడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుందన్నారు. తాను సంస్కృతం నేర్చుకున్నప్పటికీ ధారాళంగా మాట్లాడలేనని చెప్పారు. మన దేశం స్వయం సమృద్ధి(ఆత్మ నిర్భరత) సాధించడంతోపాటు ఆత్మబలాన్ని చాటడం కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. ఇందుకోసం మన మేధస్సు, పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు.

'షార్' డైరెక్టర్‌గా ఈఎస్ పద్మకుమార్

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ 'షార్' నూతన డైరెక్టర్‌గా ఈఎస్ పద్మకుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌కు డైరెక్టర్‌గా బదిలీ కావడంతో బెంగళూరులోని ఇస్రో ఇనర్షియల్ సిస్టమ్ యూనిట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈఎస్ పద్మకుమార్‌ను షార్ నూతన డైరెక్టర్‌గా నియమించారు. పద్మకుమార్ బెంగళూరు ఐఐఎస్సీలో సిస్టం సైన్స్ అండ్ ఆటోమేషన్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసి, 1996లో ఇస్రోలో ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరారు. ఆయన ఏఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎల్వీఎం3, ఎస్ఎస్ఎల్వీ ప్రయోగ వాహనాలతో పాటు మార్స్ ఆర్బిటార్ మిషన్, చంద్రయాన్, ఆదిత్య ప్రయోగాల్లో కీలకంగా వ్యవహరించారు.

ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9న

ప్రకటించిన ఎన్నికల కమిషన్ ● పోటీ రసవత్తరంగా ఉండే అవకాశం

న్యూఢిల్లీ: జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవి ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 9వ తేదీన పోలింగ్ జరపనున్నట్లు శుక్రవారం ఎన్నికల కమిషన్(ఈసీ) ప్రకటించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం ఉమ్మడి అభ్యర్థిని బలపరిచేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో ఈ సారి పోటీ ఆసక్తికరంగా మారే అవకాశాలున్నాయి. అయితే, సంఖ్యాపరంగా చూస్తే బీజేపీ సారథ్యంలోనే ఎన్డీఏదే పైచేయిగా ఉంది. రెండేళ్ల పదవీకాలం మిగిలుండగానే జూలై 21న ధన్‌ఖడ్ రాజీనామా చేయడం తెల్సిందే. దేశ 17వ ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ శుక్రవారం ప్రకటించింది. ఎన్నిక నోటిఫికేషన్ ఆగస్టు 7న విడుదల చేయనుంది.

ఎలక్టోరల్ కాలేజీ బలం 782

ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎలక్టోరల్ కాలేజీ ఏర్పాటవుతుంది. ఇందులో లోక్‌సభ, రాజ్యసభలకు ఎన్నికైన, నామినేటెడ్ సభ్యులుంటారు. వీరికే ఓటు హక్కు ఉంటుంది. ప్రస్తుతం రాజ్యసభలో ఎన్నికైన 233 మంది సభ్యులతోపాటు, నామినేటెడ్ 12 మంది సభ్యులు, అదేవిధంగా, లోక్‌సభకు ఎన్నికైన 543 మంది సభ్యులున్నారు. రాజ్యసభలో ఐదు, లోక్‌సభలో ఒక స్థానం ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న రాజ్యసభ స్థానాల్లో నాలుగు జమ్మూకశ్మీర్ నుంచి, ఒకటి పంజాబ్ నుంచి ఉన్నాయి. ఆప్ నేత సంజీవ్ అరోరా గత నెలలో జరిగిన ఉప ఎన్నికలో పంజాబ్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. దీంతో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో, ఎలక్టోరల్ కాలేజీ మొత్తం బలం 782. ఎన్నికలో విజేతగా నిలవాలంటే 391 ఓట్లు పడాలి. అందుకే, అర్హులైన ఎంపీలంతా తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాలున్నాయి. లోక్‌సభలోని 542 మంది సభ్యులకుగాను బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకి 293 మంది సభ్యుల బలముంది. అదేవిధంగా, రాజ్యసభలోని 240 మందిలో అధికార పార్టీకి 129 మంది సభ్యులున్నారు. మొత్తం కలిపి 422 మంది. ఈ లెక్కన అధికార పక్షం బలపరిచే అభ్యర్థినే విజయం వరించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే, ఏకాభిప్రాయం కుదిరే అవకాశాలు లేనందున, ప్రతిపక్షాలు ఉమ్మడిగా అభ్యర్థిని బరిలో నిలిపేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

ఉప రాష్ట్రపతి ఎన్నిక-2025

- నోటిఫికేషన్ విడుదల తేదీ: ఆగస్టు 7
- నామినేషన్ల దాఖలు తుది గడువు: ఆగస్టు 21
- నామినేషన్ల పరిశీలన: ఆగస్టు 22
- ఉపసంహరణకు చివరి తేదీ: ఆగస్టు 25
- పోలింగ్ తేదీ :సెప్టెంబర్ 9
- పోలింగ్ సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
- ఓట్ల లెక్కింపు: సెప్టెంబర్ 9

బిహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

65 లక్షల పేర్లు తొలగింపు

పట్నా: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం పూర్తిచేసింది. ముసాయిదా ఓటర్ల జాబితాను శుక్రవారం విడుదల చేసింది. 65 లక్షలకుపైగా పేర్లను తొలగించింది. వారిలో చాలామంది మరణించారని, కొంతమంది వలస వెళ్లారని, అందుకే తొలగించామని ఎన్నికల సంఘం వెల్లడించింది. ముసాయిదా జాబితాలో మొత్తం 7.24 కోట్ల మంది ఓటర్ల పేర్లు ఉన్నాయి. దీనిపై సెప్టెంబర్ 1వ తేదీలోగా అభ్యంతరాలు వ్యక్తం చేయొచ్చని ఈసీ సూచించింది. మార్పులు చేర్పుల తర్వాత తుది జాబితాను ప్రచురిస్తామని వెల్లడించింది. ముసాయిదా జాబితాపై విపక్ష ఆర్జేడీ, కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేశాయి. అర్హుల పేర్లు తొలగించి, అనర్హుల పేర్లు చేర్చారని ఆరోపించాయి. బీజేపీకి అనుకూలంగా ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నారని మండిపడ్డాయి. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై పార్లమెంట్ సైతం అట్టుడుకుతోంది. బంగ్లాదేశీలు, రోహింగ్యాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయని, వాటిని తొలగిస్తే తప్పేంటని బీజేపీ ప్రశ్నిస్తోంది.

సాక్షి కరీంనగర్

శనివారం । 2 । ఆగస్టు । 2025



క్వింటాల్ పత్తి రూ.7,400

జమ్మికుంట: స్థానిక మార్కెట్లో శుక్రవారం పత్తి ధర రూ.7,400 పలికింది. మార్కెట్‌కు తొమ్మిది క్వింటాళ్ల పత్తిని తెచ్చారు. శని,ఆదివారం సెలవు అని, సోమవారం క్రయ విక్రయాలు కొనసాగుతాయని కార్యదర్శి తెలిపారు.



యాంత్రీకరణకు మహర్దశ

దశాబ్దానికి పైగా అన్నదాతలకు దూరమైన వ్యవసాయ యాంత్రీకరణ పథకం మళ్లీ చేరువవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఈనెల 5నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

8లో▸

గరిష్టం/కనిష్టం

33.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాలి

- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, అధికారులు

కరీంనగర్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 7వరకు నిర్వహించనున్న కార్యక్రమాల్లో తల్లిపాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల నిర్వహణ సమన్వయ సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ ఐసీడీఎస్, ఆరోగ్యశాఖ సమన్వయంతో అంగన్వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య, పోషన్ అభియాన్ సిబ్బంది తల్లిపాల ప్రాధాన్యతను వివరించాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించే పోస్టర్లు బ్యానర్లు ప్రదర్శించాలని తెలిపారు. గ్రామాల్లో, వార్డుల్లో అన్నప్రాసన, అక్షరాభ్యాసం, సీమంతం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు.

ఫేస్ రికగ్నేషన్ హాజరుకు సర్వర్ సమస్య



మొగ్దుంపూర్ జెడ్పీ పాఠశాలలో ఫొటో తీస్తున్న ఉపాధ్యాయుడు

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నుంచి ఉపాధ్యాయుల హాజరు కోసం ప్రత్యేకంగా అమలు చేస్తున్న ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ విధానానికి సాంకేతిక సమస్యలేర్పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఉపాధ్యాయులందరూ యాప్‌ను వినియోగించడంతో సర్వర్ సమస్య తలెత్తింది. జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు స్మార్ట్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అయిన తర్వాత ఉదయం 8.50గంటలకు నిర్దేశిత సమయంలో ఫేస్ రికగ్నేషన్ హాజరు వేసుకున్నారు. అనంతరం పాఠశాల ముగింపు సమయంలో తిరిగి హాజరు వేసుకోవడం జరిగింది. ప్రారంభంలో యాప్ వినియోగించడంలో నెలకొన్న సాంకేతిక సమస్యలతో కొంత జాప్యమేర్పడిందని పలువురు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

హాస్టల్‌లో మెనూ పాటించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: ప్రభుత్వం రూపొందించిన ప్రకారం మెనును హాస్టల్‌లో తప్పకుండా పాటించాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ముకరంపుర కళాశాలస్థాయి వసతిగృహాన్ని సందర్శించారు. హాస్టల్‌ను పరిశీలించారు. కిచెన్‌ను తనిఖీ చేశారు. మెనూ పాటిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్ విద్యార్థుల కోసం ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిందన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించే విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని వార్డెన్‌కు సూచించారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కేవీ.అంబేద్కర్‌నగర్ ఫీడర్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్, శివాజీనగర్, ఎస్టీకాలనీ, కిసాన్‌నగర్ ప్రాంతాలతో పాటు విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కె.వీ.భగత్‌నగర్ ఫీడర్ పరిధిలోని ఎర్రగట్టు, వాసుదేవకాలనీ, న్యూ శ్రీనగర్‌కాలనీ, కట్టరాంపూర్, ఆయోధ్యకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఎం.లావణ్య తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కె.వీ.తీగలగుట్టపల్లి ఫీడర్ పరిధిలోని సరస్వతీనగర్, విద్యారణ్యపురి, తీగలగుట్టపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ గాదం రఘు తెలిపారు.

తప్పంతా వాళ్లదే

- రెవెన్యూశాఖ సమాచార లోపంతోనే పొరపాట్లు
- స్థలాల డీమార్కేషన్ చేయకపోవడంతోనే తప్పులు
- ప్రతీ డాక్యుమెంట్ పరిశీలించాలంటే రిస్కే..
- సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నాం
- పత్రాలు ఉంటే ఇంటినంబర్లకు రిజిస్ట్రేషన్లు
- డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా రూ.వందల కోట్లు అవినీతి.. ప్రభుత్వ భూములను ఏదో ఒక కారణం చూపడం, రిజిస్ట్రేషన్లు చేసేయడం, విషయం బయటికి పొక్కితే అవునా..? అంటూ నాలిక కరుచుకోవడం.. నెపమంతా రెవెన్యూ విభాగంపైకి నెట్టేయడం.. ఇదీ రిజిస్ట్రేషన్‌శాఖలో భూములు రిజిస్ట్రేషన్ చేసే అధికారుల తీరు. ఇటీవల కరీంనగర్ పరిధిలో రూ.వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు అప్పనంగా రిజిస్ట్రేషన్ చేయడంపై లోకాయుక్త మొట్టికాయలు వేయడంతో రిజిస్ట్రేషన్‌శాఖ లీలలు క్రమంగా వెలుగులోకి వస్తున్నాయి. సంబంధిత శాఖ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ మాత్రం జరుగుతున్న అవినీతి కార్యక్రమాల్లో సబ్‌రిజిస్ట్రార్ల పాత్ర అసలు లేదని, ఇదంతా రెవెన్యూ విభాగం చూసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. ఏ భూమి ప్రభుత్వానిదో, ఏ భూమి నిషేధితమో వారు సమాచారం ఇవ్వడం లేదని, అందువల్లే.. సబ్‌రిజిస్ట్రార్లు తప్పుడు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, సమాచారం ఉంటే వారు అలా ఎందుకు చేస్తారని శుక్రవారం 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో హుజురాబాద్, ఇటీవల గంగాధర సబ్‌రిజిస్ట్రార్లపై ఈ కారణంగానే వేటు పడిందని చెప్పుకొచ్చారు.

ఇప్పటికీ రికార్డుల్లో..

కొత్తపల్లిలోనే సర్వే నంబరు 272/14లో ఉన్న 20 గుంటల భూమిని తొమ్మిదిమందికి ఇటీవల మాజీ సబ్‌రిజిస్ట్రార్ నూర్ అఫ్జల్‌ఖాన్ రిజిస్ట్రేషన్ చేసిన విషయం తెలిసిందే. విచారణ జరిపిన ఉన్నతాధికారులు సబ్‌రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటువేశారు. జూలై 26వ తేదీన సస్పెండ్ చేసినా.. కార్యాలయానికి వచ్చి.. 28వ తేదీన కూడా పనిచేయడం గమనార్హం. ఆయన చేతికి సస్పెన్షన్ ఆర్డర్ వచ్చేలోగా.. 20 గుంటల భూమిలో జరిగిన తొమ్మిది రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు. 272 సర్వేనంబర్‌లో మిగిలిన బైనంబర్లతో ఉన్న భూమి కూడా ప్రభుత్వ భూమి అని ప్రభుత్వ రికార్డుల్లో ఇప్పటికీ చూపిస్తోంది. అయినా, తమకు సమాచారం లేదంటూ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. పైపెచ్చు.. రెవెన్యూ విభాగం తమకు ప్రొహిబిటెడ్ భూముల సమాచారం ఇవ్వడం లేదంటూ సబ్‌రిజిస్ట్రార్లు యథేచ్ఛగా ప్రభుత్వ భూములకు రిజిస్ట్రేషన్లు చేస్తుండటం గమనార్హం.

ఇంటి నంబర్ల బాగోతం

జిల్లా రిజిస్ట్రేషన్‌శాఖలో వెలుగుచూస్తున్న వరుస అక్రమాలపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కొత్తపల్లిలోని సర్వే నంబరు 272/14లోని 20 గుంటల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇంటి నంబర్లతోనూ పలు ప్రభుత్వ భూములను కాజేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. కరీంనగర్‌లో అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో షెడ్లుకట్టి, సెల్ఫ్ అసెస్‌మెంట్ ద్వారా ఇంటినంబర్లు పొందిన వందలాది ఇళ్ల వివరాలను కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ గుర్తించింది. ఆయా నంబర్లపై ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దని రిజిస్ట్రేషన్ శాఖకు అధికారికంగా లేఖ రాసింది. దీంతో నగరంలో రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా అడ్డుకట్ట వేయగలిగినట్లయింది.

రెండు నెలల్లో రూ.వందల కోట్ల అక్రమాలు

కొత్తపల్లి మండలంలోని సర్వే నంబర్లు 175, 197, 198లోని దాదాపు 20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో జరిగిన 476 రిజిస్ట్రేషన్లు లోకాయుక్త ఆదేశాలతో రద్దయిన విషయం తెలిసిందే. 175, 197, 198 సర్వేనంబర్లలోని 20 ఎకరాల ప్రభుత్వ భూమి విషయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల మధ్య సమన్వయలోపం ఉందన్న విషయం 1995లోనే వెలుగుచూసింది. మూడు దశాబ్దాలు గడిచినా ఈ రెండు శాఖలు ఎందుకు పరస్పరం సమాచారం ఇచ్చిపుచ్చుకోలేదో.. ఎందుకు లోకాయుక్త నుంచి ఆదేశాలు వచ్చే వరకూ రిజిస్ట్రేషన్లు చేశారో జిల్లా ఉన్నతాధికారులకే తెలియాలి. ఫలితంగా ప్రభుత్వ భూమిలో ప్లాట్లు కొన్న 476 మంది అమాయకులు న్యాయం కావాలంటూ కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ కొనుగోళ్లతో రూ.వందల కోట్లు చేతులు మారాయి.

పత్రాలుంటే రిజిస్ట్రేషన్లు చేస్తాం



ఇంటినంబర్ల విషయంలో మాకు కొన్ని ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమే. సరైన డాక్యుమెంట్లు, పన్నులు కట్టిన పత్రాలు, గ్రామ కార్యదర్శి లేదా బల్దియా కమిషనర్ ఎండార్స్‌మెంట్ ఉంటే రిజిస్ట్రేషన్ చేస్తాం. ప్రొహిబిటెడ్ భూముల విషయంలో రెవెన్యూశాఖదే బాధ్యత. వివాదాస్పద భూములను ఎప్పటికప్పుడు డీమార్కేషన్ చేసి రికార్డులను అప్‌డేట్ చేయకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. చాలా సందర్భాల్లో సబ్ రిజిస్ట్రార్లు ప్రొహిబిటెడ్ ప్రాపర్టీలను తెలియకుండా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. మాకు ఫీల్డ్ స్టాఫ్ లేరు. ప్రతీ ప్రాపర్టీని విచారణ చేయాలంటే.. మేం రోజుకు ఒక్క డాక్యుమెంట్ కూడా చేయలేం. ఇప్పటికే పని ఒత్తిడితో సతమవుతున్నాం.

– ప్రవీణ్‌కుమార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, కరీంనగర్



భక్తులతో కిటకిటలాడుతున్న మహాశక్తి ఆలయం

ఒడిబియ్యం.. కుంకుమార్చనలు



కరీంనగర్ కల్చరల్: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో రద్దీ కనిపించింది. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. చైతన్యపురిలోని శ్రీ మహాశక్తి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, ఒడిబియ్యం సమర్పించారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో ఒడిబియ్యం సమర్పించారు. పాత బజార్ శివాలయంలో కుంకుమార్చనలు నిర్వహించారు.



పాతబజార్ శివాలయంలో కుంకుమార్చనలు



వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు

పబ్లిక్ స్కూల్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

కరీంనగర్: ప్రస్తుత విద్యా సంవత్సరంలో అర్హత గల షెడ్యూల్ కులాల బాలబాలికలకు హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారని షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ జిల్లా ఉప సంచాలకుడు ఎం.నాగైలేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో రెండు సీట్లలో ప్రవేశాలు కల్పిస్తున్నారని తెలిపారు. 01 జూన్ 2018 నుంచి 31 మే 2019 మధ్యన జన్మించి ఉండాలని, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50,000, పట్టణ ప్రాంతాలవారికి రూ.2 లక్షలకు మించరాదన్నారు. ఆదాయం, కులం ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్ జిరాక్స్ ప్రతులను గెజిటెడ్ అధికారులతో ధ్రువీకరించి ఈనెల 8వ తేదీలోపు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండు కన్నా ఎక్కువ దరఖాస్తులు జిల్లాలో వస్తే లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారని తెలిపారు. లాటరీ ఎంపిక కార్యక్రమం ఈనెల 10న కలెక్టరేట్‌లో ఉంటుందని తెలిపారు.

8న బీఆర్‌ఎస్ 'బీసీ గర్జన'



మాట్లాడుతున్న మధుసూదనాచారి, పక్కన మాజీ మంత్రులు కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు రవిశంకర్, విద్యాసాగర్‌రావు, రసమయి, మనోహర్‌రెడ్డి, సతీశ్‌బాబు తదితరులు

- కరీంనగర్ సభకు యావత్ తెలంగాణ కదలి రావాలి
- సీఎం ట్రాప్‌లో కాంగ్రెస్ హైకమాండ్
- శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

కొత్తపల్లి(కరీంనగర్): 'మేమెంతో మాకంతా' అనే డిమాండ్‌తో రాష్ట్ర సాధన పోరాట తరహాలోనే బీసీ ఉద్యమాన్ని బీఆర్‌ఎస్ పార్టీ చేపడుతోందని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి స్పష్టం చేశారు. స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగరంగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8వ తేదీన కరీంనగర్‌లోని జ్యోతిరావు పూలే మైదానంలో నిర్వహించే బీసీ గర్జన బహిరంగ సభకు కదలిరావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి శుక్రవారం జ్యోతిరావు పూలే మైదానాన్ని పరిశీలించారు. చింతకుంటలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మధుసూదనాచారి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ తెస్తామనడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. పలుమార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ఏనాడు రాష్ట్రపతి, పార్లమెంట్‌లో ఆమోదించే విధంగా ఒత్తిడి తేలేదని విమర్శించారు. రేవంత్ ట్రాప్‌లో పడ్డ కాంగ్రెస్ హైకమాండ్ బీసీలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కరీంనగర్ బీఆర్‌ఎస్‌కు సెంటిమెంట్ కనుక రాష్ట్ర సాధన పోరాట తరహాలోనే బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి 42శాతం రిజర్వేషన్లు సాధించుకుంటామని పేర్కొన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, విద్యాసాగర్ రావు, సుంకె రవిశంకర్, వొడితెల సతీశ్ కుమార్,రసమయి బాలకిషన్, దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గించొద్దు

- పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం
- కొత్తపల్లిలో కార్డన్ సెర్చ్



కొత్తపల్లిలో డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్‌ను విడుదల చేస్తున్న పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కొత్తపల్లి(కరీంనగర్): శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ గౌస్‌ఆలం హెచ్చరించారు. కొత్తపల్లిలో శుక్రవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాత నేరస్తులపై ఆరా తీశారు. సరైన ధ్రువపత్రాలు లేని 45వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీపీ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అత్యవసర సమయంలో డయల్ 100 ద్వారా లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్ రహిత సమాజ నిర్మాణం కోసం పాటుపడతామని స్థానికులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, ట్రాఫిక్ నియమాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, షీం టీంలతో అవగాహన కల్పించారు. టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీఐలు నిరంజన్‌రెడ్డి, పుల్లయ్య, ప్రదీప్‌కుమార్, శ్రీలత పాల్గొన్నారు.

దోమలపై మీనాస్త్రం

గంబూసియా చేపలతో దోమలకు చెక్

- నీటి గుంతల్లో వేసేందుకు ప్రణాళిక
- లక్ష్మినగర్‌లో చేపలు వదిలిన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్
- నగరం మొత్తం అమలుకు ఆదేశం



నీటిగుంతలో చేపలు వదలుతున్న కమిషనర్



గంబూసియా చేపలు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో దోమల వృద్ధికి చెక్ పెట్టేందుకు నగరపాలకసంస్థ చర్యలు చేపట్టింది. వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉండడం, అందుకు దోమలే ప్రధాన కారణం అవుతుండడంతో నివారణ దిశగా ప్రణాళిక రూపొందించింది. నగరంలో ఖాళీ ప్రదేశాలు అధికం కావడం, వర్షపు నీళ్ల నిలుస్తుండడం తెలిసిందే. ఆ నీటి గుంతలు దోమల పుట్టుకకు కారణమవుతుండడంతో, దోమల పుట్టుకను హరించే గంబూసియా చేపలను వదిలే కార్యక్రమానికి బల్దియా శ్రీకారం చుట్టింది.

లార్వా తినే గంబూసియా

దోమల వృద్ధిని అరికట్టడంలో గంబూసియా చేపలు అత్యంత కీలకం. సాధారణంగా వర్షాకాలంలో దోమలు వ్యాధుల విజృంభణకు కారణమవుతాయి. దోమల నివారణకు స్ప్రే, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ లాంటివి రసాయనాలతో కూడి ఉంటాయి. దోమల పుట్టుకనే లేకుండా చేసే ఈ గంబూసియా చేపలు ఎలాంటి హానికరం కావు. నీటి గుంతల్లో దోమలు పెట్టిన గుడ్లు, లార్వా దశ దాటి దోమలుగా మారడానికి దాదాపు పదిహేను రోజులు పడుతుంది. ఆ గుంతల్లో గంబూసియా చేపలు వదలడం వల్ల, ఆ చేపలు దోమల గుడ్లు, లార్వాను ఆహారంగా తీసుకొంటాయి. ఫలితంగా దోమల పుట్టుకే లేకుండా పోతుంది.

మత్స్యశాఖ నుంచి సేకరణ

నగరంలోని ఉజ్వల పార్కు సమీపంలోని మత్స్యశాఖ చేపల పెంపక కేంద్రంలో ఈ గంబూసియా చేపలను పెంచుతున్నారు. ఒక్కో ప్యాకెట్‌లో 200 నుంచి 300 చేపపిల్లలు ఉంటాయి. ఇలా ప్యాకెట్లలో తీసుకువచ్చి, నీటి గుంతల్లో వదులుతుంటారు.

నీటి గుంతల గుర్తింపు

నగరపాలకసంస్థ పరిధిలో వర్షపు నీళ్లు నిలిచి, దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్న నీటిగుంతల గుర్తింపును పారిశుద్ధ్య విభాగం చేపట్టింది. ఆయా డివిజన్లలో ఉన్న నీటి గుంతల వివరాలు సేకరించి ఇవ్వాలని సంబంధిత జవాన్లను అధికారులు ఆదేశించారు. నగరంలోని 66 డివిజన్లలో దాదాపు 250 నీటి గుంతల వరకు గుర్తించినట్లు సమాచారం. ఇలా గుర్తించిన నీటి గుంతల్లో దశలవారీగా అంటే వారం రోజుల్లోగా గంబూసియా చేపలను వదిలేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు.

వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి

నీటి గుంతల్లో గంబూసియా చేపలను వదిలే ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేస్తాం. ఇప్పటికే నగరవ్యాప్తంగా ఎక్కడెక్కడ నీటి గుంతలున్నాయనేది గుర్తిస్తున్నాం. ఆ నీటి గుంతల్లో చేపలను వదలడం ద్వారా, దోమలు పుట్టకుండా చర్యలు చేపడుతాం.

– డాక్టర్ కట్ట సుమన్‌కుమార్, మెడికల్ ఆఫీసర్, నగరపాలకసంస్థ

లక్ష్మినగర్ నుంచి శ్రీకారం

లక్ష్మినగర్ నుంచి గంబూసియా చేపలను నీటి గుంతల్లో వదిలే కార్యక్రమానికి బల్దియా శ్రీకారం చుట్టింది. కాలనీలోని నీటి గుంతలో గంబూసియా చేపలను కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అధికారులతో కలిసి వదిలారు. దోమలు వృద్ధిచెందే ప్రతి నీటి గుంతలో చేపలు వదిలి, దోమలను ఆదిలోనే అంతమొందించాలని నగరవాసులు కోరుతున్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న సుప్రియ

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని ప్రభుత్వ బీసీ గర్ల్స్ హాస్టల్ కరీంనగర్– 4ను శుక్రవారం కరీంనగర్ స్పెషల్ ఆఫీసర్ నాయిని సుప్రియ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు నమోదు వివరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఏవైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తేవాలన్నారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



తరగతి గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ అంగన్వాడీ కేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పోషణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం గుడ్లు పంపిణీ చేశారు. ప్రీస్కూల్ పిల్లలతో ముచ్చటించారు. సిలబస్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ప్రతీ శుక్రవారం నిర్వహించే సమావేశాలకు మహిళలు హాజరై, అంగన్వాడీ సేవల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించి, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో సంభాషించి, వారి అభ్యసన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను నేలపై కూర్చోబెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంచీలు లేదా మ్యాట్‌లపై కూర్చోబెట్టాలని సూచించారు. తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రగతి నివేదికను తెలియజేయాలని ఆదేశించారు. బుధవారం బోధనను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, బాలల సంక్షేమ ప్రాజెక్టు అధికారి శ్రీమతి, ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రాణం తీసిన నిద్రమత్తు

- డ్రైవర్ మృతి
- మరొకరికి తీవ్రగాయాలు



నుజ్జునుజ్జు అయిన లారీ క్యాబిన్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): శాస్త్రీనగర్ సమీపంలోని రాజీవ్ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొంది. ఈ ఘటనలో రాజస్తాన్‌కు చెందిన డ్రైవర్ శాకిన్(40) మృతి చెందాడు. మరో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. కొత్తగూడెం నుంచి మిర్చిలోడ్‌తో ఢిల్లీకి వెళ్తున్న లారీ సుల్తానాబాద్‌కు చేరుకుంది. అయితే, నిద్రమత్తులో ఉన్న డ్రైవర్.. రోడ్డు పక్కన ఆగిఉన్న మరోలారీని వెనుకనుంచి ఢీకొట్టాడు. దీంతో డ్రైవింగ్ చేస్తున్న మహబూబ్‌కు తీవ్రగాయాలయ్యాయి. మరో డ్రైవర్ శాకిన్ క్యాబిన్‌లో పడుకొని ఉండగా అక్కడికక్కడే మృతి చెందాడు. హరియాణాకు చెందిన వ్యక్తి గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

క్వారీ సూపర్‌వైజర్ మృతి



రాజు మృతదేహం

సైదాపూర్: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం జాగీర్‌పల్లిలోని శ్రీలక్ష్మీ గ్రానైట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న దీకొండ రాజు(43) ప్రమాదవశాత్తు మృతిచెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తికి చెందిన దీకొండ రాజు జాగీర్‌పల్లిలోని శ్రీలక్ష్మీ గ్రానైట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం గ్రానైట్ బండను యంత్రంతో జరుపుతున్న క్రమంలో ఒక బండరాయి రాజు కుడికంతకు బలంగా తగిలింది. కంత, తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. రాజుకు భార్య సంతోష్‌కుమారి, కూతురు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ శివారు గోపాల్‌పూర్‌లో శుక్రవారం రైతు అనుముల అంజయ్యకు చెందిన ఎద్దు విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా రైతుకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. దాడి నర్సయ్యకు చెందిన పొలంలో అనుముల అంజయ్య ఎద్దులతో గొర్రు కొట్టేందుకు కిరాయికి వెళ్లాడు. గొర్రు కొడుతున్న క్రమంలో పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం సపోర్టువైరుకు ఎద్దు తాకడంతో విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. అప్రమత్తమైన అంజయ్య పక్కకు దూకడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఎన్పీడీసీఎల్ రూరల్ ఏడీఈ రఘు, ఏఈ అనిల్, బొమ్మకల్ పశువైద్యాధికారి జ్యోత్స్న పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును బాధిత రైతును అడిగి తెలుసుకున్నారు. ఎద్దు విలువ సుమారు రూ.60వేల వరకు ఉంటుందని అంజయ్య తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని కోరాడు.

బతుకుదాం.. కలకాలం

- మరణిస్తూ మరొకరికి ప్రాణదానం
- అవయవదానంపై పెరుగుతున్న అవగాహన
- రేపు జాతీయ అవయవదాన దినోత్సవం

అవయవదానంపై సేవలు అందిస్తున్న ప్రతినిధులు

సీహెచ్ లింగమూర్తి	94927 81306
మేరుగు భీష్మాచారి	98495 90415
కేఎస్ వాసు	98497 37100
కె.రాజేందర్	73962 95999



శ్మశాన వాటికలో నేత్రాలు స్వీకరిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు (ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): మనిషి చనిపోయినా మళ్లీ బతకవచ్చంటే అది కచ్చితంగా అవయవదానం ద్వారానే. వ్యక్తి మరణించిన తర్వాత మట్టిగానో.. బూడిదగానో మారే అవయవాలను సక్రమంగా వినియోగిస్తే.. మరొకరికి జీవదానం చేయొచ్చు. చావు సమీపంలో ఉన్నవ్యక్తిని బతికించగల అపురూప కార్యమిది. సామాజిక కట్టుబాట్లు, మత మౌఢ్యం వేళ్లూనుకున్న మనసమాజంలో అవయవదానం, నేత్ర, శరీరదానాలపై ఇప్పుడిప్పుడే అవగాహన పెరుగుతోంది. అవయవదానం కొత్తేమీ కాదు. కన్నప్ప సాక్షాత్తు ఈశ్వరుడికే కంటిని దానం చేశాడు. దధీచి మహర్షి వెన్నెముక దానం చేసిన ఘటన పురాణాల్లో ప్రసిద్ధి. మన మధ్య కూడా అలాంటి దానకర్ణులు ఉన్నారు. విలువైన అవయవాలను మట్టిపాలు చేసే బదులు ఇంకొకరికి దానం చేస్తే వారి ఆయుష్షు పెంచినవారమవుతామని వైద్యులు, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఆయువు పోయినా.. అవయదానంతో ఊపిరిపోద్దాం.. రండి.. అవయదానం చేద్దాం.. మరణించినా మరోవ్యక్తిలో జీవించే ఉందాం.. అవయవాల దానంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు ఏటా ఆగస్టు 3న జాతీయ అవయవదాన దినోత్సవం నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

మరణం తర్వాత దానం చేసే అవయవాలు

మనిషి మరణానంతరం కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్, జీర్ణ వ్యవస్థలోని ప్యాంక్రియాస్, పేగులు దానం చేయవచ్చు. అయితే రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి తలకు రక్త సరఫరా నిలిచిపోయిన, బీపీ ఎక్కువై కిందపడి తీవ్రంగా గాయపడిన వారు బ్రెయిన్ డెడ్ నిర్ధారణ అయిన వారి నుంచి మాత్రమే అవయవాలను సేకరిస్తారు.

ఎనిమిది మందికి పునర్జన్మ

మరణించిన వ్యక్తి నుంచి ఎనిమిది మందికి అవయవాలను దానం చేసే వీలుంది. గుండె, మూత్రపిండాలు, పాంక్రియాస్, ఊపిరితిత్తులు, కాలేయం, పేగులు, చర్మపు టిష్యు, ఎముకల్లోని మజ్జ, చేతులు, ముఖం, స్టెమ్సెల్స్, కళ్లని ఇతరులకు మార్పిడి చేసే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

బతికుండగా దానం చేసేవి.

కిడ్నీ, కాలేయం, ఎముక మజ్జ బతికుండగానే దానం చేయవచ్చు.

అపోహలు తొలగాలి.

అవయవదానంపై అనేక అపోహలు ఉన్నాయి. కానీ మరణించిన వ్యక్తికి ఏమాత్రం పనికిరాని అవే అవయవాలు మరెందరి ప్రాణాలనో నిలబెడతాయి.

నాన్న కార్నియా దానం చేశాం



మా నాన్న శౌరయ్య అనారోగ్యంతో గత జూన్ 3న మృతి చెందాడు. బంధువులు వారిస్తున్నా శ్మశాన వాటికలో పార్థివదేహాన్ని ఖననం చేయకుండా అర్ధగంట ఆపాం. సదాశయ ఫౌండేషన్ అవగాహన కల్పించగా, కుటుంబ సభ్యులను ఒప్పించా. టెక్నీషియన్‌ను శ్మశానవాటికకే రప్పించి నేత్రాలు దానం చేయించా.

– విజయ్‌కుమార్, గోదావరిఖని

ముగ్గురికి పునర్జన్మ



మా నాన్న రామకృష్ణ బీపీ పెరి ఇంట్లో పడియాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాం. అక్కడ చికిత్స పొందుతూ గత జూన్ 29న బ్రెయిన్ డెడ్ అయ్యాడు. ఆయన అవయవాలను దానం చేస్తే పలువురికి పునర్జన్మ కల్పించవచ్చని జీవన్‌ధాన్ కో ఆర్డినేటర్లు కౌన్సెలింగ్ ఇవ్వడంతో కాలేయాన్ని ఒకరికి, మూత్రపిండాలను మరోఇద్దరికి దానం చేశాం. దీంతో మా నాన్న అవయవాలు వారికి పునర్జన్మనిచ్చాయి.

– తుమ్మ ప్రణయ్, గోదావరిఖని

అవగాహన పెరుగుతోంది



అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. సదాశయ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు 1,511 వరకు నేత్రదానాలు, 90 వరకు అవయవదానాలు, 151 వరకు దేహదానాలు జరిగాయి. 1,600 వరకు అవయవదానాలపై అవగాహన సదస్సులు నిర్వహించాం. సుమారు 50,000లకు పైగా మరణానంతరం నేత్ర, అవయవ, దేహదానాలకు ప్రజలు స్వచ్ఛందంగా అంగీకారం తెలిపారు.

– సీహెచ్ లింగమూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి, సదాశయ ఫౌండేషన్

కుళ్లిన మాంసం.. నాణ్యత లేని సామగ్రి

- వేములవాడలో రెస్టారెంట్ సీజ్
- సిరిసిల్లలో నోటీస్‌లు
- రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

సిరిసిల్ల: వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లోని రెస్టారెంట్లలో శుక్రవారం రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేశారు. వేములవాడలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటించని తాజ్ రెస్టారెంట్‌ను సీజ్ చేసి, రూ.30 వేల జరిమానా విధించారు. సిరిసిల్లలో రుచి హోటల్‌లో అపరిశుభ్రతను గుర్తించి నోటీసులు జారీచేశారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ డాక్టర్ శివలీల ఆదేశాల మేరకు జిల్లాలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. వేములవాడ రెస్టారెంట్‌లో అపరిశుభ్ర వాతావరణంలో వంట చేయడం, నిలువ చేసిన మాంసం దుర్వాసన రావడం, హానికర రసాయనాలతో ఉన్న కృత్రిమ రంగులను గుర్తించారు. రూ.20,500 విలువైన 70 కిలోల మాంసం నిల్వ ఉన్నట్లు తేలింది. రెస్టారెంట్‌ను సీజ్ చేసి, రూ.30వేల జరిమానా విధించారు. జిల్లా కేంద్రంలోని రుచి రెస్టారెంట్‌లోనూ అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయడం, ఫుడ్ హ్యాండ్‌లెట్స్ గ్లౌస్, హెయిర్ క్యాప్స్ ధరించకపోవడం, వండిన ఆహారంపై మూతలు కప్పకపోవడం, కుళ్లిన వస్తువులను గుర్తించిన అధికారులు హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అనుమానిత ఆహార పదార్థాల నమూనాలను పరీక్షల కోసం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి, టాస్క్‌ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు రోహిత్‌రెడ్డి, శ్రీషిక, స్వాతి, అంకిత్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి

- నేత్రదానం చేసిన కుటుంబసభ్యులు



శ్రీకాంత్(ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుడు నారిశెట్టి శ్రీకాంత్(39) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం విధులకు హాజరైన కార్మికుడు.. అస్వస్థతగా ఉందని తోటి కార్మికులకు చెప్పాడు. ఆ వెంటనే అంబులెన్స్‌లో పీటీఎస్‌లోని ధన్వంతరి ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స అందించేలోపే మృతి చెందాడు. మృతుడికి భార్య అనూష, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్.. డీఎం ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. అయితే, పుట్టెడు దుఃఖంలో ఉన్న భార్య అనూష, కుటుంబసభ్యులు శ్రీకాంత్ నేత్రాలు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. కాగా, శ్రీకాంత్ మృతి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మరోవైపు.. డీఎం ప్లాంట్ కాంట్రాక్ట, కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టర్ల మధ్య జరిగిన చర్చల అనంతరం శ్రీకాంత్ కుటుంబానికి రూ.7లక్షల పరిహారం, ఇద్దరికి ఉద్యోగావకాశం కల్పించేందుకు, అంత్యక్రియలకు రూ.50వేలు చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. కాంట్రాక్టర్ రాజ్‌కుమార్, యూనియన్ల ప్రతినిధులు కౌశిక హరి, భూమల్ల చందర్, చిలుక శంకర్, నాంసాని శంకర్, కాంట్రాక్టర్లు ఏబీసీ రెడ్డి, ఎలిని నారాయణ, వెంకటేశ్వరరావు, రాజాకిషన్, రాజేశం, సోమిరెడ్డి ఉన్నారు.

వలస కార్మికుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 30న రూ.100 విషయంలో గొడవ చేయకండి.. బయటకు వెళ్లండి అని వారించిన మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లాకు చెందిన వినోద్(44)ను హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ కేసు వివరాలు శుక్రవారం వెల్లడించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో ఓ కంపెనీకి చెందిన బహుళ అంతస్తు భవనం పనులు చేసుకుంటూ ఓ షెడ్‌లో ఐదురుగు కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో మనోజ్, నీలకంఠకు సంబంధించిన రూ.100 గొడవలో మనోజ్, వినోద్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈక్రమంలో వినోద్ నిద్రిస్తుండగా తలపై ఇనుప రాడ్‌తో దాడి చేయగా తీవ్రగాయాలతో మృతి చెందాడు. మృతుడి భార్య ప్రతిభ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని విచారణ అనంతరం మనోజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 24 గంటల్లో హత్య కేసు ఛేదించిన ఎస్సై ఉదయ్‌కిరణ్‌తోపాటు పోలీసులను సీఐ అభినందించారు.

కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

మానకొండూర్: కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మానకొండూర్ మండలం గంగిపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి తల్లి కొయ్యడ సమ్మక్క వివరాల ప్రకారం.. గంగిపల్లికి చెందిన చలిగంటి నాగయ్యతో మెట్‌పల్లికి చెందిన హేమలతకు ఐదేళ్లక్రితం వివాహమైంది. భర్త, అత్త, ఇద్దరు ఆడబిడ్డలు అదనపు కట్నం తేవాలని వేధించారు. దీంతో తల్లిగారింటికి వెళ్లింది. కుమారుడు జన్మించడంతో ఐదు నెలల తరువాత అత్తగారింటికి వచ్చింది. మరోసారి డబ్బులు తేవాలంటూ వేధించడంతో ఇంట్లో ఉరేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

చొప్పదండి: పట్టణంలోని బీసీకాలనీలో నివాసముండే దండే పరందాములు (43) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టైలరింగ్ పనిచేసే పరందాములు కొద్దికాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి టైలర్ షాప్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య దండె కవిత ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ ఔట్ గేట్ వద్ద శుక్రవారం బస్సు ఢీకొని ఒకరు మృతి చెందారు. రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన దావు రాజయ్య(65) కరీంనగర్‌లో కూలీ పనిచేస్తున్నాడు. భార్య, పిల్లలకు దూరంగా ఉంటూ బస్టాండ్‌లో ఉంటున్నాడు. బస్టాండ్ ఔట్ గేటు వద్ద రోడ్డు దాటుతుండగా జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ గాంధీపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు.





రాజన్నకు మొక్కులు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామిని శుక్రవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అనుబంధ మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం సమర్పించుకున్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి



తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలం మొగిపాలెం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా... మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం కరీంనగర్‌లో నివసిస్తున్న చిగురుమామిడి మండలం రేకొండకు చెందిన మోరే రాజు(38), మామిడి కనకయ్య(55) శుక్రవారం బైక్‌పై రేకొండకు వెళ్లి ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరిగి కరీంనగర్ వెళ్తుండగా మొగిలిపాలెం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. కనకయ్య అక్కడిక్కడే మృతిచెందగా, రాజు తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో రాజును కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కనకయ్య చిన్నాన్న ఐదురోజుల కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొని తునికి శ్రీనివాస్ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాములపల్లికి చెందిన తునికి శ్రీనివాస్ జగిత్యాల వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెంగళాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన విధులు ముగించుకొని ఇంటికి వచ్చాక వెంగళాపూర్ ఎక్స్‌రోడ్డుకు సమీపంలో చిరువ్యాపారం నిర్వహిస్తున్న తన తల్లి వద్దకు వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రౌడీషీటర్ మనోజ్‌పై పీడీయాక్ట్



మనోజ్‌కు పీడీయాక్ట్ ప్రతిని అందిస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: భూ వివాదంలో బొల్లు మల్లవ్వ అనే మహిళను రెండు నెలల క్రితం హత్య చేసిన కేసులో చందుర్తి మండలానికి చెందిన రౌడీషీటర్ మనోజ్‌పై పీడీయాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే తెలిపారు. ఈమేరకు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చర్లపల్లి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. మనోజ్ 2023లో హత్య, దొంగతనం, బెదిరింపుకు పాల్పడిన కేసులలో నిందితుడిగా ఉన్నట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న యువకుడిపై 2024లో రౌడీషీట్ తెరిచినట్లు తెలిపారు. కౌన్సెలింగ్ నిర్వహించినా ప్రవర్తనలో మార్పు రాకపోగా.. తరచూ నేరాలకు పాల్పడుతుండడంతో పీడీయాక్ట్ అమలు చేసి, చర్లపల్లి జైలుకు తరలించినట్లు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



రాకేశ్(ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన దుర్శెట్టి రాకేశ్ (32) పురుగుల మందు తాగి శుక్రవారం మరణించాడు. మూడేళ్లక్రితం రాకేశ్ మానసిక స్థితిసరిగ్గా లేదని భార్య తన కొడుకుతో కలిసి పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. భార్య రావడం లేదని రాకేశ్ మరింత మనస్తాపానికి గురై క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి నగేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై మల్లేశ్‌తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి



దయ్యాల రాజు (120)

రాయికల్: రాయికల్ మండలం రామారావుపల్లికి చెందిన దయ్యాల రాజు (120) అనే శతాధిక వృద్ధురాలు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందింది. రాజుకు ఆరుగురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు

వేములవాడఅర్బన్: హత్యాయత్నం కేసులో ఇద్దరికీ ఐదేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి అజయ్‌కుమార్ జాదవ్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. బోయినపల్లికి చెందిన అలువాల శ్రీనివాస్‌కు 15 ఏళ్ల క్రితం వివాహం కాగా భార్య పురుగుల మందు తాగి మృతిచెందింది. ఆమె మృతికి భర్త శ్రీనివాస్, కుటుంబ సభ్యులు కారణమని భార్య తండ్రి భూపతి మల్లయ్య, అన్న విజయ్ చింతాల్‌ఠాణా గ్రామస్తులు.. శ్రీనివాస్‌తోపాటు అతని స్నేహితుడు మోహన్‌పై దాడి చేశారు. బాధితుడి శ్రీనివాస్ ఫిర్యాదుతో 2023, ఫిబ్రవరి 17న వేములవాడ అప్పటి ఎస్సై ఎండీ రఫీక్‌ఖాన్, వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ కేసు నమోదు చేశారు. భూపతి మల్లయ్య, విజయ్‌కు ఐదేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు తెలిపారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య



భాగయ్య (ఫైల్)

మల్యాల: మండలంలోని నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీకి చెందిన భీనవేని భాగయ్య (69) శుక్రవారం అనారోగ్యంతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మల్యాల ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు. భాగయ్య భార్య పదేళ్ల క్రితం మృతి చెందగా.. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతూ అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన తన ఇంటి ఎదుట ఉన్న మామిడితోటలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యాంత్రీకరణకు మహర్దశ

- గతంలో దరఖాస్తులు స్వీకరించి నిలిపివేత
- ఈ నెల 5నుంచి మళ్లీ స్వీకరణ
- ఉమ్మడి జిల్లాకు రూ.10.4కోట్ల కేటాయింపు

ఉమ్మడి జిల్లాకు కేటాయించిన నిధులు: రూ.**10.4** కోట్లు

కొనుగోలు చేయనున్న పరికరాల సంఖ్య: **13,140**

ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు: **50** శాతం రాయితీ

ఇతరులకు: **40** శాతం రాయితీ

దరఖాస్తుల స్వీకరణ: ఈ నెల 5నుంచి 15వరకు



కరీంనగర్ అర్బన్: దశాబ్దానికి పైగా దూరమైన వ్యవసాయ యాంత్రీకరణ పథకం మళ్లీ చేరువవుతోంది. గత ఆర్థిక సంవత్సరంలోనే రైతులకు రాయితీ పరికరాలు చేరాల్సి ఉండగా సదరు సంవత్సర ముగింపు నెలలో నిధులు కేటాయించడం, అంతలోనే మార్చి ముగియడంతో పథకం నిలిచిపోయింది. తాజాగా మళ్లీ నిధులను కేటాయించగా దరఖాస్తుల స్వీకరణకు జిల్లా వ్యవసాయశాఖ చర్యలు చేపడుతోంది. ఈ నెల 5నుంచి 15 వరకు దరఖాస్తులను స్వీకరించనుండగా ఆయా దశల వారీగా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాకు 10.4కోట్లు కేటాయించారు.

ఉమ్మడి జిల్లాకు రూ.10.4కోట్లు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2025–26 సంవత్సరానికి వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు రూ. 10.4 కోట్ల నిధులు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50 శాతం రాయితీ, జనరల్ కేటగిరీ రైతులకు 40శాతం రాయితీ వర్తిస్తుంది. ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచి యాసంగి వరకు పూర్తిస్థాయిలో అమలు చేస్తారు. ఈ సారి 15 రకాల యంత్ర పరికరాలతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తున్నారు.

మళ్లీ దరఖాస్తుల స్వీకరణ

ప్రభుత్వ ఆదేశాల క్రమంలో పథకం అమలుకు సంబంధించి ఆగస్టు 5నుంచి 15వరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. గతంలో చేసిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. వచ్చిన దరఖాస్తులను వ్యవసాయాధికారులు 16వ తేదీన జిల్లా కలెక్టర్‌కు అందజేస్తారు. 20 వరకు వాటిని పరిశీలిస్తారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైతే అందుకు కారణాలను తెలియజేస్తారు. ఎంపికైన రైతులకు ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 5వరకు మంజూరు పత్రాలు, సెప్టెంబరు 7 నుంచి 17 వరకు పరికరాలు పంపిణీ చేస్తారు.

ఉమ్మడి జిల్లాకు ఏయే పరికరాలు ఎన్నెన్ని ఇవ్వనున్నారంటే

బ్యాటరీ స్ప్రేయర్స్	:9,579	బండ్ ఫార్మర్	: 30
పవర్ స్ప్రేయర్స్	:1,761	పవర్ వీడర్	: 59
రోటవేటర్	: 564	బ్రష్ కట్టర్	: 132
సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్	: 110	పవర్ టిల్లర్	: 84
కల్టివేటర్	: 651	స్ట్రా బాలర్స్	: 170

ఈ సారైన రైతులకు చేరేనా..!

ప్రభుత్వం విడుదల చేసే నిధులను ఆర్థిక సంవత్సరంలోనే ఖర్చు చేయాలి. గత మార్చి నెల 17వ తేదీన నిధులు కేటాయించగా అంతే వేగంగా వ్యవసాయశాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. 25వరకు దరఖాస్తులు తీసుకోగా వచ్చిన వాటిని ఆన్‌లైన్ చేసి ప్రక్రియకు సిద్ధం చేయగా అంతలోనే ఆర్థిక సంవత్సరం ముగిసింది. దీంతో నిధులు ఖర్చు చేయలేని పరిస్థితి. అయితే 1990 నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం కొనసాగుతోంది. 2014వరకు యాంత్రీకరణ పథకానికి నిధులు రాగా అప్పటి నుంచి నిధుల కేటాయింపు లేదు. ఈ క్రమంలో గత మార్చి నెలలో యాంత్రీకరణ పథకాన్ని తెరపైకి తేగా 2024–25 సంవత్సరానికి గానూ కరీంనగర్ జిల్లాకు రూ.73లక్షలు కేటాయించింది. కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు భరిస్తాయి. ఈ పథకానికి మహిళా రైతులు మాత్రమే అర్హులు కాగా గతంలో పురుషులకే ఇచ్చేవారు. ఇదిలా ఉండగా 50శాతం రాయితీతో పరికరాలు ఇస్తుండటం, దాదాపు దశాబ్దం తరువాత అవకాశం రావడంతో దరఖాస్తులు 5వేల వరకు వచ్చాయని సమాచారం. గత ఆర్థిక సంవత్సరంలో తక్కువ నిధులు కేటాయించగా ఈ సారి రెట్టింపు నిధులు కేటాయించడం శుభ పరిణామం.

క్లుప్తంగా

రేపు జిల్లాస్థాయి యోగాసన పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ముత్యాల రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళల సీనియర్ విభాగంలో 18 నుంచి 25 సంవత్సరాలు, 25 నుంచి 35, 35 నుంచి 45, 45 నుంచి 55 సంవత్సరాల వారీగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన వారిని ఆగస్టు 7, 8ల్లో ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

మంచిర్యాలకు ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సులు

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్-2 డిపో నుంచి శుక్రవారం కరీంనగర్-మంచిర్యాల వయా లక్సెట్టిపేట మార్గంలో 4 ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు 2 డిపో మేనేజర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బెల్టులు అందజేత



విద్యార్థులతో బీజేపీ నాయకులు

కరీంనగర్‌రూరల్: ఎలబోతారంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదినం పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థులకు బెల్టులు, టై, బ్యాడ్జీలను బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు సాగర్, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌రావు, శ్రీకృష్ణ ఆలయ కమిటీ చైర్మన్ కరివేద వేణుమాధవరావు, బీజేపీ నాయకులు వేల్పుల శ్రీనివాస్, ఎం.దేవేందర్, దారం జగన్నాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశం, లక్ష్మణ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ప్రదర్శనతో అవగాహన



పోస్టర్లతో విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని అవగాహన సదస్సు నిర్వహించారు. సూక్ష్మజీవ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై పోస్టర్ ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి, నియంత్రణ చర్యలపై అధ్యాపకురాలు గీతారాణి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, ఏసీవో వసుమతి, ప్రవిత, సురేశ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శంకరయ్య, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

వార్డు అధికారులకు మెమో

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని పది మంది వార్డు అధికారులకు మెమో జారీ చేసినట్లు సమాచారం. పన్నుల వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోకపోవడంతో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మెమోలు జారీ చేసినట్లు తెలిసింది.

వీధి కుక్కల దాడిలో మహిళకు గాయాలు



గాయపడ్డ మహిళ

కరీంనగర్ కార్పొరేషన్: కిసాన్‌నగర్ దీకొండ కాలనీలో మహిళపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. సంచార జాతికి చెందిన లక్ష్మి అనే మహిళ తన వ్యాపారం నిమిత్తం కాలనీకి రాగా.. ఒక్కసారిగా పిచ్చి కుక్కలు వెంటపడి కరిచాయి. ఆమె అరుపులు విన్న స్థానికులు వచ్చి కుక్కలను తరిమేశారు. కాలనీలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ ఎడ్ల సరిత డిమాండ్ చేశారు.

ప్రత్యేక తరగతులు

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్, మెమోరీ ట్రైనర్, డాక్టర్ వేణుకుమార్ ప్రత్యేక తరగతులు నిర్వహించారు. మెమోరీ టెక్నిక్స్, స్క్రీన్ టైం(ఫోన్/టీవీ), క్రమశిక్షణ, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని భవిష్యత్‌లో గొప్పవారు కావాలని కోరారు. లక్ష్యాలను చేరుకోవడానికి పరిస్థితులు అడ్డంకి కావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ రుమాన, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెరువు నిండలె.. అలుగు పారలె..

- వెలవెలబోతున్న సాగునీటి వనరులు
- ఉమ్మడి కరీంనగర్ మండలంలో సాధారణ వర్షాలు
- వరి పంట సాగుపై రైతుల ఆందోళన



మొగ్దుంపూర్‌లో నిండని ఊర చెరువు

కరీంనగర్‌రూరల్: వరి పంట సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వానాకాలం సీజన్‌లో సరైన వర్షాలు కురవకపోవడంతో వరిసాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రధానంగా బావులు, బోర్లపైనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి నీటి వనరులు పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకుంటేనే భూగర్భ జల మట్టం పెరుగుతోంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలు పత్తి, మొక్కజొన్న, కంది, పెసర తదితర ఆరుతడి పంటలకు జీవం పోయగా వరిసాగుకు దోహదపడ్డాయి. కరీంనగర్ మండలంలో ఇప్పటివరకు 372.8 మిల్లీమీటర్లు వర్షపాతం కురవాల్సి ఉండగా.. 368.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. కొత్తపల్లి మండలంలో 431.4 మిల్లీమీటర్లకు 377 మిల్లీమీటర్లు మాత్రమే కురువగా.. రెండు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

ఇంకా నిండని చెరువులు

ఉమ్మడి కరీంనగర్ మండలంలో మొత్తం 120 చెరువులున్నాయి. దీనిలో కరీంనగర్ రూరల్ మండలంలో 72, కొత్తపల్లి మండలంలో 48 చెరువులుండగా ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో నీళ్లు చేరలేదు. తేలికపాటి వర్షాలకు వరద నీళ్లు చేరకపోవడంతో చెరువులు, కుంటలు నిండని పరిస్థితి నెలకొంది. నీళ్లు లేక చెరువులన్నీ వెలవెలబోతున్నాయి. మొత్తం 120 చెరువుల్లో 25 శాతం నుంచి 50 శాతం నిండిన చెరువులు 28, 50 శాతం నుంచి 75 శాతం నిండిన చెరువులు 48, 75 శాతం నుంచి 100 శాతం నిండిన చెరువులు 44 మాత్రమే ఉన్నాయి. ఆరురోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసినప్పటికీ ఇప్పటివరకు అలుగు పారిన చెరువులు ఒక్కటి కూడా లేకపోవడం వర్షాల దుస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది. చెరువులు, కుంటలపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతులు ఆగస్టులో కురిసే భారీ వర్షాలపైనే ఆశలు పెట్టుకుని వరి నాట్లేస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



వార్డు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సఫాయి అప్నా.. భీమారి బాగో కార్యక్రమంలో భాగంగా నగరంలోని పలు కాలనీలు సందర్శించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. లక్ష్మినగర్‌లో నీటి గుంతలో గంబూసియా చేపలను వదిలారు. వర్షాలతో చాలా ప్రాంతాల్లో నీళ్లు నిలిచి దోమలు పెరుగుతాయన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షం నీళ్లు నిలిచిన చోట ఆ నీళ్లను డ్రైనేజీలకు మళ్లించి శుభ్రం చేయాలని సూచించారు. పెద్ద నీటి గుంతల్లో గంబూసియా చేపలు వదిలి పరిసరాల్లో బ్లీచింగ్ చల్లాలన్నారు. నగరంలోని పలు డివిజన్లలో ఉన్న వార్డు కార్యాలయాలను వినియోగంలోకి తీసుకురావాలని కమిషనర్ అన్నారు. నగరంలోని వార్డు కార్యాలయాలను సందర్శించారు. హౌసింగ్‌బోర్డుకాలనీలో వార్డు కార్యాలయ ఆవరణలో పశుగ్రాసం నిలువ చేసిన వ్యక్తికి రూ.15వేలు జరిమానా విధించారు. డిప్యూటీ కమిషనర్ వేణుమాధవ్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సీడీపీవో సబిత



వైద్యులతో వైద్య విద్యార్థులు

కొత్తపల్లి: తల్లి పాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ సీడీపీవో సబిత కోరారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చింతకుంట శాంతినగర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభ, తల్లి పాల వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో మహిళలందరికీ సుమారు 50 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సఖీ లక్ష్మి, చైల్డ్‌లైన్ సంపత్, మహేశ్, సూపర్‌వైజర్ స్వప్న, సతీశ్, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, అంగన్వాడీ టీచర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో శుక్రవారం తల్లి పాల వారోత్సవాల ప్రారంభ వేడుకను ఘనంగా నిర్వహించారు. తల్లి పాల విశిష్టతను ప్రతిబింబించేలా వైద్య విద్యార్థులు వివిధ రంగులతో వేసిన తల్లిబిడ్డల చిత్రం ఆకట్టుకుంది. తల్లి పాల ప్రాముఖ్యాన్ని ప్రిన్సిపాల్ అసీం అలీ వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ అనిత, సూపరింటెండెంట్ రామకృష్ణ ప్రసాద్, హెచ్‌వోడీలు రాజమౌళి, ఎలిజారోసి, రమ్య, సంధ్య, సంగీత, అభిలాష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్: కోతిరాంపూర్ పోచమ్మవాడ అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం సభలో భాగంగా తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బాలింత తల్లులకు, గర్భిణీలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ స్వరూప రాణి, ఆయా హేమలత, ఆర్పీ రమాదేవి, మంజుల, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో షీ టీం సభ్యులు



స్కౌట్ వేడుకల్లో పారమిత విద్యార్థులు, ఉపాధ్యాయులు

స్కౌట్ స్కార్ఫ్ డే వేడుకలు

కరీంనగర్‌స్పోర్ట్స్/విద్యానగర్(కరీంనగర్): భారత్ స్కౌట్ గైడ్స్ ఆధ్వర్యంలో ప్రపంచ స్కౌట్ స్కార్ఫ్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారత స్కౌట్స్-గైడ్స్ పతాక ఆవిష్కరణ చేశారు. ముఖ్య అతిథిగా షీ టీం ఇన్స్‌పెక్టర్ శ్రీలత హాజరై మాట్లాడారు. స్కూల్ చైర్మన్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ లీనా ప్రియదర్శిని పాల్గొని స్కౌట్స్ గైడ్స్ శిక్షణ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. స్కౌట్ మాస్టర్ జి.మల్లేశం, గైడ్ కెప్టెన్ జి.సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరిన విద్యార్థులకు స్కార్ఫ్‌లు ప్రదానం చేశారు. చైర్మన్ డా.ఇనుగంటి ప్రసాదరావు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్లు ప్రసూన, అనుకర్‌రావు, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్, టీఎస్పీ రమణ, హనుమంతరావు పాల్గొన్నారు.

భూభారతి సమస్యలు పరిష్కారం

- క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన



మొగ్దుంపూర్‌లో విచారణ చేస్తున్న ఆర్‌ఐ వాస్తవిక్

కరీంనగర్‌రూరల్: భూభారతి సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఆర్ఐలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నారు. అడ్డంకులను అధిగమిస్తూ ఆగస్టు 15 వరకు వంద శాతం సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అయితే గడువు లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యే అవకాశం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

2,467 దరఖాస్తులు..

కరీంనగర్ మండలంలో జూన్ 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 14 రెవెన్యూ గ్రామాల పరిధిలో 2,467 దరఖాస్తులు రాగా.. భూభారతి పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సాదాబైనామా దరఖాస్తులను మినహాయించి ఒక్కో దరఖాస్తును పరిశీలించి గ్రామాలవారీగా నోటీసులు జారీ చేస్తున్నారు. గత నెల 1 నుంచి ఆర్ఐలు వాస్తవిక్‌గౌడ్, కనకరాజు ఆధ్వర్యంలో దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. పెద్ద గ్రామాల్లో రెండు నుంచి మూడు రోజులపాటు మోఖాపై వెళ్లి విచారణ నిర్వహిస్తున్నారు. పీవోటీ, లావాణి పట్టాల దరఖాస్తులను పరిశీలించి అర్హులకు వారసత్వ పట్టాలను జారీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. కొత్తగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలను మాత్రం ఇవ్వడం లేదు. సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వివాద రహిత దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తుండగా.. కోర్టు కేసులు, ఇతర భూవివాదాలున్న దరఖాస్తులను పక్కన పెట్టారు.

దరఖాస్తుల వివరాలు

సాదాబైనామా	478
పెండింగ్ మ్యుటేషన్లు	93
మిస్సింగ్ సర్వే నంబర్లు	826
విస్తీర్ణంలో వ్యత్యాసం	233
భూమి స్వభావం మార్పు	39
పట్టాదారు పేరులో తప్పులు	23
నిషేధిత జాబితాలోనివి	36
అసైన్డు భూములు	45
సివిల్ సమస్యలు	30
అప్పీల్	87
వారసత్వం	386
ఇతర సమస్యలు	102

క్షేత్రస్థాయిలో విచారణ



రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఆర్ఐలు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారు. సాధారణ భూసమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. సాదాబైనామా దరఖాస్తులపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో పరిశీలించడం లేదు. నిర్దేశిత సమయంలో దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం.

– ఎస్.రాజేశ్, తహసీల్దార్, కరీంనగర్‌రూరల్



కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ 36వ డివిజన్ మారుతినగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించి ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డును కొంత భాగం ఆక్రమించుకొని నిర్మాణం చేపడుతుండడంతో ఆ రోడ్డు ఇరుగ్గా మారింది. 4 నెలల క్రితం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు వచ్చి పరిశీలించి పనులు నిలిపివేయించారు. కాని ఇటీవల మళ్లీ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు. కమిషనర్ జోక్యం చేసుకొని అనుమతి ప్రకారం నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. – రాజు, మారుతినగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వేణు, టీపీవో, సెల్ నం.: 9515986377

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

ఆటో డ్రైవర్ల దినోత్సవం



కేక్ తినిపిస్తున్న నాయకులు

కరీంనగర్: ఆటో డ్రైవర్ల దినోత్సవం పురస్కరించుకొని ఆటో కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆర్టీసీ పథకంతో ఆటో డ్రైవర్ కుటుంబాలు రోడ్డుపాలై ఆత్మహత్యలు చేసుకున్నారని, వెంటనే ఆటో డ్రైవర్లపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకొని కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీనివాస్‌రెడ్డి, రాజేశం, సంపత్, రాంగోపాల్‌రెడ్డి, నరసింహ, చంద్రశేఖర్, తిరుపతి, సాగర్, సత్యనారాయణ, మహేందర్, ప్రభాకర్, కుమార్, సంపత్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, వేణుమాధవ్, మోహన్, రవి, లక్ష్మణ్, అరుణ్, మల్లేశం, అనిల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు అందజేత



కార్డులు అందిస్తున్న అదనపు కలెక్టర్ అశ్విని

కరీంనగర్‌టౌన్: జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాల్లో ఉంటున్న చిన్నారులకు వైద్యసేవలు ఉచితంగా అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ముందుకొచ్చింది. జిల్లాలో గుర్తించిన 147 మంది అనాథ పిల్లలకు ఈ పథకాన్ని అమలు చేస్తూ రూ.10లక్షల వరకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందేలా ఏర్పాటు చేసింది. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజి వాకడే చేతుల మీదుగా రాజీవ్ ఆరోగ్యశ్రీ గుర్తింపు కార్డులను అనాథ పిల్లలకు అందజేశారు. జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ సరస్వతి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, మోతె రాజు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ఎ.విజయ్‌కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు వీడ్కోలు



లింగయ్యను సన్మానిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని హుజూరాబాద్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించిన హోంగార్డు దాసరి లింగయ్య శుక్రవారం విరమణ పొందగా.. సీపీ గౌస్ ఆలం ఘనంగా సన్మానించారు. లింగయ్య 23 ఏళ్లపాటు హోంగార్డుగా పోలీసు శాఖలో సేవలందించారు. సీపీ వీడ్కోలు పలికారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(హోంగార్డ్స్) మోడెం సురేశ్, హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న నాయకులు

కరీంనగర్: రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ విద్యాశాఖ విడుదల చేసిన పదోన్నతుల షెడ్యూల్‌లో స్కూల్ అసిస్టెంట్(ప్రత్యేక విద్య) డీఎస్సీ-2024 ద్వారా అక్టోబర్‌లో నియమితులైన ఎస్జీటీ ప్రత్యేక ఉపాధ్యాయులకు కూడా పదోన్నతి అవకాశాలు కల్పించాలని సెటా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూత్రపు లకన్ బాబు, పెట్టెం రజనీకాంత్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్(సెటా) జిల్లా శాఖ అత్యవసర సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ శాఖలో కేవలం 2 నెలల సర్వీసుతో ఏఈవోలకు ఏవోలుగా పదోన్నతులు కల్పించిన గత ఉదాహరణను ప్రస్తావిస్తూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా కనీస సర్వీసు నిబంధనను మినహాయించాలని కోరారు. కరీంనగర్ జిల్లా విడుదల చేసే సీనియార్టీ జాబితాలో అక్టోబర్ 2024లో నియమితులైన ప్రత్యేక ఉపాధ్యాయులను కూడా చేర్చాలన్నారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, ప్రణయ్, పరమేశ్వర్, స్వాతి, స్వరూపరాణి, సదయ్య, సదానందం, మంజుల, లావణ్య, సుజాత, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ అథ్లెటిక్ అసోసియేషన్ జూలై 21న స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో భగత్‌నగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. ఈనెల 3, 4ల్లో హన్మకొండ జవహర్‌లాల్ స్టేడియంలో జరిగే అండర్-14 ట్రయథ్లిన్-బి విభాగంలో 9వతరగతి చదువుతున్న ఎం.సాయిచైతన్య రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

తల్లి పాల వారోత్సవం

మానకొండూర్: అన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లి పాల వారోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడారు. పుట్టిన శిశువుకు తల్లిపాలు పట్టించాలని, గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకోవాలని, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి అశ్విని, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, అంజలి రాజేశ్వరి, విజయ, కె. అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్స్ అందజేత

మానకొండూర్: చెంజర్లలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రొసీడింగ్స్ అందజేశారు. అర్హులకు విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని పేర్కొన్నారు. నాయకులు సాయిరి దేవయ్య, గొల్లన కొమురయ్య, కానిగంటి మల్లికార్జున్ పాల్గొన్నారు.

'రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహించే కుట్ర'



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లు పెంచకుండానే ఎన్నికలు నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో దేశానికి తెలంగాణ ఆదర్శమని చెప్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లుల ఆమోదానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాల న్నారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ ఎస్ నేతలతో కలిసి శుక్రవారం తెలంగాణ భవన్‌లో వకుళాభరణం మీడి యాతో మాట్లాడారు. తమిళనాడు తర హాలో బీసీ రిజర్వేషన్ల పెంపును తాము కోరుకుంటున్నామ న్నారు. బీసీల్లో నేటికీ కనీసం వార్డు మెంబరుగా ఎన్నిక కాని కులాలు 70కి పైగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 33 మూలంగా నీట్ పరీక్షలో స్థానికేతరులు కోర్టుల్లో కేసులు వేస్తూ తెలంగాణ విద్యార్థుల హక్కులను కాలరా స్తున్నా రని, దీంతో తెలంగాణ విద్యార్థులు మెడికల్ సీట్లను కోల్పోతున్నారని దాసోజు శ్రవణ్ అన్నారు.

కష్టం మీది... అధికారం మాది!

- కమ్యూనిస్టుల సహకారం వల్లే మేం అధికారంలోకి వచ్చాం
- మరోసారి మేము గెలిచేందుకు సహకారం అందించండి
- నేడు ఆవారాగాళ్లు కూడా జర్నలిస్టు ముసుగేసుకుంటున్నారు
- ప్రెస్‌మీట్లలో అలాంటివాళ్లను కొట్టాలన్నంత కోపం వస్తది
- నవ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి
- హాజరైన మంత్రి పొంగులేటి, సీపీఎం నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడా నికి కమ్యూనిస్టు ఉద్యమాలే కారణమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 2004, 2023లలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో కమ్యూనిస్టులు సహకారం అందించారని తెలిపారు. ఈ అధికారం ఇలాగే కొనసాగడానికి, మరోసారి తాము అధికారంలోకి రావడానికి కూడా కమ్యూనిస్టులు సహ కరించాలని కోరారు. కమ్యూనిస్టులు ఒక పార్టీని అధికారంలోకి తీసుకురావడంకంటే, అధికారంలో ఉన్నోడిని దించేయటంలో ముందుంటారని చురకలంటించారు. భవిష్యత్‌లో కూడా కాంగ్రెస్– కమ్యూనిస్టుల మధ్య సహకారం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. 'కృషి మీది.. అధికారం మాది.. సహకారం కొనసాగాలి' అని కమ్యూనిస్టులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నవ తెలంగాణ దినపత్రిక దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. ప్రస్తుతం సమాజంలో పత్రికల పాత్ర, జర్నలిస్టులుగా కొందరు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.

రాజకీయ నేతల్లాగే జర్నలిస్టుల విశ్వసనీయత తగ్గుతోంది

ప్రస్తుతం సమాజంలో మీడియా సంస్థలు విశ్వసనీయతని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.



కార్యక్రమంలో నవ్వులు చిందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పొంగులేటి, రాఘవులు, వేం నరేందర్‌రెడ్డి

'జర్నలిస్టు అనే పదానికి అర్థం లేకుండా పోతోంది. అక్షరాలు రానివారు కూడా జర్నలిస్టు ముసుగు వేసుకుని సోషల్ మీడియా పేరుతో తిరుగుతున్నారు. ఒకప్పుడు జర్నలిస్టు అంటే నిబద్ధత ఉండేది. ఇప్పుడు ఆవారాగాళ్లు, తిట్లు వచ్చేవాళ్లు జర్నలిస్టు అనే ముసుగు తొడుక్కొని వస్తున్నారు. ప్రెస్‌మీట్లలో మూడు గంటల ముందే వచ్చి ముందు కూర్చుంటారు. ఇంకా నమస్కారం పెట్టడం లేదేంటని గుడ్లురిమి చూస్తారు. అలాంటి వాళ్లను కిందకు దిగి కొట్టాలనిపిస్తుంది. జర్నలిజంలో ఇవాళ వింత పోకడలు వచ్చాయి. వాటికి రాజకీయ పార్టీలు తోడయ్యాయి. రాజకీయ నాయకుల తరహాలోనే జర్నలిస్టుల విశ్వసనీయత కూడా వేగంగా సన్నగిల్లుతోంది. నిజమైన జర్నలిస్టులను, జర్నలిస్టుల ముసుగు తొడుక్కున్న వారిని వేరు చేయాల్సిన అవసరం ఉంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

కమ్యూనిస్టులు ఉప్పులాంటివారు

'కమ్యూనిస్టులు ఉప్పు లాంటివారు.. ఉప్పు లేని వంట రుచి ఉండదు. అలాగే ప్రజా సమస్యలపై పోరాటంలో ఎర్రజెండా కనిపించినప్పుడే ఆ సమస్యల పరిష్కారం జరుగుతుందని ప్రజలు భావిస్తారు. అబద్ధాల ప్రాతిపదికన జరిగే నిర్మాణం కూలిపోతుందని నమ్మే వ్యక్తిని నేను. నిజం చెప్పకపోయినా, అబద్ధం మాత్రం చెప్పను. కమ్యూనిస్టులను నమ్మించి మోసం చేశారు ఇప్పటి వరకు. నాకు కమ్యూనిస్టుల పట్ల అపార గౌరవం ఉంది. ఎంపీగా గెలిచినప్పుడు పార్టీ కార్యాలయాన్ని మల్లు స్వరాజ్యంను ముఖ్య అతిథిగా ఆహ్వానించి ప్రారంభించాను. ప్రభుత్వ ప్రకటనల్లో నవ తెలంగాణ పత్రికకు ఇతర ప్రధాన పత్రికలతో సమానంగా ప్రాధాన్యతనిస్తాం. నవ తెలంగాణలో ప్రజా సమస్యలపై వచ్చే వార్తల పరిష్కారానికి కృషి చేస్తాం' అని సీఎం తెలిపారు.

కమ్యూనిస్టుల ఆశయాలను కాంగ్రెస్ సాకారం చేస్తోంది: మంత్రి పొంగులేటి

కమ్యూనిస్టులు పేదల పక్షాన నిలిచి ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నిస్తుంటారని, నిత్యం పేదలకు అండగా ఉంటారని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలలో నిజాయితీని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం పేదలకు కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ అందించేందుకు పని చేస్తోందని తెలిపారు. తాము పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తున్నామని చెప్పారు. గులాబీ రంగు వేసుకున్న కొన్ని పత్రికలు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు అధికారులు, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులపై అసంబద్ధంగా వార్తలను ప్రచురించినా సానుకూల దృక్పథంతోనే ముందుకు పోతున్నట్లు పేర్కొన్నారు. సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. అమెరికాకు భయపడి ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడడానికి భయపడుతున్న మోదీని వెనుకేసుకొచ్చే స్థితిలో దేశంలోని మీడియా ఉందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్. ప్రియాంక, పార్టీ నేతలు బి.వి. రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


సత్యసాయి శత జయంత్యుత్సవాలకు ప్రధాని మోదీకి ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: శ్రీ సత్యసాయి శత జయంత్యుత్సవాలకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీని ట్రస్టీలు ఆహ్వానించారు. మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ట్రస్టీలు జస్టిస్ రామసుబ్రమణియన్, ర్యుకో హీరా, ఎస్ఎస్ నాగానంద్, సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండ్య, కేంద్ర బొగ్గు, గనుల మంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీలో మోదీని కలిశారు. 30 నిమిషాలు వీరి భేటీ జరిగింది. సత్యసాయితో గడిపిన చిరస్మరణీయ క్షణాలను మోదీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న కార్యకలాపాలను ప్రధానికి ట్రస్టీలు వివరించి, ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. ప్రశాంతి నిలయానికి వచ్చి శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొని, స్వామి ఆశీస్సులు అందుకుంటానని మోదీ హామీ ఇచ్చినట్లు ట్రస్టీలు వెల్లడించారు. నవంబర్ 15 నుంచి 24 వరకు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఉత్సవాలు నిర్వహించనున్న విషయం తెలిసిందే.

'రిజర్వేషన్ల' వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌కు ఊరట

ప్రైవేట్ కేసును కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: 'రిజర్వేషన్ల'కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డిపై దాఖలైన ప్రైవేట్ కేసును హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయనకు ఊరట లభించినట్టయింది. గతేడాది పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన 'జన జాతర సభ' సభలో రేవంత్ చేసిన ప్రసంగంపై నల్లగొండ జిల్లాకు చెందిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ఆరోపించారని తెలిపారు. సీఎం ఆడియో క్లిప్పింగ్‌లను, మీడియా ప్రచురణలను అందజేశారు. వెంకటేశ్వర్లు పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు సాక్షుల వాంగ్మూలం రికార్డు చేసింది. ఈ నేపథ్యంలో రాజకీయ కక్ష సాధింపులో భాగంగా పెట్టిన ఈ కేసు కొట్టివేయాలని కోరుతూ రేవంత్ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయస్థానం జూలై 7న తీర్పు రిజర్వు చేసింది. రేవంత్‌పై దాఖలు చేసిన ప్రైవేట్ పిటిషన్ చెల్లదంటూ.. కేసు రద్దు చేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం తీర్పు వెలువరించారు.

కేటీఆర్, జగదీశ్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

చింతపండు నవీన్ ఫిర్యాదుపై దాఖలైన కేసు కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లోని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) ఫిర్యాదు మేరకు దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పు వెల్లడించింది. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తనపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేశారని, ఫేక్ వీడియో సృష్టించారని నవీన్ ఫిర్యాదు మేరకు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్, జగదీశ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ కక్షసాధింపుతో కేసు పెట్టారని.. తాము వ్యక్తిగతంగా ఎవరినీ ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఆధారాల్లేకుండా ఆరోపణలతో దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం జూలై 12న తీర్పు రిజర్వు చేసింది. జస్టిస్ మౌషుమి భట్టాచార్య శుక్రవారం తుది ఉత్తర్వులు వెలువరించారు. పిటిషనర్లు ఇద్దరూ వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో నకిలీ, పరువుకు నష్టం కలిగించే కంటెంట్‌ను అప్‌లోడ్ చేశారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచే అవకాశాలను తగ్గించగలదని నిరూపించడానికి ఫిర్యాదుదారు విఫలమయ్యారని స్పష్టం చేశారు.

లోగో రూపకల్పనకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: వచ్చే నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహించనున్న 'తెలంగాణ– ఈశాన్య భారత సాంకేతిక– సాంస్కృతిక మహోత్సవం' కోసం లోగో రూప కల్పన, ట్యాగ్‌లైన్ రచన, పోస్టర్ రూపకర్తల నుంచి దరఖాస్తులను రాజ్ భవన్ ఆహ్వానిస్తోంది. దరఖాస్తులను విద్యార్థులు, కళాకారులు, డిజైనర్లు ఎవరైనా సరే రూపొందించి పంపవచ్చని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మహో త్సవం తెలంగాణ, ఈశాన్య భారత్‌లోని ఎనిమిది రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర మధ్య సాంకేతిక, సాంస్కృతిక పరిజ్ఞాన మార్పిడి, ఆర్థిక సంబంధాల అభివృద్ధి లక్ష్యంగా నవంబర్ 25–27 తేదీల మధ్య, డిసెంబర్ 2–4 తేదీల మధ్య రెండు దశల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొ న్నారు. కార్యక్రమం థీమ్ లక్ష్యం.. తెలంగాణ–ఈశాన్య భారత రాష్ట్రాల మధ్య సాంస్కృతిక ఐక్యత, సాంకేతిక ఆవిష్కరణలు పరస్పర మార్పిడి భావన ప్రతిబింబించేలా ఎంట్రీలు ఉండాలని సూచించారు. ట్యాగ్‌లైన్ 10 పదాలకు మించకుండా.. ఆంగ్లంలో పోస్టర్ ఏ4 పరిమాణంలో ఉండేలా రూపొందించాలని పేర్కొన్నారు. దరఖాస్తులను EmailID:telangananortheastconnect@gmail.comకు ఆగస్టు 15గా పంపించాలని కోరారు. ఉత్తమ లోగోకు రూ.15 వేలు, ట్యాగ్‌లైన్‌కు రూ.5 వేలు, ఉత్తమ పోస్టర్‌కు రూ.20 వేలు బహుమతి ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు రాజ్‌భవన్ వెబ్‌సైట్ www.governor.telangana.gov.inను సంప్రదించాలని సూచించారు.

జూలైలో 22 ఏసీబీ కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: అవినీతి అధికారులపై కేసుల నమోదులో తెలంగాణ అవినీతి నిరోధకశాఖ వేగం పెంచింది. జూలై 1 నుంచి 31 వరకు మొత్తం 22 కేసులు నమోదు చేసింది. వీటిలో 13 ట్రాప్ కేసులు, ఒకటి ఆదాయానికి మించిన ఆస్తుల కేసు, ఒక క్రిమినల్ మిస్‌కండక్ట్, ఒక రెగ్యులర్ ఎంక్వైరీ కేసు, ఆరు ఆకస్మిక తనిఖీలకు సంబంధించిన కేసులు ఉన్నట్టు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై నెలలో నమోదైన కేసులలో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు సహా ఇరవై మంది ప్రభుత్వ ఉద్యోగులను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్టు పేర్కొన్నారు. ఏసీబీ ట్రాప్ కేసులలో మొత్తం రూ.5,75,000, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రూ.11,50,00,000 విలువైన స్థిరాస్తులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

..లోక్‌సభలో కొట్లాడేవారు

▶ మొదటి పేజీ తరువాయి

శుక్రవారం జరిగిన భేటీలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

- రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ ప్రచార ఆర్భాటాన్ని ప్రదర్శిస్తోందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. 'బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేలా పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయాలి. 8న కరీంనగర్‌లో సభ తర్వాత రాష్ట్రపతిని పార్టీ ప్రతినిధి బృందం కలిసి బీసీ రిజర్వేషన్ల కోసం విజ్ఞప్తి చేద్దాం' అని కేసీఆర్ సూచించారు.
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయమని కేసీఆర్ స్పష్టం చేశారు. ఉప ఎన్నికల సన్నద్ధతను ఇప్పటినుంచే ప్రారంభించాలని ఆదేశించారు.
- స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేలా గట్టిగా కృషి చేయాలి. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం ఎప్పుడు నిర్వహిస్తుందనే అంశంపై స్పష్టత లేదు. అయినా ఎన్నికల సన్నద్ధతకు పార్టీ నేతలు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలి.
- స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారిద్దాం. ప్రభుత్వ విధానాలు, తెలంగాణకు జరిగే అన్యాయాలు, అసెంబ్లీ ఉప ఎన్నికలు, స్థానిక ఎన్నికల్లో పార్టీ యంత్రాంగం పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యేలా కార్యాచరణ ఉంటుందని ఈ భేటీల్లో కేసీఆర్ ప్రకటించారు.

ఎల్పీజీ ఆటో రూ.2.70 లక్షలు

షోరూమ్ ధరలను ఖరారు చేసిన ఆర్టీఏ.. అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు

కన్సల్టెంట్‌లు, ఫైనాన్షియర్ల కట్టడి



సాక్షి, హైదరాబాద్: ఆటో రిక్షా ధరలను రవాణాశాఖ ఖరారు చేసింది. ఎల్పీజీ ఆటో రిక్షా ధరను రూ.2.70 లక్షలుగా, సీఎన్జీ ఆటో రిక్షా ధరను రూ.2.80 లక్షలుగా నిర్ణయించింది. నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు విక్రయించకుండా అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో ఫైనాన్షియర్‌లు, కన్సల్టెంట్‌లు కుమ్మక్కై అడ్డగోలుగా ధరలు పెంచినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈసారి అలాంటి బ్లాక్ మార్కెటింగ్‌కు అవకాశం లేకుండా నియంత్రించింది. ఓఆర్ఆర్ పరిధిలో నడిపేందుకు వీలుగా సుమారు 65 వేల ఆటోర్మిట్‌లకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. వీటిలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలు కాగా, మరో 20వేల ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలకు సైతం అనుమతినిచ్చారు. ఇప్పటికే సీఎన్జీ లేదా ఎల్పీజీతో నడుస్తున్న సుమారు 25 వేల ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకొనేందుకు అవకాశం కల్పించారు.

20 వేల ఆటోలకు ప్రొసీడింగ్‌లు..

అర్హులైన ఆటోడ్రైవర్‌లు దరఖాస్తు చేసుకొనేందుకు షోరూమ్‌లలోనే ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న డ్రైవర్ల వివరాలను పరిశీలించి కొత్త ఆటోలు కొనుగోలు చేసేందుకు ప్రొసీడింగ్‌లు (అనుమతులను) ఇచ్చారు.ఇ ప్పటి వరకు సుమారు 20 వేల ఆటోరిక్షాలకు అనుమతులను ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

రంగంలోకి కన్సల్టెంట్‌లు...

ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలకు ప్రొసీడింగ్‌ల ప్రక్రియ ముగింపు దశకు చేరడంతో ఫైనాన్షియర్‌లు, కన్సల్టెంట్‌లు రంగంలోకి దిగారు. అక్రమార్జనకు తెరలేపారు. షోరూమ్‌లలో ధరలను ఖరారు చేసినట్లుగా ఫైనాన్షియర్‌ల అక్రమాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆటోరిక్షా విక్రయాల్లో ఫైనాన్షియర్‌లు, కన్సల్టెంట్‌ల మోసాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

కేసీఆర్, హరీశ్ సంతకాలతోనే 'బనకచర్ల'కు పునాది

- కాంగ్రెస్ ప్రభుత్వ ఫిర్యాదుతోనే ఆ ప్రాజెక్టు ఆగింది
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- కేంద్రంలో బీజేపీది అవినీతి, విద్వేష పాలన
- ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో జనహిత పాదయాత్ర



మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్. చిత్రంలో దామోదర, మీనాక్షి నటరాజన్, జగ్గారెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ పరిగి: గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను గత బీఆర్ఎస్ ప్రభుత్వమే ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. కేసీఆర్ చేసిన తప్పును సరిదిద్దేందుకు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఏపీ నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు నష్టం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదు చేయటం వల్లనే దాని నిర్మాణాన్ని కేంద్రం ఆపిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న జనహిత పాదయాత్ర శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగి, సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో కొనసాగింది. పరిగిలో పార్టీ కార్యకర్తల సమావేశంతోపాటు సంగారెడ్డి జిల్లా జోగిపేటలో జరిగిన బహిరంగసభలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు పదేపదే అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. అప్పటి సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్‌రావు సంతకాలు పెడితేనే ఏపీలో బనకచర్ల ప్రాజెక్టుకు పునాది పడిందని అన్నారు. బీఆర్ఎస్ చేసిన తప్పులు, అప్పులను కప్పిపుచ్చుకునేందుకు తమపై దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కేంద్రం మెడలు వంచి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసి తీరుతామన్నారు. బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ తెస్తే, కవిత సంబురాలు చేసుకొని రంగులు పూసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేవుడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. బీజేపీని శ్రీరామచంద్రుడు స్థాపించారా? అని ప్రశ్నించారు. కులాలు, మతాల పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. జనహిత పాదయాత్ర తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర ఉంటుందని, దీనికి రాహుల్‌గాంధీ కూడా వస్తారని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వంద సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కేంద్రంలో బీజేపీ అవినీతి పాలన: మీనాక్షి

కేంద్రంలో బీజేపీ అవినీతి, మతతత్వ పాలన సాగిస్తోందని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ విమర్శించారు. పరిగిలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంతోపాటు సంగారెడ్డి జిల్లా జోగిపేటలో నిర్వహించిన బహిరంగసభలో ఆమె మాట్లాడారు. 'దేశంలో రెండు మోడల్స్ నడుస్తున్నాయి. ఒకటి తెలంగాణ మోడల్. రెండోది విద్వేష మోడల్. సామాజిక న్యాయం దిశగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోంది. కేంద్రంలోని మోదీ సర్కారు అదానీ, అంబానీల కోసమే పనిచేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది' అని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్, పార్టీ నేతలు టి.రామ్మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, లాల్‌కృష్ణ, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ మౌనం వల్లే లోకేశ్ బరితెగింపు

- ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్‌రెడ్డి లోపాయికారీ ఒప్పందం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో అధికారం తమ చేతిలో ఉందనే ధైర్యంతో బనకచర్ల ప్రాజెక్టును కట్టి తీరుతామని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ బరితెగించి మాట్లాడుతు న్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవ డంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. హరీశ్‌రావు శుక్రవారం తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోపాయికారి ఒప్పందం చేసుకుని సహకరిస్తున్నందునే ఏపీ సీఎం చంద్రబాబు ఆడిందే ఆట అన్నట్లుగా వ్యవహరి స్తున్నారని మండిపడ్డారు. లోకేశ్ ప్రకటనపై సీఎం రేవంత్, మంత్రులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. బనకచర్ల అంశం ఎజెండాలో ఉంటే చర్చకు వెళ్లబోమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రకటిస్తే, సీఎం రేవంత్ మాత్రం భేటీకి హాజరై కమిటీ ఏర్పాటుకు అంగీకరించార ని మండిపడ్డారు. బనకచర్లపై చంద్రబాబు అనుస రిస్తున్న బుల్డోజ్ విధానానికి బీజేపీ, కాంగ్రెస్ మౌనమే కారణమని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రయోజనా లను పక్కన పెట్టి చంద్రబాబు, బీజేపీ మెప్పుకోసం సీఎం రేవంత్ ప్రయత్నిస్తు న్నారని ధ్వజమెత్తారు. అధికారం, మందబలాన్ని చూసుకుని బనకచర్లపై లోకేశ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు.

నీళ్లు తీసుకుపోతే ఊరుకుంటామా?

గోదావరిలో మిగులు జలాలు ఉంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలు బనకచర్లపై ఏపీ పంపిన డీపీఆర్‌ను ఎందుకు వెనక్కి తిప్పి పంపాయని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చిల్లు పెట్టి నీళ్లు తీసుకెళ్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకోలేదని చెప్తున్న నారా లోకేశ్.. ఆ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ తన తండ్రి చంద్రబాబు కేంద్రానికి రాసిన 7 లేఖల గురించి తెలుసుకోవాలని హితవు పలికారు. కాళేశ్వరం మీద కుట్ర చేసి, మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోయకుండా ఏపీకి తరలించుకుపోయే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. బనకచర్లను ఏపీ కట్టి తీరితే, తాము అడ్డుకుని తీరుతా మని స్పష్టంచేశారు. 'గోదావరి నదిలో మా వాటాను అడిగితే ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నా మని లోకేశ్ అంటున్నారు. గతంలో బాబ్లీ, ఆల్మట్టిపై చంద్ర బాబు చేసిన పోరాటాలు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చ గొట్టేందుకేనా? సుప్రీంకోర్టుకు వెళ్లి అయినా బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ హక్కులను కాపాడుతుంది. అనుమతు లు తెచ్చుకునే పద్ధతి మీకు తెలిస్తే, ఆపే పద్ధతి కూడా మాకు తెలుసు. బనకచర్ల ద్వారా గోదావరి నీళ్లు మాత్రమే కాదు, కృష్ణా నీళ్లను కూడా తరలించుకు పోయే కుట్రను చంద్రబాబు బయట పెట్టారు. నాగార్జునసాగర్ కుడి కాల్వ సామర్థ్యాన్ని రెట్టింపు చేయడం వెనుక ఈ కుట్ర దాగి ఉంది. లోక్‌సభలో కాంగ్రెస్, బీజేపీకి తెలంగాణ నుంచి 8 మంది చొప్పున ఎంపీలున్నా బనకచర్లపై వాయిదా తీర్మాణం ఇచ్చి రాష్ట్ర హక్కులను కాపాడటం లేదు' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

నేడు తెలంగాణ 'స్పోర్ట్స్ కాంక్లేవ్'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఆమోదించిన క్రీడా విధానం అమలు, భవిష్యత్తు అవకాశాలకు సంబంధించి క్రీడా ప్రముఖులతో ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించనుంది. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సంబంధించి తీసుకుంటున్న చర్యలు, దీర్ఘకాలిక ప్రణాళికలు తదితర అంశాలపై ఇందులో చర్చిస్తారు. 'తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్' పేరుతో జరిగే ఈ చర్చాగోష్టిలో ఒలింపిక్ పతక విజేతలు అభినవ్ బింద్రా, గగన్ నారంగ్‌తో పాటు భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, మాజీ అథ్లెట్ అంజూ బాబీ జార్జ్ తదితరులు పాల్గొంటారు. ఐదు ప్రధానాంశాలతో క్రీడా పాలసీని ప్రభుత్వం రూపొందించింది. రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో స్టేడియాల నిర్మాణం, యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయం, టోర్నీల నిర్వహణ, క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలవంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ అంశాలకు సంబంధించి మరింత సలహాలు, సూచనలకు క్రీడా ప్రముఖులనుంచి ప్రభుత్వం ఆశిస్తోంది. నేడు జరిగే ఈ కార్యక్రమంలో పలు కార్పొరేట్ సంస్థలతో కూడా ప్రభుత్వం ఒప్పందాలు చేసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి ఈ కాంక్లేవ్ నిర్వహణను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

ఫార్మాలో మెదక్‌కు 'అదితి' ఆతిథ్యం

ఈ పథకం కింద రూ. వెయ్యి కోట్లు కేటాయించామన్న బీఈఈ డైరెక్టర్ జనరల్ ఆకాశ్ త్రిపాఠి

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఫార్మా పరిశ్రమల రంగంలో ప్రపంచ ఇంధన సామర్థ్య సాంకేతికతను ప్రోత్సహించడానికి తెలంగాణతో సహా ఐదు రాష్ట్రాలను 'అదితి' పథకం కింద కేంద్ర ప్రభుత్వ సంస్థ 'బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ' (బీఈఈ) ఎంపిక చేసింది. వీటిలో మెదక్ జిల్లా ఒకటి. మిగిలిన వాటిలో బద్ది, మడ్గావ్, అహ్మదాబాద్, బీదర్ ఉన్నాయని పేర్కొంది. మెదక్‌లో ఫార్మా రంగంలో అత్యాధునిక ఇంధన సాంకేతికతను అందించడం ద్వారా ఎంఎస్ఎంఈ రంగానికి తీసుకున్న రుణాలపై వడ్డీ రాయితీ (ఇంట్రెస్ట్ సబ్‌వర్షన్)తో ఆర్థికంగా మరింత ఊతం ఇవ్వడానికి బీఈఈ మెదక్‌ను ఎంపిక చేసినట్టు ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ ఆకాశ్ త్రిపాఠి తెలిపారు. ఇంధన సమర్థ చర్యల అమలులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల చురుకైన పాత్రను విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా గుర్తించినట్టు తెలిపారు. అదే సమయంలో ఫార్మా రంగంలో అదితి పథకాన్ని అమలు చేయడానికి మెదక్‌ను ఎంపిక చేసినట్టు వివరించారు. ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ 'అసిస్టెన్స్ ఇన్ డిప్లాయింగ్ ఎనర్జీ ఎఫిషియెంట్ టెక్నాలజీ ఇన్ ఇండస్ట్రీస్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్' (అదితి) పథకం రూపకల్పన చేసి అమలు కోసం రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌ను కేటాయించిందని, ఇందులో రూ.875 కోట్లు రాయితీ నిధులని పేర్కొన్నారు ఇంధన-సమర్థవంతమైన సాంకేతికతల అప్‌గ్రేడ్‌ల కోసం రాయితీ ఫైనాన్స్‌ను సులభతరం చేయడానికి రూ.50 కోట్లు కేటాయించామని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ఈ పథక అమలు ప్రాముఖ్యతను బీఈఈ కార్యదర్శి మిలింద్ డియోర్ వివరించారు. అదితి పథకం 60 పారిశ్రామిక క్లస్టర్లు, వస్త్రాలు, ఫౌండ్రీలు వంటివాటితోపాటు ఆహార ప్రాసెసింగ్‌తో సహా 14 శక్తి-ఇంటెన్సివ్ రంగాల్లో పనిచేస్తుందన్నారు. దశలవారీగా క్లస్టర్-నిర్దిష్ట విధానాన్ని అవలంబిస్తున్నామని తెలిపారు.

నేడు ఏజీ వర్సిటీ స్నాతకోత్సవం.. గవర్నర్ రాక

సాక్షి, హైదరాబాద్: విశ్వవిద్యాలయంలో జరిగే స్నాతకోత్సవం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, బంధువులకు ఒక మధుర జ్ఞాపకంగా నిలుస్తుందని వీసీ అల్దాస్ జానయ్య అన్నారు. శుక్రవారం వర్సిటీ ఆడిటోరియంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. శనివారం 55వ స్నాతకోత్సవానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ముస్తాబైందని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయం కులపతి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కానున్నట్లు ఆయన చెప్పారు. 2021–2022లో వర్సిటీలో విద్యనభ్యసించిన 830 మందికి పట్టాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రానున్న నవంబర్‌లో 56, 57వ స్నాతకోత్సవాల్ని సంయుక్తంగా నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అల్దాస్ జానయ్య తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

కూర్పు కుదరక.. కమిటీలపై కాక..

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో చోటు కోసం తీవ్రమైన పోటీ
- సమీకరణలు కుదరక సంక్లిష్టంగా పరిస్థితులు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర కమిటీ కూర్పుపై కసరత్తు కొత్త అధ్యక్షుడికి తలనొప్పులు తెచ్చిపెడుతోంది. ఇంకా జిల్లా కమిటీల ఏర్పాటే పూర్తికాకపోవడంతో రాష్ట్ర కార్యవర్గంతోపాటు, ఏడు మోర్చాల నియామకం సంక్లిష్టంగా మారింది. రాష్ట్ర కార్యవర్గం ఏర్పా టుపై కాలయాపన పెరిగేకొద్దీ పోస్టుల కోసం ఒత్తిడి మరింత పెరుగుతున్నట్టు తెలుస్తోంది. తాజాగా వివిధ జిల్లా కార్య వర్గాల ఏర్పాటు కోసం రాష్ట్ర కార్యాలయంలో చేసిన ప్రయత్నం కూడా కొలిక్కి రాలేదు. జాబితాల్లో సామాజిక సమీకరణలు, ఇతర మార్గదర్శకాలు పాటించకపోవడంతో నిర్దేశిత ఫార్ములాకు అనుగుణంగా మళ్లీ జాబితాలను సిద్ధంచేయాలని జిల్లా నాయకులకు సూచించినట్టు తెలిసింది.

సంక్లిష్టంగా కూర్పు: రాష్ట్ర కమిటీ కూర్పులో సామాజిక సమీకరణలు, ప్రాంతాలవారీగా ప్రాతినిధ్యం, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50% పద వులు, మొత్తంగా మహిళలకు 33%రిజర్వేషన్ల కల్పన వంటి వాటిపై పూర్తిస్థా యిలో దృష్టి పెట్టాల్సిన పరిస్థితులు ఏర్ప డ్డాయి. దీంతో రాష్ట్ర కార్యవర్గం, కమిటీ కస రత్తు కూడా ఇంకా పూర్తిస్థాయిలో వేగం పుంజుకోలేకపోతోంది. జూలై చివరినాటికి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రకటన ఉంటుందని భావించినా వెలువడ లేదు. అందుకు మరి కొన్ని రోజులు పట్టే అవ కాశాలున్నాయని తెలుస్తోంది. జంబో కమి టీలు వేసుకునే అవకాశం లేదని ముందుగానే నేతలకు అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు స్పష్టత నిచ్చారు. మొత్తం 22 మందితో (3 ప్రధాన కార్యదర్శులు, 8 మంది ఉపాధ్యక్షులు, 8 కార్యదర్శులు, 1 కోశాధి కారి, 1 సంయుక్త కోశాధికారి, ఒక ఆఫీస్ కార్య దర్శి) రాష్ట్ర పదాధికారుల కమిటీని నియమించుకోవాలని జాతీయ నాయకత్వం రాష్ట్ర అధ్యక్షుడిని ఆదేశించింది. వీరి సంఖ్యను పెంచుకునేందుకు అనుమతివ్వలేదని తెలుస్తోంది. ఈ కమిటీ కూర్పులో పూర్తి స్వేచ్ఛ ఇచ్చినా సామాజిక సమీకరణలు వంటి నిర్దేశిత మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని సూచించింది. కాగా, జూలై చివరలోగా జిల్లా కమిటీల ఏర్పాటుకు పరిశీలకులను కూడా నియమించినా కీలక అంశాలు ప్రతిబంధకంగా మారినట్టు సమాచారం. పాత కమిటీలో ఉన్నవారిలో 40% మందినే కొత్త కమిటీ లోకి తీసుకోవాలని, ఈ కమిటీల్లో 50% ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు ఉండాలని, వారికి క్రియాశీల సభ్యత్వంతోపాటు 60 ఏళ్లలోపు వయసు ఉండాలని అధిష్టానం నిర్దేశించింది. అయితే, జిల్లా కమిటీలే ఇంకా పూర్తిస్థాయిలో ఏర్పాటు కాకపోవడంతో రాష్ట్ర కమిటీ నియా మకం మరింత ఆలస్యం కానుంది. పదవుల కోసం ఆశావ హుల జాబితా భారీగానే ఉన్నట్టు తెలుస్తోంది.

జాతీయ సినీ పురస్కారాలు 2023

స్త్రీల జీవితాల్లోని అంతఃప్రవాహాలు
వారిని లైంగికంగా పీడించి
ఓడిపోయిన పిశాచాలు...
స్త్రీలకు స్త్రీలే తోడుగా నిలిచిన కథనాలు...
శుక్రవారం ప్రకటించిన జాతీయ సినీ పురస్కారాలు
2023లో వెండితెర చూపించిన
మహిళా సంఘర్షణలను మరోసారి జ్ఞప్తికి తెచ్చాయి.
అలాగే ఎన్నో ఏళ్లుగా సినీ రంగంలో ఉన్నా
ఈసారి గుర్తింపు పొందిన నటీమణులు, గాయనులు
వారి అభిమానులను ఆనందపరిచారు.
మొత్తంగా ఈ అవార్డులు స్త్రీల దృష్టికోణంలో ప్రత్యేకమైనవి.

శ్రీ వాణి రాణించింది



'మిసెస్ చటర్జీ వెర్సస్ నార్వే' చిత్రంలో రాణి ముఖర్జీ



రాణి ముఖర్జీకి ఉత్తమనటి పురస్కారం దక్కింది.

ఆమె నటించిన 'మిసెస్ చటర్జీ వెర్సస్ నార్వే' చిత్రానికి గానూ ఆమెకు ఈ పురస్కారం అందింది. 'గులామ్' (1998) నుంచి రాణి ముఖర్జీ నటిస్తూ ఉన్నా జాతీయనటిగా గుర్తింపు దక్కడం ఇన్నాళ్లకు గాని సాధ్య పడలేదు. ఆమెకు ఈ పురస్కారం రావడం పట్ల అభిమానులే కాదు... విమర్శకులు కూడా సంతృప్తిగా ఉన్నారు. ఎందుకంటే స్త్రీల దృష్టికోణంలో 'మిసెస్ చటర్జీ వెర్సస్ నార్వే' చాలా శక్తివంతమైన సమస్యను చర్చించింది. నిజ జీవితం ఆధారంగా తీసిన ఈ సినిమాలో రాణి ముఖర్జీ గొప్పగా నటించిందన్న ప్రశంసలు పొందింది. జాతీయ పురస్కారం వచ్చిందన్న వార్త వెలువడగానే 'నా ముప్పై ఏళ్ల నటనా జీవితానికి ఇది వేలిడేషన్‌గా భావిస్తున్నా' అని ఆమె స్పందించింది.

ఎన్నో కలికితురాయిలు

బెంగాల్ నుంచి బాలీవుడ్‌కు వచ్చిన రాణి ముఖర్జీ 'ఆతీ క్యా ఖండాలా' పాట ఉన్న ఆమిర్ ఖాన్ 'గులామ్'తో ప్రేక్షకుల దృష్టిలో పడింది. ఆ తర్వాత షారుక్‌తో నటించిన 'కుచ్ కుచ్ హోతా హై'తో స్టార్‌డమ్‌కు చేరుకుంది. 'చోరీ చోరీ చుప్‌కే చుప్‌కే', 'కభి ఖుషీ కభి గమ్', 'సాథియా', 'వీర్ జారా'... తదితర సినిమాలు ఆమె ప్రతిభను చాటాయి. అయితే అమితాబ్‌తో కలిసి నటించిన 'బ్లాక్' సినిమాలో తను కేవలం గ్లామర్ హీరోయిన్ కాదని, ప్రతిభ ఉన్న నటి అని నిరూపించింది. 2014లో దర్శకుడు ఆదిత్యా చోప్రాను వివాహం చేసుకున్నాక సినిమాలకు కొంత దూరమైనా ఇటీవల 'మర్దానీ', 'మర్దానీ 2', 'హిచ్కీ', 'మిసెస్ చటర్జీ వెర్సస్ నార్వే' చిత్రాలతో తెరతో తన అనుబంధాన్ని కొనసాగిస్తోంది.

మిసెస్ చటర్జీ వెర్సస్ నార్వే

భారతీయ తల్లులకు పిల్లలను ఎలా పెంచాలో తెలుసు. పాలు ఇచ్చే పద్ధతి, పాల బువ్వ తినిపించే పద్ధతి, నీళ్ల పోయడం, జోలపాడటం... ప్రతిదీ తెలుసు. కాని ఈ పద్ధతి తప్పు అంది నార్వే ప్రభుత్వం. అక్కడి బాలల సంరక్షణ అధికారులు అక్కడ నివసిస్తున్న భారతీయ జంట అనురూప్ భట్టాచార్య, సాగరికల నుంచి వారి ఇద్దరు పిల్లలను 2011లో అధీనంలోకి తీసుకున్నారు. ఇందుకు కారణం నార్వే బాలల సంరక్షణ చట్టాలు. అక్కడ నివసిస్తున్న పౌరుల ఇళ్లలో పిల్లలు ఉంటే వారిని క్రమ విరామాలలో పరిశీలిస్తారు అధికారులు. అలా పరిశీలనకు వచ్చిన ప్రతిసారీ భారతీయ పద్ధతులకు పెద్దర్థాలు తీసి అనురూప్, సాగరికల పిల్లలు ప్రమాదంలో ఉన్నారని మూడేళ్ల కొడుకును, సంవత్సరం వయసు కుమార్తెను తమ అధీనంలోకి తీసుకెళ్లారు. ఆ పిల్లల కోసం సాగరిక చేసిన పోరాటాన్ని రాణి ముఖర్జీ 'మిసెస్ చటర్జీ వెర్సస్ నార్వే' సినిమాలో పునఃప్రతిష్ట చేసింది.

నటి ఊర్వశికి ఉత్తమ సహాయ నటి పురస్కారం

తెలుగువారికి చిరపరిచితమైన నటి ఊర్వశికి 2023 జాతీయ పురస్కారాల్లో 'ఉల్లుజుక్కు' (అంతఃప్రవాహం) సినిమాకు ఉత్తమ సహాయ నటి పురస్కారం లభించింది. ఇదే సినిమాకు మలయాళం నుంచి ఉత్తమ జాతీయ చిత్రం పుర



స్కారం కూడా లభించింది. 'ఉల్లుజుక్కు'లో ఊర్వశి అత్తగారి పాత్రలో నటించింది. ఆమె కుమారుడు పెళ్లయిన కొన్నాళ్లకే జబ్బు వల్ల మరణిస్తాడు. కోడలు ఆ పెళ్లికి ముందే ఒక వ్యక్తితో ప్రేమలో ఉంటుంది. కాని అనివార్యమై ఈ పెళ్లి చేసుకుంటుంది. భర్త మరణించే సమయానికి ఆ ప్రాంతంలో విపరీతమైన వానలు కురిసి వరద సంభవిస్తుంది. పైకి కనిపించే ఆ వరదలో లోపలి ప్రవాహపు వేగం ఎంతో ఎవరికీ తెలియదు. అలాగే అత్తగారు, కోడలు తమ జీవితాల్లో ఏయే లోపలి గాథలతో సతమతమవుతున్నారో ప్రేక్షకులకు మెల్లగా తెలుస్తూ వస్తుంది. సినిమా ముగింపు సమయానికి కోడలు అత్తను వీడి వెళ్లే పరిస్థితి ఉన్నా చివరకు ఆమె తన ప్రియుణ్ణి కాదని అత్త వద్దకు చేరుకోవడంతో సినిమా ముగుస్తుంది. ఈ సినిమాలో అత్తగా ఊర్వశి, కోడలిగా పార్వతి తిరువోతు నటించగా ఊర్వశికి పురస్కారం దక్కింది.


సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై




జాతీయ పురస్కారాలలో మనోజ్ బాజ్‌పాయ్ నటించిన 'సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై' సినిమాకు ఉత్తమ డైలాగ్ రైటర్ పురస్కారం దక్కింది. ఈ సినిమా జాతీయ పురస్కారాల పట్టికలో కనిపించడం చాలా ముఖ్యమైన విషయం. దీనికి కారణం బాబాల చెరలో చిక్కి బలైపోతున్న చిన్నారి ఆడపిల్లల కోసం న్యాయం వైపు నిలబడితే న్యాయం దక్కి తీరుతుందని ఇందులోని కథానాయకుడు తన న్యాయవాద వృత్తి ద్వారా నిరూపిస్తాడు. ఆడపిల్లలకు ఎన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయో, వారి మీద లైంగిక దాడి జరిగితే ఎన్ని విధాల వొత్తిళ్లు వస్తాయో ఈ సినిమా చూపుతుంది. టీనేజ్ పిల్లలకూ, వారి తల్లిదండ్రులకూ, వారి కోసం పథకాలు రచించే కపట స్వాములకు ఈ సినిమా హెచ్చరిక.

● జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం

33 ఏళ్ల తర్వాత బాద్‌షాకు ఆదాబ్



ముప్పై మూడు ఏళ్ల సుదీర్ఘ నటనానుభవం తర్వాత షారుక్ ఖాన్‌ను భారత ప్రభుత్వం ఉత్తమ నటుడిగా గుర్తించింది. 'దీవానా' (1992) నుంచి షారుక్ ఖాన్ బాలీవుడ్‌లో ప్రవేశించి 'కింగ్ ఖాన్'గా ప్రేక్షకుల అభిమానం పొందుతూ, దేశ విదేశాల్లో ఎన్నో అవార్డులు పొందుతున్నా జాతీయ ఉత్తమ నటుడి అవార్డు మాత్రం రాలేదు. ఇన్నాళ్ల తర్వాత అదీ మన సౌత్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో నటించిన 'జవాన్' సినిమాకు వరించింది. అయితే అది కూడా పూర్తి అవార్డు కాదు. సగమే. మరో సగాన్ని యువ నటుడు విక్రాంత్ మాసేతో (ట్వల్త్ ఫెయిల్ సినిమాకు) పంచుకోవాలి. అంటే ఈసారి ఉత్తమ నటుడు పురస్కారాన్ని ఇద్దరు నటులకు ప్రకటించారు.



సినిమా రంగంలో ఎటువంటి ఘరానా వంశాల మద్దతు లేకపోయినా ఢిల్లీ నుంచి మధ్యతరగతి యువకుడిగా వచ్చి జెండా ఎగుర వేసిన వాడు షారుక్. తనతరం హీరోలు ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్‌లతో పోటీ పడి తన సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నాడు. వేగమైన శరీర కదలికలు, వినూత్నమైన డైలాగ్ డెలివరీ, అల్లరి చిల్లరిగా కనిపిస్తూనే లోతైన భావాలు పలికించడం ప్రత్యేకతగా షారుక్ ప్రేక్షకులకు నచ్చాడు. 'బాజీగర్', 'డర్' సినిమాల్లో నెగెటివ్ కేరెక్టర్లు వేసినా యువత అతణ్ణి హీరోగానే చూసింది. ఆ తర్వాత 'దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే' (1995)తో పూర్తి సూపర్‌స్టార్‌గా అవతరించాడు. 'పర్‌దేశ్', 'దిల్‌తో పాగల్ హై', 'దిల్ సే', 'కభీ ఖుషీ కభీ గమ్'.. అన్నీ హిట్‌గా నిలిచాయ్. దర్శకుడు కరణ్ జోహార్, జూహీ చావ్లాలతో చాలా హిట్స్ సాధించాడు షారుక్. దిలీప్ నటించిన 'దేవదాసు' పాత్రను మళ్లీ పోషించి మెప్పించాడు. 'కల్ హోనా హో', 'వీర్‌జారా', 'చక్‌దే ఇండియా' వంటి సినిమాలు అతడి ప్రతిభను పదేపదే నిరూపించాయి. స్టార్‌గా ఉండి కూడా 'మై నేమ్ ఈజ్ ఖాన్' లో బుద్ధిమాంద్యం ఉన్న హీరోగా నటించాడు. 'ఓమ్ శాంతి ఓమ్', 'చెన్నై ఎక్స్‌ప్రెస్' సినిమాలు ఆబాలగోపాలాన్ని అలరించాయి. షారుక్‌కు ఉత్తమ నటుడు అవార్డు తెచ్చిన 'జవాన్'ను 300 కోట్లతో నిర్మిస్తే 1100 కోట్లు వసూలు చేసింది. ఇప్పటికీ షారుక్ బాలీవుడ్ కా బాద్‌షాగానే కొనసాగుతున్నాడు.

ఊరు పాటకు కిరీటం



కాసర్ల శ్యామ్

ప్రయివేట్ గీతాల నుంచి జాతీయ పురస్కార గ్రహీతగా..

జాతీయ అవార్డుల్లో తెలంగాణ పల్లె పద సౌందర్యం మెరుపై మెరిసింది. తళుక్కున వెలిగింది. 'బలగం' సినిమాలో కాసర్ల శ్యామ్ రాసిన పాట 'ఊరు పల్లెటూరు' ఆ సినిమా విడుదలైనప్పుడే తెలుగు వారందరి మనసును తాకింది. పల్లె జీవనం అందరికీ ఇష్టమే కాబట్టి, ఆ పల్లెను మిస్సయ్యి పట్నవాసం, ప్రవాసం ఉండక తప్పదు కాబట్టి పాటలోని పల్లెతనాన్ని వినగానే అందరి ప్రాణం లేచివచ్చింది. కాసర్ల రచనకు భీమ్స్ అందించిన సంగీతం, మంగ్లి–రామ్ మిరియాల అందించిన గళం, దర్శకుడు వేణు ఎల్దండి దృశ్య రూపం అన్నీ కలిసి పాటను నిలబెట్టాయి. ఇప్పుడు జాతీయస్థాయిలో ఆ పాట గెలిచి తెలంగాణ గ్రామీణ సౌందర్యానికి అందిన వందనం స్వీకరించింది.

'ఊరు పల్లెటూరు' పాటతో ఉత్తమ గేయ రచయితగా జాతీయ పురస్కారం అందుకోనున్న కాసర్ల శ్యామ్‌ది తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హన్మకొండలోని బ్రాహ్మణవాడ. తండ్రి మధుసూదన్ రావు రంగస్థల, టీవీ, సినీనటుడు కావడంతో నటుడు కావాలనే ఆకాంక్ష శ్యామ్ చిన్నతనం నుంచే ఉండేది. అయితే సాహిత్యం పట్ల తనకున్న అభిలాషతో జానపద పాటలు రాయడం, పాడడంలో అనుభవాన్ని సంపాదించారు. వరంగల్ శంకర్, సారంగపాణి బృందంతో కలసి పలు ప్రదర్శనలు ఇవ్వడంతో గాయకుడిగా, రచయితగా గుర్తింపు తెచ్చుకున్నారు. 'కాలేజీ పిల్ల చూడరో.. యమ ఖతర్నాక్ గుందిరో..' శ్యామ్ రాసిన తొలి జానపద సాంగ్. ఆ తర్వాత సుమారు 50పైగా ఆల్బమ్స్‌కు పాటలు రాశారు. ఆ సమయంలోనే మిత్రుల సాయంతో సినిమా అవకాశాల కోసం ప్రయత్నించగా.. 'చంటిగాడు'(2003) సినిమాలో తొలి అవకాశం వచ్చింది. బాలాదిత్య, సుహాసిని జోడీగా బి. జయ దర్శకత్వంలో బీఏ రాజు నిర్మించిన ఈ చిత్రంలో 'కోకోకో .. కొక్కొరోకో, సిగ్గులొలికే సీతాలు' పాటలతో సినీ గేయ రచయితగా పరిచయం అయ్యారు. ఆ తర్వాత 'ప్రేమికులు', 'మహాత్మ', 'పటాస్', 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'సుప్రీమ్', 'రాజా ది గ్రేట్', 'డీజే టిల్లు', 'అల వైకుంఠపురములో'... వంటి పలు సినిమాల్లో సుమారు 800కుపైగా పాటలు రాశారు శ్యామ్. తెలంగాణ మాండలికం, యాస, మాస్‌తోపాటు మెలోడీ గీతాలు రాయడంలో ఆయన మంచి పేరు సంపాదించుకున్నారు. తన అభిమాన రచయిత చంద్రబోస్ అని చెబుతుంటారాయన. ఆయన భార్య రాధిక ఆర్కిటెక్ట్. 'బలగం' సినిమాలోని అన్ని పాటల్నీ కాసర్ల శ్యామ్ రాయగా 'ఊరు.. పల్లెటూరు...' పాటకిగానూ రచయితగా తొలి జాతీయ అవార్డు అందుకోనున్నారు.

మహానుభావుల దారిలో వచ్చిన అవార్డు ఇది

– కాసర్ల శ్యామ్

'బలగం' చిత్రంలో నేను రాసిన 'ఊరు.. పల్లెటూరు...' పాటకి నాకు జాతీయ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ అవార్డు రావడానికి ముఖ్య కారణమైన 'బలగం' చిత్ర దర్శకుడు వేణుగారికి, నిర్మాతలు హర్షిత్ రెడ్డి, హన్షితగార్లకు, 'దిల్' రాజుగారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఇంత మంచి పాటకి అద్భుతమైన సంగీతం సమకూర్చిన భీమ్స్‌గారికి, గాయకులు రామ్ మిర్యాల, మంగ్లీగార్లకు నా కృతజ్ఞతలు. నిజంగా ఎందరో మహానుభావుల తర్వాత మళ్లీ ఈ జాతీయ అవార్డు నాకు దక్కడం నేను చేసిన అదృష్టంగా భావిస్తున్నాను. ముఖ్యంగా తెలంగాణ సంస్కృతిని, తెలంగాణ స్వచ్ఛతను చాటిచెప్పిన ఈ పాట జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడం పట్ల తెలుగువాడిగా నేను చాలా సంతోషపడుతున్నా.

● ఉమెన్ పవర్



చినుకు చినుకు కలిస్తే ప్రవాహం అయినట్టు చేయీ చేయీ కలిపితే విజయం చేరువ అవుతుందని అంటున్నారు కొందరు మహిళా గ్రూప్ సభ్యులు. ఇంటి వద్ద చిన్న చిన్న వ్యాపారాలు చేసే యాభై మంది మహిళలు వాట్సప్ ద్వారా ఒక జట్టుగా కలిశారు. ఒకరి కష్టనష్టాలను మరొకరితో పంచుకున్నారు... వ్యాపార మెళకువలను కలబోసుకున్నారు. నాలుగేళ్లుగా తమ నైపుణ్యాలను, సృజనాత్మకతను పంచుకుంటూనే వ్యాపారాలలో విజయాలు సాధిస్తున్నారు. రేపు ఆదివారం వీరంతా కలిసి సికింద్రాబాద్‌లోని ఎక్స్‌పో చాణక్యలో తమ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు పంచుకున్న విషయాలు..

హస్తకళలు, క్లీనింగ్ అండ్ హైజీన్ ప్రొడక్ట్స్, ఫొటోగ్రఫీ, హెల్త్‌కేర్ సర్వీసెస్, ఈవెంట్ ప్లానర్స్, స్నాక్స్ మేకర్స్, గిఫ్ట్ డీలర్స్, ఆర్కిటెక్ట్స్, ఇంటీరియర్ డిజైనర్లు.. ఇలా వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న యాభైమంది మహిళలు ఒకచోట చేరి జట్టుగా విజయాలు సాధిస్తున్నారు. తమతోటి వారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

జట్టుగా కృషిచేస్తే సమష్టి విజయం

ఆన్‌లైన్ నెట్‌వర్క్ జట్టు

ఒక ఫ్రెండ్ ద్వారా తెలిసి, రెండేళ్ల క్రితం ఈ గ్రూప్‌లో జాయిన్ అయ్యాను. రోజూ ఉదయం మేమంతా రెండు గంటల సేపు ఆన్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా కలుసుకుంటాం. ఎవరికైనా ఏదైనా సమాచారం అవసరం ఉంటే.. ఆ విషయాలను పంచుకుంటాం. వెబ్ డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్ చేసే స్టార్టప్‌ని రన్ చేస్తున్నాను. మా గ్రూప్‌లో ఎవరికైనా నా వర్క్ అవసరం ఉంటే వాళ్లు షేర్ చేస్తారు. నా వర్క్‌కి సంబంధించి ఏదైనా అవసరం ఉంటే, మా గ్రూప్ ఫ్రెండ్స్ నుంచి తీసుకుంటాను. ఏడాదికి ఒకసారి పెట్టే స్టాల్ ద్వారా నాకు ఏదైతే అవసరం ఉంటుందో దాని గురించి నా డెస్క్ వద్ద రాస్తాను. ఎవరికైనా ఆ స్కిల్ ఉంటే, వర్క్‌లో జాయిన్ కావచ్చు. వారి వద్ద ఏదైనా ఎక్విప్‌మెంట్ ఉంటే మాకు అందజేయవచ్చు. ఇంట్లో ఉండి చిన్న చిన్న బిజినెస్‌లు చేసుకునే గృహిణులు, బయటకు రావాలంటే ఇబ్బందిగా ఫీలయ్యేవారు.. ఈ వేదిక ద్వారా ప్రయోజనాలు పొందాలనుకున్నాం. శిక్షణాతరగతులు కూడా నిర్వహిస్తుంటాం. మహిళల వ్యాపార వృద్ధికి జట్టుగా చేసే కృషి ఎంతగానో ఉపయోగపడుతుంది.

– లక్ష్మీ మోపిదేవి, ముగ్ధా క్రియేటివ్స్, హైదరాబాద్



వ్యాపార విస్తరణకు సరైన మార్గం

వైష్ణో ఎంటర్‌ప్రైజెస్ పేరుతో హెల్తీ స్నాక్స్ తయారు చేస్తుంటాను. మిల్లెట్స్‌తో చేసే ఈ స్నాక్స్‌ని ఆర్డర్ మీద సప్లయ్ చేస్తుంటాను. నా వర్క్స్ గురించి ఈ గ్రూప్‌లోని స్నేహితులు స్టేటస్ పెడుతుంటారు. నేనూ వారి వర్క్స్‌ని స్టేటస్‌గా పెడుతుంటాను. దీని ద్వారా మా బంధుమిత్రులకు కూడా వారి వర్క్స్ చేరువవుతుంటాయి. మూడేళ్ల క్రితం ఈ విమెన్ గ్రూప్‌లో చేరాను. గ్రూప్ సభ్యులుగా వర్క్‌షాప్స్‌లో కలుస్తుంటాం. ఒకరికి ఒకరం సాయంగా ఉంటాం. మహిళలు ఒకరిగా కన్నా ఇలా సమష్టిగా కలిస్తే విజయాలు సులువుగా సాధించగలరు.

– శైలబాల, వైష్ణో ఎంటర్‌ప్రైజెస్, హైదరాబాద్





సృజనాత్మక పనికి చేయూత

నేను బడ్జెట్ ఫ్రెండ్లీ కస్టమైజ్డ్ గిఫ్ట్స్ తయారు చేస్తాను. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి చేసే నా గిఫ్ట్ ఐడియాస్‌లో ఫొటో ఫ్రేమ్స్, స్క్రాప్ బుక్స్, ఫొటో ఆల్బమ్స్, వెడ్డింగ్ ఈవెంట్‌కి కావల్సిన గిఫ్ట్ ఐటమ్స్ ఉంటాయి. రెండేళ్ల క్రితం ఈ మహిళా గ్రూప్‌లో స్నేహితుల ద్వారా జాయిన్ అయ్యాను. నా వర్క్‌ని నా గ్రూప్‌లో ఉన్నవారే ప్రమోట్ చేస్తుంటారు. నేనూ ఈ గ్రూప్‌లోని కొంతమంది సభ్యులతో కొలాబరేట్ అయ్యి నా బిజినెస్‌ను పెంచుకుంటున్నాను. ప్రతి యేటా జరిగే ఈ ఎక్స్‌పోలో నా స్టాల్ ఉంటుంది. దీని ద్వారా నా వర్క్ మరింతమందికి రీచ్ అవుతున్నందుకు ఆనందంగా ఉంది.

– నాగవాణి, హైదరాబాద్

కాంటాక్ట్స్ పెరిగాయి

ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్, వేణీ, రిటర్న్ గిఫ్ట్స్.. వంటివి తయారు చేస్తుంటాను. తెలిసిన వారి ద్వారా ఈ మహిళా గ్రూప్‌లో చేరాను. దీంతో నాకు కాంటాక్ట్స్ పెరిగాయి. మిగతావారితో కలిసి నా బిజినెస్‌ను ఎలా డెవలప్ చేసుకోవచ్చో తెలిసింది. లీడర్‌షిప్ క్వాలిటీస్ నేర్చుకున్నాను. వర్క్‌షాప్స్ కూడా నిర్వహించుకుంటాం. లోన్ మేళా, హెల్త్‌క్యాంప్స్ ఏర్పాటు చేస్తుంటాం.

– దుర్గ గరిమెళ్ళ, విపంచిక ట్రెండ్స్, హైదరాబాద్



– నిర్మలారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఆగస్టు 1న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	99,660	1,01,020	99,820	1,01,020	99,250	99,810
బంగారం (22 క్యారెట్లు)	92,440	91,500	91,500	94,240	91,310	91,500
వెండి	1,13,400	1,13,200	1,23,000	1,13,200	1,13,200	1,23,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● డైటరీ కాపర్

మెదడు పనితీరుకు మేలు

రాగి అనేది శరీరంలోని ప్రతి కణజాలంలో కనిపించే ఒక ముఖ్యమైన ట్రేస్ మినరల్. ఇతర ఖనిజాల మాదిరిగా, శరీరం దానిని స్వంతంగా తయారు చేసుకోదు; మనం తీసుకునే ఆహారం ద్వారానే లభిస్తుంది. అనేక ఇతర ముఖ్యమైన ఖనిజాలతో పోలిస్తే, ఎక్కువ రాగి అవసరం లేదు. అలాగని రాగి లోపిస్తే మాత్రం మెదడు పనితీరు మందగిస్తుంది. అందువల్ల రోజూ ఆహారంలో తగినంత కాపర్ ఉండేలా చూసుకుంటే మెదడు కణజాలం చురుగ్గా పని చేస్తుంది. దానిద్వారా జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. రాగి వివిధ న్యూరోహార్మోన్‌లను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది, జన్యు వ్యక్తీకరణను నియంత్రిస్తుంది. మెదడు అభివృద్ధికి మద్దతు ఇస్తుంది, పిగ్మెంటేషన్‌ను ప్రభావితం చేస్తుంది. రోగనిరోధక వ్యవస్థ పనితీరును నిర్వహిస్తుంది.



మెదడు ఆరోగ్యంలో...

మెదడు అభివృద్ధికి, దాని పనితీరుకు సరైన మొత్తంలో రాగి కూడా అవసరం. మానసిక స్థితి, ప్రేరణ, శ్రద్ధ, ఒత్తిడి ప్రతిస్పందనను నియంత్రించడం వంటి వివిధ మెదడు విధుల్లో రాగి ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

అధిక రాగి స్థాయిలు అల్జీమర్స్ వ్యాధికి కూడా దారితీస్తాయి. హిప్పోకాంపస్, సెరిబ్రల్ కార్టెక్స్ వంటి మెదడులోని ముఖ్యమైన ప్రాంతాలలో న్యూరాన్ల పనితీరును అధిక స్థాయిలో రాగి ప్రభావితం చేస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది జ్ఞాపకశక్తి, విమర్శనాత్మక ఆలోచన వంటి వాటికి ఉపకరిస్తుంది. రాగి అత్యధికంగా ఉండే ఆహారాలు ఆర్గాన్ మీట్స్, గుల్లలు, ఇతర సముద్ర ఆహారాలు, పౌల్ట్రీ, రెడ్ మీట్ వంటి జంతువుల నుండి తీసుకోబడిన ఉత్పత్తులు. మీరు డైటరీ కాపర్ కోసం జంతు ఉత్పత్తులను తినవలసిన అవసరం లేదు. అనేక మొక్కల ఆధారిత ఆహారాలు రాగికి సురక్షితమైన వనరులు.

మెదడు, ఎముకలు, కీళ్ళు, గుండె, ధమనులు, చర్మం, రోగనిరోధక వ్యవస్థ అంటే అనేక శారీరక ప్రక్రియలకు రాగి చాలా అవసరం కానీ అది లోపిస్తే ఎంత ఇబ్బందో, ఎక్కువ అయితే కూడా అంతటి హానికరం. అందువల్ల తగిన రాగి స్థాయిలను నిర్వహించడం శరీర ఆరోగ్యానికి అత్యవసరం.

మొక్కల ఆధారిత డైటరీ కాపర్

బంగాళదుంపలు, పుట్టగొడుగులు, జీడిపప్పు, పొద్దుతిరుగుడు విత్తనాలు, డార్క్ చాక్లెట్, టోఫు చిక్‌పీస్, చిరుధాన్యాలు, కాయధాన్యాలు, అవకాడో, టర్నిప్ గ్రీన్స్, పాలకూర.

● లైట్‌హౌస్ పేరెంటింగ్

ఒడ్డుకు చేర్చేలా మాత్రమే...



లైట్‌హౌస్ అనేది సముద్రంలోని ఓడలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు లైట్‌హౌస్ పేరెంటింగ్ పిల్లలకు ఒక దిశను చూపుతుంది. అదే సమయంలో పిల్లలు వారి సొంత మార్గాల్లో పయనించేలా చేస్తుంది. ఈ పేరెంటింగ్ విధానంతో పిల్లలు బాధ్యతాయుతంగా ఎదగ గలిగే అవకాశాలెన్నో ఉన్నట్లు నిపుణుల పరిశీలన. ఈ తరహా పేరెంటింగ్ పిల్లలు భవిష్యత్తులో బాధ్యతయుతంగా పెరగడానికి ఎలా దోహదపడుతుందో తెలుసుకుందాం.

లైట్‌హౌస్ పేరెంటింగ్ అంటే పిల్లలను సక్రమ మార్గంలో పెట్టడం. పిల్లలకు పూర్తిగా స్వేచ్ఛ ఇస్తూనే వారిని బాలెన్స్ చేయడం. ఈ వ్యూహాన్ని అమలు చేసే వారు తమ పిల్లలకు నిజాయితీగా మాట్లాడడానికి తగిన స్వేచ్ఛను ఇస్తారు. ఈ విధానంలో పిల్లలు తమకు ఏదైనా సాయం అవసరమైతే సంకోచించకుండా తల్లిదండ్రులను అడిగేలా పిల్లలను ప్రోత్సహిస్తుంది. తద్వారా పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

ప్రయోజనాలు ఏమిటి?

లైట్‌హౌస్ పేరెంటింగ్ ప్రాథమిక ప్రయోజనాల్లో ఒకటి.. పిల్లల ఆత్మగౌరవంపై సానుకూల ప్రభావం చూపడం.

ఆరోగ్యకరమైన హద్దులు

లైట్‌హౌస్ పేరెంట్స్ తమ పిల్లలకు సొంతంగా ఎంచుకునే స్వేచ్ఛను ఇస్తారు. కానీ, వారికి కొన్ని హద్దులను నిర్దేశిస్తారు. పిల్లలు తమ ఆత్మవిశ్వాసం, స్వాతంత్ర్యం వంటి ముఖ్యమైన జీవిత నైపుణ్యాలను నేర్చుకుంటారు. తల్లిదండ్రులు తమపై పూర్తి నమ్మకం ఉంచుతున్నారని తెలుసుకోవడం ద్వారా పిల్లల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను ఎదుర్కోవటానికి వారికి శక్తి వస్తుంది.

బలమైన బంధాన్ని ఏర్పరచుకోవడం

ఈ పేరెంటింగ్ విధానానికి కమ్యూనికేట్ చేయడం చాలా ముఖ్యం. పిల్లలు తమ తల్లిదండ్రులను విమర్శిస్తారనే భయం లేకుండా నిశ్చింతతో ఉన్నప్పుడు సంబంధాలు బలపడతాయి. వారు తమ తల్లిదండ్రులను సలహాదారులుగా భావిస్తే.. ఆత్మస్థైర్య భావం పెరుగుతుంది.



కోపింగ్ నైపుణ్యాలను పెంపొందించడం

ఈ పేరెంటింగ్ విధానం ప్రాథమికంగా పిల్లలు ఎదురుదెబ్బలను అనుభవించేలా చేస్తుంది. అవసరమైనప్పుడు సాయం కోసం అడగడంలో వారికి మద్దతునిస్తుంది. పిల్లలు తమ భావాలను, ఇబ్బందులను సొంతంగా అధిగమించగల సామర్థ్యాన్ని పొందుతారు. జీవితంలో ఎదురయ్యే పెద్ద సమస్యలను అధిగమించేందుకు ఈ పేరెంటింగ్ ఎంతో తోడ్పడుతుంది.

సవాళ్లు

లైట్ హౌస్ పేరెంటింగ్ విధానంతో అనేక ప్రయోజనాలను ఉన్నప్పటికీ, ఇది ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. తల్లిదండ్రులు తమ పిల్లల కష్టాలు ఎదుర్కొనే విషయంలో వెనుకడుగు వేయడం కష్టం. ఫెయిల్యూర్ అనేది నేర్చుకోవడంలో ఒక భాగమని తెలుసుకోవాలి. ఇందుకు చాలా సహనం అవసరం. పిల్లల ప్రత్యేక అవసరాలు, వారి పరిస్థితులపై ఆధారపడి కొంతమందికి మరింత ప్రత్యక్ష పర్యవేక్షణ అవసరం కావచ్చు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఎప్పుడు జోక్యం చేసుకోవాలి అనే దానిపై లైట్‌హౌస్ పేరెంటింగ్ ప్రాథమిక సూత్రాలను తప్పనిసరిగా పాటించాలి.

ఆచరణాత్మక చిట్కాలు

మీ పిల్లల వయస్సు ప్రకారం.. మీరు వారి విషయంలో జోక్యం చేసుకునే విషయంలో కొద్దిగా మార్పులు చేయండి. పెద్ద పిల్లలు వారికి వారే అర్థం చేసుకోగలరు.. కానీ, యువకులకు మరింత ప్రయోగాత్మక మార్గదర్శకత్వం అవసరం. స్పష్టమైన మార్గదర్శకాలను పాటిస్తూనే మీ పిల్లల పట్ల మీ ప్రేమను వ్యక్తపరచండి. ఇది చిన్నవారికి తమ అంచనాలను అర్థం చేసుకోనేలా చేస్తుంది. తద్వారా యువకులు తెలివిగా వ్యవహరించేందుకు వీలుంటుంది. మీ పిల్లలను ఎప్పుడూ మార్గనిర్దేశం చేస్తూ చురుకుగా ఉండాలి. ఫెయిల్యూర్ అనేది ఒక గొప్ప పాఠం అని పిల్లలు నమ్మేలా చేయండి. ఏ తప్పు జరిగింది. తర్వాత దానిని ఎలా మెరుగుపర్చుకోవాలి అనేది చర్చించండి. తప్పులు అనేవి జీవితం ఎదుగుదలలో భాగమని పిల్లలకు తెలిసేలా చెప్పడం అత్యవసరం.

లైఫ్@360

గుండెను వేగంగా నడిపించండి

బ్రిస్క్ వాకింగ్ గుండె ఆరోగ్యానికి మంచిది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది.

బ్రిస్క్ వాకింగ్ అంటే మీ సాధారణ నడక కంటే వేగంగా నడవడం. అంటే హృదయ స్పందన రేటును పెంచే వేగంతో నడవాలి. ఇది మితమైన తీవ్రత కలిగిన వ్యాయామం, అంటే నడుస్తున్నప్పుడు శ్వాస తీసుకోవడంలో కొంచెం ఇబ్బంది పడతారు, కానీ మాట్లాడగలరు.



బ్రిస్క్ వాకింగ్ ప్రయోజనాలు

● బ్రిస్క్ వాకింగ్ గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ● బరువు తగ్గడానికి సహాయపడుతుంది ● బ్రిస్క్ వాకింగ్ కేలరీలను కరిగించడానికి ఉపకరిస్తుంది. దీనిద్వారా ఇది బరువు తగ్గడానికి లేదా బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది. ● మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది ● బ్రిస్క్ వాకింగ్ ఒత్తిడి, ఆందోళన, నిరాశను తగ్గించడానికి సహాయపడుతుంది. ● ఎముకలు, కండరాలను బలోపేతం చేస్తుంది. ● బ్రిస్క్ వాకింగ్ ఎముకలు, కండరాలను బలంగా ఉంచడంలో సహాయపడుతుంది, ఇది ఎముకల సాంద్రతను పెంచడం ద్వారా బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుంది.● శక్తి స్థాయిలను పెంచడానికి, అలసటను తగ్గించడానికి సహాయపడుతుంది. ● జ్ఞాపకశక్తిని, నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది.

బ్రిస్క్‌వాకింగ్ ఎలా చేయాలి?

● మీ సాధారణ నడక వేగాన్ని పెంచండి. ● మీ చేతులను మీ వైపులా వదిలివేయండి, లేదా వాటిని కొద్దిగా వంచి, ముందుకు వెనుకకు ఊపండి. ● మీ నడకలో వేగం, దూరాన్ని పెంచండి. ● ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల బ్రిస్క్ వాకింగ్ చేయడానికి లక్ష్యంగా పెట్టుకోండి. ● బ్రిస్క్‌వాకింగ్ ప్రారంభించడానికి చిట్కాలు. ● మీకు నడవడం అలవాటు లేకపోతే, నెమ్మదిగా ప్రారంభించండి. ● క్రమంగా వేగాన్ని, దూరాన్ని పెంచండి. ● మీకు నచ్చిన ప్రదేశంలో నడవండి ఉదాహరణకు తోటల్లో లేదా బీచ్ వంటి ప్రదేశాలలో అన్నమాట.. దీనిని ఒక సామాజిక కార్యకలాపంగా మార్చడానికి స్నేహితులతో లేదా కుటుంబ సభ్యులతో కలిసి నడవండి.

ఆయుష్షా... ఆరోగ్యమా?



ఆయుష్షు.. ఆరోగ్యం.. ఈ రెండింటిలో మీ ఓటు దేనికి అంటే చెప్పలేం. ఎందుకంటే ఎంత ఆరోగ్యంగా ఉన్నా... ఆయుష్షు లేకపోతే ఏం లాభం? అదేవిధంగా ఎంత కాలం జీవించి ఉన్నా, ఆరోగ్యం లేకుండా ఎప్పుడూ మంచంలో పడి ఉంటే ప్రయోజనం ఏముంది?

అయితే జీవిత కాలానికి, ఆరోగ్య కాలానికీ తేడా ఏమిటని అడిగితే మాత్రం కచ్చితంగా చెప్పచ్చు... జీవిత కాలం అంటే మనం లేదా ఇతర జీవులు ఎంత కాలం పాటు గరిష్ఠంగా జీవించి ఉన్నారన్నది చెప్పడమే. అదే ఆరోగ్య కాలం అంటే మనం లేదా ఆయా జీవులు బతికిన కాలంలో ఎంత కాలం పాటు ఆరోగ్యంగా ఉన్నారో చెప్పడం. ఆయుష్షులోనూ, ఆరోగ్యంలోనూ జన్యువుల పాత్ర కీలకమైనప్పటికీ ఎవరికి వారు కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యం గా ఉండటం, అలా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా అధిక కాలం జీవించడం అనేది వారి చేతుల్లోనే ఉంటుంది. ఆయుఃప్రమాణం దేశాన్ని బట్టి మారుతుంటుంది. ఉదాహరణకు అమెరికాలో పురుషుల సగటు ఆయుఃప్రమాణం 75 ఏళ్లయితే స్త్రీలకు 80 సంవత్సరాలు.

ప్రతివారూ దీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా గడపాలంటే కొవ్వు స్థాయిలు తక్కువగా.. పోషకాలు, పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం, తేలికపాటి వ్యాయామాలు చేయడం, ఆరోగ్యకరమైన జీవన శైలి పాటించడం వంటి అలవాట్ల వల్ల జీవిత కాలం, ఆరోగ్య కాలం.. రెండూ సమతుల్యంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

సాక్షి సినిమా

● 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రకటన

తెలుగు చిత్రం మెరిసింది

● ఏడు అవార్డులతో తెలుగు సినిమా హవా
● 33 ఏళ్ల కెరీర్‌లో జాతీయ ఉత్తమ నటుడిగా షారుక్ ఖాన్‌కి తొలి అవార్డు
● ఉత్తమ నటుడి విభాగంలో హిందీ యువ నటుడు విక్రాంత్ మెస్సీకీ అవార్డు
● ఉత్తమ నటి రాణీ ముఖర్జీ
● ఉత్తమ చిత్రం 'ట్వెల్త్ ఫెయిల్'
● ఉత్తమ దర్శకుడు సుదీప్తో సేన్
● ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రం 'భగవంత్ కేసరి'

71వ జాతీయ సినీ అవార్డులను శుక్రవారం సాయంత్రం ఢిల్లీలో ప్రకటించారు. 2023లో జనవరి 1 నుంచి డిసెంబరు 31 వరకు సెన్సార్ అయిన సినిమాలను పరిగణనలోకి తీసుకుని, ఈ అవార్డులను ప్రకటించారు. అశుతోష్ గోవారీకర్ అధ్యక్షుడిగా, పదకొండు మంది సభ్యులతో కూడిన జ్యూరీ కమిటీ ఫీచర్ ఫిల్మ్ అవార్డుల విజేతలను నిర్ణయించింది. నాన్-ఫీచర్ ఫిల్మ్ విభాగంలో అవార్డుల విజేతలను ప్రకటించిన జ్యూరీకి పి. శేషాద్రి చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. అవార్డుల్లోని ప్రధాన విభాగాల్లో హిందీ సినిమా జోరు కనిపించింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి... ఇలాంటి ప్రధాన విభాగాల్లో నార్త్ సినిమా హవా కనిపించగా, టెక్నికల్ విభాగాల్లో దక్షిణాది సినిమాలకు అవార్డులు వచ్చాయి. కాగా తెలుగు చిత్రసీమ ఏకంగా ఏడు అవార్డులు దక్కించుకుని మెరిసింది.

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్‌కు తొలిసారి జాతీయ ఉత్తమ నటుడి అవార్డు రావడం విశేషం. మూడు దశాబ్దాలకు పైగా సక్సెస్‌ఫుల్ యాక్టర్‌గా రాణిస్తున్న షారుక్ ఖాన్‌కు తమిళ దర్శకుడు అట్లీ డైరెక్షన్‌లోని 'జవాన్' సినిమాతో తొలిసారి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు దక్కింది. ఉత్తమ నటుడి విభాగంలో మరో హిందీ నటుడు విక్రాంత్ మెస్సీకీ అవార్డు దక్కింది. ఐపీఎస్ ఆఫీసర్ మనోజ్ కుమార్ శర్మ జీవితం ఆధారంగా రూపొందిన స్ఫూర్తిదాయకమైన బయోగ్రాఫికల్ చిత్రం 'ట్వెల్త్ ఫెయిల్'లో హీరోగా నటించారు విక్రాంత్ మెస్సీ. విధు వినోద్ చోప్రా దర్శకత్వంలోని ఈ 'ట్వెల్త్ ఫెయిల్' ఉత్తమ చిత్రంగానూ అవార్డు కొల్లగొట్టింది. ఇక తన బిడ్డల కోసం ఓ తల్లి చేసిన అసాధారణ పోరాటం ఆధారంగా రూపొంది, ప్రేక్షకులను భావోద్వేగానికి గురి చేసిన 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' సినిమాలోని నటనకుగాను రాణీ ముఖర్జీకి ఉత్తమ నటి అవార్డు లభించింది. ఉత్తమ దర్శకుడి అవార్డు 'ది కేరళ స్టోరీ' సినిమాకు గాను సుదీప్తో సేన్‌కు దక్కింది. ఇక తెలుగు సినిమాకి దక్కిన అవార్డుల విషయాని కొస్తే...




2023 దసరాకి విడుదలై, మంచి విజయాన్ని సొంతం చేసుకున్న 'భగవంత్ కేసరి' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నిలిచింది. ఇక 2024 సంక్రాంతికి విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'హను-మాన్' సినిమాకు రెండు అవార్డులు దక్కాయి. ఏవీజీసీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్), బెస్ట్ యాక్షన్ డైరెక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ)లో అవార్డులు వచ్చాయి. 'హను-మాన్ (నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్, దర్శకుడు ప్రశాంత్ వర్మ, యానిమేటర్-వీఎఫ్‌ఎక్స్ సూపర్‌వైజర్ జెట్టి వెంకట్ కుమార్‌లు అవార్డులు అందుకుంటారు. అలాగే స్టంట్ కొరియోగ్రఫీకి సంబంధించి నందు, పృథ్వీ అవార్డులు అందుకుంటారు. 'బేబీ' సినిమాకు రెండు అవార్డులు వచ్చాయి. మంచి స్క్రీన్‌ప్లేను సమకూర్చి యువత పల్స్ పట్టుకున్న ఈ చిత్రదర్శకుడు సాయిరాజేశ్‌కు స్క్రీన్‌ప్లే రైటర్ (ఒరిజినల్)గా, ఇదే చిత్రంలోని 'ప్రేమిస్తున్నా...' పాటకు గాను ఉత్తమ నేపథ్య గాయకుడిగా పీవీఎస్‌ఎన్ రోహిత్‌కు అవార్డులు వచ్చాయి. జాతీయ వ్యాప్తంగా బాక్సాఫీస్‌ను షేక్ చేసిన 'యానిమల్' సినిమాకు ఆర్‌ఆర్ అందించిన హర్షవర్ధన్ రామేశ్వర్‌కు అవార్డు దక్కింది. ఇక ప్రేక్షకులకు విపరీతంగా నచ్చిన 'బలగం' సినిమాలోని 'ఊరు పల్లెటూరు..' పాటను రాసినందుకు గాను బెస్ట్ లిరిక్ రైటర్‌గా కాసర్ల శ్యామ్‌కు అవార్డు దక్కింది. ఉత్తమ బాలనటి విభాగంలో ముగ్గుర్ని విజేతలుగా ప్రకటించగా, వారిలో తెలుగు నుంచి ప్రముఖ దర్శక - నిర్మాత సుకుమార్ కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ఉన్నారు. 'గాంధీతాత చెట్టు' సినిమాకుగాను సుకృతికి అవార్డు లభించింది.

2023లో విడుదలైన సినిమాలకే అవార్డులను ప్రకటించారు. కానీ... 'హను-మాన్' సినిమా 2024లో విడుదలైంది కదా అనే సందేహం రావొచ్చు. కానీ ఈ సినిమాకు 2023లో సెన్సార్ పూర్తయింది. ఇంకా పలు విభాగాల్లో పలు భాషలకు చెందిన అవార్డులను జ్యూరీ ప్రకటించింది. ఆ అవార్డుల జాబితా ఈ విధంగా...

● ఉత్తమ నటుడు: **షారుక్ ఖాన్** - జవాన్ ● నటుడు: విక్రాంత్ మెస్సీ - 'ట్వెల్త్ ఫెయిల్' ● నటి: **రాణీ ముఖర్జీ** - మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే హిందీ చిత్రం ● సహాయ నటుడు: **విజయరాఘవన్** - 'పొక్కాలమ్' (మలయాళం); ముత్తుపెట్టయి సోము భాస్కర్ - 'పార్కింగ్' (తమిళ చిత్రం) ● సహాయ నటి: **ఊర్వశి** - ఉళ్లొళుక్కు (మలయాళ చిత్రం); ● జంకీ బోడివాల - 'వశ్ (గుజరాతీ చిత్రం) ● చైల్డ్ ఆర్టిస్ట్: **సుకృతి వేణి బండ్రెడ్డి** - (గాంధీ తాత చెట్టు ● కబీర్ ఖాందరి - జిప్సీ (మరాఠీ మూవీ) ● త్రిష తోసార్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగ్తాప్ - నాల్ 2 (మరాఠీ మూవీ) ● మేల్ ప్లేబ్యాక్ సింగర్: ప్రేమిస్తున్నా.. (పీవీఎన్ ఎస్ రోహిత్) - బేబీ మూవీ ● ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్: చెలియా.. (శిల్పరావు సింగర్) - జవాన్ ● సినిమాటోగ్రఫీ: ప్రసంతను మొహపాత్ర - ది కేరళ స్టోరీ ● ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత - బేబీ: సాయిరాజేశ్ నీలం ● పార్కింగ్: రాంకుమార్ బాలకృష్ణన్ ● డైలాగ్ రచయిత: దీపక్ కింగ్రాని: సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై ● తమిళ చిత్రం - పార్కింగ్ ● పంజాబీ చిత్రం - గొడ్డే గొడ్డే చా ● ఒడియా చిత్రం- పుష్కర ● మరాఠీ చిత్రం - శ్యాంచీ ఆయ్ ● మలయాళ చిత్రం - ఉళ్లొళుక్కు ● కన్నడ చిత్రం - కందిలు ● హిందీ చిత్రం: కాథల్ ● గుజరాతీ చిత్రం: వశ్ ● బెంగాలీ చిత్రం: డీప్ ఫ్రిడ్జ్ ● అస్సామీస్ చిత్రం: రొంగటపు 1982 ● యాక్షన్ డైరెక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ) - హనుమాన్, స్టంట్ కొరియోగ్రాఫర్: నందు, పృథ్వి ● స్పెషల్ మెన్షన్: యానిమల్ (రీ రికార్డింగ్ మిక్సర్) - ఎమ్ఆర్ రాజకృష్ణన్

భగవంత్ కేసరి



బాలకృష్ణ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'భగవంత్ కేసరి'. కాజల్ అగర్వాల్, శ్రీలీల, అర్జున్ రాంపాల్ ఇతర పాత్రలు పోషించారు. సాహు గారపాటి, హరీశ్ పెద్ది నిర్మించిన ఈ సినిమా 2023 అక్టోబర్ 19న విడుదలైంది.

'భగవంత్ కేసరి' కథేంటంటే...

నేలకొండ భగవంత్ కేసరి (బాలకృష్ణ) ఒక ఊచకోత కేసులో జైలు శిక్ష అనుభవిస్తుంటాడు. మంచితనంతో అక్కడి జైలర్‌కు (శరత్ కుమార్) దగ్గరవుతాడు. జైలర్ కుమార్తె విజయలక్ష్మి అలియాస్ విజ్జి పాప (శ్రీలీల)తో మంచి అనుబంధం ఏర్పడుతుంది భగవంత్ కేసరికి. విజ్జి పాపని ఆర్మీలో చేర్పాలనేది జైలర్ కల. అయితే అనూహ్య పరిస్థితుల్లో జైలర్ మరణించే క్రమంలో విజ్జి పాపని ఆర్మీలో చేర్పించమని భగవంత్ కేసరిని కోరతాడు. దీంతో ఆ పాప బాధ్యతల్ని భగవంత్ కేసరి తీసుకుంటాడు. ఆమెని ఓ సింహంలా తయారు చేసి, ఆర్మీలో జాయిన్ చేయాలని శిక్షణ ఇప్పిస్తుంటాడు. అయితే ఆర్మీలో చేరడం విజ్జి పాపకు ఇష్టం ఉండదు. కానీ, ఆ తర్వాత ఆమె పశ్చాత్తాపం చెంది, శిక్షణ తీసుకుంటుంది. పోలీసాఫీసర్ అయిన భగవంత్ కేసరి జైలుకు ఎందుకు వెళ్లాడు? విజ్జి పాప మిలిటరీలో జాయిన్ అయిందా? లేదా? కేసరిని ఇష్టపడిన సైకాలజిస్ట్ కాత్యాయని (కాజల్) భగవంత్‌కి చేసిన సాయం ఏంటి? ప్రాజెక్ట్ వి కోసం ప్రయత్నాలు చేస్తున్న బిలియనీర్ రాహుల్ సంఘ్వీతో (అర్జున్ రాంపాల్) భగవంత్ కేసరికి ఉన్న వైరం ఏంటి వంటి అంశాలు ఈ సినిమాలో ఆసక్తిగా అనిపిస్తాయి. అంతేకాదు.. అమ్మాయిలపై గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చెప్పిన అంశం ఈ సినిమా ప్రేక్షకులకు దగ్గర కావడానికి ప్రధాన కారణం.

'భగవంత్ కేసరి' ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికవడం గర్వంగా ఉంది. ఈ గౌరవం మా చిత్ర బృందానికి చెందుతుంది. నిర్మాతలు సాహు గారపాటి, హరీశ్ పెద్ది, ఈ కథను అద్భుతంగా ఆవిష్కరించిన దర్శకుడు అనిల్ రావిపూడి, నటీనటులు, సాంకేతిక నిపుణులు.. ఇలా అందరి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైంది. జాతీయ అవార్డుల జ్యూరీకి నా కృతజ్ఞతలు. ఈ గుర్తింపు మాకు మరింత స్ఫూర్తినిచ్చి, మరిన్ని శక్తిమంతమైన కథలను అందించాలన్న మా తపనను మరింత బలపరిచింది.
- బాలకృష్ణ, నటుడు

ట్వెల్త్ ఫెయిల్



ఐపీఎస్ అధికారి మనోజ్ కుమార్ శర్మ జీవితం ఆధారంగా 'ట్వెల్త్ ఫెయిల్' సినిమా తెరకెక్కింది. మధ్య ప్రదేశ్‌లోని చంబల్ లోయ ప్రాంతమైన మొర్యానాకి చెందిన మనోజ్ కుమార్ శర్మది నిరుపేద కుటుంబం. చదువులో మనోజ్ బిలో యావరేజ్ స్టూడెంట్. అయితే ఓసారి మనోజ్ చదువుతున్న స్కూల్ ప్రిన్సిపాల్ పరీక్షల్లో కాపీ కొట్టి పాస్ అవ్వమని స్టూడెంట్స్‌కు చెబుతాడు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ దుష్యంత్ ప్రిన్సిపాల్‌ను జైలుకు పంపుతాడు. నిజాయితీగా చదివి పాస్ కావడంలోనే అసలైన గెలుపు ఉందని, మనల్ని మనం మోసం చేసుకోకూడదని డీఎస్పీ దుష్యంత్ స్టూడెంట్స్‌కు చెబుతాడు. ఇక మనోజ్ ఏమో ట్వెల్త్ ఫెయిల్ అవుతాడు. కానీ దుష్యంత్ మాటలను స్ఫూర్తిగా తీసుకున్న మనోజ్ నిజాయితీగా చదివి ట్వెల్త్ పాస్ అవుతాడు. సివిల్స్‌వైపు అడుగులు వేస్తాడు. ఈ ప్రయత్నంలో ఎన్నో అవమానాలు, సవాళ్లు ఎదుర్కొంటాడు? రీ స్టార్ట్ అంటూ... ఫైనల్‌గా మనోజ్ ఎలా కష్టపడి ఐపీఎస్ ఆఫీసర్ అయ్యాడు? అన్నదే 'ట్వెల్త్ ఫెయిల్' సినిమా కథ.



'ది కేరళ స్టోరీ' సినిమాకు రెండు విభాగాల్లో (ఉత్తమ దర్శకుడు, సినిమాటోగ్రఫీ) అవార్డులు వచ్చాయి. అయితే ఈ సినిమాకు అవార్డులు రావడాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తప్పుపట్టారు. "మతపరమైన విభేదాలను రెచ్చగొట్టేలా, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసేలా తీసిన సినిమాకు గౌరవాన్ని కల్పించడం అనేది సంఘ్‌పరివార్ విభజనాత్మక సిద్ధాంతాలను పరోక్షంగా అవార్డు జ్యూరీ కమిటీ సమర్థించినట్లే. అలాగే మత సామరస్యానికి చిరునామా అయిన కేరళను అవమానించినట్లే. ఇది కేవలం మలయాళీలను మాత్రమే కాదు... ప్రజాస్వామ్యాన్ని నమ్మే ప్రతి ఒక్కరినీ బాధించే అంశం. రాజ్యాంగ విలువలను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ స్వరం విప్పాలి" అని 'ఎక్స్'లో పేర్కొన్నారు విజయన్.

'ది కేరళ...'కి అవార్డా?

ఏడు అవార్డులు రావడం సంతోషం



71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో తెలుగు పరిశ్రమకు ఏడు అవార్డులు రావడం సంతోషంగా ఉంది. ఉత్తమ తెలుగు చిత్రంగా 'భగవంత్ కేసరి' ఎంపికవడంపై బాలకృష్ణకి, తెలంగాణలోని పల్లె ఆప్యాయతను కళ్లకు కట్టినట్లు చూపిన 'బలగం'లోని పాటల్లో 'ఊరు.. పల్లెటూరు...' పాటకిగానూ జాతీయ అవార్డుకు ఎంపికైన కాసర్ల శ్యామ్‌కు అభినందనలు. 'బేబీ, హను-మాన్' చిత్రాలకు రెండేసి అవార్డులు రావడం, 'గాంధీ తాత చెట్టు' చిత్రానికి సుకృతి వేణి బాలనటిగా ఎంపికవడం అభినందనీయం. తెలుగు సినీ రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది. - సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



జాతీయ ఉత్తమ నటుడు అవార్డు రావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. ఈ క్షణాలను జీవితాంతం గుర్తు పెట్టుకుంటాను. ఈ అవార్డుకు నేను అర్హుడిని అని నమ్మిన జ్యూరీకి, కేంద్ర సమాచార, మంత్రిత్వ శాఖ.. ఇలా అందరికీ ధన్యవాదాలు. నన్ను నమ్మి, నాకు అవకాశం కల్పించిన అట్లీసార్ అండ్ టీమ్‌కి థ్యాంక్స్. అట్లీసార్ చెప్పినట్లు...మాస్!. సినిమాల కోసం నేను మరింత కష్టపడాలన్న దానికి ఈ అవార్డు ఓ రిమైండర్ వంటిది.
- షారుక్ ఖాన్, నటుడు



మా 'హను-మాన్'కి రెండు ప్రతిష్ఠాత్మక విభాగాలైన యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్‌లో అవార్డు వచ్చినందుకు మా వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్ వెంకట్ కుమార్ చిట్టికి అభినందనలు. అలాగే యాక్షన్ కొరియోగ్రఫీలో నందు, పృథ్వీ మాస్టర్లకు ఈ అవార్డు వచ్చింది.. వారికీ అభినందనలు. మా నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ నా తరఫున చాలా థ్యాంక్స్. మా సినిమాకి ఈ గుర్తింపు ఇచ్చిన జ్యూరీ సభ్యులకు మా యూనిట్ తరఫున ధన్యవాదాలు.
-ప్రశాంత్ వర్మ, డైరెక్టర్



మా 'బేబీ' బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ మేల్ సింగర్ విభాగాల్లో రెండు అవార్డులకి ఎంపికవడం సంతోషంగా ఉంది. ఇది నా కెరీర్‌లో గేమ్ చేంజింగ్ మూమెంట్ అనుకోవచ్చు. ముఖ్యంగా స్క్రీన్‌ప్లేకి అవార్డు రావడం అనేది చాలా పెద్ద విషయం. నేను ఒక్కటే చెబుతాను. ఎస్‌కేఎన్ నమ్మకపోతే ఇది జరిగేది కాదు. చిన్న సినిమాలు తీసుకునే నన్ను నమ్మి 'బేబీ' సినిమా నిర్మించి, నాకు ఈ గౌరవం తీసుకొచ్చినందుకు థ్యాంక్స్.. అలాగే నా టీమ్‌కి కూడా అభినందనలు. మా సింగర్ పీవీఎన్ఎస్ రోహిత్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. నా సినిమాతో తనకు పెద్ద బ్రేక్ రావడం గర్వంగా ఉంది. - సాయి రాజేశ్, డైరెక్టర్



జాతీయ అవార్డు సాధిస్తాననుకోలేదు. నాకు అవార్డు వచ్చిన విషయం తెలిసి దర్శకుడు సందీప్‌గారు హ్యాపీ ఫీలయ్యారు. 'యానిమల్' సినిమా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం లాక్‌డౌన్ సమయంలో ఎంతో కష్టపడ్డాం. మనకు దక్షిణాదిలోనే చాలా పోటీ ఉంటుంది. అలాంటిది ఉత్తరాది వెళ్లి, అవార్డు అందుకోవడం అనేది దేవుడి దయ, కొంచెం అదృష్టం, నా కష్టం... ఇవన్నీ కలిసి నా కల నిజమైనట్లుగా ఉంది. 'అర్జున్‌రెడ్డి' సినిమా నుంచి సందీప్‌రెడ్డిగారితో నా జర్నీ మొదలైంది. ప్రస్తుతం ప్రభాస్‌గారి 'స్పిరిట్' సినిమా చేస్తున్నాం.
- హర్షవర్ధన్ రామేశ్వర్, సంగీత దర్శకుడు



రెండోసారి జాతీయ అవార్డు వచ్చినందుకు హ్యాపీగా ఉంది (గతంలో 'సూరరై పోట్రు'కు వచ్చింది). 'వాత్తి' (తెలుగులో 'సార్'గా విడుదలైంది) సినిమాకిగాను ఉత్తమ సంగీత దర్శకుడిగా అవార్డు రావడం సంతోషంగా ఉంది. ఈ సినిమాకు నన్ను ఎంచుకున్న హీరో ధనుష్‌కి ధన్యవాదాలు. నన్ను నమ్మి ప్రోత్సహించిన దర్శకుడు వెంకీ అట్లూరి, నాగవంశీ, త్రివిక్రమ్‌గార్లతో పాటు టీమ్ అందరికీ థ్యాంక్స్.
- జీవీ ప్రకాశ్, సంగీత దర్శకుడు

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
586	203
80,600	24,565

విదేశీ సూచీలు

నాస్‌డాక్	20,613	▽	509
డోజోన్స్	43,500	▽	631
ఎఫ్‌టీఎస్ఈ 100	9,066	▽	67
డాక్స్	23,473	▽	593
షాంఘై	3,560	▽	13
నికాయ్	40,800	▽	270

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	86.95	87.97
£	బ్రిటన్ పౌండ్	115.00	117.99
€	యూరో	98.49	101.24
¥	జపాన్ యెన్ (100)	57.34	58.79
AU$	ఆస్ట్రేలియా డాలర్	55.18	57.42
S$	సింగపూర్ డాలర్	65.40	68.79
SAR	సౌదీ రియాల్	22.47	23.96
UAE D	యూఏఈ దిర్హామ్	22.94	24.19
¥	చైనా యువాన్	11.26	13.09

యూపీఐ సరికొత్త రికార్డ్

- జూలైలో 1947 కోట్ల లావాదేవీలు
- విలువ రూ.25.08 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు జూలైలో సరికొత్త రికార్డులకు చేరాయి. 19.47 బిలియన్ లావాదేవీలు (1947 కోట్లు) నమోదైనట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకటించింది. వీటి విలువ రూ.25.08 లక్షల కోట్లుగా ఉంది. క్రితం ఏడాది జూలైలో యూపీఐ లావాదేవీల విలువ రూ.20.64 కోట్లతో పోల్చిచే 20 శాతానికి పైగా పెరిగింది. ఈ ఏడాది మే నెలలో నమోదైన 18.67 బిలియన్ లావాదేవీలు (విలువ రూ.25.14 లక్షల కోట్లు) ఇంతకుముందు వరకు గరిష్ట రికార్డుగా ఉంది. దేశంలోని మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ లావాదేవీలు 85 శాతంగా ఉన్నాయి. యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్ దేశాల్లోనూ యూపీఐ అందుబాటులోకి రావడం గమనార్హం.

యూపీఐపై కొత్త పరిమితులు

యూపీఐ నెట్‌వర్క్‌పై రద్దీని తగ్గించేందుకు వీలుగా ఎన్‌పీసీఐ కొన్ని పరిమితులను తీసుకొచ్చింది. బ్యాంక్ ఖాతాలోఎంత బ్యాలన్స్ ఉందన్నది రోజులో 50 సార్ల వరకే పరిశీలించుకోగలరు. ఇంతకుముందు ఈ విషయంలో ఎలాంటి పరిమితి లేదు. యూపీఐ లింక్డ్ అకౌంట్లను సైతం 25 సార్లే చూసుకోగలరు. ఒక మొబైల్ నంబర్‌కు లింక్ అయి, 12 నెలలకు పైగా ఇనాక్టివ్‌గా ఉన్న (కార్యకలాపాలు లేని) యూపీఐ ఐడీలు ఇక పనిచేయవు.

ఐటీసీ లాభం రూ. 5,343 కోట్లు

క్యూ1 ఆదాయం రూ. 23,129 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో రూ. 5,343 కోట్లకుపైగా నికర లాభం ప్రకటించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 5,172 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 23,129 కోట్లకు చేరగా.. గత క్యూ1లో రూ. 19,350 కోట్ల టర్నోవర్ నమోదైంది. మొత్తం వ్యయాలు రూ. 16,752 కోట్లను దాటాయి. ఇతర ఆదాయంతో కలిసి మొత్త టర్నోవర్ రూ. 23,812 కోట్లకు చేరింది. దీనిలో సిగరెట్లుసహా ఎఫ్ఎంసీజీ బిజినెస్ నుంచి రూ. 15,354 కోట్లు లభించింది. సిగరెట్ల అమ్మకాలు రూ. 9,554 కోట్లను తాకగా.. ఇతర ఎఫ్ఎంసీజీ ఆదాయం రూ. 5,800 కోట్లను అధిగమించింది. ఈ బాటలో అగ్రి విభాగం నుంచి రూ. 9,724 కోట్లు, పేపర్ బోర్డులు, ప్యాకేజింగ్ నుంచి రూ. 2,117 కోట్లు చొప్పున అందుకుంది. ఐటీ సర్వీసులు, ఐటీసీ గ్రాండ్ సెంట్రల్ హోటల్(ముంబై), ఫుడ్‌టెక్ నుంచి రూ. 1,183 కోట్లమేర ఇతర ఆదాయం సాధించింది.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు 1.1 శాతం లాభంతో రూ. 417 వద్ద ముగిసింది.

జీఎస్‌టీ @ 1.96 లక్షల కోట్లు

- జూలైలో 7.5 శాతం అధిక వసూళ్లు
- 66 శాతం పెరిగిన రిఫండ్‌లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు జూలై నెలలో రూ.1.96 లక్షల కోట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూసినప్పుడు 7.5 శాతం అధిక ఆదాయం వసూలైంది. క్రితం ఏడాది ఇదే నెలలో రూ.1.82 లక్షల కోట్ల జీఎస్‌టీ ఆదాయం నమోదైంది. ఇక ఈ ఏడాది జూన్‌లో ఆదాయం రూ.1.84 లక్షల కోట్లతో పోల్చి చూసినా మంచి వృద్ధి కనిపించింది. దేశీ అమ్మకాల ద్వారా రూ.1.43 లక్షల కోట్లు, దిగుమతులపై పన్ను రూపంలో రూ.52,712 కోట్లు వసూలైంది. జీఎస్‌టీ రిఫండ్‌లు 66.8 శాతం పెరిగి రూ.27,147 కోట్లకు చేరాయి. అంతర్జాతీయంగా ఒత్తిళ్లు నెలకొన్నప్పటికీ మొత్తం మీద స్థిరమైన వినియోగాన్ని, ఆర్థిక వ్యవస్థలో నిలకడైన వృద్ధిని ఈ గణాంకాలు సూచిస్తున్నట్టు ఈవై ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ తెలిపారు. జూలైలో రిఫండ్‌లు 2024 సంవత్సరం ఇదే నెలతో పోల్చి చూస్తే రెట్టింపైనట్టు డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎస్ఎం మణి తెలిపారు. గత నెలలో వసూళ్లు స్తబ్దుగా ఉన్న నేపథ్యంలో ఆదాయాన్ని పెంచుకునే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై వచ్చే జీఎస్‌టీ కౌన్సిల్‌లో చర్చించే అవకాశం ఉందని పరిశీలకులు చెబుతున్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

టారిఫ్‌ల భారం.. సగమే!	భారత వృద్ధి అంచనాలకు ఫిచ్ కోత

భారత్‌లో యాపిల్‌కు రికార్డు స్థాయిలో ఆదాయం



న్యూఢిల్లీ: జూన్ త్రైమాసికంలో భారత్ సహా ఇరవై నాలుగు మార్కెట్లలో రికార్డు స్థాయిలో ఆదాయాలు సాధించినట్లు అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ సీఈవో టిమ్ కుక్ తెలిపారు. ఐఫోన్లు, మ్యాక్, సర్వీసులు మొదలైన విభాగాలు ఇందుకు దోహదపడినట్లు చెప్పారు. ప్రతి ప్రాంతంలోనూ ఐఫోన్ల విక్రయాలు పెరిగాయని, భారత్‌తో పాటు దక్షిణాసియా, బ్రెజిల్‌లాంటి వర్ధమాన మార్కెట్లలో రెండంకెల స్థాయి వృద్ధి నమోదైందని ఆయన వివరించారు. మరోవైపు, అమెరికా టారిఫ్‌ల అంశం తీసుకుంటే 800 మిలియన్ డాలర్ల మేర ప్రతికూల ప్రభావం పడిందన్నారు. కొత్త టారిఫ్‌లేమీ లేకపోతే సెప్టెంబర్ త్రైమాసికంలో ఇది 1.1 బిలియన్ డాలర్లకు చేరొచ్చని కుక్ వివరించారు. జూన్ త్రైమాసికంలో యాపిల్ ఆదాయం 10 శాతం పెరిగి 94.04 బిలియన్ డాలర్లకు, లాభం 9.2 శాతం పెరిగి రూ. 23.42 బిలియన్ డాలర్లకు చేరింది.

రూపాయికే బీఎస్ఎన్ఎల్ 4జీ ప్లాన్

నెల రోజుల వేలిడిటీ



న్యూఢిల్లీ: మరింత మంది కస్టమర్లను ఆకర్షించే దిశగా ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ తాజాగా రూ. 1కే 4జీ సర్వీస్ ప్లాన్‌ను ప్రకటించింది. దీనికి ఒక నెల వేలిడిటీ ఉంటుంది. యూజర్లు నెల రోజులపాటు తమ 4జీ మొబైల్ సేవలను పరిశీలించేందుకు వీలుగా, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా, ఫ్రీడం ప్లాన్ కింద పరిమిత కాలవ్యవధికి ఈ ఆఫర్ అందిస్తున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. దీనితో పూర్తి దేశీ టెక్నాలజీని యూజర్లు పరీక్షించవచ్చని కంపెనీ సీఎండీ ఎ. రాబర్ట్ జె రవి తెలిపారు. ఈ ప్లాన్‌లో అపరిమిత వాయిస్ కాల్స్ (లోకల్, ఎస్‌టీడీ), రోజుకు 2జీబీ హై-స్పీడ్ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, ఉచిత సిమ్‌లాంటివి పొందవచ్చు. పోటీ సంస్థలైన జియో, భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా ఇదే తరహా ప్రీపెయిడ్ ప్లాన్‌ను వరుసగా రూ. 349, రూ. 379, రూ. 399కి అందిస్తున్నాయి. బీఎస్ఎన్ఎల్ 4జీ సర్వీస్ మాత్రమే అందించనుండగా, ప్రైవేట్ సంస్థలు అపరిమిత 5జీ సర్వీసులు, ఎలాంటి అదనపు చార్జీ లేకుండా కొన్ని ఎంటర్‌టైన్‌మెంట్ యాప్‌లకు కూడా యాక్సెస్ అందిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

వాహన విక్రయాలు.. స్లోడౌన్

- జూలైలోనూ డిమాండ్ అంతంతే
- స్వల్పంగా పెరిగిన మారుతీ



ముంబై: దేశీయంగా డిమాండ్ స్తబ్దత కొనసాగడంతో జూలైలోనూ వాహన విక్రయాలు నెమ్మదించాయి. దిగ్గజ ఆటో కంపెనీలైన మారుతీ సుజుకీ విక్రయాలు స్వల్పంగా పెరగ్గా.., హ్యుందాయ్ మోటార్ అమ్మకాలు తగ్గాయి. మహీంద్రాఅండ్‌మహీంద్రా, కియా ఇండియా విక్రయాల్లో రెండంకెలు, ఒక అంకె వృద్ధి నమోదు చేశాయి. మారుతీ సుజుకీ దేశీయంగా జూలైలో 1,37,776 ప్యాసింజర్ వాహనాలు విక్రయించింది. గత ఏడాది జూలైలో అమ్ముడైన 1,37,463 వాహనాలతో పోలిస్తే స్వల్పంగా 0.22% ఎక్కువ. చిన్న కార్ల విభాగంలో ఆల్టో, ఎస్–ప్రెస్సో విక్రయాలు 9,960 నుంచి 6,822 యూనిట్లకు తగ్గాయి.

- హ్యుందాయ్ మోటార్ ఇండియా దేశీయ అమ్మకాలు 10% క్షీణించి 43,973 యూనిట్లకు వచ్చి చేరింది. 'వాహన పరిశ్రమ గత కొన్ని నెలలుగా డిమాండ్ లేమి పరిస్థితిని ఎదుర్కొంటోంది. పండుగ సీజన్‌పై ఆశావహంగా ఉన్నాం. పూర్తి స్థాయి సరఫరా, నూతన ఉత్పత్తులతో సిద్ధంగా ఉన్నాం' అని హ్యుందాయ్ సీఓఓ తరుణ్ గార్గ్ తెలిపారు
- మహీంద్రా యుటిలిటీ వాహన సేల్స్ 20% వృద్ధితో 49,871 యూనిట్లుగా నమోదైంది.

జూలైలో సేల్స్ ఇలా... (ఎగుమతులతో కలిపి)

కంపెనీ	2025	2024	వృద్ధి/క్షీణత (%)
మారుతీ	1,80,526	1,75,041	3
హ్యుందాయ్	60,073	64,563	(-)7
ఎంఅండ్ఎం	83,691	66,444	26
టాటా మోటార్స్	69,131	71,996	(-)4
టయోటా కిర్లోస్కర్	32,575	31,656	3
కియా ఇండియా	22,135	20,507	8
ఎంజీ మోటార్స్	6,678	4,575	46
హోండా కార్స్	7,524	7,334	3
టూవీలర్స్			
హెచ్ఎంఎస్ఐ	5,15,378	4,83,100	7
హీరోమోటోకార్ప్	4,49,755	3,07,274	21
టీవీఎస్ మోటార్స్	4,56,350	3,54,140	29
బజాజ్ ఆటో	3,66,000	3,54,169	3
సుజుకీ	1,13,600	1,16,714	(-3)
రాయల్ ఎన్‌ఫీల్డ్	88,045	67,265	31

కొనసాగిన టారిఫ్ ఎఫెక్ట్

- సూచీలు రెండో రోజూ డీలా
- 81 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీ 203 పాయింట్లు డౌన్
- ఫార్మా, మెటల్ షేర్లలో విక్రయాలు



ముంబై: ట్రంప్ సుంకాల విధింపు ఆందోళనలతో స్టాక్ సూచీలు రెండో రోజూ డీలాపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్ల తిరోగమనం, అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు ఒత్తిడిని మరింత పెంచాయి. ముఖ్యంగా ఫార్మా, మెటల్, ఐటీ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 586 పాయింట్లు క్షీణించి 80,600 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 203 పాయింట్లు కోల్పోయి 24,565 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 690 పాయింట్లు క్షీణించి 80,495 వద్ద, నిఫ్టీ 233 పాయింట్లు పతనమై 24,535 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. ట్రంప్ దాదాపు 70 దేశాలపై సుంకాలు పెంచుతున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకం చేయడంతో ఆసియా మార్కెట్లు 2%, యూరోపియన్ సూచీలు 3% వరకు పతనయ్యాయి. అమెరికా స్టాక్ సూచీలు భారీ నష్టాలతో ట్రేడవుతున్నాయి.

- ఎఫ్ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లూ నష్టాలు చవి చూశాయి. బీఎస్ఈ ఇండెక్సుల్లో ఫార్మా, టెలీ కమ్యూనికేషన్ 2.5%, మెటల్, చమురు, టెక్, రియల్టీ 2% చొప్పున పతనమయ్యాయి. స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1.59%, 1.37% పడ్డాయి.
- ఎండీ, సీఈఓ గిరీశ్ కౌస్గీ రాజీనామా, బోర్డు ఆమోదంతో పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ షేరు 18% క్షీణించి రూ.808 వద్ద స్థిరపడింది.
- మనీలాండరింగ్ కేసులో ఆగస్టు 5న విచారణకు హాజరు కావాలంటూ రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేయడంతో రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ షేర్లు లోయర్ సర్క్యూట్ తాకాయి. రిలయన్స్ పవర్ 5 శాతం క్షీణించి రూ. 50.21 వద్ద, రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ 5 శాతం పతనమై రూ.311 వద్ద లోయర్ సర్క్యూట్ తాకి అక్కడే ముగిశాయి.

శాంతి గోల్డ్ లిస్టింగ్ జిగేల్..

నష్టాల మార్కెట్లోనూ, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ లిస్టింగ్ మెప్పించింది. ఇష్యూ ధర(రూ.199)తో పోలిస్తే బీఎస్ఈలో 15% ప్రీమియంతో రూ.229 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 20% ఎగసి రూ.238 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 15% లాభంతో లిస్టింగ్ ధర(రూ.229) వద్దే ముగిసింది.



గ్రాహం థోర్ప్‌కు నివాళిగా...

మాజీ క్రికెటర్ గ్రాహం థోర్ప్ స్మరణార్థం ఇంగ్లండ్ ఆటగాళ్లు 'ఎ డే ఫర్ థోర్పీ' పేరుతో నివాళి అర్పించారు. ఆటగాడిగా ఉన్నప్పుడు తలకు హెడ్‌బ్యాండ్ ధరించి బ్యాటింగ్‌కు వచ్చే థోర్ప్‌ను గుర్తు చేసుకుంటూ...ఇంగ్లండ్ క్రికెటర్లు మ్యాచ్ రెండో రోజు అదే తరహా తెలుపు హెడ్‌బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు. థోర్ప్ సొంత మైదానమైన ఓవల్ గ్రౌండ్‌లోనే టెస్టు జరుగుతున్న నేపథ్యంలో అతని భార్య, కూతురు ఆటకు ముందు గంట మోగించారు. మ్యాచ్ సందర్భంగా ప్రత్యేకంగా నిధుల సేకరణ కూడా జరిగింది. శుక్రవారం థోర్ప్ పుట్టిన రోజు కాగా...ఏడాది క్రితం 55 ఏళ్ల వయసులో అతను చనిపోయాడు. ఇంగ్లండ్ తరఫున 100 టెస్టులు ఆడిన థోర్ప్ 44.66 సగటుతో 6744 పరుగులు చేశాడు. ఇందులో 16 సెంచరీలు, 39 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 82 వన్డేల్లో 37.18 సగటుతో 2380 పరుగులు సాధించాడు.

ఆటను శాసించిన బౌలర్లు


సిరాజ్

రెండో రోజు 15 వికెట్ల పతనం

- భారత్ 224 ఆలౌట్
- ఇంగ్లండ్ 247 ఆలౌట్
- చెరో 4 వికెట్లు తీసిన సిరాజ్, ప్రసిధ్
- భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 75/2

లండన్: అండర్సన్–టెండూల్కర్ ట్రోఫీలో ఆఖరి టెస్టు రసకందాయంగా జరుగుతోంది. రెండో రోజును ఇరు జట్ల బౌలర్లు శాసించారు. దీంతో ఒక్క రోజే 15 వికెట్లు నేలకూలాయి. ముందుగా భారత్ తొలి ఇన్నింగ్స్ ఇలా మొదలవగానే అలా 224 పరుగుల వద్ద ముగిసింది. మరోవైపు జోరుగా మొదలైన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ అంతే జోరుగా కుప్పకూలింది. 92 పరుగుల వరకు వికెట్ కోల్పోని ఆతిథ్య జట్టు 247 పరుగులకే ఆలౌటైంది. కేవలం 23 పరుగుల ఆధిక్యమే లభించగా... అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ ఆట నిలిచే సమయానికి 18 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. రాహుల్ (7), సాయి సుదర్శన్ (11) వెనుదిరగ్గా... యశస్వి జైస్వాల్ (49 బంతుల్లో 51 బ్యాటింగ్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంగా ఆడి అజేయ అర్ధ శతకంతో నిలిచాడు. జైస్వాల్‌తో ఆకాశ్‌దీప్ (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. జైస్వాల్ ఇచ్చిన రెండు క్యాచ్‌లు ఇంగ్లండ్ ఫీల్డర్లు వదిలేయడం కలిసొచ్చింది. ప్రస్తుతం టీమిండియా 52 పరుగుల ఆధిక్యంలో ఉంది.

34 బంతుల్లోనే ముగిసె...

రెండో రోజు ఆట మొదలైన కొద్దిసేపటికే భారత్ ఆలౌటైంది. 204/6 ఓవర్‌నైట్ స్కోరుతో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ మిగిలిన నాలుగు వికెట్లను తొలి అర గంటలోనే కోల్పోయింది. మూడో ఓవర్లోనే ఓవర్‌నైట్ స్పెషలిస్ట్ బ్యాటర్ కరుణ్ నాయర్‌ను (109 బంతుల్లో 57; 8 ఫోర్లు) టంగ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీంతో 218 పరుగుల వద్ద ఏడో వికెట్ పడింది. ఆ తర్వాత 6 పరుగుల వ్యవధిలోనే అట్కిన్సన్... వాషింగ్టన్ సుందర్ (55 బంతుల్లో 26; 3 ఫోర్లు), సిరాజ్ (0), ప్రసిధ్ కృష్ణ (0) వికెట్లను పడగొట్టాడు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్ 69.4 ఓవర్లలో 224 వద్ద ముగిసింది. రెండో రోజు భారత్ కేవలం 20 పరుగులే చేయగలిగింది. అట్కిన్సన్‌కు ఐదు వికెట్లు దక్కాయి.

ఓపెనింగ్ జోరులో...

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ దూకుడుగా మొదలైంది. క్రాలీ, డకెట్ పేసర్లపై బౌండరీలతో విరుచుకుపడ్డారు. సిరాజ్ మూడో ఓవర్లో క్రాలీ 2 ఫోర్లు కొడితే... ఆకాశ్‌దీప్ ఓవర్లో డకెట్ మూడు ఫోర్లు బాదాడు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ ఇలా ఎవరిని విడిచిపెట్టకుండా యథేచ్ఛగా ఆడేశారు. బౌండరీలు, సిక్స్‌లతో వన్డేను తలపించే 'పవర్ ప్లే'లా సాగిన ఓపెనింగ్ జోరుతో ఇంగ్లండ్ 12 ఓవర్లలోనే 92 పరుగులు చేసింది. ఈ దూకుడుకు మరుసటి ఓవర్లో డకెట్ (38 బంతుల్లో 43; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు)ను అవుట్ చేయడం ద్వారా ఆకాశ్‌దీప్ బ్రేకులేశాడు. 15వ ఓవర్లో ఇంగ్లండ్ వందకు చేరగా, క్రాలీ 42 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. 109/1 స్కోరు వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లారు.


ప్రసిధ్


జైస్వాల్

రెండో సెషన్‌లో బౌలర్ల హవా

ఆ తర్వాత కూడా బజ్‌బాల్ ఆట ఆడిన క్రాలీని ప్రసిధ్‌కృష్ణ పెవిలియన్ చేర్చాడు. ఇక్కడి నుంచి బౌలింగ్ ప్రతాపం మొదలైంది. సిరాజ్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో విలువైన వికెట్లను పడేశాడు. పోప్ (22; 4 ఫోర్లు), జో రూట్ (29; 6 ఫోర్లు), బెథెల్ (6)లను వరుస విరామాల్లో సిరాజ్ అవుట్ చేయడంతో 196 పరుగుల వద్ద 5 వికెట్లను కోల్పోయింది. జట్టు స్కోరు 200 దాటాక స్మిత్ (8), ఓవర్టన్ (0)లను ప్రసిధ్ కృష్ణ పెవిలియన్ చేర్చాడు. 215/7 స్కోరు వద్ద రెండో సెషన్ ముగిసింది. టెయిలెండర్ల అండతో 57 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన బ్రూక్‌ను సిరాజ్ బౌల్డ్ చేశాడు. తొలి రోజు ఫీల్డింగ్‌లో భుజానికి గాయమైన వోక్స్ ఈ మ్యాచ్‌కు పూర్తిగా దూరమయ్యాడు. దాంతో 9 వికెట్లకే ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టుకు 23 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది.

జట్టునుంచి బుమ్రా విడుదల


ఐదో టెస్టుకు దూరమైన పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాను బీసీసీఐ జట్టు నుంచి విడుదల చేసింది. దీని వల్ల అతను ఈ టెస్టు జరిగే సమయంలో టీమ్‌తో పాటు ఉండాల్సిన అవసరం లేదు. ఈ సిరీస్‌లో ముందుగా అనుకున్నట్లుగానే 3 టెస్టులే ఆడిన బుమ్రా 14 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లండ్ పర్యటన ముగిసిన తర్వాత వచ్చే నెలలో భారత్ ఆసియా కప్ టి20 టోర్నీ ఆడనుంది. బుమ్రా ఇందులో ఆడతాడా లేదా అనే విషయంపై సెలక్టర్లు తర్వాత నిర్ణయం తీసుకుంటారు.

స్కోరు వివరాలు

భారత్ తొలిఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అట్కిన్సన్ 2; రాహుల్ (బి) వోక్స్ 14; సుదర్శన్ (సి) స్మిత్ (బి) టంగ్ 38; గిల్ రనౌట్ 21; కరుణ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) టంగ్ 57; జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 9; జురేల్ (సి) బ్రూక్ (బి) అట్కిన్సన్ 19; సుందర్ (సి) ఓవర్టన్ (బి) అట్కిన్సన్ 26; ఆకాశ్‌దీప్ నాటౌట్ 0; సిరాజ్ (బి) అట్కిన్సన్ 0; ప్రసిధ్‌కృష్ణ (సి) స్మిత్ (బి) అట్కిన్సన్ 0; ఎక్స్‌ట్రాలు 38; మొత్తం (69.4 ఓవర్లలో ఆలౌట్) 224. **వికెట్ల పతనం:** 1–10, 2–38, 3–83, 4–101, 5–123, 6–153, 7–218, 8–220, 9–224, 10–224. **బౌలింగ్:** వోక్స్ 14–1–46–1, అట్కిన్సన్ 21.4–8–33–5, టంగ్ 16–4–57–3, ఓవర్టన్ 16–0–66–0, బెథెల్ 2–1–4–0. **ఇంగ్లండ్ తొలిఇన్నింగ్స్:** క్రాలీ (సి) జడేజా (బి) ప్రసిధ్ 64, డకెట్ (సి) జురేల్ (బి) ఆకాశ్‌దీప్ 43; ఒలీ పోప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 22; రూట్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 29; బ్రూక్ (బి) సిరాజ్ 53; బెథెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 6; స్మిత్ (సి) రాహుల్ (బి) ప్రసిధ్ 8; ఓవర్టన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ప్రసిధ్ 0; అట్కిన్సన్ (సి) ఆకాశ్‌దీప్ (బి) ప్రసిధ్ 11; టంగ్ నాటౌట్ 0; వోక్స్ అబ్సెంట్ హర్ట్; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (51.2 ఓవర్లలో ఆలౌట్) 247. వికెట్ల పతనం:** 1–92, 2–129, 3–142, 4–175, 5–195, 6–215, 7–215, 8–235, 9–247. **బౌలింగ్:** సిరాజ్ 16.2–1–86–4, ఆకాశ్‌దీప్ 17–0–80–1, ప్రసిధ్‌కృష్ణ 16–1–62–4, జడేజా 2–0–11–0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ బ్యాటింగ్ 51; రాహుల్ (సి) రూట్ (బి) టంగ్ 7; సుదర్శన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అట్కిన్సన్ 11; ఆకాశ్‌దీప్ బ్యాటింగ్ 4; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (18 ఓవర్లలో 2 వికెట్లకు) 75. **వికెట్ల పతనం:** 1–46, 2–70. **బౌలింగ్:** అట్కిన్సన్ 6–2–26–1, టంగ్ 7–1–25–1, ఓవర్టన్ 5–1–22–0.

సెమీస్‌లో తరుణ్

మకావ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



మకావ్: సంచలన ప్రదర్శనతో దూసుకెళ్తున్న భారత షట్లర్, హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి... మకావ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ సెమీ ఫైనల్‌కు చేరాడు. వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్, టాప్ సీడ్ లీ చెక్ యు (హాంకాంగ్)పై ప్రిక్వార్టర్స్‌లో సంచలన విజయం సాధించిన తరుణ్... క్వార్టర్ ఫైనల్లోనూ అదే జోరు కనబర్చాడు. శుక్రవారం పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ప్రపంచ 47వ ర్యాంకర్ తరుణ్ 21–12, 13–21, 21–18తో ప్రపంచ 87వ ర్యాంకర్ హు జె (చైనా)పై గెలిచి సెమీస్‌లో అడుగుపెట్టాడు. బీడబ్ల్యూఎఫ్ సూపర్–300 టోర్నీల్లో తరుణ్ సెమీస్‌కు చేరడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడు అత్యుత్తమంగా జర్మన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్ ఆడాడు. 75 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్‌ను సులువుగా గెలుచుకున్న 23 ఏళ్ల తరుణ్... రెండో గేమ్‌లో వెనుకబడ్డాడు. ఆ తర్వాత నిర్ణయాత్మక మూడో గేమ్ ఆరంభం నుంచి నువ్వానేనా అన్నట్లు సాగగా... కీలక దశలో పాయింట్లు సాధించిన తరుణ్ ముందంజ వేశాడు. మరో క్వార్టర్ ఫైనల్లో భారత్‌కే చెందిన కామన్వెల్త్ స్వర్ణ పతక విజేత లక్ష్యసేన్ 21–14, 18–21, 21–14తో జియాన్ చెన్ జూ (చైనా)పై విజయం సాధించాడు. 63 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో లక్ష్యసేన్ ఆధిక్యం కనబర్చాడు. నేడు జరగనున్న సెమీఫైనల్స్‌లో ఐదో సీడ్ అల్వీ ఫర్హాన్ (ఇండోనేసియా)తో లక్ష్యసేన్, జస్టిన్ హో (మలేసియా)తో తరుణ్ తలపడనున్నారు. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి 14–21, 21–13, 20–22తో చూంగ్ హాన్ జియాన్–హైకల్ ముహమ్మద్ (మలేసియా) ద్వయం చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

రోజూ మనం తీసుకునే ఆహారంలో ఎక్కువ శాతం ఉండేది పిండి పదార్థాలే. వీటివల్ల మనం రోగాల బారిన పడుతున్నాం. కడుపులోకి వెళ్లిన పిండి పదార్థాన్ని పచనం చేసి, గ్లూకోజ్‌గా మార్చి, శరీరానికి శక్తినిచ్చే పని ఇన్సులిన్ అనే హార్మోన్ ద్వారా జరుగుతుంది. అవసరానికి మించి పిండి పదార్థాలు, హానికరమైన కొవ్వు పదార్థాలను మనం రోజూ తినడం వల్ల ఇన్సులిన్ సున్నితత్వాన్ని కోల్పోతుంది. అందువల్ల శరీరంలో అధికంగా ఇన్సులిన్ ఉత్పత్తి అయినప్పటికీ ఫలితం లేని స్థితికి చేరినప్పుడు 'ఇన్సులిన్ రెసిస్టెన్స్' ఏర్పడుతోంది. అధిక బరువు దగ్గరి నుంచి క్యాన్సర్ వరకు 64 రకాల జబ్బులకు ఇదే కారణమవుతోందన్న అవగాహన ఇటీవల కాలంలో పెరిగింది. అందువల్ల పిండిపదార్థాలను తక్కువగా తీసుకుంటూ.. మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలను ఎక్కువగా తీసుకుంటే అనారోగ్యాలు దరిచేరవు అంటున్నారు వైద్య నిపుణులు. దీన్నే 'లో కార్బ్ హై ఫ్యాట్' - ఎల్‌సీహెచ్‌ఎఫ్ ఆహార పద్ధతిగా చెబుతున్నారు.

- సాక్షి, సాగుబడి

లో కార్బ్.. హై ఫ్యాట్!



'ఆరోగ్యకరమైన' ట్రెండ్

- పిండి పదార్థాలను అతిగా తినటంతో 'కొవ్వుల' భారం
- ఫలితంగా షుగర్, ఫ్యాటీ లివర్, క్యాన్సర్ వంటి జబ్బులు
- వీటికి చెక్ పెట్టే 'లో కార్బ్ హై ఫ్యాట్' ఆహార పద్ధతి

ఊబకాయుల్లో చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే గణాంకాల ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో కూడా ఊబకాయం సమస్య వేగంగా పెరుగుతోంది. టైప్ 2 షుగర్ వ్యాధి రోగులు ప్రపంచంలో 1990 నుంచి 2022 మధ్యలో రెట్టింపయ్యారు. 'లాన్సెట్' కథనం ప్రకారం 21.2 కోట్ల భారతీయులు మధుమేహంతో బాధపడుతున్నారు.

పిండి పదార్థాలను ఎక్కువగా తింటే..

మనం తినే ఆహారం జీర్ణమై గ్లూకోజ్‌గా మారి, శరీర భాగాలు నిర్విరామంగా పనిచేయటానికి శక్తిగా ఉపయోగపడుతుంది. ఆహారంలో పిండి పదార్థాలు పెరిగితే రక్తంలో చక్కెర శాతాలూ పెరుగుతాయి. శరీరం ఈ చక్కెరలను కరిగించడానికి, శక్తి ఉత్పత్తి చేయటానికి కనీసం 2 నుంచి 3 గంటల సమయం తీసుకుంటుంది. ఈ ప్రక్రియను నిర్వహించే ఇన్సులిన్ చాలినంత లేకపోయినా, సరిగ్గా పనిచేయకపోయినా రక్తంలో చక్కెర శాతం నియంత్రణలో ఉండదు.

- ఆహారం ద్వారా అందే గ్లూకోజ్‌లో అవసరమైనప్పుడు వెంటనే వాడుకోవటానికి వీలుగా కొంత మేరకు గ్లైకోజెన్‌గా మారుతుంది. మిగిలిపోయిన అదనపు శక్తిని కొవ్వుగా మార్చి నిల్వ చేసుకునే సామర్థ్యం శరీరానికి ఉంది.
- గ్లైకోజెన్.. బ్యాంకు ఖాతాలో ఎప్పుడైనా వాడుకోవటానికి సిద్ధంగా ఉండే సొమ్ములాంటిది. కొవ్వుగా మారిన గ్లూకోజ్‌ను.. ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా చెప్పుకోవచ్చు.
- గ్లూకోజ్ ఒకసారి కొవ్వుగా మారితే, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప, తిరిగి దానికదే గ్లూకోజ్‌గా మారదు. ఈ కొవ్వును జీవన క్రియ ద్వారానే కరిగించి శక్తిగా మార్చగలం.
- పిండి పదార్థాలు తక్కువగా, ఆరోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉండే లో కార్బ్ హై ఫ్యాట్ (ఎల్‌సీహెచ్‌ఎఫ్) ఆహారం తీసుకుంటే శరీరంలో అధిక కొవ్వును సులువుగా కరిగించవచ్చు.

కొవ్వు పదార్థాలు ఎక్కువగా తింటే..

ఊబకాయులు ఆహారం పరిమితం చేసినా, ఉపవాసం ఉన్నా కూడా బరువు తగ్గటం కంటే పెరుగుతారు. ఈ విచిత్రమైన పరిస్థితి ఎందుకంటే, మనకు ఎక్కువ ఆకలి వేసినప్పుడు ఇన్సులిన్ ప్రభావం అధికమై ఆహారంలోని పిండి పదార్థాలను కొవ్వుగా మార్చి నిల్వ చేస్తుంది. ఈ పరిస్థితి మారాలంటే మన ఆహారంలో అధిక సంతృప్త కొవ్వులు ఉన్న నూనె వాడాలి. తద్వారా ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గి, బరువు పెరుగుదలను నివారించవచ్చు. దీనికి తక్కువ పిండి పదార్థాలు ఉండే ఆహారాన్ని కలిపితే శరీరంలో ఉన్న నిల్వ కొవ్వు కూడా కరగటం మొదలవుతుంది.

ఏ నిష్పత్తిలో తీసుకోవాలి?

ప్రధానంగా మనం తీసుకునే ఆహారంలోని స్థూల పోషకాలు మూడు.. పిండి పదార్థాలు(కార్బోహైడ్రేట్లు), మాంసకృత్తులు (ప్రొటీన్లు), కొవ్వు పదార్థాలు (ఫ్యాట్స్). ఎల్‌సిహెచ్‌ఎఫ్ పద్ధతి ప్రకారం.. ఉదాహరణకు.. 172 సెం.మీ. ఎత్తు, 82 కిలోల బరువు ఉన్న వ్యక్తి.. 10 కిలోల బరువు తగ్గాలనుకుంటే.. రోజువారీ తీసుకోవాల్సినవి..

- నికర పిండి పదార్థాలు – 20 గ్రా.
  (పిండి పదార్థం నుంచి పీచును మినహాయిస్తే మిగిలేవి)
- మాంసకృత్తులు – 70 గ్రా.
- ఆరోగ్యకరమైన కొవ్వులు – 100–150 గ్రా.

ఈ మూడూ కలిపి కనిష్ఠంగా 1200 నుంచి గరిష్ఠంగా 1500 క్యాలరీల వరకు ఉండాలి.

ఈ ఆహార విధానం అందరికీ ఒకేలా ఉండదు. అందువల్ల దీనిపై అవగాహన ఉన్న వైద్యులను సంప్రదించి, వారి పర్యవేక్షణలోనే ఈ ఆహారం, జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రతి మనిషికి.. వారివారి అనారోగ్య సమస్యలు, ఆరోగ్య లక్ష్యాలు.. వీటన్నింటి ఆధారంగా వైద్యులు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారు. ఈ ఆహార నియమావళికి అలవాటు పడటానికి కొన్ని రోజుల నుంచి కొన్ని వారాల సమయం పట్టవచ్చు.

నేనూ వాడి.. లబ్ధి పొందాను



నేను గత 47 సంవత్సరాలుగా వేలాది గుండె శస్త్రచికిత్సలు, ముఖ్యంగా బైపాస్ సర్జరీలు చేశాను. తక్కువ పిండి పదార్థాలు, ఎక్కువ 'ఆరోగ్యకరమైన కొవ్వులు' ఉండే ఆహారం వాడకం ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి సహాయకారిగా నిలిచింది. నేనూ ఇది పాటించి లబ్ధి పొందాను. 17 ఏళ్ల క్రితం మధుమేహం, రక్తపోటుకు ఇన్సులిన్ ఇంజక్షన్లు వాడేవాడిని. మొదట్లో ఈ ఆహార పద్ధతిని నేనూ నమ్మలేదు. రెండేళ్లు పరిశోధన చేసి ఈ నియమావళిని నమ్మి ప్రారంభించాను. ఇందులో గానుగ నుంచి తీసిన కొబ్బరి నూనె వాడకం చాలా ప్రధానం. 6 వారాల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలు వచ్చాయి. ఇన్సులిన్ ఇంజక్షన్, రక్తపోటుకు మందులు వాడటం ఆపేశాను. 'లో కార్బ్ స్కూల్' అనే యూట్యూబ్ చానల్లో.. అనేక ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఎలాంటి ఆహార పద్ధతులు పాటించారో చాలా వీడియోలు కూడా చేశాను.

డా. పి.వి. సత్యనారాయణ, ప్రముఖ కార్డియో థొరాసిక్ సర్జన్, ఎల్‌సీహెచ్‌ఎఫ్ ఆహార పద్ధతి నిపుణులు, హైదరాబాద్

క్లుప్తంగా...

వెల్ది రేఖకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు

- అవార్డుకు ఎంపికైన తొలి చేనేత కార్మికురాలు



సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత మహిళా కార్మికురాలు వెల్ది రేఖ కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో చేనేత దినోత్సవం సందర్భంగా అందించే ఈ అవార్డుకు రేఖ ఎంపికైనట్లు శుక్రవారం చేనేత, జౌళిశాఖ అధికారులు ప్రకటించారు. లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికైన తొలి మహిళా చేనేత కార్మికురాలు రేఖ కావడం గమనార్హం. 45 రోజులపాటు చేనేత మగ్గంపై శ్రమించి పట్టు పీతాంబరాన్ని నేశారు. 48 ఇంచుల వెడల్పు, అయిదు మీటర్ల పొడవుతో కూడిన ఈ చీరపై కాకతీయుల తోరణం, వేములవాడ రాజన్న కోడె మొక్కులను సూచించే జరీ బుటాలను పొందుపరిచారు. సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారులైన వెల్ది హరిప్రసాద్ సతీమణి రేఖ భర్త అడుగుజాడల్లోనే చేనేత వృత్తిలో కొనసాగుతున్నారు. దేవుడి పూజలకు వినియోగించే నూలుపోగుల దండలు నేస్తూ గుర్తింపు పొందారు.

కూలీల బిడ్డకు మైక్రోసాఫ్ట్‌లో కొలువు

- రూ.51 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించిన రవీన



కాగజ్‌నగర్ టౌన్: వ్యవసాయ కూలీల కుమార్తె ప్రతిష్ఠాత్మక మైక్రోసాఫ్ట్ సంస్థలో ఏడాదికి రూ.51 లక్షల ప్యాకేజీతో బెంగళూరులో ఉద్యోగం సాధించింది. తల్లిదండ్రుల కష్టం విలువ తెలిసి.. అంకితభావం, పట్టుదలతో ఆమె ఈ లక్ష్యాన్ని సాధించిందంటూ స్థానికులు, అధ్యాపకులు ప్రశంసిస్తున్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ముడిమడుగు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు బదావత్ ప్రభాకర్, వనిత దంపతుల కుమార్తె రవీన 2022లో 12వ తరగతి ఉత్తీర్ణత సాధించింది. ఆ తర్వాత ఎలాంటి కోచింగ్ లేకుండానే జేఈఈ అర్హత సాధించి అలహాబాద్ ఐఐటీలో అడ్మిషన్ పొందింది. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్ సంస్థలో ఏడాదికి రూ.51 లక్షల ప్యాకేజీతో బెంగళూరులో ఉద్యోగావకాశం పొందింది. కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం పొందిన రవీన క్రమశిక్షణతో చదువులో చురుగ్గా ఉంటూ 12వ తరగతి వరకు ఇక్కడే చదువుకుందని ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ తెలిపారు.

భార్యకు 72 లక్షల భరణం



ఆదిలాబాద్ టౌన్: భార్యాభర్తల గొడవకు సంబంధించి ఆరేళ్లుగా కోర్టులో నడుస్తున్న కేసు.. భారీ భరణంతో ముగిసింది. ఆదిలాబాద్ సంజయ్‌నగర్‌కు చెందిన ఆడే విజయలక్ష్మికి.. ఆమె భర్త ఆడే జీవన్ శుక్రవారం కోర్టులో న్యాయమూర్తి ఎదుట రూ.72 లక్షల భరణం చెల్లించినట్లు న్యాయవాది తొగరి నిఖిలేష్ తెలిపారు. దీంతో పాటు పిల్లల చదువుల ఖర్చు సైతం చెల్లించేందుకు భర్త అంగీకరించారన్నారు.

ఈ నెలలో వర్షాలు సాధారణమే...

- కొన్నిప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ నమోదయ్యే అవకాశం
- గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం, కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఎక్కువ
- ప్రస్తుతం రాష్ట్రంలో కొంత లోటులోనే వర్షపాతం.. ఆగస్టు నెల అంచనాలను విడుదల చేసిన ఐఎండీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాలు సాధారణ స్థితిలోనే నమోదవుతున్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో జూన్ నెలలో తీవ్ర లోటువర్షపాతం నమోదు కాగా... జూలైలో కాస్త ఆశాజనకంగా వర్షాలు కురిశాయి. దీంతో రాష్ట్ర వర్షపాతం గణాంకాలు సాధారణ స్థితికి చేరాయి. ప్రస్తుతం నాలుగైదు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రాష్ట్ర సగటు గణాంకాలు లోటు దిశగా పడిపోతున్నాయి. ప్రస్తుతం ఆగస్టు నెలలో వర్షాలు సాధారణ స్థితిలో నమోదవుతాయని, కొన్ని ప్రాంతాల్లో సాధారణంకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వేసిన అంచనాలు కొంత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆగస్టు నెల వర్షపాతం అంచనాలను ఐఎండీ విడుదల చేసింది. ఈ నెలలో వర్షాలు సాధారణ స్థితిలో నమోదవుతాయని, 94 శాతం నుంచి 106 శాతం మధ్యలో వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల సీజన్ ద్వితీయార్ధంలో వర్షాలు సాధారణం కంటే ఎక్కువగా నమోదైతేనే రైతాంగానికి లాభం చేకూరుతుందని వ్యవసాయ శాఖ చెబుతుండగా.. తాజాగా వాతావరణ శాఖ వెల్లడించిన గణాంకాలు ఒకింత ఆందోళన కలిగిస్తున్నాయి.

మండుతున్న ఎండలు...

రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. పగటి పూట తీవ్ర ఉక్కపోతతో కూడిన వాతావరణం... రాత్రిపూట సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో భాగంగా ద్వితీయార్ధం ఉష్ణోగ్రతలు తగ్గాల్సి ఉండగా... ప్రస్తుతం అధికంగా నమోదవుతుండటం ఆందోళన కలిగించే విషయం. ఈ నెలలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో నమోదవుతాయని, రాత్రిపూట మాత్రం సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని సూచించింది.

- నైరుతి సీజన్లో ఆగస్టు 1 వరకు 36.36 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 34.24 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మూడు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా... 24 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 6 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం కేసులో నలుగురి అరెస్టు

- నగర వాసి నుంచి రూ.3 కోట్లు కొల్లగొట్టిన ముఠా
- సైబర్ మోసగాళ్లకు మ్యూల్ ఖాతాలు ఇస్తున్నట్టు గుర్తించిన టీజీ సీఎస్‌బీ అధికారులు



శిఖాగోయల్

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెద్దమొత్తంలో లాభాలు వస్తాయని ఆశచూపి నగరవాసి నుంచి రూ.3 కోట్లు కొల్లగొట్టిన సైబర్ మోసం కేసులో టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీ సీఎస్‌బీ) అధికారులు పురోగతి సాధించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న నలుగురు నిందితులు శ్రీనివాస్ మనుబోతుల (నార్సింగి), సయ్యద్ యూసుఫ్ (ఆఘాపుర, నాంపల్లి), చెక్క యేష్యా (బంజారాహిల్స్), మహ్మద్ జుబేర్ అహ్మద్ (హుమాయున్‌నగర్)లను అరెస్టు చేసినట్టు టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన నలుగురు నిందితులు సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంక్ ఖాతాలు ఇవ్వడంతోపాటు సైబర్ మోసాల్లో కొల్లగొట్టిన నగదు లావాదేవీల్లో సహకరిస్తున్నట్టు తెలిపారు. వారి ఖాతాల్లో జమయ్యే మొత్తంలో 10 శాతం కమీషన్ ఇస్తే తమ బ్యాంకు ఖాతాల్లోకి సైబర్ మోసాల్లో కొల్లగొట్టిన డబ్బులు వేసేందుకు అంగీకరించేలా ఈ నిందితులు సైబర్ నేరగాళ్లతో ఒప్పందాలు చేసుకున్నట్టు టీజీసీఎస్‌బీ దర్యాప్తులో వెల్లడైంది. ఒప్పందం తర్వాత శ్రీనివాస్ బ్యాంకు ఖాతాలోకి రూ.4.3 కోట్ల నగదు బదిలీ జరిగింది. ఇందులో నగరానికి చెందిన బాధితుడికి చెందిన రూ.77 లక్షలు ఉన్నట్టుగా టీజీ సీఎస్‌బీ అధికారులు గుర్తించారు. దేశవ్యాప్తంగా మొత్తం 46 సైబర్ క్రైం కేసులతోనూ శ్రీనివాస్ బ్యాంకు ఖాతాకు సంబంధం ఉన్నట్టు గుర్తించామని శిఖాగోయల్ తెలిపారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన టీజీ సీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీను, ఎస్సై నయీముద్దీన్, కానిస్టేబుళ్లు శివ, రాజు, ఉపేందర్, శేఖర్, కేసు దర్యాప్తు పర్యవేక్షించిన డీఎస్పీ కేవీఎం ప్రసాద్, అడిషనల్ ఎస్పీ బిక్షంరెడ్డిలను శిఖాగోయల్ అభినందించారు.

ప్రజెంట్ సార్...

అర్ధనగ్నంగా సెల్ఫీ దిగి..

పంచాయతీ కార్యదర్శి నిర్వాకం..



తంగళ్లపల్లి(సిరిసిల్ల): పంచాయతీ కార్యదర్శులు నిత్యం డీఎస్ఆర్ యాప్‌లో సెల్ఫీ దిగి తమ హాజరును నమోదు చేయాలి. అనంతరం గ్రామంలో చేపట్టే పనుల ఫొటోలు పోస్టు చేయాలి. కానీ తంగళ్లపల్లి, సారంపల్లి గ్రామాల కార్యదర్శి మహ్మద్ సమీర్ జూలై 29, 30 తేదీలలో ఒంటిపై బట్టలు లేకుండా.. తన ఇంటిలోనే సెల్ఫీ దిగి హాజరు పూర్తిచేసినట్లు గుర్తించారు. దీనిపై తంగళ్లపల్లి ఎంపీడీవో లక్ష్మీనారాయణను 'సాక్షి'వివరణ కోరగా.. పంచాయతీ కార్యదర్శుల డీఎస్ఆర్ పరిశీలిస్తున్నామని తెలిపారు. ఇలాంటివి జరిగినట్లు గుర్తిస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

సీఎం ఫొటోతో హాజరు

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసిన జగిత్యాల కలెక్టర్



బుగ్గారం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోతో ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేసుకున్న జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చంద్రయ్యపల్లి పంచాయతీ కార్యదర్శిపై వేటు పడింది. కలెక్టర్ సత్యప్రసాద్ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొంతకాలంగా పంచాయతీ కార్యదర్శుల హాజరు నమోదుపై అనుమానం వచ్చిన ఉన్నతాధికారులు.. ఇటీవల ప్రత్యేక పరిశీలన జరిపారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు తమ హాజరు నమోదు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తేలింది. చంద్రయ్యపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి టి.రాజన్న ఏకంగా ముఖ్యమంత్రి ఫొటోనే వాడి డీఎస్ఆర్ (డైలీ శానిటేషన్ రిపోర్ట్)యాప్‌లో హాజరు నమోదు చేసుకున్నాడు. ఉన్నతాధికారుల పరిశీలనలో విషయం బయటపడడంతో.. కలెక్టర్ సత్యప్రసాద్ కార్యదర్శి రాజన్నను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై బుగ్గారం ఎంపీడీవో అఫ్జల్‌మియాను వివరణ కోరగా.. హాజరు నమోదుకు సంబంధించి కారోబార్ చేసిన పొరపాటుతో ఈ పరిస్థితి తలెత్తిందని తెలిపారు.

సచివాలయ సందర్శకులకు క్యూఆర్ కోడ్

- 'విజిటర్ ఈ–పాస్ మేనేజ్‌మెంట్ సిస్టం' అమలు

సాక్షి, హైదరాబాద్: సచివాలయ సందర్శకులకు ఇకనుంచి 'విజిటర్ ఈ–పాస్ మేనేజ్‌మెంట్ సిస్టం'ను అమల్లోకి తీసుకురానున్నారు. దీని కోసం క్యూఆర్ కోడ్ ఉన్న విజిటర్ పాస్‌ను రూపొందించారు. దీనిలో అర్జీదారు పూర్తి వివరాలు నమోదవుతాయి. అర్జీదారు వచ్చిన సమయం నుంచి.. వెళ్లే వరకు అన్ని వివరాలను నమోదు చేస్తారు. ఎంతమంది అర్జీదారులు సచివాలయానికి వస్తున్నారు?, వాళ్లు ఏయే మంత్రుల పేషీకి వెళ్తున్నారు?, ఏ నంబర్ గదికి వెళ్తున్నారు? తదితర వివరాలను తీసుకుంటారు. ఈ–పాస్‌లతో మంత్రులు, పేషీకి ఇచ్చిన అర్జీల్లో ఎంత మొత్తం పరిష్కారం అవుతున్నాయో కూడా చూస్తారని సమాచారం. మరోవైపు అర్జీదారు పాస్ తీసుకున్న చోటికే వెళ్లారా? లేక ఇతర అధికారుల దగ్గరకు వెళ్లారా? అనేది తెలుసుకునే అవకాశం కూడా ఉందని సమాచారం. పారదర్శకతతో పాటు జవాబుదారీతనం ఉంటుందని క్యూఆర్ కోడ్ విధానం అమలు చేయనున్నారు. గతంలో డిప్యూటీ సీఎం చాంబర్ ముందు కొంత మంది ఆందోళన చేసిన నేపథ్యంలో.. ఈ విధానానికి రూపకల్పన చేసినట్లు సమాచారం.

ముగిసిన ఆపరేషన్ ముస్కాన్–11

సాక్షి, హైదరాబాద్: అదృశ్యమైన, జాడ కనిపించకుండా పోయిన, బాలకార్మికులుగా, భిక్షాటనలో ఉన్న చిన్నారులతో పాటు వీధి బాలలను గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్–11 స్పెషల్ డ్రైవ్‌లో 7,678 మంది (బాలురు –7,149, బాలికలు–529) చిన్నారులను గుర్తించినట్టు సీఐడీ అడిషనల్ డీజీ చారు సిన్హా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీరిలో 6,593 మందిని తిరిగి కుటుంబాలకు అప్పగించినట్లు చెప్పారు. మిగిలినవారిని రెస్క్యూహోంలకు తరలించినట్లు తెలిపారు. చిన్నారులతో పని చేయిస్తున్న 1,718 మందిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో 93.3 శాతం హాజరు

బోధన, బోధనేతర సిబ్బంది నమోదు తప్పనిసరి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు నమోదు కోసం ప్రవేశపెట్టిన ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో ఉపాధ్యాయులు నమోదు చేసుకుంటున్నారు. ఫేస్ రికగ్నిషన్ హాజరు ఆగస్టు ఒకటో తేదీ నుంచి ప్రతి ఉపాధ్యాయునికి ప్రభుత్వం తప్పనిసరి చేసింది. పాఠశాల విద్యాశాఖ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 24973 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1,28,760 మంది బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. శుక్రవారం ఫేస్ రికగ్నిషన్ (ముఖం గుర్తింపు) యాప్‌లో 96,327 (75 శాతం) మంది ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నమోదు చేసుకున్నారు. నమోదు చేసుకున్న వారిలో.. 89,922 (93.3%) మంది బోధన, బోధనేతర సిబ్బంది తమ హాజరును యాప్ ద్వారా అప్‌లోడ్ చేశారు.

ఆఖరి మజిలీకి చచ్చే చావు..!



చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఏలేటి రామయ్యపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు కొత్తూరి రాజిరెడ్డి (90) గురువారం మృతి చెందాడు. అంత్యక్రియలు నిర్వహించాల్సిన వైకుంఠధామం గ్రామ శివారులోని చలివాగు పక్కన ఉంది. కానీ, పొలాల వెంబడి దారంతా బురద, గుంతలమయం కావడంతో శుక్రవారం అంత్యక్రియల నిర్వహణకు బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో మృతుని బంధువులు కొద్దిదూరం వెళ్లి ఆగిపోయారు. 'ఆ నలుగురు'మాత్రమే అష్ట కష్టాలు పడి శవాన్ని వైకుంఠధామానికి చేర్చి అంత్యక్రియలు నిర్వహించారు. వైకుంఠధామాలకు రోడ్డు సక్రమంగా వేయించలేని పాలకులు.. పల్లెలను ఎలా అభివృద్ధి చేస్తారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాబును దత్తత మాత్రమే ఇచ్చాను.. సరోగసీ అని చెప్పలేదు



పోలీసుల విచారణలో 'సృష్టి' డాక్టర్ నమ్రత
తొలిరోజు ఏ వివరాలూ రాబట్టలేకపోయిన పోలీసులు

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): సృష్టి ఆస్పత్రి కేసు వ్యవహారంలో కీలకమైన ఏ1 ముద్దాయి డాక్టర్ నమ్రత పోలీసుల విచారణలో నోరు విప్పడం లేదు. పిల్లలు లేరని తన దగ్గరకు వచ్చిన మహిళకు తాను కేవలం బాబును దత్తత ఇప్పించానని పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పినట్లు తెలిసింది. అది తప్ప ఇక ఏ విషయంలోనూ ఆమె నోరు విప్పకపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఈ కేసులో డాక్టర్ నమ్రతను శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు పోలీసులు విచారించేందుకు కోర్టు నుంచి కస్టడీకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఉత్తర మండలం డీసీపీ కార్యాలయంలో డీసీపీ, ఏసీపీతో పాటు గోపాలపురం పోలీసులు ఆమెను విచారిస్తున్నారు. మొదటి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు వివిధ అంశాల గురించి ఆమెను గుచ్చిగుచ్చి ప్రశ్నించినా ఏ ప్రశ్నకూ సమాధానం ఇవ్వలేదని తెలిసింది. తను ఎలాంటి తప్పూ చేయలేదని, తనకు బిడ్డ కావాలని, తన భర్త విదేశాల్లో ఉంటారని ఓ మహిళ తన దగ్గరకు రాగా దత్తత ఇప్పించానని మాత్రమే సమాధానం చెప్పినట్లు తెలిసింది. అంతకుమించి ఆమె నుంచి ఎటువంటి వివరాలూ పోలీసులు రాబట్టలేకపోయారు. ఆస్పత్రినుంచి సేకరించిన రికార్డుల్లో అనుమానం వచ్చిన కేసుల గురించి ప్రశ్నించినా డాక్టర్ నమ్రత తనకు గుర్తు లేదని చెప్పినట్లు తెలిసింది. ఇక్కడ సరోగసీ పేరుతో శిశువుల అక్రమ రవాణా మాత్రమే జరగడంతో చాలా కేసులు రికార్డుల్లోకి ఎక్కలేదు. ఇంకా నాలుగు రోజులపాటు పోలీసులు డాక్టర్ నమ్రతను విచారించనున్నారు.

పోలీసు కస్టడీకి మరో ఇద్దరు నిందితులు

ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను కోర్టు పోలీసు కస్టడీకి అనుమతించింది. శుక్రవారం వైజాగ్‌కు చెందిన ఏ3–కల్పన, అమీర్‌పేట్‌కు చెందిన ఏ6 సంతోషిలను పోలీసు కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. శనివారం వారిని పోలీసులు విచారించనున్నారు. బాబును అసలైన తల్లిదండ్రుల నుంచి తీసుకుని వచ్చి రాజస్తాన్‌కు చెందిన దంపతులకు అందించడంలో ఈ ఇద్దరూ కీలకంగా వ్యవహరించినట్లు తెలిసింది.

నేటి నుంచి ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ సంగీతా సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు చేయాలని వైద్యారోగ్యశాఖ నిర్ణయించింది. ఈ మేరకు 35 ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించనున్నాయి. మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 307 సంతాన సాఫల్య కేంద్రాలను తనిఖీ చేయనున్నారు. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీతా సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. తొలుత గ్రేటర్ హైదరాబాద్‌లోని 157 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, ఆ తర్వాత జిల్లాల్లోనూ దాడులు చేయనున్నారు. ప్రతీ బృందంలో ఒక డాక్టర్‌తో పాటు ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉంటారు. అయితే ఈ దాడుల్లో ప్రధానంగా 29 అంశాలను పరిశీలించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన చెక్ లిస్టుతో బృందాలు తనిఖీలు చేయనున్నాయి. మూడు రోజుల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనల మేరకు సంతాన సాఫల్య కేంద్రాలు పనిచేస్తున్నాయో లేదో చెక్ లిస్ట్ ప్రకారం అందించాలని అధికారులను ఆదేశించారు.

ఆస్తిని పంచుకుని అమ్మను గెంటేశారు

అధికారులను ఆశ్రయించిన వృద్ధురాలు



మద్దూరు: ఆస్తి మొత్తం లాక్కొని.. వృద్ధాప్యంలో ఉన్న తల్లిని ఇంటి నుంచి గెంటేశారు కుమారులు. దీంతో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న ఆ తల్లి.. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నానని, న్యాయం చేయాలంటూ అధికారులను ఆశ్రయించింది. ఈ ఘటన మద్దూరు మండలం ఖాజీపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన 83 ఏళ్ల నాగమ్మ, వడ్ల రాములు భార్యాభర్తలు. వీరికి భీములు, వెంకటయ్య, చంద్రమౌళి, ఒక కూతురు లక్ష్మమ్మ ఉన్నారు. భర్త వడ్ల రాములు ఐదేళ్ల క్రితం మృతిచెందాడు. దీంతో ఆయన పేరుమీద ఉన్న 14 ఎకరాల భూమితో పాటు, రూ.4 లక్షల నగదును గ్రామ పెద్దల సమక్షంలో పంపకాలు చేపట్టారు. నాగమ్మకు రూ.40 వేలు అందజేసి భూమి, మిగిలిన డబ్బులను కుమారులకు పంచారు. అయితే తల్లి నాగమ్మను ముగ్గురు కుమారులు ఏడాదికి ఒకరు చొప్పున చూసుకోవాలని పెద్దలు చెప్పినా, భూములు, డబ్బులు చేతికందడంతో నాగమ్మను ఇంట్లో నుంచి గెంటేశారు కుమారులు. దీంతో నాగమ్మ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో కుమారులను ఆశ్రయించగా, తల్లిపై జాలి లేకుండా నానా మాటలు తిట్టి పంపించారు. దీంతో తనకు న్యాయం చేయాలని, భర్త ఆస్తి తనకు దక్కేలా చూడాలని ఆ తల్లి తహసీల్దార్ మహేశ్‌గౌడ్‌ను ఆశ్రయించింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వాగు దాటి వైద్యసేవలు



గూడెంలోని గొత్తికోయలకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి విజయ్


ట్రాక్టర్‌లో వెళ్తున్న వైద్య సిబ్బంది

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం బయ్యక్కపేట సమీప అటవీ ప్రాంతంలోని నీలంతోగు గొత్తికోయ గూడెంలో వైద్య సిబ్బంది శుక్రవారం వైద్య సేవలందించారు. పల్లె దవాఖానా వైద్యాధికారి విజయ్ సిబ్బందితో కలిసి దట్టమైన అటవీప్రాంతంలో ఐదు కిలోమీటర్ల మేర గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో ప్రయాణించారు. మధ్యలోని వాగు దాటారు. గూడెంలోని గొత్తికోయలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గూడెంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. అలాగే బయ్యక్కపేట సమీపంలోని ముసలమ్మపెంటగూడెం వాసులకు కూడా వైద్య సేవలందించారు.


వాగుదాటుతున్న సిబ్బంది

సర్కారు బడికి 'రాం' రాం!





- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదులో భారీ తగ్గుదల
- తెలంగాణలో రెండేళ్లలో 5,23,986 మంది తగ్గిన వైనం
- ఉత్తరప్రదేశ్‌లో 31.88 లక్షలు.. రాజస్థాన్‌లో 15.31 లక్షల మంది గుడ్‌బై
- చాలా రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి.. 1.58 కోట్ల మంది సర్కారు బడులకు దూరం
- సర్వ శిక్ష అభియాన్ కింద అధునాతన వసతులు.. అయినా కార్పొరేట్‌ల వైపే మొగ్గు
- యూడీఐఎస్ఈ నివేదికల ఆధారంగా వెల్లడి

సాక్షి ప్రతినిధి, వరంగల్: ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో (గవర్నమెంట్, లోకల్ బాడీ) చేరుతున్న విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. సర్కారు బడుల్లో అత్యాధునిక సాంకేతిక సౌకర్యాలు, డిజిటల్ పద్ధతిలో బోధన చేస్తున్నా కార్పొరేట్ స్కూళ్ల వైపే మొగ్గు చూపుతున్నారు. 2019-20 నుంచి 2021-22 వరకు సర్కారు బడుల్లో పెరిగిన ఎన్‌రోల్‌మెంట్.. ఆ తర్వాత 2022-23, 2023-24ల వరకు వచ్చే సరికి గణనీయంగా పడిపోయింది. 2024-25లో కూడా సర్కారు బడుల్లో విద్యార్థుల చేరిక ఆశాజనకంగా లేదని యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యూడీఐఎస్ఇ) నివేదికలు చెబుతున్నాయి. 2019-20 నుంచి 2023-24ల వరకు ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా సర్కారు బడుల్లో నమోదైన విద్యార్థుల గణాంకాలను రెండు రోజుల కిందట కేంద్ర విద్యాశాఖ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. 2021-22 సంవత్సరంలో నమోదైన విద్యార్థుల సంఖ్య.. 2023-24లోని సంఖ్యతో పోలిస్తే రెండు సంవత్సరాల్లో 1,57,50,281 మంది తగ్గారు.

దేశంలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 2019-2024 వరకు సంవత్సరాల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్స్ వివరాలు ఇలా...

రాష్ట్రం	2019-20	2020-21	2021-22	2022-23	2023-24
అండమాన్ అండ్ నికోబార్	51,905	49,943	51,168	52,059	48,792
ఆంధ్రప్రదేశ్	40,42,535	46,27,205	46,96,207	42,56,013	40,50,116
అరుణాచల్‌ప్రదేశ్	2,13,421	2,34,914	2,33,908	2,05,522	1,87,634
అసోం	50,61,895	50,97,436	52,77,671	51,51,710	50,17,578
బిహార్	1,95,79,263	2,08,74,968	2,19,89,445	2,03,59,013	1,74,66,574
చండీగఢ్	1,52,561	1,53,489	1,65,156	1,64,241	1,55,752
ఛత్తీస్‌గఢ్	40,00,147	40,42,244	42,62,053	40,82,523	39,47,170
దాద్రానగర్ హవేలి, అండ్ డామన్ డయ్యూ	83,154	84,162	91,026	93,770	93,333
ఢిల్లీ	24,09,441	25,42,240	27,96,676	27,76,216	25,71,404
గోవా	43,547	42,857	42,932	42,653	41,722
గుజరాత్	52,95,130	53,34,822	55,70,875	55,11,272	54,59,151
హరియాణా	21,31,579	22,32,333	26,02,484	24,64,486	22,30,123
హిమాచల్‌ప్రదేశ్	8,51,783	8,47,735	9,00,749	8,72,058	8,31,845
జమ్మూకశ్మీర్	12,71,045	13,24,301	14,73,368	14,54,668	14,21,643
జార్ఖండ్	48,10,045	48,73,009	52,42,868	49,43,098	48,43,847
కర్ణాటక	49,06,231	50,31,606	54,45,989	53,27,221	49,85,661
కేరళ	17,25,686	17,57,209	18,62,020	18,54,934	18,01,570
లద్దాఖ్	27,072	28,744	29,312	28,667	26,275
లక్షదీప్	12,606	13,114	13,586	12,587	12,591
మధ్యప్రదేశ్	91,19,353	89,04,779	94,29,734	90,95,629	86,71,760
మహారాష్ట్ర	56,46,319	55,94,726	58,53,094	54,81,157	53,25,571
మణిపూర్	1,99,958	2,01,758	2,16,636	2,12,608	2,03,508
మేఘాలయ	4,78,070	4,82,425	4,77,232	4,38,863	4,20,993
మిజోరామ్	1,27,509	1,32,230	1,43,345	1,35,515	1,29,068
నాగాలాండ్	1,74,882	1,71,747	1,70,219	1,56,175	1,41,852
ఒడిశా	55,14,876	52,13,350	52,55,198	52,67,551	52,09,594
పుదుచ్చేరి	83,809	87,867	97,368	91,295	83,737
పంజాబ్	26,89,786	28,76,825	30,90,436	29,02,536	28,23,581
రాజస్థాన్	85,21,720	89,55,632	99,12,280	92,50,493	83,81,575
సిక్కిం	89,876	85,980	84,411	79,597	71,839
తమిళనాడు	45,93,422	47,75,207	53,14,845	50,42,026	48,40,034
తెలంగాణ	28,37,635	28,96,974	33,03,699	30,09,212	27,79,713
త్రిపుర	5,62,047	5,36,724	5,42,892	5,24,284	5,08,036
ఉత్తరప్రదేశ్	1,68,57,549	1,75,76,345	1,90,56,651	1,80,18,332	1,58,68,581
ఉత్తరాఖండ్	9,41,454	9,16,631	9,80,808	9,42,657	8,70,147
పశ్చిమ బెంగాల్	1,58,57,323	1,63,03,026	1,65,64,139	1,59,04,276	1,59,67,829

దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి..

ఏటేటా సర్కారు బడుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. 2019-20లో 13,09,31,634 మంది విద్యార్థులు దేశ వ్యాప్తంగా సర్కారు బడుల్లో ఉంటే.. 2020-21 నాటికి ఆ సంఖ్య 13,49,04,560లకు చేరింది. మరుసటి సంవత్సరం 2021-22లో 14,32,40,480లకు పెరగ్గా ఆ తర్వాత నుంచి ఎన్‌రోల్‌మెంట్ తగ్గింది. 2022-23లో 13,62,04,917లు కాగా, 2023-24 నాటికి 12,74,90,199లకు పడిపోయినట్లు రికార్డులు చెప్తున్నాయి. ఈ లెక్కన అత్యధికంగా రెండేళ్లలో బిహార్‌లో 45,22,871, ఉత్తరప్రదేశ్‌లో 31,88,070, రాజస్థాన్‌లో 15,30,705, మధ్యప్రదేశ్‌లో 7,57,974, తెలంగాణలో 5,23,986 మంది సర్కారు బడులకు దూరం అయ్యారు. ఒడిశా, లక్షదీప్‌లు మినహా దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల జనాభాను బట్టి పలు రాష్ట్రాల్లో ఎన్‌రోల్‌మెంట్ గణనీయంగా తగ్గింది.

ఉమ్మడి వరంగల్‌లో మూతబడులు

రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలు మొత్తం 18,254 ఉండగా.. వాటిల్లో 6,90,816 మంది విద్యార్థులు ఉన్నారు. అంటే ఒక్కో బడిలో సగటు పిల్లల సంఖ్య 38 మాత్రమే. ఏకంగా 1,864 ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క విద్యార్థి లేనట్లు అప్పట్లో అధికారులు ప్రకటించడం గమనార్హం. కాగా ఉమ్మడి వరంగల్‌లోనూ 298 వరకు ప్రభుత్వ పాఠశాలలు మూత బడినట్లు అధికారులు పేర్కొన్నారు. సర్కారు బడుల్లో సంఖ్య తగ్గడానికి గురుకులాలు, మోడల్ స్కూళ్లు కారణమవగా.. ఏమాత్రం ఆర్థిక స్తోమత లేని వారు, గురుకులాల్లో సీట్లు దక్కని వారు పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్తు బడుల్లో చేరుతున్నారని ఉపాధ్యాయులు చెప్తున్నారు. కొంతమంది తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువులో నాణ్యత తక్కువగా ఉంటుందని భావించి, ప్రైవేటు పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్న ప్రచారం కూడా ఉంది. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలు ఉండటం వల్ల కూడా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపడానికి ఇష్టపడటం కూడా సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణంగా చెప్తున్నారు.

మూతబడులను పునఃప్రారంభించాలి



సర్కారు బడులకు పిల్లలు రావడం లేదని చాలాచోట్ల స్కూల్స్ మూసేస్తున్నారు. ఇదే కారణంతో నేను చదువుకున్న కుమ్మరికుంట తండా బడిని కూడా బంద్ చేశారు. పాఠశాలలో అన్ని వసతులు కల్పించి తిరిగి ప్రారంభించాలి. ఆ బడిని అన్ని వసతులతో మళ్లీ తెరిపిస్తే చాలామంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని భావిస్తున్నాం. జిల్లా పాలనాధికారులు విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలలను పునఃప్రారంభించాలి.

– బానోత్ శ్రీను, కుమ్మరి కుంట తండా, మహబూబాబాద్ జిల్లా

పార్లమెంట్‌లో తెలంగాణ

తెలంగాణలో 99 డయాలసిస్ కేంద్రాలు

ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ పథకంపై కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ : తెలంగాణలోని 33 జిల్లాల్లో డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ పథకం కింద ఇప్పటి వరకు రాష్ట్రంలో 99 హీమో డయాలసిస్ కేంద్రాలు పనిచేస్తున్నాయని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ లోక్‌సభలో శుక్రవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ సమాధానమిచ్చారు. తెలంగాణలో 2022-23లో 6.44 లక్షల సెషన్లు, 2023-24లో 4.97 లక్షల సెషన్లు, 2024-25లో 5.86 లక్షల సెషన్ల డయాలసిస్ జరిగాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పీఎంఎన్‌డీపీ కేంద్రాల్లో 678 హీమో డయాలసిస్ యంత్రాలు ఉన్నాయని, ఈ సంఖ్య ప్రస్తుతం ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా ఉన్నదే కానీ, రానున్న రోజుల్లో డిమాండ్ పెరగనుందని కేంద్రం అంచనా వేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. అనంతరం తాలూకా స్థాయిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు విస్తరించేందుకు మార్గదర్శకాలు జారీ చేసినట్టు వివరించింది.

తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు అడ్డంకులు

- మనోహరాబాద్-కొత్తపల్లి, భద్రాచలం-కొవ్వూరు పనుల్లో జాప్యం
- రాజ్యసభలో వెల్లడించిన రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ : తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో రెండు ప్రధాన రైల్వే ప్రాజెక్టులపై జాప్యం కొనసాగుతోందని, భూముల సేకరణ, రాష్ట్రాల నుంచి నిధుల సమకూర్పులో ఆలస్యమే ఇందుకు ప్రధాన కారణాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ స్పష్టం చేశారు. శుక్రవారం రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ పార్థసారథిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

మనోహరాబాద్-కొత్తపల్లి ప్రాజెక్టు ప్రగతి

ఈ ప్రాజెక్టు 151 కిలోమీటర్ల పొడవుతో ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణను ఉచితంగా చేసి, నిర్మాణ వ్యయంలో మూడోవంతు ఖర్చు భరించాల్సి ఉంది. ఇందులో భాగంగా మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు 76 కి.మీ. మేర పనులు ఇప్పటికే పూర్తి కాగా, సిద్దిపేట-కొత్తపల్లి మార్గంలో పనులు కొనసాగుతున్నాయని కేంద్రం పేర్కొంది. ఈ ప్రాజెక్టు కోసం అవసరమైన 1,145.6 హెక్టార్ల భూమిలో 1,049.5 హెక్టార్లు మాత్రమే సేకరించగా, మిగిలిన 96.1 హెక్టార్లు ఇంకా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. రూ.926.93 కోట్ల అంచనా వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.416 కోట్లు మాత్రమే చెల్లించిందని కేంద్రమంత్రి తెలిపారు.

భద్రాచలం-కొవ్వూరు ప్రాజెక్టు పురోగతి

119 కి.మీ. కొత్త రైల్వే మార్గంలో 50 శాతం ఖర్చుతో ఏపీ ప్రభుత్వం భాగస్వామిగా ఉన్న ప్రాజెక్టు ఇది. ఇందులో భాగంగా భద్రాచలం -సత్తుపల్లి (56.25 కి.మీ.) లైన్‌ను 2022 మేలో పూర్తి చేశారు. అయితే మిగిలిన పనుల కోసం అవసరమైన నిధుల విషయంలో ఏపీ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన స్పందన రాలేదని కేంద్రం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాలు చురుగ్గా స్పందిస్తేనే పనులు వేగవంతం అవుతాయని కేంద్రం అభిప్రాయపడింది.

వార్షిక ప్రణాళికలో భూపాలపల్లి బైపాస్ రోడ్డు

ఎంపీ కావ్యకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరు అంశాన్ని 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చామని వరంగల్ ఎంపీ కడియం కావ్యకు.. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లేఖ రాశారు. జాతీయ రహదారి 353సీపై భూపాలపల్లి-ఆత్మకూరు-సిరొంచ సెక్షన్‌లో బైపాస్ రోడ్డు నిర్మించాలంటూ.. ఈ ఏడాది ఏప్రిల్ 2న కడియం కావ్య చేసిన విజ్ఞప్తిపై కేంద్రమంత్రి స్పందించారు. బైపాస్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనను వార్షిక ప్రణాళికలో చేర్చామని, డీపీఆర్ రూపొందించేందుకు టెండర్లను ఆహ్వానించామని పేర్కొన్నారు. డీపీఆర్ అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని లేఖలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి.. కడియం కావ్య బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.



'గుట్టల'కొద్దీ పచ్చదనం

చుట్టూరా గుట్టలు.. మధ్యలో పచ్చని పంట చేనులు కనువిందు చేస్తున్నాయి. ఈ మనోహర దృశ్యానికి మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం అటవీప్రాంతంలోని కాచనపల్లి ఆదివాసీ గ్రామం వేదికైంది. ఈ గ్రామ పరిధిలోని గుట్టల మధ్య జూన్ చివరిలో, ఈనెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు ఆదివాసీలు మొక్కజొన్న పంట సాగు చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా పచ్చదనం పరచుకుంది.

- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

సాగర్ సొగసు చూడతరమా..!

■ నిండుకుండలా సాగర్ జలాశయం
■ చరిత్రకు సాక్ష్యం నాగార్జున కొండ ■ మనసుదోచే ఎత్తిపోతల



నాగార్జునసాగర్ ప్రాజెక్టు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్‌కు కొత్తనీరు వచ్చి నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరటంతో జలాశయం కొత్త అందాలను సంతరించుకుంది. గత మూడు రోజులుగా సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. అంతేకాకుండా నిండుకుండలా కనపడుతున్న సాగర్‌లో జలాశయం మీదుగా లాంచీలో నాగార్జునకొండకు వెళ్లటం పర్యాటకులకు మరుపురాని అనుభూతిగా మిగిలిపోతుంది. దీంతో నిత్యం రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది పర్యాటకులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో సాగర్ చుట్టుపక్కల సందర్శనీయ స్థలాలపై ప్రత్యేక కథనం..

ప్రధాన జలవిద్యుత్ కేంద్రం

ఇది సాగర్ ప్రధాన డ్యాం దిగువ ప్రాంతంలో ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ఉంటుంది. ఈ జల విద్యుత్ కేంద్రాన్ని సాగర్ జెన్‌కో ఎస్‌ఈ అనుమతి తీసుకొని సందర్శించాల్సి ఉంటుంది.

చరిత్రకు ప్రతిరూపం నాగార్జునకొండ



నాగార్జునకొండకు వెళ్లాలంటే విజయపురిసౌత్‌లోని లాంచీస్టేషన్ నుంచి 14 కి.మీ.దూరం కృష్ణానదిలో ప్రయాణం చేయాలి. కొండకు చేరుకునేందుకు లాంచీలో 45 నిమిషాల సమయం పడుతుంది. నాగార్జునకొండ ప్రపంచంలోనే రెండవ ఐలాండ్ మ్యూజియం. నాగార్జున సాగర్ పరిధిలోని విజయపురిసౌత్‌లో లాంచీస్టేషన్ నుంచి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లాంచీలు పర్యాటకులకు అందుబాటులో ఉంటాయి. పెద్దలకు లాంచీ టిక్కెట్టు ధర రూ.200, పిల్లలకు రూ 150, మ్యూజియం, మాన్యుమెంట్ సందర్శనకు రూ.30, మ్యూజియం సందర్శనకు 15 సంవత్సరాలలోపు చిన్నారులకు ఉచితం. విజ్ఞాన విహార యాత్రకు గ్రూపుగా వచ్చే విద్యార్థులకు లాంచీ టిక్కెట్‌పై 15 శాతం రాయితీ పర్యాటకశాఖ ఇస్తుంది. అలాగే పార్టీలకు, పంక్షన్‌లకు శాంతిసిరి గంటకు రూ.10,000లు, అగస్త్య లాంచీ గంటకు రూ.8,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు లాంచీస్టేషన్ ఫోన్ 9705188311 నెంబర్‌ను సంప్రదించవచ్చు.

గత ఆనవాళ్లకు చిరునామా అనుపు



నాగార్జునసాగర్ 7కి.మీ. దూరంలో అనుపు పర్యాటక కేంద్రం ఉంది. ఇక్కడ ఆనాటి నాగార్జున విశ్వ విద్యాలయం, ఇక్ష్వాకుల కాలం నాటి యాంపీ స్టేడియం ఆనవాళ్లు ఉన్నాయి. కృష్ణానది లోయలో లభించిన రంగనాథస్వామి దేవాలయాన్ని అదే రాతితో అనుపులోని కృష్ణానది తీరంలో నిర్మించటం విశేషం.

భక్తుల కోర్కెలు తీర్చే సాగర్‌మాత



విజయపురిసౌత్‌లోని కృష్ణానది తీరంలో వేంచేసియున్న సాగర్‌మాత దేవాలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు. భక్తుల కోర్కెలు తీర్చే చల్లనితల్లిగా సాగర్‌మాతకు విశిష్టమైన పేరు ఉంది. ఇక్కడ నెలకొల్పిన జపమాల క్షేత్రం రాష్ట్రంలోనే ప్రత్యేకతను నెలకొంది.

చూపరుల మనస్సుదోచే ఎత్తిపోతల




ఇది సాగర్ నుంచి మాచర్లకు వెళ్ళే రహదారిలో 14కిలో మీటర్ల దూరంలో ఉంది. చంద్రవంక వాగుపై సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతం ఇది. 7 0అడుగుల పై నుంచి జాలువారే నీటి దృశ్యం పర్యాటకుల మనస్సు దోచుకుంటుంది. జలపాతం చూసేందుకు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 టికెట్ ధరను టూరిజంశాఖ వసూలు చేస్తుంది. ఇక్కడ పర్యాటకుల సౌకర్యార్థం రాత్రి బస చేసేందుకు 8 రూములు ఉన్నాయి. 5 ఏసీరూమ్‌లు, 3 నాన్‌ఏసీ రూములు ఉన్నాయి. ఏసీ రూమ్ ధర రూ.1,600, నాన్‌ఏసీ రూ.వెయ్యి. ఇతర వివరాలకు ఎత్తిపోతల మేనేజర్ దత్తకుమార్ ఫోన్‌నెంబర్ 94414 53115 నెంబరులో సంప్రదించవచ్చు.

మెడికిల్స్



నిబంధనలు పాటించని మెడికల్ షాపులు

- ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయాలు
- ఫిజీషియన్ శాంపిళ్లు, కాలం చెల్లిన మందుల అమ్మకాలు
- షాపుల్లో బినామీల దందా
- కానరాని ఫార్మసిస్టు
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు
- ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్న అమాయకులు





మీకు తల నొప్పి వస్తుందా?.. తరచూ జ్వరం బారినపడుతున్నారా?.. కడుపు, ఒళ్లు నొప్పులతో భరించ లేకపోతున్నారా?.. నిద్ర పట్టడం లేదా?.. మీకు భయమేమీ లేదు.. అనారోగ్య సమస్య గురించి చెబితే చాలు.. ప్రిస్క్రిప్షన్ లేకుండానే మెడికల్ షాపుల్లో అన్నిరకాల మందులు ఇచ్చేస్తారు. ఎంత మొత్తంలో కావాలన్నా విక్రయిస్తారు. ఏ మందు వేసుకోవాలో.. రోజుకు ఎన్ని వేసుకోవాలో.. ఎన్ని రోజులు వాడాలో కూడా వారే సూచిస్తారు. ఇలా చిత్తూరు జిల్లాలో మెడికల్ షాపుల నిర్వాహకులు అడ్డగోలు వ్యాపారం చేస్తున్నారు. అధికారులు ఏదో ఓ సారి తనిఖీ చేయడం, నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపు కోవడం విమర్శలకు తావిస్తోంది.

చిత్తూరు రూరల్ (కాణిపాకం): డ్రగ్స్, కాలపరిమితి దాటిన, నకిలీ మందుల విక్రయాలు సైతం చిత్తూరు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. డాక్టర్ రాసిన కంపెనీ ఔషధాలు లేకుంటే, వాటికి బదులు వేరే కంపెనీ మందులు అంటగడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. సేమ్ ఫార్ములా.. కంపెనీ మాత్రమే వేరు.. ఇది కూడా దానిలాగే పనిచేస్తుంది.. అని ఉచిత సలహాలు ఇస్తున్నారు. జిల్లాలో సుమారు 1,500 వరకు రిటైల్, హోల్సేల్ మెడికల్ షాపులున్నాయి. అలాగే చాలామంది క్లినిక్‌లోనే మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకున్నారు. రోజూ ప్రతి చిన్న, పెద్ద దుకాణాల్లో రూ.5 వేల నుంచి రూ.లక్ష దాకా వ్యాపారం సాగుతోంది. ఈ వ్యాపారం ఇష్టానుసారంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

తారుమారు

డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్టు- 1940, ఫార్మసీ యాక్టు- 1948 ప్రకారంగా బీ ఫార్మసీ లేదా ఎం.ఫార్మసీ పూర్తిచేసిన వారే మెడికల్ షాపులు నిర్వహించాలి. షాపు పర్మిషన్ తీసుకునే సందర్భంలో సంబంధిత ఫార్మసిస్టుల సర్టిఫికెట్లతో పాటు వ్యక్తి గత గుర్తింపుకార్డు ప్రతులు, చిరునామా తదితర వివరాలు దరఖాస్తుతో జతచేసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమర్పించాలి. అనుమతి మంజూరైన తర్వాతే షాపులు నిర్వహించాలి. జిల్లాలో మెడికల్ షాపులు చాలామంది బినామీలే నిర్వహిస్తున్నారు. ప్రొఫెషనల్ ఫార్మసిస్టు ఆధ్వర్యంలో అవగాహన ఉన్న సిబ్బందితోనే దుకాణాలను నిర్వహించాలి. చాలామంది తక్కువ వేతనంతో యువకులను పనిలో పెట్టుకుంటున్నారు. మెడికల్‌పై పరిజ్ఞానం లేని వ్యక్తులు షాపులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.



మెడికల్‌షాపు తనిఖీలో అధికారులు (ఫైల్)


ఇదోరకమైన దందా..

జనరిక్, నాన్ జనరిక్ తేడా లేకుండా షాపుల నిర్వాహకులు ఔషధ కంపెనీలతో పర్సంటేజీలు మాట్లాడుకొని వైద్యులతో కుమ్మక్కై ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు చేసిన మందులకు కనీసం బిల్లులు కూడా ఇవ్వకుండా విక్రయాలు చేస్తున్నారు. యాంటీబయాటిక్ మందులను డాక్టర్ల సూచనల మేరకు ఇవ్వాలి. కానీ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ ఇస్తున్నట్లు సమాచారం. దీంతో అనవసరంగా యాంటీబయాటిక్ మందులు వాడిన వారు సైడ్ ఎఫెక్ట్‌తో కొత్తరోగాల బారిన పడుతున్నారు. ఇక బెంగళూరు నుంచి పలు రకాల బ్రాండ్‌ల పేరుతో అనధికారికంగా మందులు, మాత్రలు సరఫరా అవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇవీ తక్కువ రేటుకు ఇస్తుండడంతో మార్కెట్‌లో విచ్చలవిడిగా లభ్యమవుతున్నట్టు తెలుస్తోంది.

కలెక్టర్ ఆదేశాలతో రెండు నెలలకు క్రితం చిత్తూరు నగరంలోని పొన్నియమ్మ గుడివీధిలోని రెండు మెడికల్ షాపులపై డ్రగ్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో విక్రయానికి అనుమతి లేని మందులను గుర్తించారు. మందులు, మాత్రల విక్రయాలకు సంబంధించిన వివరాలు సక్రమంగా లేవని తెలుసుకున్నారు. దీంతో ఆ షాపును సీజ్ చేయగా..మరో షాపునకు నోటీసులు ఇచ్చారు. ఇది ఒక్కటే కాదు.. ఇలా వందల సంఖ్యలో మెడికల్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి.



ఉయ్యాలవాడలో పొలం బాట పట్టిన మోడల్‌స్కూల్ విద్యార్థులు



పొలానికి వెళ్లి నాట్లు వేసి

తరగతి గదుల్లో రోజూ పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు పొలం బాట పట్టారు. విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై ఆసక్తి కల్పించేంచడంతో పాటు, రైతుల వ్యయ ప్రయాసలు, సాగు తదితర వివరాలపై అవగాహన కల్పించేందుకు కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు గురువారం విద్యార్థులను పొలానికి తీసుకెళ్లారు. వరి నాట్లు వేసి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మోతాదులో రసాయనిక ఎరువులు, వరి మొక్క నాణ్యత, నీటి వినియోగం, తదితర విషయాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వీరి వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్, ట్రైనర్ హుసేన్‌వలి ఉన్నారు. - ఉయ్యాలవాడ



రైతు పొలంలో వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు

నూతన ఆవిష్కరణలకు ఏఎన్‌ఆర్‌ఎఫ్ సహకారం

ఏర్పేడు: శాస్త్ర, సాంకేతిక రంగంలో నూతన ఆవిష్కరణలకు ఏఎన్‌ఆర్‌ఎఫ్ (అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్) నిబద్ధతతో పనిచేస్తోందని ఏఎన్‌ఆర్‌ఎఫ్ సీఈవో శివకుమార్ కళ్యాణరామన్ అన్నారు. ఆయన శుక్రవారం తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీని సందర్శించి, సహకార పరిశోధనా కార్యక్రమాలు, ఆవిష్కరణ వ్యూహాలపై అధ్యాపకులతో చర్చలలో పాల్గొన్నారు. సహకార, అంతర్ విభాగ పరిశోధన ప్రతిపాదనలను పెంపొందించడం, ప్రభావవంతమైన పరిష్కారాల కోసం లోతైన సాంకేతిక పరిశోధన, అభివృద్ధి, ఆర్‌అండ్‌డీ వ్యూహాలను గురించి వివరించారు. పరిశోధకుల సామర్థ్య నిర్మాణం, అధునాతన పరిశోధన గ్రాంట్లు, కన్వర్జెన్స్ హబ్-అండ్-స్పోక్ పరిశోధన నమూనాలు, పీఎం-ఈసీఆర్‌జీ పథకం, మెడ్‌టెక్‌లో సవాళ్లను పరిష్కరించడం వంటి అంశాలపై లోతుగా చర్చించారు. భారతీయ సంస్థలలో పరిశోధనా నైపుణ్యం, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు.

మలేషియా వర్సిటీతో ఎస్పీడబ్ల్యూ కళాశాల ఒప్పందం

తిరుపతి సిటీ : యూనివర్సిటీ ఆఫ్ మలేషియా తెరెంగ్గానుతో పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల మధ్య విద్యాభివృద్ధిపై ప్రతిష్టాత్మక ఒప్పందం కుదిరింది. ఈ మేరకు శుక్రవారం పద్మావతి డిగ్రీ కళాశాల బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ, మలేషియా వర్సిటీ ఫిషరీస్ అండ్ ఫుడ్ సైన్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ మన్సూర్ ఇస్మాయిల్ షేక్ ఒప్పందపు పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్య, పరిశోధన, సాంస్కృతిక అంశాలతో పాటు విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలపై పరస్పర సహకారం అందిపుచ్చుకునేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ సి భువనేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గీత రాత మారేనా?

కూటమి మొండిచేయి

- గీత కార్మికులకు ఇచ్చిన హామీల అమలెప్పుడు?
- ఏడాది దాటినా పట్టించుకోని కూటమి సర్కారు
- వాడవాడలా బెల్టు షాపులు
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కల్లుగీత ఛిన్నాభిన్నం
- సుమారు 25 వేల మంది కార్మికులకు కష్టం





గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న నాయకులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కల్లు గీత కార్మికులు తమ రాత మారేనా.. కష్టాలు తీరేనా అని ఎదురుచూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమ జీవితాల్లో వెలుగులు నింపితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వేదనను మిగిలుస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఊరూవాడా బెల్టు షాపులు, విచ్చలవిడిగా మద్యం అమ్మకాలతో గీత వృత్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సుమారు 9 వేల బెల్టుషాపులు ఉన్నాయని గీత కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. గత ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన కూటమి నాయకులు గద్దెనెక్కిన తర్వాత తమను పట్టించుకోవడం లేదని అంటున్నారు. కల్లుగీత వృత్తిపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 25 వేల మంది కార్మికులు ఆధారపడి ఉన్నారంటున్నారు.

9 వేలకు పైగా బెల్టు షాపులు

ఏలూరు జిల్లావ్యాప్తంగా సుమారు 5 వేలు, పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సుమారు 4 వేలు బెల్టు షాపులు ఉన్నాయి. కూటమి నాయకులు, వారి అనుచరులే బెల్టుషాపులను నిర్వహిస్తున్నారని, దీంతో గీత వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం గీత కార్మికులు ఉందని ఆవేదన చెందుతున్నారు. బెల్టు షాపులపై కొరడా ఝుళిపిస్తామని ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రి ప్రకటనలు చేయడం తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యల పరిష్కారం కోసం గీత కార్మికులు ఆందోళన బాట పట్టారు. ఇప్పటికే సర్కిల్ వారీగా సభలు, సమావేశాలు నిర్వహించిన కార్మికులు ఆందోళనను ఉధృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈనెల 18న ఏలూరు కలెక్టరేట్ వద్ద భారీ ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

కల్తీ మద్యం హల్‌చల్!

ఉమ్మడి జిల్లాలో కల్తీ మద్యం హల్‌చల్ చేస్తున్నట్లు గీత కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గోవా, యానాం నుంచి అక్రమ మద్యం తీసుకువస్తున్నారని చెబుతున్నారు. అనకాపల్లి, పరవాడ కేంద్రంగా కబళిస్తున్న కల్తీ మద్యం రాకెట్ పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లును స్థావరంగా చేసుకుందని అంటున్నారు. పాలకొల్లులో కల్తీ మద్యం తయారుచేసి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కాకినాడ జిల్లాలకు సరఫరా చేస్తున్నట్టు వార్తలు వస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. బెల్టు షాపుల్లో అధికంగా కల్తీ మద్యం విక్రయిస్తున్నారని, హైదరాబాద్ నుంచి స్పిరిట్‌ను తీసుకువచ్చి రంగు నీళ్లు కలిపి మద్యంగా తయారు చేసి బ్రాండెడ్ కంపెనీల బాటిల్స్‌లో నింపి ప్రముఖ బ్రాండ్ల లేబుల్ అతికించి షాపుల్లో విక్రయిస్తున్నారని అంటున్నారు. తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత అనుచరుడే కల్తీ మద్యం దందా నడుపుతున్నట్టు విస్తృత ప్రచారం జరుగుతోందని గీత కార్మికుల నాయకులు ఆరోపిస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఆపన్న హస్తం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గీత కార్మికులకు **ఆపన్న హస్తం అందించింది.** నాటి సీఎం **వైఎస్ జగన్ నూతన** ఎక్సైజ్ పాలసీ తీసుకువచ్చారు. **గీత పన్ను** రద్దు చేశారు. కల్లు గీత కార్మిక సొసైటీలు, **గీత** గీచే వారికి చెట్టు పథకం **అమలు చేశారు. కల్లు** తీస్తూ ప్రమాదానికి గురైశాశ్వత వైకల్యం పొందితే నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇప్పించి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను చూపించారు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా నష్టపరిహారం చెల్లించారు. **ప్రమాదాల్లో మరణిస్తే** ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. ఎన్‌ఈఆర్‌జీఎస్, షెల్టర్ బెడ్ అభివృద్ధి పథకాల ద్వారా తాటి, ఈత వంటి చెట్లు పెంచేలా చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా కాలువ గట్లు, నదీ, సాగర తీరాలను పటిష్టం చేస్తూ కల్లు గీతకు కావాల్సిన తాటి, ఈత చెట్లు సమృద్ధిగా పెరిగేలా చర్యలు తీసుకున్నారని గీత కార్మికులు గుర్తుచేసుకుంటున్నారు.

బెల్టు షాపులు తొలగించాలి



గీత వృత్తిని దెబ్బ తీస్తున్న మద్యం బెల్టు షాపులను తక్షణం తొలగించాలి. ఊరూవాడా తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ బెల్టు షాపులు వెలియడంతో కల్లు గీత వృత్తి మరుగున పడే ప్రమాదం ఉంది. గీత వృత్తిని కాపాడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–బెజవాడ వెంకటేశ్వరరావు, గీత కార్మికుడు, చొదిమెళ్ల, ఏలూరు మండలం

హామీలు అమలుచేయరా?



ఎన్నికల ముందు కూటమి నాయకులు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలి. బెల్టు షాపులు పెడితే తోలు తీస్తామని ప్రకటిస్తున్నా అమలులో శ్రద్ధ చూపడం లేదు. కూటమి నాయకులే దగ్గరుండి తమ అనుచరులతో బెల్టు షాపులు పెట్టించడం సిగ్గుచేటు.

– గూడవల్లి వెంకటనారాయణ, గీత కార్మికుడు, భీమడోలు

గత ప్రభుత్వంలో మేలు



గీత కార్మికులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేలు చేసింది. అక్రమ మద్యం, బెల్టుషాపులు లేకుండా చూశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడిగా బెల్టుషాపులు ఉన్నాయి. గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసింది.

– సింహాద్రి ఆదినారాయణ, గీత కార్మికుడు, చల్ల చింతలపూడి, దెందులూరు మండలం

పట్టించుకోని అధికారులు



ఉమ్మడి జిల్లాలో అక్రమ మద్యం ఏరులై పారుతున్నా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. నాటు సారా పేరుతో గీత కార్మికులపై దాడులు చేస్తూ వేధిస్తున్నారు. ఓపక్క కల్లు వ్యాపారం లేక ఉపాధి కోల్పోతున్న గీత కార్మికులు అధికారుల వేధింపులతో వృత్తికి దూరమవుతున్నారు.

– జుత్తిగ నరసింహమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కల్లుగీత కార్మిక సంఘం, భీమవరం

● చదువుకుందామా

అడవి ఒడిలో పచ్చని బడి





మీరు పాఠాలెక్కడ వింటారు? స్కూల్లో క్లాసులో బెంచీల మీద కూర్చొని, బోర్డు మీద టీచర్ రాసిన అక్షరాలు చూస్తూ పాఠాలు వింటారు. మరి అడవిలో చెట్ల మధ్య కూర్చొని, ఆ చల్లగాలిని, వాతావరణాన్ని ఆస్వాదిస్తూ పాఠాలు వింటే ఎలా ఉంటుంది? చాలా కొత్తగా ఉంటుంది కదా? విద్యార్థులకు అలాంటి అనుభూతినే అందిస్తున్నాయి కొన్ని పాఠశాలలు. దీన్నే "Forest Schooling' - (అరణ్య విద్యాభ్యాసం) అంటారు.

పిల్లల్ని క్లాసుల్లో ఉంచి, వారికి నిర్బంధంగా పాఠాలు చెప్పడాన్ని కొందరు విద్యావేత్తలు చాలా ఏళ్ల క్రితమే నిరసించారు. అందుకు భిన్నంగా వారిని ప్రకృతికి దగ్గర చేసేలా పాఠాలు చెప్పాలని యోచించారు. ఆ సమయంలో వారికొచ్చిన ఆలోచనే 'అడవుల్లో పాఠశాలలు'. 1950లలో మొదటిసారి స్వీడన్‌లో ప్రారంభమైన ఫారెస్ట్ స్కూల్స్ ఆ తర్వాత ఇతర దేశాలకు వ్యాపించాయి. ప్రధానంగా డెన్మార్క్ దేశంలో ఇవి చాలా ప్రఖ్యాతి పొందాయి.

ఈ ఫారెస్ట్ స్కూల్‌లో 3 సంవత్సరాల పైబడిన పిల్లలను వారంలో ప్రతిరోజూ 4 గంటలు అడవిలోకి తీసుకువెళ్తారు. అలా వెళ్లేటప్పుడు వారు తమతోపాటు బొమ్మలు తీసుకెళ్లరు. వాటికి బదులుగా అడవి అందించే వస్తువులను మాత్రమే ఉపయోగించి వారు ఆడుకుంటారు. వారు వెళ్లే చోట వారికోసం ఒక గుడిసె లేదా టెంట్ లాంటిది ఏర్పాటు చేస్తారు. వర్షం వచ్చినా, ఇతర అవసరాలున్నా, భోజనాలు చేయాలన్నా దాన్ని వినియోగిస్తారు. మిగిలిన సమయమంతా అడవిలో గడుపుతారు.

ఫారెస్ట్ స్కూల్‌లో పాఠాల కన్నా ఎక్కువగా ప్రకృతిని పరిశీలించడం, దానితో మమేకమవడం ఉంటుంది. అక్కడ తిరిగే చిన్న జంతువులను గమనించడం, నీటి కుంటల్లో జాగ్రత్తగా దిగడం, చెట్లను పరిశీలించడం చేస్తుంటారు. ఇవన్నీ టీచర్ల పర్యవేక్షణలోనే సాగుతాయి. పిల్లలు ప్రమాదకరమైన పనులు చేయకుండా వారు అనుక్షణం గమనిస్తూ ఉంటారు. పాఠాలు చెప్పే టీచర్లే తమను ఆడుకొమ్మని ప్రోత్సహిస్తుండటంతో పిల్లలు చాలా ఉత్సాహంగా ఉంటారు. చెట్లెక్కుతూ, బురదలో దిగుతూ, జంతువులను వెంటాడుతూ సాయంత్రం దాకా ఆనందంగా గడుపుతారు. దీనివల్ల పిల్లల్లో స్వాతంత్ర్య భావజాలం, పరిసరాల పట్ల అవగాహన, ఆత్మ విశ్వాసం పెరుగుతాయి.






● వండర్ కిడ్

ఐదేళ్ల వయసులో... ఎవరెస్ట్ బేస్‌ను అందుకుంది



ఎవరెస్ట్ శిఖరం చేరుకోవడం ప్రపంచంలోని పర్వతారోహకులందరికీ జీవితాశయం. ప్రపంచంలో ఎత్తైన పర్వతాన్ని అధిరోహించి, ఆ విజయాన్ని తమ ఖాతాలో వేసుకోవాలని ఉవ్విళ్లూరుతుంటారు. ఏటా అనేకమంది అందుకోసం ప్రయత్నిస్తూ ఉంటారు. అనేక సవాళ్లతో కూడిన ఆ ప్రయాణం అందరికీ సాధ్యం కాదు. కానీ ఐదేళ్ల వయసుకే ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేరుకుని రికార్డు సృష్టించింది మహారాష్ట్రలోని థానేకు ప్రిషా లోకేష్ నికాజూ. ఈ ఘనత సాధించిన అతి చిన్నవయస్కురాలిగా నిలిచింది. తన తండ్రి లోకేష్ నికాజూకు పర్వాతరోహణ మీద ఆసక్తి. ఆయనతో కలిసి చిన్ననాటి నుంచే పలు ప్రాంతాలకు వెళ్లిన ప్రిషాకు పర్వతారోహణపై ఆసక్తి ఏర్పడింది. దీనికి తండ్రి ప్రోత్సాహం తోడవడంతో మూడేళ్ల నుంచే అందుకు తగ్గ శిక్షణ పొందింది. ప్రతిరోజూ ఎనిమిది నుండి తొమ్మిది కిలోమీటర్లు నడవడం, ఏరోబిక్స్ తరగతులకు హాజరు కావడం చేసేది. తన ఇంట్లోని గోడలు ఎక్కడం, దూరాలు దూకడం ద్వారా తనను తాను మెరుగుపరుచుకుంది. 2021లో మహారాష్ట్రలోని ఎత్తైన కల్సుబాయి శిఖరాన్ని అధిరోహించింది. ఆ తర్వాత పర్వతారోహకులంతా కలలు కనే ఎవరెస్ట్ శిఖరాన్ని తన లక్ష్యంగా చేసుకుంది. 2023లో ఐదేళ్లకే తండ్రితో కలిసి ట్రెక్కింగ్ చేస్తూ 5,364 మీటర్ల ఎత్తున బేస్ క్యాంప్‌కు చేరుకుంది. ఈ ప్రయాణంలో ఎక్కడా తను అలిసిపోకపోవడం, అనారోగ్యం బారిన పడకపోవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. పెద్దయ్యాక శిఖరాన్ని తప్పక చేరుకుంటానని నమ్మకంగా చెప్తోంది. తన ధైర్యం, సాహసం చూసి అందరూ తనను అభినందిస్తున్నారు.



● మేజిక్ వర్డ్స్

అబ్రకడబ్రా హకూనా మటాటా



చిన్నారులూ... మీరెప్పుడైనా ఈ వింత పదబందాలను విన్నారా? స్కూల్స్‌లో గాని, మ్యాజిక్ క్యాంప్‌లలో మెజీషియన్స్ ద్వారా గాని, సినిమాల్లో కానీ - ఎక్కడో చోట వీటిని వినే ఉంటారు కదా. మరి వీటి అర్థాలు ఏంటి? ఇవి ఎక్కడనుండి ఉద్భవించాయి అని ఎప్పుడైనా ఆలోచించారా? ఈ విచిత్రమైన పదబందాలు గాలి వాటున వచ్చినవి కావు. వీటి పుట్టుక వెనుక ఒక చిన్నపాటి చరిత్రే ఉంది. వాటి తాలూకా చరిత్ర, అర్థాలను ఇప్పుడు తెలుసుకుందాం.



అబ్రకడబ్రా

అబ్రకడబ్రా అనే పదబందానికి అర్థం 'నేను చెప్పిందే జరుగుతుంది'. ఇది 2వ శతాబ్దంలో రోమన్ వైద్యుడు సెరెనస్ సమ్మోనికస్ రాసిన లిబర్ మెడిసినాలిస్ అనే గ్రంథంలో మొదటిసారిగా కనిపిస్తుంది. ఈ పదాన్ని జ్వరం నుండి రక్షణ కల్పించే మంత్రంగా ఉపయోగించేవారని చరిత్ర చెబుతుంది. ఆకు లేపనాన్ని గొంతు మీద రాసి 'అబ్రకడబ్రా' అని చెప్పగానే జ్వరం నుండి విముక్తి పొందినట్లుగా భావించేవాళ్ళంట నాటి ప్రజలు. కాలక్రమేణా నవలలు, సినిమాల ప్రభావం చేత ఈ పదం ప్రస్తుతం సరదా సంభాషణలలో మాయామంత్రంగా ఉపయోగించబడుతుంది.

హకూనా మటాటా

హకూనా మటాటా అనేది స్వాహిలీ భాషా పదబంధం. దీని అర్థం 'చింత లేదు' (No worries). ఇది తూర్పు ఆఫ్రికాలో ముఖ్యంగా కెన్యా, టాన్జానియా వంటి దేశాలలో స్వాహిలీ మాట్లాడే సంఘాలలో సాధారణంగా ఉపయోగించబడుతుంది. ఇది 1994లో విడుదలైన డిస్నీ చిత్రం 'ది లయన్ కింగ్' ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. చిత్రంలోని పాట ''హకూనా మటాటా'' టిమన్ మరియు పుంబా అనే పాత్రలచే పాడబడింది. ఇది ఒత్తిడి లేని, ఆనందమైన జీవనశైలిని సూచిస్తుంది.

హోకస్ పోకస్

ఈ పదబంధం 17వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో స్టేజ్ మాజిక్‌లో ఉపయోగించబడింది. ఈ పదబందాన్ని 'ఇది నా శరీర' అనే అర్థంలో ఉపయోగిస్తారు. ఇది లాటిన్ పదం ''హోక్ ఎస్ట్ కార్పస్ మీయమ్'' (హొఛి ఛ్టి ఛొటఐఉరఝ్బ్బఋ) నుండి వచ్చినట్లు కొందరు భావిస్తారు. ఇది కాథలిక్ మాస్‌లో ఉపయోగించబడుతుంది. దీనిని మాయాజాలికులు వినోదం కోసం ఉపయోగించారు.

అలకజామ్

ఈ పదం 20వ శతాబ్దంలో అమెరికన్ స్టేజ్ మాజిక్‌లో ప్రాచుర్యం పొందింది. దీని ఖచ్చితమైన మూలం సాహిత్యంలో పొందుపరచబడలేదు కానీ ఇది అరబిక్ లేదా హిందీ పదాల నుండి ప్రేరణ పొందినట్లు భావిస్తారు. అలకజామ్ అనగా 'అద్భుతం' అని అర్థం.

సిమ్ సలా బిమ్

ఈ పదబంధం డానిష్ మాయాజాలికుడు దాంటే వల్ల 20వ శతాబ్దంలో ప్రాచుర్యం పొందింది. ఇది ఒక డానిష్ నర్సరీ రైమ్ నుండి వచ్చినట్లు భావిస్తారు. దీనికి ఖచ్చితమైన అర్థం లేకపోయినప్పటికీ ఇది స్టేజ్ మాజిక్‌లో ఉపయోగించబడుతుంది. మాయాజాల ప్రదర్శనలో భాగంగా మెజీషియన్ ''సిమ్ సలా బిమ్'' అని పలుకుతూ మ్యాజిక్ చేస్తాడు.

● మహనీయులు

తెలుగవారికి సేవలందించిన ధీరుడు
కడప కోటిరెడ్డి



తెలుగునేల మీద ఎంతోమంది మహనీయులు దేశస్వాతంత్ర్యం కోసం పోరాడారు. తమ ధన, ప్రాణాలను అందుకోసం వెచ్చించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక నేతలుగా ఎదిగి అందరికీ సేవలందించారు. అటువంటివారిలో ఒకరు కడప కోటిరెడ్డి. కడప కోటిరెడ్డి చిత్తూరు జిల్లా మదనపల్లె తాలూకాలోని నారాయణ చెరువు (కోటిరెడ్డిగారి పల్లె)లో 1886లో జన్మించారు. ఆయనకు చిన్ననాటి నుంచి ఆదర్శభావాలు ఎక్కువ. పేదలకు సాయం అందించడం, అందర్నీ ఆత్మీయంగా చూడటం ఆయనకు అలవాటు. 1911లో ఇంగ్లాండులోని మిడిల్ టెంపుల్ నుండి బారిష్టర్‌గా పట్టా పొందారు. అనంతరం స్వదేశం చేరుకొని కడపలో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. దీంతోపాటు రైతుగా మారి వ్యవసాయం కూడా చేసేవారు.

ఆ సమయంలో దేశంలో స్వాతంత్ర్య ఉద్యమం ఉధృతంగా సాగుతోంది. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల హరి సర్వోత్తమరావుతో కలిసి రాయలసీమలో హోమ్ రూల్ ఉద్యమంలో పాల్గొన్నారు కోటిరెడ్డి. ఆ సమయంలోనే ఆయనకు కల్లూరు సుబ్బారావు, పప్పూరు రామాచార్యులతో స్నేహం ఏర్పడింది. అందరూ కలిసి జాతీయోద్యమానికి తమవంతు సహకారం అందించేవారు. కోటిరెడ్డి 1921లో మహాత్మాగాంధీతో కలిసి రాయలసీమ అంతా పర్యటించారు. 1929లో స్వతంత్ర సభ్యుడిగా మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యారు. 1940లో ఉప్పు సత్యాగ్రహంలో కోటిరెడ్డి క్రియాశీలకంగా పాల్గొన్నారు. దీంతో బ్రిటిష్ అధికారులు ఆయన్ను జైలుకు తరలించారు. ఆయన భార్య రామసుబ్బమ్మ సైతం స్వాతంత్ర్య ఉద్యమం పాల్గొన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని రాజాజీ ప్రభుత్వంలో దేవాదాయశాఖ మంత్రిగా కోటిరెడ్డి పనిచేశారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత టంగుటూరి ప్రకాశం పంతులు మంత్రివర్గంలో పనిచేశారు. తుదిశ్వాస వరకూ రాష్ట్రానికి సేవలందించిన కోటిరెడ్డి మహనీయులు.


● పుస్తకాలు

ఊహాలోకపు తలుపులు తెరిచే కథలు

పిల్లలకు ఊహాలోకాలంటే ఎంతో ఇష్టం. రాకుమారులు, రాకుమార్తెలు, మంత్రగత్తెలు, భూతాలు, మాంత్రికులు, మరుగుజ్జు మనుషులు.. ఇలా అనేక పాత్రలను వారు ఆ లోకంలో ఊహించుకుంటారు. ఆ ఊహాలోకపు తలుపులు తెరిచే కథలివి. అబ్బురపరిచే కథలకు తోడు చక్కని బొమ్మలు జత కట్టడంతో ఈ పుస్తకం పిల్లల్ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. మృగం అందాల రాకుమారుడిగా మారిపోవడం, చాక్లెట్లూ కేకులతోనూ కట్టిన ఇల్లు, కొయ్యబొమ్మ మాట్లాడటం వంటివన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి.



ఆదర్శం పెంపొందించే రచయిత్రి జీవితం



రచయిత్రి జాక్వెలిన్ వుడ్సన్ 2014లో పద్యాల రూపంలో రాసిన తన చిన్ననాటి జ్ఞాపకాలే ఈ పుస్తకం. 1960లలో ఆఫ్రికన్ అమెరికన్ అమ్మాయిగా ఎదుగుతున్న తన బాల్య జీవితాన్ని ఇందులో ఆమె వివరించారు. తాను రచయిత్రిగా మారడానికి దారితీసిన సంఘటనలను వర్ణించారు. పిల్లలు తప్పకుండా చదవాల్సిన పుస్తకాల్లో ఒకటిగా అనేకమంది ఈ పుస్తకాన్ని పేర్కొంటారు. ఈ పుస్తకం అనే అవార్డులను గెలుచుకుంది.

● వండర్ వరల్డ్

ఇసుక కొండ... భలేగుండ...

సముద్రం దగ్గర ఇసుక ఉంటుంది. అప్పుడప్పుడు కొత్త ఇళ్ల దగ్గర ఇసుకను చూస్తాం. గ్రౌండ్స్‌లో కూడా ఇసుక పోస్తారు ఆడుకునేందుకు. కాని ఇసుక దీవి దానిలో ఇసుక కొండ ఉంటే? ఈ వింతను చూడటానికి అందరూ పాలోమని ఫ్రాన్స్‌కు పోతారు. అక్కడి ఆర్కహాన్ తీరంలో ఉన్న ఇసుక దీవే 'డ్యూన్ డూ పిలా'. లేదా ఇంగ్లిష్‌లో 'డ్యూన్ ఆఫ్ పిలా'. దాదాపు మూడు కిలోమీటర్ల పొడవు ఉండే ఈ తీరంలో ఒక వైపుగా పెద్ద ఇసుక కొండ ఉంటుంది. ఎంత ఎత్తో తెలుసా? 106 మీటర్లు. అంటే దాదాపు 40 అంతస్తుల బిల్డింగ్ అంత ఎత్తు. అందుకే టూరిస్టులు ఇక్కడకు వచ్చి ఆపసోపాలు పడి ఆ ఇసుక కొండ చివరకు చేరుతారు. మరి ఇంత ఇసుక ఇక్కడ పోగు పడటానికి కారణం ఏమిటో ఎవరికీ తెలియదు. టూరిస్టులు కొండ చివర నుంచి పారాగ్లైడింగ్ ధైర్యంగా చేస్తుంటారు. కారణం? పడినా ఇసుకేగా? ఏం దెబ్బలు తగలవు. మీరు పెద్దయ్యాక సరదాగా ఫ్రాన్సు వెళ్లి ఈ వింతను కనండి.







● కథ

సవాలు



అది శీతాకాలం. జనం గజగజ వణికిపోతున్నారు. బయటకు వచ్చేవారు ఒంటి నిండా ఉన్ని దుస్తులు కప్పుకొని వస్తున్నారు. ఆ కాలంలో ఓ పగటిపూట అడవిగుండా ఓ బాటసారి వణుకుతూ నడుచుకుంటూ వెళ్తున్నాడు. అతణ్ని చూసిన చల్లగాలి 'చూశావా నా ప్రతాపం? నేను వీస్తున్నానని అతనెంత భయపడుతూ, వణుకుతూ వెళ్తున్నాడో' అని సూర్యుడితో అంది.

ఆ మాటలకు సూర్యుడు నవ్వి, 'అది నీ గొప్పతనం కాదు. కాల మహిమ. ఇది శీతాకాలం కాబట్టి నువ్వు చల్లగా వీస్తూ ప్రజల్ని వణికిస్తున్నావు. అదే వేసవిలో అయితే నువ్వు వడగాడ్పువి అవుతావు. అప్పుడు జనం నిన్ను చిరాకు పడతారు' అన్నాడు. ఆ మాటలకు చల్లగాలికి కోపం వచ్చింది. 'అయితే నా గొప్పతనమేమీ లేదంటావ్? అయితే ఇప్పుడు చూడు నా ప్రతాపం. అక్కడ వెళ్తున్న ఆ మనిషి ఒంటికి వేసుకున్న కోటును నా శక్తితో ఎగిరిపోయేలా చేస్తాను. అది నువ్వు చేయగలవా?' అని అడిగింది.

'ఇతరుల్ని అలా ఇబ్బంది పెట్టడం తప్పు' అని సూర్యుడు హితవు పలికాడు.

'నీకు ధైర్యం ఉంటే నాతో సవాలుకు ఒప్పుకో. అతని కోటు ఎగిరిపోయేలా చేస్తాను. నువ్వు చేయగలవేమో చూస్తాను' అంది. సూర్యుడు చిన్నగా నవ్వుకున్నాడు.

చల్లగాలి తన ప్రతాపంతో గట్టిగా గాలి ఊదింది. దీంతో అడవిలో గాలి హోరెత్తింది. నడుస్తున్న బాటసారికి ఏం చేయాలో తోచలేదు. తన ఒంటిపై ఉన్న కోటును మరింత గట్టిగా అదిమిపట్టుకున్నాడు. చల్లగాలి మరింత విజృంభించింది. అతను మరింత కోటును విడవకుండా పట్టుకున్నాడు. అలా ఐదు నిమిషాలు ప్రయత్నించినా చల్లగాలి ఎత్తు పారలేదు. 'నా వల్ల కాలేదు. ఇప్పుడు నువ్వు ప్రయత్నించు' అని సూర్యుడి వంక చూసి అంది.

'కోటు ఎగిరిపోయేలా చేయలేను. కానీ తనంతతానుగా అతను కోటు తీసేసేలా చేయగలను' అన్నాడు సూర్యుడు. అలాగా అని ఎగతాళి చేసింది చల్లగాలి.

సూర్యుడు మెల్లగా తన కిరణాలను అడవిపై ప్రసరింపజేశాడు. చల్లగాలి తగ్గి, వెచ్చదనం పెరిగింది.

దీంతో బాటసారికి హాయిగా అనిపించింది. అలా నడుస్తూ, వేడిని ఆస్వాదించాలని ఒంటిపై కోటును తీసి చేత్తో పట్టుకున్నాడు. పరాభవంతో చల్లగాలి తలదించుకుంది. చెప్పింది చేసి చూపించినందుకు సూర్యుడు చిరునవ్వులు చిందించాడు.

బిజినెస్ రీల్

పూర్తిగా వెనక్కి రాని 2,000 నోట్లు

రూ.6,017 కోట్ల మేర ప్రజల వద్దే



ముంబై: మార్కెట్ నుంచి 2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించి రెండేళ్లు దాటినా.. ఇప్పటికీ రూ.6,017 కోట్ల విలువ చేసేవి వెనక్కి తిరిగి రాలేదు. 2023 మే 19న రూ.2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. చట్టపరంగా చెల్లుబాటును రద్దు చేయలేదు. 2023 మే 19 నాటికి వ్యవస్థలో రూ.3.56 లక్షల కోట్ల విలువ చేసే పెద్ద నోట్లు చలామణిలో ఉన్నాయి. 2025 జూలై 31 నాటికి రూ.6,017 కోట్లకు తగ్గిపోయినట్టు ఆర్‌బీఐ డేటా వెల్లడించింది. నాడు చలామణిలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో 98.31 శాతం వెనక్కి వచ్చినట్టు తెలిపింది. తొలుత బ్యాంకుల్లో ఈ నోట్ల మార్పిడికి అవకాశం కల్పించడం తెలిసే ఉంటుంది. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఆర్‌బీఐకి ఉన్న 19 ఇష్యూ ఆఫీసుల వద్ద వీటిని మార్చుకునే అవకాశం ఇప్పటికీ ఉంది. తమ వద్దనున్న 2,000 నోట్లను బ్యాంక్ ఖాతా వివరాలతోపాటు ఆర్‌బీఐ ఇష్యూ ఆఫీస్‌కు పోస్ట్ ద్వారా పంపొచ్చు.

మ్యాక్సివిజన్ రూ. 100 కోట్ల పెట్టుబడులు



చెన్నై: మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ కొత్తగా చెన్నై మార్కెట్లోకి ప్రవేశించింది. పది ఆస్పత్రులను ఏర్పాటు చేసింది. టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని వీటిని ప్రారంభించారు. వచ్చే రెండేళ్లలో చెన్నైవ్యాప్తంగా హాస్పిటల్స్ ఏర్పాటుపై రూ. 100 కోట్లు వెచ్చించనున్నట్లు సంస్థ సీఎండీ జీఎస్‌కే వేలు తెలిపారు. తమిళనాడులో ఇప్పటికే తిరుచ్చి, మదురై తదితర నగరాల్లో కంటి ఆసుపత్రులను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

విస్తరణ బాటలో రంగిత



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్టెల్లారో బ్రాండ్స్‌లో భాగమైన ఫ్యాషన్ బ్రాండ్ రంగిత తెలుగు రాష్ట్రాల్లో స్టోర్స్ విస్తరణపై మరింతగా దృష్టి పెడుతోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎనిమిది స్టోర్స్ ఉండగా .. మరికొద్ది రోజుల్లో ఇంకో రెండు ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ స్టెల్లారో బ్రాండ్స్ సీఈవో హిమాన్షు చక్రవర్తి తెలిపారు. మహిళల ఎథ్నిక్‌వేర్‌ను రూ. 399–రూ. 1,999 శ్రేణిలో అందిస్తున్నామని వివరించారు. ఈ–కామర్స్ సంస్థ స్నాప్‌డీల్, స్టెలారోకు ఏస్ వెక్టార్ గ్రూప్ మాతృ సంస్థగా ఉంది. స్నాప్‌డీల్‌లో ఆన్‌లైన్ బ్రాండ్‌గా ప్రారంభమైన రంగితకు తెలుగు రాష్ట్రాల్లోను ఆదరణ ఉండటంతో ముందుగా ఇక్కడే స్టోర్స్ ఏర్పాటు చేసినట్లు చక్రవర్తి చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-8-2025	
విశాఖ	465-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	465-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	430-00
వరంగల్	432-00
రిటైల్ ధర	4.90

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,179.00	3.21
EICHERMOT	5,518.00	2.21
ASIANPAINT	2,434.00	1.58
HINDUNILVR	2,554.00	1.3
NESTLEIND	2,274.70	1.2

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SUNPHARMA	1,629.30	-4.54
DRREDDY	1,221.40	-3.85
ADANIENT	2,341.50	-3.67
CIPLA	1,505.00	-3.19
TATASTEEL	153	-3.13

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	7,813
ఎన్‌ఎస్‌ఈ	94,819
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,57,023
ఎఫ్ఐఐ	- 3,366
డీఐఐ	+ 3,187

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.33 (రాత్రి 11.30కు)	$ 69.26 (క్రితం ముగింపు)
బ్రెంట్	69.75 (రాత్రి 11.30కు)	$ 71.07 (క్రితం ముగింపు)

టారిఫ్‌ల భారం.. సగమే!

- 48 బిలియన్ డాలర్ల మేర ప్రభావం
- టెక్స్‌టైల్స్, రత్నాభరణాలపై ఎఫెక్ట్



న్యూఢిల్లీ: భారత ఎగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధించాలన్న అమెరికా నిర్ణయం వల్ల దాదాపు సగం ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడొచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అమెరికాకు 86 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు ఉండగా, అందులో 48 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎక్స్‌పోర్ట్స్‌పై సుంకాల ఎఫెక్ట్ ఉంటుందని పేర్కొన్నాయి. టెక్స్‌టైల్స్/క్లోతింగ్ (10.3 బిలియన్ డాలర్లు), రత్నాభరణాలు (12 బి.డా.), రొయ్యలు (2.24 బి.డా.), లెదర్.. ఫుట్‌వేర్ (1.18 బి.డా.), రసాయనాలు (2.3 బి.డా.), ఎలక్ట్రికల్.. మెకానికల్ మెషినరీ (9 బిలియన్ డాలర్లు) రంగాలపై ఎక్కువగా ప్రభావం పడుతుందని వివరించాయి. అమెరికాకు 5.33 బిలియన్ డాలర్ల విలువైన అపారెల్ ఎగుమతులపై ప్రభావం పడుతుందని ఒక ఎగుమతిదారు తెలిపారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్ గూడ్స్‌లాంటి సుమారు సగం పైగా పరిశ్రమలు మినహాయింపు కేటగిరీలో ఉన్నందున మిగతా సగం కేటగిరీలపై ఎఫెక్ట్ పడుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2024–25లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 131.8 బిలియన్ డాలర్లుగా (86.5 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 45.3 బిలియన్ డాలర్ల దిగుమతులు) నమోదైంది.

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి..

టారిఫ్‌ల వల్ల ఫ్యాక్టరీలు మూతబడకుండా నడిపించడానికి, ఉద్యోగులను తీసివేయకుండా ఉండటానికి ఎగుమతిదారులు.. ఉత్పత్తి వ్యయానికన్నా తక్కువకే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఏఈపీసీ చైర్మన్ సుధీర్ సెఖ్రీ తెలిపారు. ఈ నేపథ్యంలో సుంకాలపరమైన ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకుని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎగుమతిదారులు కూడా ఇతరత్రా మరిన్ని మార్కెట్లకు విస్తరించడంపై దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఏపీఐలు, సర్క్యూట్లకు మినహాయింపులు..

ఫినిష్డ్ ఫార్మా ఉత్పత్తులు, యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్స్ (ఏపీఐలు), అలాగే ముడిచమురు, నేచురల్ గ్యాస్, రిఫైన్డ్ ఇంధనాలు, బొగ్గు, విద్యుత్‌లాంటి ఎనర్జీ ఉత్పత్తులు, కీలకమైన లోహాలు, ఎలక్ట్రానిక్స్.. సెమీకండక్టర్లు మొదలైన వాటికి 25 శాతం టారిఫ్‌ల నుంచి మినహాయింపు ఉంటుందని జీటీఆర్‌ఐ తెలిపింది. కంప్యూటర్లు, ట్యాబ్లెట్లు, స్మార్ట్‌ఫోన్లు, సాలిడ్ స్టేట్ డ్రైవ్స్, ఫ్లాట్ ప్యానెల్ డిస్‌ప్లేలు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లు లాంటివి కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఇప్పటికే రవాణాలో ఉన్నవి, ఆగస్టు 7 నాటికల్లా అమెరికాకు చేరేలా ఇప్పటికే నౌకల్లో లోడ్ చేసిన ఉత్పత్తులకు మినహాయింపు ఉంటుందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈవో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ తెలిపారు.

తయారీ రంగంలో జోరు

- 16 నెలల గరిష్ట స్థాయికి పనితీరు
- జూలైలో పీఎంఐ 59.1కు విస్తరణ



ముంబై: దేశ తయారీ రంగం జూలైలో మరింత బలపడింది. ఈ రంగంలో పనితీరును సూచించే హెచ్ఎస్‌బీసీ పర్చేంజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 59.1 పాయింట్లకు చేరింది. ఇది 16 నెలల గరిష్ట స్థాయి. ఈ ఏడాది జూన్ నెలలో ఇది 58.4 పాయింట్లుగా ఉంది. సానుకూల డిమాండ్ పరిస్థితుల నేపథ్యంలో కొత్త ఆర్డర్లకు తోడు ఉత్పత్తిని వేగంగా పెంచుకోవడం మెరుగైన పనితీరుకు దోహదపడినట్టు హెచ్ఎస్‌బీసీ భారత ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. సాధారణంగా 50 పాయింట్లకు పైన ఉంటే విస్తరణగా, ఆలోపు నమోదైతే బలహీన పడినట్టుగా భావిస్తుంటారు. ఐదేళ్లలోనే అత్యంత వేగంగా అమ్మకాలు నమోదు కాగా, తయారీ వృద్ధి 15 నెలల గరిష్టానికి చేరినట్టు ఈ సర్వే తెలిపింది. వచ్చే 12 నెలల్లో ఉత్పత్తి పెరుగుదల పట్ల తయారీదారులు విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అదే సమయంలో సానుకూల సెంటిమెంట్ అన్నది మూడేళ్ల కనిష్టానికి తగ్గడం గమనార్హం. అధిక పోటీ, ద్రవ్యోల్బణం పట్ల తయారీదారుల్లో ఆందోళన వ్యక్తమైంది. అదనపు సిబ్బందిని నియమించుకోవడం 2024 నవంబర్ తర్వాత అధికంగా నిదానించింది. వ్యయపరమైన ఒత్తిళ్లు జూలైలో పెరిగినట్టు సర్వే తెలిపింది.

గూగుల్ ప్లేలో రియల్ మనీ గేమ్స్



న్యూఢిల్లీ: చట్టబద్ధమైన రియల్ మనీ గేమ్స్ (ఆర్ఎంజీ) అన్నింటిని భారత్‌లోని తమ ప్లేస్టోర్‌లో అనుమతించే దిశగా టెక్ దిగ్గజం గూగుల్ ప్రతిపాదన చేసింది. ఎంపిక చేసిన నిర్దిష్ట డైలీ ఫ్యాంటసీ స్పోర్ట్స్ (డీఎఫ్ఎస్), రమ్మీ యాప్‌లకు మాత్రమే ప్లేస్టోర్‌లో చోటు కల్పించే ప్రయోగాత్మక ప్రోగ్రాంను నిలిపివేసే విధంగా ఇది ఉండనుంది. మరోవైపు, నైపుణ్యాల ఆధారిత గేమ్స్‌ను ప్రమోట్ చేసేందుకు వీలుగా తమ యాడ్ పాలసీలో కూడా మార్పులు చేసే యోచన ఉన్నట్లు కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ)కి గూగుల్ తెలిపింది. మార్కెట్లో పోటీని దెబ్బతీసే విధానాలను అమలు చేస్తోందన్న విన్‌జో గేమ్స్ ఫిర్యాదుపై సీసీఐ విచారణ చేపట్టిన నేపథ్యంలో గూగుల్ ఈ మేరకు ప్రతిపాదన చేసింది. దీనిపై ఆగస్టు 20 లోపు సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలు తెలపాల్సి ఉంటుంది.

ఏటీఎఫ్ ధర 3 శాతం అప్..

వాణిజ్య సిలిండర్ రేటు రూ. 33.50 తగ్గింపు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ప్రామాణిక రేట్లలో మార్పులకు తగ్గట్లుగా ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు దేశీయంగా విమాన ఇంధన (ఏటీఎఫ్) రేట్లను 3 శాతం పెంచాయి. వాణిజ్య సిలిండర్ల ధరను రూ.33.50 మేర తగ్గించాయి. గృహాల్లో వినియోగించే వంట గ్యాస్ సిలిండర్ రేటులో ఎలాంటి మార్పు చేయకుండా రూ. 853గా (14.2 కేజీలు) కొనసాగించాయి. పెట్రోల్, డీజిల్ రేట్లను కూడా యథాతథంగానే ఉంచాయి. తాజా మార్పులతో న్యూఢిల్లీలో ఏటీఎఫ్ రేటు కిలోలీటరుకు రూ. 2,677.88 పెరిగి రూ. 92,021.93కి చేరింది. ఏప్రిల్ నుంచి వరుసగా మూడు నెలల పాటు విమాన ఇంధనం రేటు సుమారు రూ. 12,239.17 మేర తగ్గింది. అయితే, జూలైలో 7.5 శాతం, తాజాగా మరో మూడు శాతం పెంచడంతో దాదాపు రూ. 8,949.38 పెరిగింది. దీంతో దాదాపు మూడొంతుల మేర ధర తగ్గింపు ప్రయోజనాలు తుడిచి పెట్టుకుపోయినట్లయింది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాల్లో దాదాపు 40 శాతం భాగం ఏటీఎఫ్‌దే ఉంటుంది. ఇంధనం ధర పెరగడం వల్ల ఎయిర్‌లైన్స్‌పై భారం పెరుగుతుంది. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలైన ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ప్రతి నెలా ఒకటో తేదీన అంతర్జాతీయంగా ప్రామాణిక రేట్లకు తగ్గట్లు దేశీయంగా ఏటీఎఫ్, వంట గ్యాస్ రేట్లను సవరిస్తాయి.

జీవిత బీమా జేవీ కోసం ఏంజెల్ వన్, లివ్‌వెల్ జట్టు



ముంబై: ఫిన్‌టెక్ సంస్థ ఏంజెల్ వన్, లివ్‌వెల్ కలిసి జీవిత బీమా వ్యాపారానికి సంబంధించి జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేయనున్నాయి. ఇందుకోసం రూ. 400 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ సంస్థలో ఏంజెల్ వన్‌కి 26 శాతం, లివ్‌వెల్ హోల్డింగ్ కంపెనీకి 74 శాతం వాటాలు ఉంటాయి. దీనికి ప్రుడెన్షియల్ ఏషియా మాజీ రీజనల్ సీఈవో విల్ఫ్ బ్లాక్‌బర్న్ చెయిర్‌గా, అవీవా వియత్నాం మాజీ డిప్యూటీ సీఈవో నిఖిల్ వర్మ సీఈవోగా ఉంటారు. డిజిటల్ ఆర్థిక సేవల తరహాలోనే బీమాను కూడా పారదర్శకమైన విధంగా, విశ్వసనీయమైన వేదిక ద్వారా అందరికీ అందుబాటులోకి తేవాలనేది తమ లక్ష్యమని ఏంజెల్ వన్ గ్రూప్ సీఈవో అంబరీష్ కెంఘె తెలిపారు.

బ్యాంకుల డిజిటల్ ఛానళ్లపై థర్డ్‌పార్టీ ఉత్పత్తులు వద్దు

ఆర్‌బీఐ కొత్త ప్రతిపాదన



ముంబై: బ్యాంకులు తమ డిజిటల్ ఛానళ్లపై థర్డ్ పార్టీ (ఇతర సంస్థలకు చెందిన) ఉత్పత్తులను ప్రదర్శించరాదంటూ ఆర్‌బీఐ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చింది. ప్రమోటర్ గ్రూప్ సంస్థలు, బ్యాంక్ గ్రూపు సబ్సిడరీలు/జేవీలు/అసోసియేట్‌లకు సైతం ఇది వర్తించనుంది. రిస్క్ ఆధారిత లావాదేవీల పర్యవేక్షణ, నిఘా యంత్రాంగాన్ని బ్యాంక్‌లు అమల్లోకి తీసుకురావాలని ముసాయిదా నిబంధనల్లో ఆర్‌బీఐ పేర్కొంది. కస్టమర్ల లావాదేవీల తీరును అధ్యయనం చేయడం, అసాధారణ లావాదేవీలను పర్యవేక్షించడం లేదా లావాదేవీలకు సంబంధించి కస్టమర్ల ఆమోదాన్ని ముందస్తుగా పొందడం వంటివి కొత్త రిస్క్ నిర్వహణ విధానం కింద ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఆగస్ట్ 11 వరకు వీటిపై భాగస్వాముల నుంచి సలహా, సూచనలను ఆహ్వానించింది.

భారత వృద్ధి అంచనాలకు ఫిచ్ కోత

- 2025–26 సంవత్సరంలో 6.3 శాతమే
- గత అంచనా 6.4 శాతం
- అమెరికా టారిఫ్‌ల ప్రభావం కొంతే

న్యూఢిల్లీ: ప్రముఖ అంతర్జాతీయ రేటింగ్ సంస్థ 'ఫిచ్' ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) భారత వృద్ధి అంచనాలను తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. 6.4% వృద్ధి నమోదవుతుందన్న గత అంచనాలను సవరిస్తూ.. 6.3 శాతానికి పరిమితం అవుతుందని తాజాగా వెల్లడించింది. అమెరికా టారిఫ్‌ల ప్రభావం భారత కంపెనీలపై చూపించే ప్రత్యక్ష ప్రభావం తక్కువేనని అభిప్రాయపడింది. "మౌలిక సదుపాయాల కల్పనపై పెద్ద ఎత్తున ఖర్చు చేస్తుండడం సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్ (తయారీలో వినియోగించేవి), విద్యుత్, పెట్రోలియం ఉత్పత్తులు, స్టీల్, ఇంజనీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు సానుకూలిస్తుంది" అంటూ 'ఇండియా కార్పొరేట్స్ క్రెడిట్ ట్రెండ్స్' నివేదికలో ఫిచ్ రేటింగ్స్ పేర్కొంది. తాను రేటింగ్ ఇచ్చే భారత కంపెనీల రుణ కొలమానాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెరుగుపడతాయని, బలమైన ఎబిటా మార్జిన్లు, అధిక మూలధన వ్యయాలను అధిగమించేందుకు అనుకూలిస్తాయని వివరించింది.



టారిఫ్‌ల ప్రభావం అధిగమించొచ్చు..

భారత కంపెనీలపై అమెరికా టారిఫ్‌ల కారణంగా పడే ప్రభావం తక్కువేనన్నది ఫిచ్ రేటింగ్ విశ్లేషణగా ఉంది. అమెరికా మార్కెట్లో వీటి ఎక్స్‌పోజర్ (వ్యాపారం) తక్కువగా ఉండడాన్ని గుర్తు చేసింది. కాకపోతే అధిక సరఫరా పరమైన రిస్కులు ఎదురు కావొచ్చని పేర్కొంది. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై తుది ఫలితం ఆధారపడి ఉంటుందని అభిప్రాయపడింది. భారత కంపెనీలు తమ ఎగుమతులను వైవిధ్యం చేసుకోవడం ద్వారా (ఇతర మార్కెట్లకు పెంచుకోవడం) టారిఫ్‌ల ప్రభావాన్ని అధిగమించగలవని అంచనా వేసింది. భారత్‌పై 25 శాతం టారిఫ్‌లకు అదనంగా పెనాల్టీలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం గుర్తుండే ఉంటుంది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల మధ్య విస్తృత స్థాయి చర్చలు జరుగుతున్నప్పటికీ.. ఏకాభిప్రాయ సాధనకు సమయం తీసుకుంటోండడం గమనార్హం. దేశీ మార్కెట్‌పైనే ప్రధానంగా ఆధారపడే ఆయిల్ అండ్ గ్యాస్, సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్, ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్, టెలికం, యుటిలిటీలపై టారిఫ్‌ల కారణంగా ప్రత్యక్ష ప్రభావం పెద్దగా ఉండబోదని పేర్కొంది. టారిఫ్‌ల అనిశ్చితులు కారణంగా యూఎస్, యూరప్‌కు ఐటీ, ఆటో ఎగుమతులు 2025–26లో పరిమితంగా ఉండొచ్చంటూ.. అమెరికా విధానంలో మార్పు చోటుచేసుకుంటే ఫార్మా కంపెనీలపైనా ప్రభావం పడొచ్చని అంచనా వేసింది. స్టీల్, కెమికల్స్ అధిక సరఫరాలు భారత మార్కెట్‌ను ముంచెత్తితే ఆయా రంగాల్లోని కంపెనీలు ధరలపరమైన ఒత్తిళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని, మెటల్స్, మైనింగ్ రంగాల్లో ధరల పరంగా అధిక అస్థిరతలు ఉండొచ్చని తెలిపింది.

క్యూ1 ఫలితాలు

టాటా పవర్ లాభం ఓకే

రూ. 1,262 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రయివేట్ రంగ దిగ్గజం టాటా పవర్ కంపెనీ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 6 శాతం పుంజుకుని రూ. 1,262 కోట్లను తాకింది. పునరుత్పాదక ఇంధన, విద్యుత్ ప్రసారం, పంపిణీ బిజినెస్‌లు ఇందుకు సహకరించాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,189 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 16,810 కోట్ల నుంచి రూ. 17,464 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 94 మెగావాట్ల సొంత ప్లాంటుతోపాటు.. 560 మెగావాట్ల థర్డ్ పార్టీ ఈపీసీ ప్రాజెక్టులను ప్రారంభించినట్లు కంపెనీ పేర్కొంది. నిర్వహణలోని పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 5.6 గిగావాట్లకు చేరినట్లు వెల్లడించింది. వీటిలో 4.6 గిగావాట్లు సోలార్‌కాగా.. 1 గిగావాట్ పవన విద్యుత్‌గా పేర్కొంది. రానున్న మూడు త్రైమాసికాలలో 1.6 గిగావాట్‌ను జత చేసుకునే ప్రణాళికలున్నట్లు తెలియజేసింది. ఈ కాలంలో రికార్డ్ నెలకొల్పుతూ 270 ఎండబ్ల్యూపీ రూఫ్‌టాప్ సోలార్‌ను ఇన్‌స్టాల్ చేసినట్లు వెల్లడించింది. కంపెనీ 7 గిగావాట్ల శుద్ధ ఇంధన సామర్థ్యం సహా.. మొత్తం 15.8 గిగావాట్ల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది.

ఫలితాల నేపథ్యంలో టాటా పవర్ షేరు బీఎస్‌ఈలో 2 శాతం బలహీనపడి రూ. 389 వద్ద ముగిసింది.

గోద్రెజ్ ప్రాపర్టీస్ లాభం అప్

రూ. 598 కోట్లు



న్యూఢిల్లీ: రియల్టీ రంగ దిగ్గజం గోద్రెజ్ ప్రాపర్టీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 15 శాతం వృద్ధితో రూ. 598 కోట్లను అధిగమించింది. గతేడాది (2024–25) ఇదే కాలంలో రూ. 519 కోట్లు ఆర్జించింది. అయితే హై బేస్ ప్రభావంతో అమ్మకాల బుకింగ్స్ 18 శాతం క్షీణించి రూ. 7,082 కోట్లకు పరిమితమయ్యాయి. గత క్యూ1లో రూ. 8,637 కోట్ల బుకింగ్స్ నమోదయ్యాయి. కాగా.. మొత్తం ఆదాయం రూ. 1,699 కోట్ల నుంచి రూ. 1,620 కోట్లకు స్వల్ప వెనకడుగు వేసింది. ఈ ఏడాది 10 శాతం అధికంగా రూ. 32,500 కోట్ల ముందస్తు అమ్మకాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 2.5 శాతం క్షీణించి రూ. 2,049 వద్ద ముగిసింది.

గ్లాక్సో ఫార్మా లాభం ప్లస్

రూ. 279 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఔషధ రంగ దిగ్గజం గ్లాక్సోస్మిత్‌క్లెయిన్ ఫార్మాస్యూటికల్స్ పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 12 శాతం వృద్ధితో రూ. 279 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 249 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం నామమాత్ర వెనకడుగుతో రూ. 849 కోట్లకు పరిమితమైంది. గత క్యూ1లో రూ. 850 కోట్ల టర్నోవర్ అందుకుంది. ఇన్నోవేటివ్ పోర్ట్‌ఫోలియోపై పెట్టుబడులు కొనసాగిస్తున్నట్లు కంపెనీ ఎండీ భూషణ్ అక్షికర్ పేర్కొన్నారు. దీంతో అంకాలజీ ఔషధాలు జెమ్‌పెర్లీ(డోస్టర్లిమాబ్), జెజులా(నిరపారిబ్) విడుదల బాటలో సాగుతున్నట్లు వెల్లడించారు. దేశీయంగా వీటి విడుదల ద్వారా కేన్సర్ సంబంధిత చికిత్సలో ఆధునిక ఔషధాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 7 శాతం పతనమై రూ. 2,934 వద్ద ముగిసింది.

యూపీఎల్ నష్టాలు తగ్గాయ్

రూ. 176 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో అగ్రోకెమికల్స్, పెస్టిసైడ్ దిగ్గజం యూపీఎల్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర నష్టం భారీగా తగ్గి రూ. 176 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 527 కోట్ల నష్టం ప్రకటించింది. అయితే మొత్తం ఆదాయం 2 శాతం స్వల్ప వృద్ధితో రూ. 9,216 కోట్లను తాకింది. గత క్యూ1లో రూ. 9,067 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ కాలంలో అన్ని విభాగాల మార్జిన్లుసహా.. నగదు ఆర్జన మెరుగుపడినట్లు కంపెనీ చైర్మన్, గ్రూప్ సీఈవో జై ష్రాఫ్ తెలియజేశారు. సీజనల్‌గా ఎదురయ్యే పలు సవాళ్లు, ప్రధానంగా లాటిన్ అమెరికా అమ్మకాలు నీరసించిన నేపథ్యంలోనూ పటిష్ట పనితీరును ప్రదర్శించగలిగినట్లు కంపెనీ సీఈవో మైక్ ఫ్రాంక్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో యూపీఎల్ షేరు బీఎస్‌ఈలో 5.5 శాతం పతనమై రూ. 665 వద్ద ముగిసింది.

వన్ మొబిక్విక్‌కు భారీ నష్టాలు

రూ. 42 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఫిన్‌టెక్ కంపెనీ వన్ మొబిక్విక్ సిస్టమ్స్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర నష్టం ఆరు రెట్లు పెరిగి రూ. 42 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 7 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం 21 శాతం క్షీణించి రూ. 271 కోట్లకు పరిమితమైంది. గత క్యూ1లో రూ. 342 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 344 కోట్ల నుంచి రూ. 313 కోట్లకు తగ్గాయి. పేమెంట్ గేట్‌వే వ్యయాలు రూ. 128 కోట్ల నుంచి రూ. 143 కోట్లకు, ఉద్యోగుల లబ్ధి ఖర్చులు రూ. 39 కోట్ల నుంచి రూ. 42 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో మొబిక్విక్ షేరు బీఎస్‌ఈలో 4.6 శాతం పతనమై రూ. 234 వద్ద ముగిసింది.

పీసీ జ్యుయెలర్ ఫర్వాలేదు

రూ.162 కోట్ల లాభం



న్యూఢిల్లీ: ఆభరణాల విక్రయ సంస్థ పీసీ జ్యుయెలర్ లిమిటెడ్ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.162 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.156 కోట్లతో పోల్చి చూస్తే 4 శాతం పెరిగింది. ఆదాయం ఇదే కాలంలో రూ.440 కోట్ల నుంచి రూ.808 కోట్లకు దూసుకుపోయింది. ప్రమోటర్లతో పాటు క్యాపిటల్ వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు షేర్ల జారీ ద్వారా రూ.500 కోట్ల సమీకరణకు గత నెలలో కంపెనీ బోర్డు నిర్ణయించడం గమనార్హం. రుణాలను ముందుగానే తీర్చివేయడం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం చివరకు రుణ రహితంగా మారాలన్నది కంపెనీ ప్రణాళికగా ఉంది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 52 షోరూమ్‌లు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ.2,372 కోట్ల ఆదాయంపై రూ.577 కోట్ల లాభాన్ని నమోదు చేసింది.

బీఎస్‌ఈలో పీసీ జ్యుయెలర్ షెరు ధర 4 శాతం మేర తగ్గి రూ.15 వద్ద ముగిసింది.

హీడెల్‌బర్గ్ సిమెంట్ లాభం రూ.48 కోట్లు



న్యూఢిల్లీ: హీడెల్‌బర్గ్ సిమెంట్ జూన్ త్రైమాసికానికి రూ.48 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.40 కోట్లతో పోల్చి చూస్తే 21 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. ఆదాయం సైతం 12 శాతానికి పైనే పెరిగి రూ.597 కోట్లకు చేరుకుంది. అమ్మకాలు 11 శాతం పెరగడం, ధరల పెంపు రూపంలో మరొక శాతం కలిపి 12 శాతం మేర ఆదాయంలో వృద్ధిని నమోదు చేసినట్టు కంపెనీ తెలిపింది. అమ్మకాలు 11 శాతం అధికంగా 1,254 కిలో టన్నులకు చేరాయి. జర్మనీకి చెందిన బిల్డింగ్ మెటీరియల్స్ బహుళజాతి సంస్థ హీడెల్‌బర్గ్ మెటీరియల్స్‌కు హీడెల్‌బర్గ్ సిమెంట్ అనుబంధ సంస్థగా ఉంది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో కంపెనీ షేరు 3 శాతానికి పైనే ఎగసి రూ.217 వద్ద ముగిసింది.

అరవింద్ లాభం అప్

క్యూ1లో రూ. 55 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో టెక్స్‌టైల్స్ తయారీ కంపెనీ అరవింద్ లిమిటెడ్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 55 కోట్లకు చేరింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 44 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 10 శాతం పుంజుకుని రూ. 2,006 కోట్లను దాటింది. దీనిలో టెక్స్‌టైల్స్ విభాగం నుంచి 14 శాతం అధికంగా రూ. 1,536 కోట్లు లభించగా.. అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ బిజినెస్ 7 శాతం వృద్ధితో రూ. 351 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 8% పైగా పెరిగి రూ. 1,939 కోట్లను దాటాయి. ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టులపై ఈ ఏడాది రూ. 475 కోట్లవరకూ పెట్టుబడులు వెచ్చించే ప్రణాళికలున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ఈ షేరు గత ముగింపు రూ. 316 వద్ద ముగిసింది.

భారత్ ఫుట్‌బాల్ కోచ్‌గా జమీల్


13 ఏళ్ల తర్వాత స్వదేశీ కోచ్




న్యూఢిల్లీ: భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు చాన్నాళ్ల తర్వాత స్వదేశీ కోచ్‌ను నియమించారు. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) భారత్‌కు చెందిన ఖాలిద్ జమీల్‌కు జాతీయ జట్టు కోచింగ్ బాధ్యతలు అప్పగించింది. ఈ కోచ్ పదవి కోసం విదేశీ కోచ్‌లు స్టీఫెన్ కాన్‌స్టంటైన్, స్టీఫాన్ టర్కోవిచ్‌లు కూడా పోటీపడినప్పటికీ వీళ్లిద్దరిని వెనక్కినెట్టిన 48 ఏళ్ల జమీల్ భారత్ హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు. 13 ఏళ్ల తర్వాత జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు స్వదేశీ కోచ్ శిక్షణ ఇవ్వనున్నారు. చివరి సారిగా భారత్‌కే చెందిన సావియో మెడెరా 2011 నుంచి 2012 వరకు హెడ్ కోచ్‌గా వ్యవహరించారు. తాజా నియామకంపై ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే మాట్లాడుతూ 'ఐఎమ్ విజయన్ నేతృత్వంలోని టెక్నికల్ కమిటీ ముగ్గురితో కూడిన తుదిజాబితా నుంచి జమీల్‌ను ఎంపిక చేసింది. అయితే ఆయన పదవీ కాలాన్ని మాత్రం ఇంకా ఖరారు చేయలేదు. జమీల్ మూడేళ్ల గడువును ఆశిస్తున్నారు. అయితే రెండేళ్లా లేదంటే మూడేళ్లా అనేది జట్టు ప్రదర్శన, ఆయన ఇచ్చే శిక్షణను బట్టి ఉంటుంది' అని అన్నారు. భారత మాజీ ఫుట్‌బాలర్ అయిన జమీల్ శిక్షణలో 2017లో ఐజ్వాల్ ఫుట్‌బాల్ క్లబ్ 'ఐ–లీగ్' టైటిల్‌ను సాధించింది. ప్రస్తుతం ఆయన ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ కోచ్‌గా ఉన్నారు. అయితే భారత కోచ్‌గా నియమితులైన జమీల్ పూర్తి స్థాయిలో టీమిండియా కోచ్‌గా పనిచేయాల్సి ఉంటుందని ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడు చౌబే స్పష్టం చేశారు. దీంతో ఐఎస్‌ఎల్ ఫ్రాంచైజీకి జమీల్ గుడ్‌బై చెప్పాల్సి ఉంది. గత కోచ్ మార్ఖ్ భారత జట్టు హెడ్ కోచ్‌గా ఉంటూనే, ఎఫ్‌సీ గోవా కోచ్‌గాను పనిచేశారు. స్పెయిన్‌కు చెందిన మనోలో గత నెల కోచ్ పదవి నుంచి తప్పుకున్నారు. టీమిండియా గత కొంతకాలంగా తక్కువ ర్యాంకు జట్లతోనూ ఓడిపోతుండటంతో ఇంకో ఏడాది పదవీకాలం మిగిలిండగానే కోచ్ తన పదవికి రాజీనామా చేశారు.

కిన్ డబుల్ ధమాకా..

స్టీన్‌బెర్గన్‌కు పసిడి ● ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్


స్టీన్‌బెర్గన్


స్టీన్‌బెర్గన్

సింగపూర్: ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ ఆరో రోజు స్టార్ స్విమ్మర్లు లాన్ మర్చెండ్ (ఫ్రాన్స్), టీనేజ్ స్టార్ స్విమ్మర్ సమ్మర్ మెకింటోష్ (కెనడా) బరిలో లేకపోవడంతో... ఐదు వేర్వేరు దేశాలకు చెందిన స్విమ్మర్లు పసిడి పతకాలు ఖాతాలో వేసుకున్నారు. శుక్రవారం పోటీల్లో నెదర్లాండ్స్, చైనా, హంగేరి, అమెరికా, ఇంగ్లండ్‌కు చెందిన స్విమ్మర్లు స్వర్ణ పతకాలు సాధించారు. మహిళల 100 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో మ్యారిట్ స్టీన్‌బెర్గన్ (నెదర్లాండ్స్) పసిడి పతకంతో మెరిసింది. ఫైనల్ రేసులో స్టీన్‌బెర్గన్ 52.55 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచింది. మొల్లీ ఓ కల్లాఘన్ (52.67 సెకన్లు; ఆస్ట్రేలియా), టారీ హుస్కే (52.89 సెకన్లు; అమెరికా) వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. 2024లో దోహా వేదికగా జరిగిన పోటీల్లో సైతం విజేతగా నిలిచిన స్టీన్‌బెర్గన్... చివరి 50 మీటర్లలో జోరు పెంచి చాంపియన్‌గా అవతరించింది. ఆస్ట్రేలియా, అమెరికా స్విమ్మర్ల నుంచి కఠిన పోటీ ఎదురైనా... ఆఖర్లో ఆధిక్యం కనబర్చింది. 'దోహాలో సునాయాసంగా విజయం సాధించా. కానీ ఈ సారి పోటీ చాలా తీవ్రంగా ఉంది. అందుకే ఈ విజయం చాలా సంతృప్తినిచ్చింది' అని పోటీ అనంతరం స్టీన్‌బెర్గన్ పేర్కొంది. ఆరో రోజు పోటీలు ముగిసేసరికి అమెరికా, ఆస్ట్రేలియా ఐదేసి స్వర్ణ పతకాలతో పట్టిక అగ్రస్థానంలో నిలిచాయి. ఓవరాల్‌గా అమెరికా 20 పతకాలు సాధించగా... ఆస్ట్రేలియా 13 పతకాలు ఖాతాలో వేసుకుంది.

కిన్ విన్

పురుషుల 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో చైనా స్విమ్మర్ కిన్ హైయాంగ్ విజేతగా నిలిచాడు. శుక్రవారం జరిగిన ఫైనల్లో కిన్ 2 నిమిషాల 7.41 సెకన్లలో లక్ష్యాన్ని చేరి పసిడి పతకం ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పీ వటనబె (2 నిమిషాల 7.70 సెకన్లు; జపాన్) రజతం గెలుచుకోగా... కాస్పర్ కార్‌బ్యె (2 నిమిషాల 7.73 సెకన్లు; నెదర్లాండ్స్) కాంస్య పతకం నెగ్గాడు. ఈ విభాగంలో రెండేళ్ల క్రితం ప్రపంచ రికార్డు (2 నిమిషాల 5.48 సెకన్లు) తనపేరిట రాసుకున్న కిన్... విజయం అనంతరం 'ఇదో అద్భుతం' అని వ్యాఖ్యానించాడు. 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లోనూ పసిడి నెగ్గిన కిన్... 200 మీటర్లలోనూ జోరు కనబర్చి డబుల్ ధమాకా మోగించాడు. పురుషుల 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ హబర్ట్ (హంగేరి) పసిడి పతకం గెలిచాడు. 1 నిమిషం 53.19 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు. పీటర్ కోట్జీ (1 నిమిషం 53.36 సెకన్లు; దక్షిణాఫ్రికా), యోహాన్ బ్రౌర్డ్ (1 నిమిషం 54.62 సెకన్లు; ఫ్రాన్స్) వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. స్టార్ స్విమ్మర్ కేట్ డగ్లస్... అమెరికాకు ఐదో స్వర్ణం అందించింది. మహిళల 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో 2 నిమిషాల 18.50 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచింది. ఈ విభాగంలో ఇది రెండో అత్యుత్తమ టైమింగ్ కావడం విశేషం. చికునోవా (2 నిమిషాల 19.96 సెకన్లు) రజతం గెలుచుకోగా.. కైలెన్ కార్బెట్, అలీనా ముసుకా (2 నిమిషాల 23.52 సెకన్లు) ఒకే సమయంలో లక్ష్యాన్ని చేరి కాంస్యం దక్కించుకున్నారు. పురుషుల 4–200 ఫ్రీస్టయిల్ రిలేలో బ్రిటన్ జట్టు 6 నిమిషాల 59.84 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం పసిడి గెలుచుకుంది. చైనా (7 నిమిషాల 0.91 సెకన్లు), ఆస్ట్రేలియా (7 నిమిషాల 0.98 సెకన్లు) వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నాయి.


కిన్

12 ఏళ్లకే పతకం..



చైనాకు చెందిన 12 ఏళ్ల స్విమ్మర్ యూ జిడి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తాచాటింది. మహిళల 4–200 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలే విభాగంలో చైనా జట్టులో సభ్యురాలైన యూ జిడి కాంస్యం గెలుచుకుంది. ఆస్ట్రేలియా, అమెరికా బృందాలు వరుసగా స్వర్ణ, రజతాలు నెగ్గారు. 200 మీటర్ల బటర్‌ఫ్లై, 200 మీటర్ల మెడ్లీ వ్యక్తిగత విభాగాల్లోనూ యూ జిడి పతకానికి దగ్గరగా వచ్చింది. నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతకానికి దూరమైంది. 400 మీటర్ల విభాగం యూ జిడి ఇంకా పోటీ పడాల్సి ఉంది. ఈ టోర్నీలో భారత స్విమ్మర్ల నిరాశజనక ప్రదర్శన ఆరో రోజు కూడా కొనసాగింది. పురుషుల 100 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో రోహిత్ 47వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.

సయీమ్ అయూబ్ ఆల్‌రౌండ్ షో

వెస్టిండీస్‌పై తొలి టి20లో పాకిస్తాన్ విజయం



లాడర్‌హిల్: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన పాకిస్తాన్ క్రికెట్ జట్టు... వెస్టిండీస్‌తో తొలి టి20లో ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి పోరులో పాకిస్తాన్ 14 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇటీవల సొంతగడ్డపై ఆస్ట్రేలియా చేతిలో టెస్టు, టి20 సిరీస్‌ల్లో వైట్‌వాష్‌కు గురైన వెస్టిండీస్... పాకిస్తాన్‌పై కూడా అదే పేలవ ప్రదర్శన కొనసాగించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. సయీమ్ అయూబ్ (38 బంతుల్లో 57; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా... ఫఖర్ జమాన్ (28; 2 ఫోర్లు, 1 సిక్స్), హసన్ నవాజ్ (24; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. విండీస్ బౌలర్లలో షామర్ జోసెఫ్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఓ మాదిరి లక్ష్యఛేదనలో విండీస్ తడబడింది. పాక్ బౌలర్ల ధాటికి 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 164 పరుగులకు పరిమితమైంది. ఓపెనర్లు జాన్సన్ చార్లెస్ (36 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), జెవెల్ ఆండ్రె (33 బంతుల్లో 35; 1 ఫోర్ 3 సిక్స్‌లు) జట్టుకు మెరుగైన ఆరంభాన్నిచ్చారు. అయితే వీరిద్దరూ తమ సహజ స్వభావానికి భిన్నంగా నెమ్మదిగా ఆడారు. దీంతో 11 ఓవర్లు ముగిసేసరికి విండీస్ వికెట్ నష్టపోకుండా 72 పరుగులు చేసింది. ఆ తర్వాత పట్టు బిగించిన పాకిస్తాన్ బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టారు. కెప్టెన్ షై హోప్ (2), గుడాకేశ్ మోతీ (0), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (11), రోస్టన్ ఛేజ్ (5), రొమారియో షెఫర్డ్ (12) విఫలమయ్యారు. విండీస్ విజయానికి 3 ఓవర్లలో 65 పరుగులు అవసరమైన దశలో... జాసన్ హోల్డర్ (12 బంతుల్లో 20 నాటౌట్; 4 సిక్స్‌లు), షామర్ జోసెఫ్ (12 బంతుల్లో 21 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడినా ఫలితం లేకపోయింది. పాకిస్తాన్ బౌలర్లలో మొహమ్మద్ నవాజ్ 3, సయీమ్ అయూబ్ 2 వికెట్లు పడగొట్టారు. నవాజ్ ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు పడగొట్టడంతో మ్యాచ్ పాకిస్తాన్ వైపు మొగ్గింది. హాఫ్ సెంచరీతో పాటు రెండు వికెట్లు తీసిన సయీమ్ అయూబ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఆదివారం తెల్లవారుజామున రెండో టి20 జరగనుంది.

వెస్ట్‌జోన్ సారథిగా శార్దుల్

● ఆగస్టు 28 నుంచి దులీప్ ట్రోఫీ
● సెమీస్‌లో సౌత్‌జోన్‌తో తలపడనున్న వెస్ట్‌జోన్



ముంబై: దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీలో బరిలోకి దిగే వెస్ట్‌జోన్ జట్టుకు టీమిండియా ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ సారథిగా ఎంపికయ్యాడు. ఈ నెల 28 నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో జరగనున్న ఈ టోర్నీ కోసం శుక్రవారం వెస్ట్ జోన్ సెలెక్టర్లు 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. ఇందులో భారత ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ కూడా ఉన్నారు. శార్దుల్, శ్రేయస్, యశస్వి, సర్ఫరాజ్, షమ్స్ ములానీ, తనుశ్ కోటియాన్, తుషార్ దేశ్‌పాండే రూపంలో ముంబై నుంచి ఏడుగురికి వెస్ట్ జోన్ జట్టులో అవకాశం దక్కగా... గుజరాత్ నుంచి నలుగురు, సౌరాష్ట్ర నుంచి ఇద్దరు, మహారాష్ట్ర నుంచి ఇద్దరు జట్టులో చోటు దక్కించుకున్నారు. మరో ఏడుగురు ప్లేయర్లు స్టాండ్‌బై ఎంపికయ్యారు. ఈ ఏడాది నుంచి దులీప్ ట్రోఫీని తిరిగి పాత తరహాలో జోనల్ విధానంలో నిర్వహిస్తున్నారు. సౌత్ జోన్, వెస్ట్ జోన్ జట్లు నేరుగా సెమీఫైనల్ ఆడనుండగా... నార్త్ జోన్‌తో ఈస్ట్ జోన్, సెంట్రల్ జోన్‌తో నార్త్ ఈస్ట్ జోన్ క్వార్టర్ ఫైనల్లో తలపడనున్నాయి. 2023–24లో చివరిసారిగా జోన్‌ల వారిగా పోటీలు నిర్వహించిన సమయంలో సౌత్‌జోన్ జట్టు విజేతగా నిలిచింది.

వెస్ట్ జోన్ జట్టు: శార్దుల్ ఠాకూర్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, ఆర్య దేశాయ్, హార్విక్ దేశాయ్, శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్, రుతురాజ్ గైక్వాడ్, జైమీత్ పటేల్, మనన్ హింగ్‌రాజియా, సౌరభ్ నవాలె, షమ్స్ ములానీ, తనుశ్ కోటియాన్, ధర్మేంద్రసింగ్ జడేజా, తుషార్ దేశ్‌పాండే, అర్జాన్ నగ్‌వాస్‌వాలా.

ఫైనల్‌కు లక్కీ



ఏథన్స్ (గ్రీస్): ప్రపంచ అండర్–17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్ లక్కీ పసిడి పతకానికి అడుగు దూరంలో నిలిచాడు. పురుషుల ఫ్రీస్టయిల్ 110 కేజీల విభాగంలో లక్కీ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. జపాన్, ఇరాన్‌కు చెందిన రెజ్లర్లపై విజయాలతో లక్కీ ముందంజ వేశాడు. జపాన్ రెజ్లర్ హంటో హయేషిపై టెక్నికల్ సూపీరియారిటీతో విజయం సాధించిన లక్కీ... తదుపరి రౌండ్‌లో 8–0తో ముర్తాజ్ బగ్దవద్జె (జార్జియా)పై గెలుపొందాడు. ఇక హోరాహోరీగా సాగిన సెమీఫైనల్లో లక్కీ 15–7 పాయింట్ల తేడాతో ఇరాన్‌కు చెందిన అమీర్ హుసేన్‌పై నెగ్గాడు. 65 కేజీల విభాగంలో గౌరవ్ పూనియా తొలి రెండు రౌండ్‌లలో టెక్నికల్ సుపీరియారిటీతో విజయం సాధించినా... క్వార్టర్స్‌లో ఓడి ఇంటిబాట పట్టాడు.

న్యూజిలాండ్ ఘనవిజయం

తొలి టెస్టులో 9 వికెట్ల తేడాతో జింబాబ్వే ఓటమి



బులవాయో: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన న్యూజిలాండ్ జట్టు... జింబాబ్వేతో తొలి టెస్టులో ఘన విజయం సాధించింది. మూడు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్‌లో కివీస్ 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. తద్వారా రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. సొంతగడ్డపై కనీస ప్రతిఘటన కనబర్చలేకపోయిన జింబాబ్వే మరో పరాజయం మూటగట్టుకుంది. తొమ్మిదేళ్ల తర్వాత న్యూజిలాండ్‌తో ఆడిన మ్యాచ్‌లో జింబాబ్వే నిరాశపరిచింది. ఓవర్‌నైట్ స్కోరు 31/2తో శుక్రవారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జింబాబ్వే... చివరకు 67.1 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. సీన్ విలియమ్స్ (66 బంతుల్లో 49; 6 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలినవాళ్లు ఆకట్టుకోలేకపోయారు. కెప్టెన్ ఇర్విన్ (22), తఫద్జా ట్సిగా (27) బ్లెస్సింగ్ ముజర్‌బానీ (19) తలా కొన్ని పరుగులు చేశారు. నిక్ వెల్చ్ (4), విన్సెంట్ మసెకెసా (2), సికందర్ రజా (5) విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్ 4 వికెట్లు పడగొట్టగా... మ్యాట్ హెన్రీ, విలియమ్ రూర్కే చెరో 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. అనంతరం 8 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ 2.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 8 పరుగులు చేసి గెలిచింది. అంతకుముందు జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులు చేయగా... న్యూజిలాండ్ 307 పరుగులు చేసింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు పడగొట్టిన మ్యాట్ హెన్రీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఈ నెల 7 నుంచి రెండో టెస్టు ప్రారంభం కానుంది.

'ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా'

వివాహ బంధంపై చహల్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: భారత లెగ్‌స్పిన్నర్ యుజువేంద్ర చహల్, ధనశ్రీ వర్మ ఇటీవలే అధికారికంగా విడిపోయారు. అయితే విడాకులకు ముందు తాను తీవ్ర మానసిక వేదనను అనుభవించానని చహల్ చెప్పాడు. కొందరు తనను మోసగాడిగా చిత్రీకరించారని, తాను ఎప్పుడూ మోసం చేయలేదని...తాను ప్రేమించిన వ్యక్తి పట్ల విధేయతతోనే ఉన్నానని అతను పేర్కొన్నాడు. 'నా విడాకుల తర్వాత నన్ను కొందరు మోసగాడు అన్నారు. కానీ నేను జీవితంలో ఎవరినీ మోసం చేయలేదు. నేను ఇష్టపడిన వ్యక్తి కోసం ఎంతో ఎక్కువ విధేయతను ప్రదర్శించాను. మనసారా ప్రేమించాను' అని చహల్ వ్యాఖ్యానించాడు. ధనశ్రీతో విడాకుల దాకా పరిస్థితి వచ్చినప్పుడు మానసికంగా బాగా దెబ్బ తిన్నానని అతను గుర్తు చేసుకున్నాడు. 'నేను ఎలాంటి వేదనను అనుభవించానో నా సన్నిహితులకు బాగా తెలుసు. జీవితం పట్ల అలసిపోయినట్లు అనిపించింది. రోజులో రెండు గంటలు మాత్రమే పడుకుంటే రెండు గంటల పాటు ఏడుస్తూనే ఉండేవాడిని. ఇది దాదాపు నలభై రోజులు సాగింది. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకోవాలని కూడా భావించా' అని ఈ స్పిన్ బౌలర్ వెల్లడించాడు. అధికారికంగా విడాకులు తీసుకునే వరకు బయటపడవద్దని...అప్పటి వరకు కలిసే ఉన్నట్లుగా బయట కనిపించేందుకు తాము ప్రయత్నించినట్లు అతను చెప్పాడు. మరో వైపు ఇతర అమ్మాయిలతో తనకు ఏదో బంధం ఉన్నట్లుగా వచ్చిన వదంతులు మరింతగా బాధపెట్టాయని చహల్ వివరించాడు. 'ఎవరితోనైనా కనిపిస్తే చాలు సంబంధం అంటగట్టేస్తూ వచ్చారు. నాకు ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. మహిళలను ఎలా గౌరవించాలో నాకు తెలుసు' అని చహల్ చెప్పాడు. చహల్ ప్రస్తుతం ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో నార్తాంప్టన్‌షైర్ తరఫున ఆడుతున్నాడు.

సెల్ ఫోన్‌ను సైతం మోయలేనని అనిపించింది..!

భూమికి తిరిగొచ్చినప్పుడు అనుభవాన్ని వివరించిన శుభాంశు శుక్లా

వాషింగ్టన్: యాగ్జియం స్పేస్ మిషన్‌ను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న భారతీయ వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా మొదటిసారిగా మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని భార రహిత స్థితిలో గడిపి భూమిపైకి వచ్చిన తర్వాత భూగురుత్వాకర్షణ శక్తికి అలవాటు పడే క్రమంలో ఎదురైన ఇబ్బందులను ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. గురుత్వాకర్షణ శక్తి ఎంత అవసరమో భూమిని వీడాకనే తమకు తెలిసిందన్నారు. 'ఒక్కసారిగా భార రహిత స్థితిలోకి మారిపోగా దానికి అలవాటు పడేందుకు కొంత సమయం పట్టింది. అదేవిధంగా, భూమికి తిరిగొచ్చాక కూడా తిరిగి గురుత్వాకర్షణ శక్తికి అలవాటు పడాల్సి వచ్చింది' అని వివరించారు. క్యాప్సూల్‌లోంచి బయటకు వచ్చాక సెల్ ఫోన్ సైతం పట్టుకోలేనంత బరువుగా మారిపోవడం తనకు ఆశ్చర్యం వేసిందని తెలిపారు. భూమిపైకి వచ్చిన కొన్ని వారాల తర్వాత సైతం అడ్జస్ట్ కావడం కష్టమవుతుందని, పడిపోకుండా నిలబడటం, అడుగులు వేయడం సైతం ఇబ్బందిగానే ఉంటుందని చెప్పారు. అందుకే, వ్యోమగాములకు ప్రత్యేక రిహాబిలిటేషన్ కార్యక్రమం ద్వారా బలం కూడదీసుకోవడం, శరీర అవయవాల సమన్వయం, బ్యాలెన్స్ వంటివి ఒక్కటొక్కటిగా అలవాటయ్యాయన్నారు. అంతరిక్షంలో ఉన్నప్పటి మాదిరిగానే వదిలేసిన ల్యాప్‌టాప్ గాల్లోనే తేలియాడుతుందని భావించి, రూంలోనే దాన్ని పడేశాని ఆయన గుర్తు చేసుకున్నారు. అంతరిక్షంలో శూన్య గురుత్వాకర్షణ శక్తిలో అన్నీ తేలియాడుతూనే ఉంటాయి. అటువంటి భారరహిత స్థితిలోనే తనకు అప్పగించిన ప్రయోగాలన్నిటినీ విజయవంతంగా నెరవేర్చానన్నారు. 'ఇప్పుడంతా మునుపటిలాగానే మారిపోయింది. మరో స్పేస్ మిషన్‌కు సిద్ధంగా ఉన్నా' అంటూ ఆయన ప్రకటించారు. శుభాంశు అంతరిక్ష కేంద్రంలో ఉంటూ చేపట్టిన ప్రయోగాల డేటా, సేకరించిన నమూనాలు ఇప్పటికే అమెరికా నుంచి భారత్‌లోని పరిశోధన శాలలకు చేరాయి. త్వరలో భారత్‌కు రానున్న శుభాంశు శుక్లా ఆ ప్రయోగాల గురించి శాస్త్రవేత్తలకు వివరించనున్నారు.



యుద్ధాలు సాగాల్సింది కదన రంగంలో. అంతే తప్ప పసిపిల్లల పొట్టల మీద కాదు. గాజాను ఆకలితో మాడ్చి చంపేయాలనే ఇజ్రాయెల్ అమానవీయ యుద్ధరీతికి సజీవ సాక్ష్యమిది. అంత పెద్ద బానలో అడుగుబొడుగు మిగిలిన సూపును ఆఖరి బొట్టు వరకూ వొంపుకుంటున్న ఈ చిన్నారి గాజా దైన్యానికి కొండంత అద్దం. చోద్యం చూస్తున్న ప్రపంచ దేశాలకు చెంపపెట్టు! గాజా సిటీలోని ఆహార కేంద్రం వద్ద శుక్రవారం నాటి దృశ్యమిది.

ట్రంప్ వ్యాఖ్యలు అసత్యాలు: థరూర్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'భారత్ డెడ్ ఎకానమీ'అంటూ నోరుపారేసుకోవడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఖండించారు. 'ట్రంప్ వ్యాఖ్యలు అసత్యాలు.. ఆ విషయం మనందరికీ తెలుసు'అంటూ వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడారు. ట్రంప్ నిజమే చెప్పారంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించలేదు. ఆపరేషన్ సిందూర్‌పై కేంద్ర ప్రభుత్వానికి బహిరంగంగా మద్దతు తెలిపినప్పటి నుంచి థరూర్, కాంగ్రెస్ అగ్రనాయకత్వం మధ్య అంతరం పెరగడం తెల్సిందే. కాంగ్రెస్ సిఫారసు చేయకున్నా ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం విదేశాలకు పంపించిన దౌత్య బృందానికి థరూర్ నాయకత్వం వహించారు.

ఆధునిక చరిత్రలోనే అనాగరిక దేశాధినేత

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై మాజీ ప్రధాని దేవెగౌడ

న్యూఢిల్లీ: మన దేశం గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ తీవ్రంగా స్పందించారు. ఆధునిక చరిత్రలోనే ఇటువంటి అత్యంత చపలచిత్త, అనాగరిక, బాధ్యతలేని దేశాధినేత మరొకరు లేరంటూ దుమ్మెత్తిపోశారు. మన దేశం గురించి, మన ఆర్థిక వ్యవస్థ గురించి ట్రంప్ చేసిన నిరాధార, అసభ్యకర వ్యాఖ్యలతో తనకు షాక్ కలిగించాయని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధునిక చరిత్రలోనే ఇంత అస్థిరంగా, అనాగరికంగా, బాధ్యతారహితంగా వ్యవహరించిన మరొక దేశాధినేతను లేదని నేను అనుకుంటున్నాను. ట్రంప్ భారత్‌తో మాత్రమే కాదు, దీర్ఘకాలంగా ఉన్న మిత్ర దేశాలను సైతం వదిలిపెట్టలేదు. ట్రంప్‌లోనే ఏదో తేడా ఉందని పేర్కొన్న ఆయన.. ఇంతకు మించి వ్యాఖ్యానించడమంటే మనల్ని మనం తక్కువ చేసుకోవడమే అవుతుందని వ్యాఖ్యానించారు. ట్రంప్ వేధింపులకు లొంగకుండా గట్టిగా నిలబడిన ప్రధాని మోదీని ఆయన ప్రశంసించారు.

ట్రంప్.. నోబెల్ బహుమతికి అర్హుడు: వైట్‌హౌస్

వాషింగ్టన్: భారత్-పాక్ సహా ఆరు ప్రపంచ ఘర్షణలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం వహించారని, నోబెల్ శాంతి బహుమతికి అర్హుడని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ అన్నారు. థాయ్‌లాండ్ - కంబోడియా మధ్య వివాదాన్ని పరిష్కరించి బేషరతు కాల్పుల విరమణకు సహాయం చేశారని, మూడు లక్షల మంది ప్రజలను నిరాశ్రయులను చేసిన ఘర్షణకు ముగింపు పలికారని ట్రంప్‌ను ఆమె కొనియాడారు. దేశాలతోపాటు ఇజ్రాయెల్-ఇరాన్, రువాండా-కాంగో, భారత్-పాకిస్తాన్, సెర్బియా-కొసావో, ఈజిప్ట్-ఇథియోపియా ఘర్షణలను ముగించారన్నారు. ఆయన అధికారం చేపట్టిన నాటి నుంచి నెలకు సగటున ఒకటి వరకు శాంతి ఒప్పందాలను కుదిర్చారన్నారు. ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వడానికి ఇది సరైన సమయమని ఆమె పునరుద్ఘాటించారు. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ 'ఆపరేషన్ సింధూర్' తరువాత.. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొనడం, ఆ తరువాత ఇరు దేశాల మధ్య ఒప్పందంతో కాల్పుల విరమణ జరగడం తెలిసిందే. అయితే.. ఇరు దేశాల మధ్య ఘర్షణకు ముగింపు పలకడానికి తానే మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ పదేపదే ప్రకటించారు. తన దౌత్యపరమైన కృషికి నోబెల్ శాంతి బహుమతికి అర్హుడినని పదేపదే చెప్పుకొన్నారు. అయితే ట్రంప్ వాదనలను భారత్ ఖండిస్తూనే ఉంది. పాక్‌తో కాల్పుల విరమణ ఒప్పందంలో మరే మూడోదేశం జోక్యం లేదని, ఇరుదేశాల సైన్యంలోనే డైరెక్టర్ జనరల్స్ మధ్య జరిగిన చర్చల వల్లే శాంతి నెలకొందని భారత్ స్పష్టం చేసింది.

చిన్నారితోపాటు దేశం విడిచి వెళ్లిన రష్యా మహిళ..


ఢిల్లీ పోలీసుల నిర్లక్ష్యంపై సుప్రీం ఆగ్రహం

- పోలీస్ కమిషనర్‌ను సైతం వదిలేది లేదని హెచ్చరిక
- ఇంటర్‌పోల్ సాయం తీసుకుని, బాలుడిని తీసుకురావాలని ఆదేశం

న్యూఢిల్లీ: భర్త నుంచి విడిపోయిన రష్యా మహిళ, చిన్నారితోపాటు దేశం విడిచి వెళ్లిపోవడంపై సుప్రీంకోర్టు ఢిల్లీ పోలీసులకు తలంటింది. పోలీసులు తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరించి కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని మండిపడింది. మైనర్‌ను రష్యా నుంచి తిరిగి తీసుకువచ్చేందుకు అక్కడి భారత ఎంబసీతో సంప్రదింపులు జరపాలని ఆదేశించింది. చిన్నారి కస్టడీ విషయంలో రష్యా మహిళ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం మే 22వ తేదీన ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. అయినప్పటికీ, ఆమె దేశం విడిచి నేపాల్ మీదుగా రష్యా వెళ్లిపోయినట్లుగా తెలవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ పోలీసుల పూర్తి నిర్లక్ష్యం, వైఫల్యమని పేర్కొంది. ఈ విషయాన్ని ఢిల్లీ పోలీసులతోపాటు విదేశాంగ శాఖ కూడా దీన్ని చాలా తేలిగ్గా తీసుకున్నారని వ్యాఖ్యానించింది. కానీ, చిన్న వివాదం ఏమాత్రం కాదని పేర్కొంది. 'ఆ బిడ్డను ఈ కోర్టు కస్టడీ నుంచి తల్లి తీసుకుంది. ఇది పిల్లలు తల్లిదండ్రుల మధ్య కస్టోడియల్ వివాదం కేసు కాదు. ఆ బాలుడి సంరక్షణ బాధ్యతను తండ్రికి, తల్లికీ కూడా అప్పగించలేదు. దేశం తరఫున అతడి సంరక్షకుడిగా ఉంటూ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆ పిల్లవాడు ప్రస్తుతం కోర్టు కస్టడీలో ఉన్నాడు'అని ధర్మాసనం వెల్లడించింది. ఈ పరిణామానికి కారణమైన స్థానిక స్టేషన్ హౌస్ అధికారి(ఎస్‌హెచ్‌వో), డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ)లనే కాదు, అవసరమైతే పోలీస్ కమిషనర్‌కు సైతం సమన్లు జారీ చేస్తామని తీవ్ర స్వరంతో హెచ్చరించింది. 'తల్లి కదలికలపై కన్నేసి ఉంచేందుకు మహిళా పోలీసు అధికారులను నియమించాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే, స్థానికుల సాయంతో, పారదర్శకతతో వ్యవహరిస్తూ ఆ మహిళ ఇంట్లోకి ప్రవేశించడానికి సైతం అనుమతిచ్చాం. అయినప్పటికీ ఆమె బిడ్డతోపాటు ఇంటిని ఎలా వదిలి వెళ్లగలిగింది?'అని ఢిల్లీ పోలీసుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిని ధర్మాసనం ప్రశ్నించింది. నేపాల్, యూఏఈ, రష్యా వైమానిక సంస్థలను సంప్రదించగా వారు వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశమంటూ ఎలాంటి సమాచారమూ తమకు ఇవ్వలేదని ఐశ్వర్య భాటి తెలిపారు. 'నేర పూరిత చర్యలకు వ్యక్తిగత గోప్యతనేది వర్తించదు. ఢిల్లీ నుంచి బిహార్ ద్వారా అతి కష్టమైన రోడ్డు మార్గం ద్వారా నేపాల్‌కు చేరుకుంది. అక్కడ నాలుగు రోజులు మకాం వేసింది. అయినా ఢిల్లీ పోలీసులు పట్టించుకోలేదు. కోర్టు వద్ద అసలైన పత్రాలుండటంతో ఆమె ఫోర్జరీ పత్రాలతో నేపాల్ వెళ్లినా ఢిల్లీ పోలీసులు అడ్డుకోలేదు'అంటూ ధర్మాసనం మండిపడింది. ఈ విషయంలో ఇంటర్‌పోల్ సాయం తీసుకోవాలని, అవసరమైన ఆదేశాలను తాము జారీ చేస్తామని ఐశ్వర్య భాటికి తెలిపింది. చిన్నారిని వెనక్కి తీసుకువచ్చే విషయంలో తీసుకున్న చర్యల పురోగతిపై పది రోజుల్లో నివేదికను అందించాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. రష్యా మహిళ చిన్నారి సహా దేశం విడిచి నేపాల్, షార్జాల మీదుగా వెళ్లిపోయి ఉంటుందని జులై 21న జరిగిన విచారణ సందర్భంగా కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. నేపథ్యమిదీ.. భారత్‌కు చెందిన వ్యక్తి రష్యా మహిళను పెళ్లి చేసుకున్నారు. ఆమె 2019 నుంచి ఎక్స్-1 వీసాపై ఢిల్లీలోనే ఉంటోంది. కుమారుడు పుట్టాక వారి మధ్య విభేదాలొచ్చాయి. కోర్టు సూచన మేరకు బాలుడి సంరక్షణ బాధ్యతను వారంలో చెరి సగం పంచుకున్నారు. కొన్నాళ్లు సరిగానే ఈ వ్యవహారం నడిచినా అకస్మాత్తుగా ఆ మహిళ, చిన్నారి సహా కనిపించకుండా పోవడంతో ఆ వ్యక్తి కోర్టును ఆశ్రయించారు.

వందేళ్ల వృద్ధ ఖైదీ విడుదల

సంత్ కబీర్ నగర్: ఉత్తరప్రదేశ్‌లో వందేళ్ల వయసున్న వృద్ధ ఖైదీ భోలా చౌదరి శుక్రవారం సంత్ కబీర్ నగర్ జిల్లా జైలు నుంచి విడుదలయ్యాడు. శిక్షా కాలం పూర్తి కాకపోయినా అతడి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని విడుదల చేయాలని రాష్ట్ర గవర్నర్ ఆనందిబెన్ పటేల్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఎట్టకేలకు విముక్తి లభించింది. బలియా జిల్లాలోని అమ్ఘాట్ గ్రామానికి చెందిన భోలా చౌదరికి హత్య, హత్యాయత్నం కేసులో దోషిగా తేలాడు. న్యాయస్థానం 1978లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. తొలుత బలియా, తర్వాత అజయ్‌గఢ్, అనంతరం సంత్ కబీర్ నగర్ జిల్లా జైలుకు తరలించారు. 2023 ఏప్రిల్ 2 నుంచి సంత్ కబీర్ నగర్‌లో శిక్ష అనుభవిస్తున్నాడు. తీవ్ర అనారోగ్యంతో బాధపడతున్నానని, క్షమాభిక్ష ప్రసాదించాలని గవర్నర్‌ను వేడుకున్నాడు. అతడి వినతి పట్ల గవర్నర్ సానుకూలంగా స్పందించారు.



ఓ వైపు పరవళ్లు తొక్కుతున్న జలపాతం.. మరో వైపు నిండుగా పరుచుకున్న పచ్చదనం.. కనువిందు చేస్తున్న ఈ దృశ్యం గోవాలోనిది



ఇండోనేసియాలోని తూర్పు నుసా తెంగారా ప్రావిన్స్‌లోని ల్యూటోబి లాకిలాకి అగ్ని పర్వతమిది. తాజాగా బద్దలై లావా, బూడిద ఏకంగా 10 కిలోమీటర్ల ఎత్తున ఎగజిమ్ముతోంది. దీంతో, బాలిలో విమానాల రాకపోకలను నిలిపివేశారు.

అమెరికాలో 8 కొత్త కాన్సులర్ కేంద్రాలను ప్రారంభించిన భారత్

వాషింగ్టన్: అమెరికా వ్యాప్తంగా 8 కొత్త కాన్సులర్ అప్లికేషన్ సెంటర్లను భారత ప్రభుత్వం ప్రారంభించింది. అమెరికాలోని భారత రాయబారి వినయ్ ఖ్వాత్రా ఈ విషయాన్ని ప్రకటించారు. 'ఆగస్టు 1 నుంచి యూఎస్‌ఏలో మా కాన్సులర్ సేవలను విస్తరిస్తున్నాం. బోస్టన్, కొలంబస్, డాలస్, డెట్రాయిట్, ఆడిసన్, ఓర్లాండో, రాలీ, శాన్‌జోస్‌లో ఈ కొత్త కేంద్రాలు ఉంటాయి. త్వరలో లాస్ ఏంజెలెస్‌లోనూ మరో కేంద్రాన్ని ప్రారంభిస్తున్నాం. వీటితో భారతీయ డయాస్పోరాకు కాన్సులర్ సేవలు గణనీయంగా పెరుగుతాయి.' అని ఖ్వాత్రా ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'భారత్-అమెరికా భాగస్వామ్యానికి ప్రజల మధ్య సంబంధాలు ప్రధానమైనవని మేం దృఢంగా విశ్వసిస్తున్నాం. బోస్టన్, లాస్ ఏంజెలెస్‌లలో కాన్సులేట్‌లను ప్రారంభించడం రెండు దేశాల మధ్య సంబంధాన్ని మాత్రమే కాకుండా.. ప్రజల మధ్య సంబంధాన్ని బలోపేతం చేస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. ఈ సెంటర్లు శనివారాల్లో కూడా తెరచి ఉంటాయి. భారత విదేశాంగ శాఖ ప్రకారం.. భారత సంతతికి చెందిన దాదాపు 54 లక్షల మంది అమెరికాలో నివసిస్తున్నారు. ఇది ఆ దేశంలో మూడో అతి పెద్ద ఆసియా సమూహం. భారత్-అమెరికా మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో ప్రవాసులు కీలక పాత్ర పోషించారు.

పులిని బంధించి ఇచ్చిన తండ్రీ కూతుళ్లకు సత్కారం

రాంచీ: తమ ఇంట్లోకి ప్రవేశించిన పులిని బంధించి, అటవీ శాఖ అధికారులకు పట్టివ్వడంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఓ వ్యక్తి, అతని కుమార్తెలను జార్ఖండ్ ప్రభుత్వం సత్కరించింది. రాష్ట్రంలోని మార్దు గ్రామంలోని పురందర్ మహతో ఇంట్లోకి జూన్ 25న తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో ఒక మగ పులి ప్రవేశించింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మహతో కుమార్తె సోనికా కుమారి, మరో అమ్మాయి చాకచక్యంగా ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఆ తరువాత తండ్రితో కలిసి బయటి నుంచి తలుపు తాళం వేశారు. అనంతరం అటవీ శాఖకు సమాచారం ఇచ్చారు. పలమౌ టైగర్ రిజర్వ్ నుంచి ఒక రెస్క్యూ బందం ఘటనా స్థలానికి చేరుకుని పులిని విజయవంతంగా బంధించింది. తరువాత టైగర్ రిజర్వ్‌లో విడిచిపెట్టారు. వారి ధైర్య సాహసాలను గుర్తించిన ప్రభుత్వం.. రాంచీలో జరిగిన 76వ వన్ మహోత్సవ్ సత్కరించింది. ఇద్దరికీ రూ.1.20 లక్షల రివార్డును అందజేసింది.

లద్దాఖ్‌లో ఇస్రో 'హోప్' మిషన్

దేశంలో మొట్టమొదటి అనలాగ్ టెస్టు

- అంతరిక్ష ప్రయోగాల్లో మరో ముందడుగు

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) కీలక ప్రయోగాలకు సన్నద్ధమవుతోంది. వ్యోమగాములను 2027 నాటికి అంతరిక్షంలోకి, 2040 నాటికి చంద్రుడిపైకి పంపించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. దాంతోపాటు మరిన్ని కీలక అంతరిక్ష ప్రయోగాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరీక్షల కోసం జమ్మూకశ్మీర్‌లోని లద్దాఖ్‌ను ఇస్రో ఎంపిక చేసింది. దేశంలో మొట్టమొదటి అనలాగ్ మిషన్‌ను ఇక్కడే చేపట్టబోతోంది. అచ్చంగా అంతరిక్షంలో, ఇతర గ్రహాలపై ఉండే భౌతిక, వాతావరణ పరిస్థితులను ఇక్కడ సృష్టిస్తారు. అందులో వ్యోమగాములు ఒంటరిగా గడపాల్సి ఉంటుంది. శారీరకంగా, మానసికంగా వారిలో కలిగే మార్పులను అధ్యయనం చేస్తారు. అంతేకాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం పరీక్షించబోతున్నారు. ఈ మిషన్‌కు హిమాలయన్ ఔట్‌పోస్ట్ ఫర్ ప్లానెటరీ ఎక్స్‌ప్లోరేషన్(హోప్) అని నామకరణం చేశారు.

- లద్దాఖ్‌లో ప్రత్యేకమైన భౌగోళిక పరిస్థితులు ఉన్నాయి. ఇది సముద్ర మట్టానికి 14,000 మీటర్ల ఎత్తులో ఉంది. ఇక్కడ ఆక్సిజన్ లభ్యత 40 శాతమే. చలి కూడా అధికం. అంగారక గ్రహంతోపాటు చంద్రుడి ఉపరితలానికి దగ్గరగా ఉన్న పరిస్థితులను లద్దాఖ్‌లో గుర్తించారు. అందుకే హోప్ మిషన్‌కు ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారు.
- ఇద్దరు నివసించేలా ఒక ఇంటిని నిర్మిస్తారు. ఇది స్పేస్‌క్రాఫ్ట్ లాగే ఉంటుంది. ఆహారం వండుకోవడానికి వసతులుంటాయి. ఇతర వనరులు పరిమితంగానే కల్పిస్తారు. వ్యోమగాములు 10 రోజుల పాటు నివసించాలి. ఇందుకోసం ఇప్పటికే ఇద్దరిని ఎంపిక చేశారు. ఒకరు ప్లానెటరీ సైన్స్ గ్రాడ్యుయేట్ కాగా, మరొకరు పీహెచ్ పరిశోధకుడు. 135 మంది దరఖాస్తు చేసుకోగా ఇద్దరికి అవకాశం దక్కింది.
- సాధారణంగా అంతరిక్ష ప్రయోగాలు రోజుల తరబడి జరుగుతుంటాయి. క్లిష్టమైన పరిస్థితులకు తగ్గట్టుగా వ్యోమగాములు సిద్ధం కావాల్సి ఉంటుంది. ఇందుకోసం ముందస్తుగానే పరీక్షలు నిర్వహిస్తుంటారు.
- అనలాగ్ మిషన్ అనేది అంతర్జాతీయంగా అమల్లో ఉన్న విధానం. వ్యోమగాముల ఆరోగ్యంపై పర్యవేక్షణ, ఎమర్జెన్సీ డ్రిల్స్‌తోపాటు ప్రతికూల పరిస్థితుల్లో కమ్యూనికేషన్లను పరీక్షించడానికి వాడుతున్నారు.
- హోప్ ప్రాజెక్టులో ఐఐటీ-బాంబే, యూనివర్సిటీ ఆఫ్ లద్దాఖ్‌తోపాటు కొన్ని ప్రైవేట్ సంస్థలు పాలుపంచుకుంటున్నాయి.
- అనలాగ్ మిషన్‌తో అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ మరో అడుగు ముందుకు వేసినట్లేనని నిపుణులు చెబుతున్నారు.

రాజకీయాలంటే అబద్ధాలు పొగడ్తలు కాదు: గడ్కరీ

పుణె: రాజకీయాల్లో కొనసాగాలంటే అబద్ధాలు చెప్పడం, పొగడ్తలు కురిపించడం అవసరమన్న దురభిప్రాయం ఒకటుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. వాస్తవంలో రాజకీయ నేతలు నిజాలు మాత్రమే మాట్లాడుతూ ప్రజల విశ్వాసం పొందవచ్చని తెలిపారు. దివంగత శివసేన చీఫ్ బాలా సాహెబ్ ఠాక్రే ఎంతో నిజాయతీతో మాట్లాడేవారని గుర్తు చేశారు. మాటలకు, చేతలకు పొంతన ఉండేలా వ్యవహరించేవారని చెప్పారు. మంచిని మంచి గాను, చెడుంటే దానిని చెడు అనే చెప్పాలని గడ్కరీ అన్నారు. 'రాజకీయాల్లో స్పష్టంగా, నిజాయతీతో మాట్లాడటం ఒక్కోసారి వీలవ్వదని సీఎం ఫడ్నవీస్ అంటుంటారు కానీ, లోక్‌సభ ఎన్నికల ప్రచారం సమయంలో నేను నిజం మాత్రమే ప్రజలకు చెప్పాను. ఉచితాలు ఇవ్వలేను, కులం, వర్గం అంటూ నావద్దకు రావద్దు, నాకు మీరు ఓటేసినా వేయకున్నా అందరి సంక్షేమం కోసం పనిచేస్తా..' అని స్పష్టం చేశానన్నారు. గురువారం ఆయన లోకమాన్య తిలక్ నేషనల్ అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా ప్రసంగించారు. కార్యక్రమంలో సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ పాల్గొన్నారు.

కాన్సులర్ జనరల్‌ను నియమించిన కెనడా

ఒట్టావా: ముంబైలో కాన్సులర్ జనరల్‌గా జెఫ్ డేవిడ్‌ను నియమించినట్లు కెనడా ప్రభుత్వం తెలిపింది. తాజా నియామకంపై కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ బుధవారం ఒక ప్రకటన చేశారు. డేవిడ్ ఇప్పటి వరకు చైనా, అఫ్గానిస్తాన్‌లలో సేవలందించారు. 2023లో భారత్‌ను వీడిన డియోడ్రా కెల్లీ స్థానంలో జెఫ్ డేవిడ్ బాధ్యతలు చేపట్టనున్నారు. గతేడాది అక్టోబర్‌లో భారత ప్రభుత్వం కెనడాలోని ఐదుగురు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించుకోవడంతోపాటు అంతే సంఖ్యలో కెనడా దౌత్యాధికారులను దేశం నుంచి బహిష్కరించాక చేపట్టిన మొట్టమొదటి నియామకం ఇదే. జూన్‌లో కెనడాలో జరిగిన జీ 7 శిఖరాగ్రం సందర్భంగా ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరస్పరం హై కమిషనర్లను నియమించుకోవాలని, దౌత్య సంబంధాలతోపాటు రెండు దేశాల పౌర, వాణిజ్య సంబంధాలను సాధారణ స్థాయికి తేవాలని అంగీకారానికి రావడం తెల్సిందే. కాగా, సిక్కు తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ 2023 జూన్‌లో సర్రే నగరంలో హత్యకు గురయ్యాడు. దీని వెనుక భారత ప్రభుత్వ హస్తం ఉందంటూ అప్పటి కెనడా ప్రధాని ట్రూడో చేసిన తీవ్ర ఆరోపణలు, అనంతర పరిణామాలతో రెండు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

ప్రభుత్వ పథకాలకు బతికున్న నేతల పేర్లు పెట్టొద్దు

తమిళనాడు ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

చెన్నై: రాష్ట్రంలోని సంక్షేమ పథకాలకు జీవించి ఉన్న రాజకీయ నేతల పేర్లు పెట్టడం లేదా ప్రభుత్వ ప్రచార సామగ్రిలో మాజీ ముఖ్యమంత్రులు లేదా సైద్ధాంతిక నాయకుల ఫోటోలను ఉపయోగించవద్దని హైకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అన్నాడీఎంకే ఎంపీ సీవీ షణ్ముగం దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, జస్టిస్ సుందర్ మోహన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రకటనల కోసం సుప్రీంకోర్టు ఆదేశాలు, కంటెంట్ మార్గదర్శకాలను ఉదహరించింది. ఇటీవలే, తమిళనాడు ప్రభుత్వం ముఖ్యమంత్రి పేరును కలుపుకొని 'ఉంగలుడన్ స్టాలిన్', 'స్టాలిన్ విత్ యు' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం అదే పేరుతో ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సీవీ షణ్ముగం పిటిషన్ దాఖలు చేశారు. సంక్షేమ పథకాల్లో రాజకీయ ప్రముఖులను పొందుపరచి రాష్ట్రం ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తోందని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు వినిపించారు. సుప్రీం కోర్టు తీర్పులను, ప్రభుత్వ ప్రకటన మార్గదర్శకాలు-2014ను ఉల్లంఘించిందని వాదించారు. ఇది ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ఆపడం లేదని, ఈ తీర్పు వాటిని ఎలా ప్రచారం చేస్తున్నారనే దానిపైనేనని హైకోర్టు స్పష్టత ఇచ్చింది.

రుణ మోసం కేసు..

అనిల్ అంబానీపై లుకౌట్ నోటీస్


న్యూఢిల్లీ: రూ.17 వేల కోట్ల రుణ మోసాల కేసులో అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ చైర్మన్ అనిల్‌పై లుకౌట్ నోటీస్ జారీ అయ్యింది. ఆయన దేశం విడిచివెళ్లిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వీలుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వినతి మేరకు శుక్రవారం ఈ నోటీస్ విడుదల చేశారు. ఈ కేసులో ఆగస్టు 5వ తేదీన ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో జరిగే విచారణకు రావాలంటూ ఈడీ నోటీసు పంపించింది. మనీ ల్యాండరింగ్ చట్టం కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేస్తామని ఈడీ వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లో ఆయన కంపెనీల అధికారులకు సైతం నోటీసులు జారీ చేసే అవకాశాలున్నాయని అంటున్నారు. సెబీ అందించిన నివేదిక మేరకు ఈడీ అధికారులు జూలై 24వ తేదీన 50 కంపెనీలు, 25 మంది అధికారులకు చెందిన 35 చోట్ల మొదలుపెట్టిన సోదాలను మూడు రోజులపాటు కొనసాగించారు. యస్ బ్యాంకు నుంచి పొందిన రూ.3 వేల కోట్ల రుణాలను పక్కదారి పట్టించినట్లు ఈడీ ఆరోపిస్తుండగా, అలాంటిదేమీ లేదంటూ అంబానీ గ్రూప్ కొట్టిపారేస్తోంది.



గాజాలో ఆహార కేంద్రాలను పరిశీలించిన ట్రంప్ దూత

డెయిర్ అల్-బలాహ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ శుక్రవారం గాజాలోని ఆహార పంపిణీ కేంద్రాలను పరిశీలించారు. గాజాలో ఆకలి చావులు, చిన్నారుల్లో పోషకాహార లోపం, ఆహార కొరత, మానవతా సాయం పంపిణీ కేంద్రాల వద్ద ఇజ్రాయెల్ కాల్పుల వంటి పరిణామాలతో అంతర్జాతీయంగా తీవ్ర ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్న వేళ ఆయనీ పర్యటన చేపట్టడం గమనార్హం. ఇజ్రాయెల్‌లో అమెరికా రాయబారి మైక్ హుకాబీతో కలిసి రఫాలోని గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్(జీహెచ్‌ఎఫ్) పంపిణీ కేంద్రాలను సందర్శించారు. ఈ కేంద్రాలను ఇజ్రాయెల్, అమెరికాలు కలిసి ఏర్పాటు చేసిన విషయం తెల్సిందే. హమాస్ వైఖరిని నిరసిస్తూ ఖతార్‌లో కాల్పుల విరమణ కోసం జరిగే చర్చల నుంచి వారం క్రితం వైదొలిగిన అమెరికా.. బందీల విడుదలకు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తామని ప్రకటించింది.

రాజ్యసభలో గరిష్ట ప్రాతినిధ్యం ఉన్న రాష్ట్రం?



భారత రాజ్యాంగ పరిషత్ మొదట ఉప రాష్ట్రపతి పదవిని కల్పించలేదు. రాజ్యాంగ పరిషత్ ముఖ్య న్యాయ సలహాదారుడైన బెనగళ నర్సింగరావు చొరవతో ఈ పదవిని ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి మరణించినా, సెలవులో ఉన్నా లేదా విధులు నిర్వర్తించలేని పరిస్థితిలో ఉన్నా కొత్త రాష్ట్రపతి ఎన్నికయ్యేంత వరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పార్లమెంట్‌లోని సభాధ్యక్షులు ఒక కమిటీగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వ పరిపాలన నిర్వహించాలని ఆయన సూచించారు. ఆ తర్వాత జరిగిన చర్చల ఫలితంగా హెచ్.వి. కామత్ తదితరులు ఉప రాష్ట్రపతి పదవి ఏర్పాటుకు కృషి చేశారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

ఇండియన్ పాలిటీ

భారత పార్లమెంట్

కేంద్ర స్థాయిలో శాసన నిర్మాణ శాఖ అంటే పార్లమెంట్ (సంసద్). రాజ్యాంగంలోని 79వ అధికరణం ప్రకారం పార్లమెంట్ అంటే లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతి. రాజ్యాంగంలో అయిదో భాగంలోని రెండో అధ్యాయంలో 79 నుంచి 122 వరకు ఉన్న అధికరణలు భారత పార్లమెంట్ నిర్మాణం, అధికారాలు, విధుల గురించి పేర్కొంటున్నాయి.

- భారతదేశంలో 1952 నుంచి 1962 వరకు ద్విసభ్య నియోజకవర్గాలను ఏర్పాటు చేసేవారు.
- బ్రిటిష్ పార్లమెంట్‌లా భారతదేశ పార్లమెంట్‌కు సార్వభౌమాధికారం లేదు.
- 1954లో మొదటి లోక్‌సభ స్పీకర్ జి.వి. మౌలాంకర్ (గణేష్ వాసుదేవ్ మౌలాంకర్) ప్రజా ప్రతినిధుల సభకు లోక్‌సభ అని, రాష్ట్రాల మండలికి రాజ్యసభ అని నామకరణం చేశాడు.
- రాజ్యాంగంలో రాజ్యసభకు 'కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్', లోక్‌సభకు 'హౌస్ ఆఫ్ ది పీపుల్' అనే పదాలను ఉపయోగించారు. కానీ హిందీ భాషా పదాలైన రాజ్యసభ, లోక్‌సభ అనే పదాలే జన బాహుళ్యంలో వాడుకలోకి వచ్చాయి.

రాజ్యసభ

భారత రాజ్యాంగంలోని 80వ అధికరణను అనుసరించి రాజ్యసభను ఏర్పాటు చేశారు. రాజ్యాంగ పండితులు దీన్ని 'ఎగువసభ', 'రాష్ట్రాల పరిషత్', 'పెద్దల సభ'గా వర్ణించారు.

- రాజ్యసభ 1952 ఏప్రిల్ 3న ఏర్పాటైంది.
- రాజ్యసభ తొలి సమావేశాన్ని 1952 మే 13న నిర్వహించారు.
- హిందీలో 'రాజ్య' అంటే రాష్ట్రం అని అర్థం. అందువల్ల రాజ్యసభ అంటే రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే సభగా పేర్కొనవచ్చు.
- రాజ్యాంగం ప్రకారం రాజ్యసభ గరిష్ట సభ్యుల సంఖ్య 250 మంది. ప్రస్తుతం రాజ్యసభలో 245 మంది సభ్యులున్నారు.
- ప్రస్తుతం 4వ షెడ్యూల్ ప్రకారం మొత్తం రాజ్యసభకు కేటాయించిన సభ్యుల సంఖ్య 233. సాహిత్యం, కళలు, శాస్త్ర విజ్ఞానం, సామాజిక సేవ మొదలైన రంగాల్లో విశేషానుభవం ఉన్న 12 మంది సభ్యులను 80(3)వ అధికరణం ప్రకారం రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు.
- రాజ్యాంగంలోని 80(2)వ అధికరణం ప్రకారం రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించే రాజ్యసభ సభ్యులను రాష్ట్రాల అసెంబ్లీల సభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతి ప్రకారం ఎన్నుకుంటారు.
- 80(4)వ అధికరణం ప్రకారం పార్లమెంట్ రూపొందించిన చట్టం ఆధారంగా రాజ్యసభలో కేంద్రపాలిత ప్రాంతాల ప్రాతినిధ్యం ఉంటుంది.
- 80(5)వ అధికరణం ప్రకారం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీట్ల కేటాయింపు రాజ్యాంగంలోని 4వ షెడ్యూల్ ప్రకారం జరగాలి.
- భారత రాజ్యాంగం సమాఖ్య విధానాన్ని అనుసరిస్తోంది. కాబట్టి పార్లమెంట్‌లో రాష్ట్రాల ప్రాతినిధ్యం అవసరమైంది. ఈ కారణంగా రాజ్యసభను ఏర్పాటు చేశారు.
- 'ప్రతి రాష్ట్రం నుంచి ఎగువ సభలో సమాన ప్రాతినిధ్య పద్ధతి' అనే అమెరికా సమాఖ్యకు చెందిన విధానం మన రాజ్యాంగంలో లేదు.
- 4వ షెడ్యూల్‌లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జనాభా ఆధారంగా రాజ్యసభలో ప్రతినిధుల సంఖ్యను నిర్ణయించారు.
- ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు కేటాయించిన సభ్యుల సంఖ్య 31 మంది.
- నాగాలాండ్, మణిపూర్ నుంచి ఒక్కో సభ్యుడిని మాత్రమే కేటాయించారు.
- రాజ్యసభకు నిర్వహించే ఎన్నికల పద్ధతిని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు.

రాజ్యసభకు పోటీ చేయడానికి కావాల్సిన అర్హతలు:

1. భారతదేశ పౌరుడై ఉండాలి.
2. వయసు కనీసం 30 ఏళ్లు ఉండాలి.
3. ఆదాయాన్ని పొందే ప్రభుత్వ ఉద్యోగం చేయడదు.
4. పార్లమెంట్ చట్టాలరీత్యా నిర్దేశించిన ఇతర అర్హతలు కలిగి ఉండాలి.

శాశ్వత సభ: లోక్‌సభలా రాజ్యసభకు నిర్దీత కాల పరిమితి ఉండదు. ఇది శాశ్వత సభ. ఇది రద్దు కాదు. మొత్తం సభ్యుల్లో మూడో వంతు సభ్యులు ప్రతి రెండేళ్లకు ఒకసారి పదవీ విరమణ చేస్తారు. వీరి స్థానంలో కొత్త సభ్యులను ఎన్నుకుంటారు. పదవీ విరమణ చేసిన సభ్యులు తిరిగి పోటీ చేయవచ్చు. ఒక్కో సభ్యుడు ఆరేళ్లు కొనసాగుతాడు.

- అధికరణ 83(1) ప్రకారం రాజ్యసభ కాలపరిమితి గురించి వివరించారు.
- 89వ అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎక్స్-అఫీషియో చైర్మన్‌గా ఉప రాష్ట్రపతి వ్యవహరిస్తారు. ఈయనకు నిర్ణాయక ఓటు ఉంటుంది.
- రాజ్యసభ సభ్యులు తమలో నుంచి ఒకరిని డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నుకుంటారు.
- మొదటి రాజ్యసభ చైర్మన్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్.
- మొదటి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ - ఎస్.వి. కృష్ణమూర్తి రావు.
- రాజ్యసభ సమావేశానికి కావాల్సిన కనిష్ఠ సభ్యుల సంఖ్యను 'కోరమ్' అంటారు. మొత్తం సభ్యుల్లో పదో వంతును కోరమ్‌గా పరిగణిస్తున్నారు.

రాజ్యసభ ప్రత్యేక అధికారాలు:

1. 67వ అధికరణం ప్రకారం ఉప రాష్ట్రపతిని తొలగించే తీర్మానాన్ని ముందుగా రాజ్యసభలోనే ప్రవేశపెట్టాలి.
2. అధికరణ 249 ప్రకారం రాష్ట్ర జాబితాలోని ఏదైనా అంశానికి జాతీయ ప్రాముఖ్యం ఉందని భావించి రాజ్యసభ 2/3వ వంతు మెజార్టీతో తీర్మానాన్ని ఆమోదిస్తే ఏడాది కాలానికి చెల్లుబాటయ్యే విధంగా శాసనం చేయవచ్చు.
3. అధికరణ-312 ప్రకారం నూతన అఖిల భారత సర్వీసులను ఏర్పాటు చేయడానికి సంబంధించిన బిల్లు ముందుగా రాజ్యసభ ఆమోదం పొందాలి.

- రాజ్యసభలో ప్రాతినిధ్యం ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు - ఢిల్లీ, పుదుచ్చేరి.
- జాతీయ అత్యవసర పరిస్థితి విధింపునకు సంబంధించిన తీర్మానాన్ని రాజ్యసభ ఒక నెల లోపు ఆమోదించాలి.
- రాష్ట్రపతి పాలనకు సంబంధించిన తీర్మానాన్ని రాజ్యసభ రెండు నెలల్లోపు ఆమోదించాలి.
- లోక్‌సభ ఆమోదించిన ఆర్థిక బిల్లులను రాజ్యసభ 14 రోజుల్లోపు ఆమోదించాలి.

రాజ్యసభలో అత్యధిక స్థానాలున్న రాష్ట్రాలు:

రాష్ట్రం	సభ్యులు
1. ఉత్తరప్రదేశ్	31
2. మహారాష్ట్ర	19
3. తమిళనాడు	18
4. పశ్చిమ బెంగాల్	16
5. బీహార్	16
6. కర్ణాటక	12
7. ఆంధ్రప్రదేశ్	11
8. మధ్యప్రదేశ్	11
9. గుజరాత్	11

- **రాజ్యసభలో ఒక సభ్యుడిని మాత్రమే కలిగి ఉన్న రాష్ట్రాలు:** అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, గోవా, మేఘాలయా, సిక్కిం, త్రిపుర.
- కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి నుంచి రాజ్యసభకు ఒక సభ్యుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- ఢిల్లీ (కేంద్రపాలిత ప్రాంతం) నుంచి రాజ్యసభకు ముగ్గురు సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- తెలంగాణ, అసోం, పంజాబ్ రాష్ట్రాల నుంచి ఏడుగురు సభ్యుల చొప్పున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

రాజ్యసభ చైర్మన్: పార్లమెంట్‌లోని ఉభయసభలను నిర్వహించడానికి విడివిడిగా సభాధ్యక్షులు ఉంటారు. 89వ అధికరణం ప్రకారం భారత ఉప రాష్ట్రపతి రాజ్యసభకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

- ఏ కారణంగానైనా రాజ్యసభ చైర్మన్ అందుబాటులో లేనప్పుడు డిప్యూటీ చైర్మన్ సభను నిర్వహిస్తారు.
- రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కూడా అందుబాటులో లేనప్పుడు సభా నియమావళి ప్రకారం ఎంపిక చేసిన ఒక సీనియర్ సభ్యుడు సమావేశాలను నిర్వహిస్తారు.
- రాజ్యాంగంలో 89 నుంచి 92 వరకు ఉన్న అధికరణలు రాజ్యసభ సభాధ్యక్షుల ఎన్నిక, రాజీనామా, సమావేశాలకు సంబంధించిన వివరాలను తెలుపుతున్నాయి.
- అధికరణ 97 ప్రకారం రాజ్యసభ చైర్మన్ హోదాలో ప్రస్తుతం ఉప రాష్ట్రపతి నెలకు రూ.1,25,000 వేతనం పొందుతున్నారు. ఇతర సౌకర్యాలు, పెన్షన్ మొదలైన సదుపాయాలు కూడా ఉంటాయి.

భారత విమానయాన పితామహుడెవరు?

వివిధ దేశాల మధ్య ప్రయాణించడానికి రోజులు, నెలల సమయం తీసుకునే పరిస్థితి నుంచి ప్రపంచంలోని ఏ సుదూర ప్రాంతానికైనా కేవలం ఒక రోజులోనే చేరగలగడాన్ని సుసాధ్యం చేసింది వాయు రవాణా. అమెరికాకు చెందిన రైట్ సోదరులు 1903లో తొలిసారిగా విమానాన్ని రూపొందించారు. ఈ విధంగా ప్రారంభమైన విమానయానం రవాణా వ్యవస్థ స్వరూపాన్నే పూర్తిగా మార్చేసింది.



భారతదేశం - వాయు రవాణా

ఆధునిక ప్రపంచంలో రవాణా వ్యవస్థలో వాయు రవాణా ప్రాముఖ పాత్ర పోషిస్తోంది. ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి తక్కువ సమయంలో ప్రయాణించడానికి, సరకుల రవాణాకు విమానాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పశ్చిమ దేశాల నుంచి తూర్పు దేశాలకు వెళ్లే విమాన మార్గాలన్నీ మనదేశం మీదుగా వెళ్తున్నాయి. భారతదేశ శీతోష్ణస్థితి విమానయానానికి అనుకూలం.

భారతదేశంలో మొట్టమొదటి ఎయిర్ మెయిల్ సర్వీస్ 1911లో అలహాబాద్ - నైనిటాల్ మధ్య ప్రారంభమైంది. ఈ రెండు ప్రదేశాల మధ్య దూరం 10 కి.మీ. ఈ విమానాన్ని హెన్రీ ఫికిట్ నడిపాడు. మన దేశంలో 1911లోనే విమాన రవాణా ప్రారంభమైనప్పటికీ అది వ్యవస్థీకృతం కాలేదు. 1920లో 'టాటా సన్స్' సంస్థ కొన్ని ఎయిర్ డ్రోమ్‌లను ప్రారంభించింది. అప్పట్నుంచి మనదేశంలో విమాన రవాణా వ్యవస్థీకృతమైంది. 1932లో జె.ఆర్.డి.టాటా కరాచీ - ముంబై నగరాల మధ్య మొదటి విమానాన్ని నడిపారు. జె.ఆర్.డి.టాటాను భారతదేశ విమానయాన పితామహుడిగా వ్యవహరిస్తారు. భారతదేశంలో విమాన సర్వీసుల ఏర్పాటు కోసం 1950లో 'రాజాధ్యక్ష' కమిటీని భారత ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ సూచనల ప్రకారం 1953లో వాయు రవాణాను జాతీయం చేశారు. 1953లో రెండు ఎయిర్ కార్పొరేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అవి:

1. ఎయిర్ ఇండియా (విదేశీ సర్వీసుల కోసం)
2. ఇండియన్ ఎయిర్‌లైన్స్ (స్వదేశీ సర్వీసుల కోసం)

మన దేశంలో 'వాయుదూత్' సర్వీసులను 1981లో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం దేశంలోని వాయు రవాణాను కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. 1990 ఏప్రిల్‌లో దేశ విమాన రవాణాలో ప్రైవేట్ వైమానిక సంస్థలను అనుమతించడానికి 'ఓపెన్ స్కై' పాలసీని ప్రవేశపెట్టారు.

ఎయిర్ ఇండియా: ఇది ఖండాంతర విమానయాన సర్వీసులను నడుపుతుంది. ఎయిర్ ఇండియా మస్కట్ 'మహారాజా' దీన్ని 'ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా' నిర్వహించేది. ఈ సంస్థ అన్ని ఖండాల్లోని దాదాపు 90 దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యంగా అమెరికా, కెనడా, యూరప్, రష్యా, గల్ఫ్, తూర్పు ఆసియా, పశ్చిమాసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియాలకు సర్వీసులు నడుపుతోంది. వీటిలో గల్ఫ్‌రూటు లాభదాయకం.

- భారతదేశంలో ఎక్కువ అంతర్జాతీయ విమానాశ్రయాలు కేరళలో ఉన్నాయి.
- దేశంలో విమానాశ్రయాలు గుజరాత్‌లో ఎక్కువగా ఉన్నాయి.

ఇండియన్ ఎయిర్‌లైన్స్: ఈ సంస్థ దేశంలోని వివిధ నగరాలు, పట్టణాలకు విమానాలను నడుపుతోంది. 19 పొరుగు దేశాలకు సర్వీసులను అందిస్తోంది. 2005లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ తన బ్రాండ్ పేరును 'ఇండియన్'గా మార్చింది. దీని మస్కట్ కోణార్క్ సూర్య దేవాలయంలోని రథ చక్రం. దేశంలోని సాధారణ విమానాశ్రయాలను 'నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా' నిర్వహించేది.

వాయుదూత్: సరకుల రవాణా కోసం 1981 లో దీన్ని ప్రారంభించారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాలు నడవని ప్రాంతాలు, ముఖ్యంగా దట్టమైన అడవులున్న ఈశాన్య ప్రాంతాలకు ప్రయాణికుల కోసం ఈ సర్వీసులను ఉపయోగించారు. దీన్ని 1993లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో విలీనం చేశారు.

పవన్‌హన్స్ లిమిటెడ్: దీన్ని 1985 అక్టోబర్ 15న స్థాపించారు. దీని కేంద్ర కార్యాలయం ఢిల్లీలో ఉంది. పెట్రోలియం స్థావరాలకు సహాయం కోసం ఇది ఏర్పాటైంది. తర్వాతి కాలంలో కొండ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలు, ఎన్టీపీసీ, గెయిల్, బీఎస్ఎఫ్ లాంటి సంస్థలకు సేవలందించేందుకు విస్తరించారు.

- ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీలో పైలట్లకు శిక్షణ ఇస్తారు. ఇది ఉత్తర ప్రదేశ్‌లోని ఫుర్‌సత్‌గంజ్‌లో ఉంది. మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తోంది.
- బెంగళూరులోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ విమానాల తయారీ, రిపేర్లను నిర్వహిస్తోంది.

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా: నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలను విలీనం చేసి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాను 1995 ఏప్రిల్ 1న ఏర్పాటు చేశారు.

- ప్రస్తుతం ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(AAI) కింద మూడు సంస్థలు పనిచేస్తున్నాయి. అవి
  1. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ డివిజన్
  2. నేషనల్ ఎయిర్‌పోర్ట్ డివిజన్
  3. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్
- 1990లో ప్రవేశపెట్టిన ఓపెన్ స్కై పాలసీ వల్ల ప్రైవేటు రంగంలో 8 ప్యాసింజర్ ఎయిర్‌వేస్ ప్రారంభమయ్యాయి. అవి
  1. జెట్ ఎయిర్‌వేస్
  2. కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్
  3. ఇండిగో ఎయిర్‌వేస్ 4. స్పైస్‌జెట్
  5. జెట్‌లైట్ 6. గో ఎయిర్‌వేస్
  7. పారామౌంట్ ఎయిర్‌వేస్
  8. దక్కన్ ఏవియేషన్

అంతర్జాతీయ విమానాశ్రయాలు

1. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు పాలెం)	న్యూఢిల్లీ
2. నేతాజీ సుభాస్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు - డమ్‌డమ్)	కోల్‌కతా
3. ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు శాంతాక్రాజ్, సహారా)	ముంబై (మహారాష్ట్ర)
4. అన్నాదురై అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు మీనంబాకం)	చెన్నై (తమిళనాడు)
5. నిడుంబస్సేరి అంతర్జాతీయ విమానాశ్రయం	తిరువనంతపురం (కేరళ)
6. గురురామ్‌దాస్‌జీ/రాజాసాన్సీ అంతర్జాతీయ విమానాశ్రయం	అమృత్‌సర్ (పంజాబ్)
7. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం	శంషాబాద్ (హైదరాబాద్)
8. లోకప్రియ గోపీనాథ్ బర్దోలియా అంతర్జాతీయ విమానాశ్రయం	గువాహటి (అసోం)
9. సర్దార్ వల్లభభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం	అహ్మదాబాద్(గుజరాత్)
10. వీర సావర్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం	పోర్ట్‌బ్లెయిర్ (అండమాన్ నికోబార్ దీవులు)
11. దేవి అహల్యాబాయి అంతర్జాతీయ విమానాశ్రయం	ఇండోర్ (మధ్యప్రదేశ్)
12. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం	నాగపూర్ (మహారాష్ట్ర)
13. గయా అంతర్జాతీయ విమానాశ్రయం	గయ (బీహార్)
14. బెంగళూరు/ దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయం	బెంగళూరు (కర్ణాటక)
15. రాజాభోజ్ అంతర్జాతీయ విమానాశ్రయం	భోపాల్ (మధ్యప్రదేశ్)
16. జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయం	జైపూర్ (రాజస్థాన్)
17. వాస్కోడగామా అంతర్జాతీయ విమానాశ్రయం	పనాజి (గోవా)

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ

మాదిరి ప్రశ్నలు

1. ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ ఎక్కడ ఉంది?
   1) ఢిల్లీ 2) ఝాన్సీ
   3) చిత్తరంజన్ 4) ఫుర్‌సత్‌గంజ్
2. పవన్‌హన్స్ లిమిటెడ్ హెలికాప్టర్ సర్వీసుల్ని ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1953 2) 1985
   3) 1990 4) 1995
3. అన్నాదురై అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడ ఉంది?
   1) న్యూఢిల్లీ 2) కొచ్చిన్
   3) చెన్నై 4) కోల్‌కతా
4. భారత ప్రభుత్వం వాయు రవాణాను ఏ సంవత్సరంలో జాతీయం చేసింది?
   1) 1953 2) 1948
   3) 1969 4) 1990
5. దేవి అహల్యాబాయి అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడ ఉంది?
   1) ఇండోర్ 2) పోర్ట్‌బ్లెయిర్
   3) అమృత్‌సర్ 4) గౌహతి
6. కింది వాటిలో ఏ అంతర్జాతీయ విమానాశ్రయానికి డమ్‌డమ్ అనే పేరుండేది?
   1) ఇందిరా గాంధీ
   2) నేతాజీ సుభాష్ చంద్రబోస్
   3) ఛత్రపతి శివాజీ
   4) రాజీవ్ గాంధీ
7. వాయు రవాణాలో ఓపెన్ స్కై పాలసీని ప్రవేశపెట్టిన సంవత్సరం?
   1) 1985 2) 1953
   3) 1990 4) 1995
8. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏ నగరంలో ఉంది?
   1) ముంబై 2) నాగపూర్
   3) జైపూర్ 4) పుణే
9. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1990 2) 1985
   3) 1981 4) 1995
10. పాలెం(ఇందిరా గాంధీ) అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడ ఉంది?
    1) శంషాబాద్ 2) కోల్‌కతా
    3) న్యూఢిల్లీ 4) అమృత్‌సర్
11. భారతదేశంలో అతి పొడవైన రన్‌వే ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయం?
    1) ఇందిరా గాంధీ 2) రాజీవ్ గాంధీ
    3) ఛత్రపతి శివాజీ 4) అన్నాదురై
12. శాంతాక్రాజ్ అనే పేరున్న అంతర్జాతీయ విమానాశ్రయం?
    1) ఇందిరాగాంధీ
    2) నేతాజీ సుభాష్ చంద్రబోస్
    3) ఛత్రపతి శివాజీ
    4) సర్దార్ వల్లభభాయ్ పటేల్

సమాధానాలు

1) 4 2) 2 3) 3 4) 1
5) 1 6) 2 7) 3 8) 2
9) 4 10) 3 11) 2 12) 3

గతంలో అడిగిన ప్రశ్నలు

1. హైదరాబాద్‌లోని నూతన అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎవరి పేరు పెట్టారు? (Police Constables-2009)
   1) ఇందిరా గాంధీ
   2) మహాత్మా గాంధీ
   3) రాజీవ్ గాంధీ
   4) జవహర్‌లాల్ నెహ్రూ
2. ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న నగరం? (Prohibition & Excise Constable-2013)
   1) ముంబై 2) చెన్నై
   3) పుణే 4) అహ్మదాబాద్
3. జతపరచండి. (S.I.-2011)

పట్టిక-1 విమానాశ్రయం	పట్టిక-2 స్థలం
ఎ. మీనంబాకం	1. ఢిల్లీ
బి. సాంతాక్రజ్	2. కోల్‌కతా
సి. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం	3. చెన్నై
డి. డమ్‌డమ్	4. ముంబై

కోడ్‌లు:

	ఎ	బి	సి	డి
1)	1	4	3	2
2)	3	4	1	2
3)	3	2	1	4
4)	2	3	4	1
5)	1	2	4	3

4. కిందివాటిలో ఏ రాష్ట్రంలో ఎక్కువ డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్‌లు ఉన్నాయి? (Deputy Jailors-2012)
   1) కర్ణాటక 2) తమిళనాడు
   3) ఆంధ్రప్రదేశ్ 4) గుజరాత్

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 4

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ హైదరాబాద్‌లో వివిధ ఖాళీలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్ వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 04.
- **ఖాళీల వివరాలు:** పోస్టు-డాక్టోరల్ రీసెర్చ్ ఫెలో-01, రీసెర్చ్ అసోసియేట్-01, జూనియర్ రీసెర్చ్ ఫెలో-01, ప్రాజెక్ట్ అసిస్టెంట్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, పీహెచ్‌డీ(సీఎస్ఈ/ఈసీఈ/ఈఈఈ)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు పోస్టు-డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోకు రూ.85,000, రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.58,000, జూనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.37,000, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.20,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 17.08.2025.
- **వెబ్‌సైట్:** https://iith.ac.in/

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 4,987 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టులు

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో.. సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 4,987.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి. దరఖాస్తు చేసిన రాష్ట్రానికి సంబంధించిన డొమైసిల్(నివాస ధ్రువీకరణ పత్రం) సర్టిఫికేట్ తప్పనిసరి, సంబంధిత రాష్ట్రం/ప్రాంత భాష చదవడం, రాయడం, మాట్లాడడం వచ్చి ఉండాలి. ఇంటెలిజెన్స్ పనిలో ఫీల్డ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.
- **వయసు:** 17.08.2025 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** రూ.21,700 నుంచి రూ.69,100+కేంద్ర ప్రభుత్వ అలవెన్సులు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 26.07.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.08.2025.
- **ఆఫ్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించడానికి చివరితేది:** 19.08.2025
- **వెబ్‌సైట్:** https://www.mha.gov.in/

భూమి మీద మొదట నివసించిన జీవులు ఏవి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ



మాదిరి ప్రశ్నలు

1. కార్డేటాలలో ఏ నిర్మాణం ఉండటాన్ని ముఖ్య లక్షణంగా పేర్కొంటారు?
   1) హృదయం 2) చర్మం
   3) మెదడు 4) పృష్ఠవంశం
2. జీవశాస్త్రంలో విచిత్ర జీవులుగా వేటిని పేర్కొంటారు?
   1) హెమీ కార్డేట్‌లు 2) సెఫలో కార్డేట్‌లు
   3) యూరో కార్డేట్‌లు 4) కార్డేట్‌లు
3. సకశేరుకాల ఉద్భవానికి సంబంధించిన డింభకం ఏది?
   1) బైపిన్నేరియా లార్వా
   2) బఫియోప్లూటియస్
   3) ఆరిక్యులేరియా 4) ఎఖైనోప్లూయస్
4. 'శీతల రక్త జీవులు (బాహ్యోష్ణ సకశేరుకాలు)'గా వేటిని పేర్కొంటారు?
   1) చేపలు 2) ఉభయచరాలు
   3) సరీసృపాలు 4) పైవన్నీ
5. కింది వాటిలో 'ఉష్ణరక్త జీవులు (అంతరోష్ణ సకశేరుకాలు)' ఏవి?
   1) సరీసృపాలు 2) పక్షులు
   3) క్షీరదాలు 4) 2, 3
6. అధిక సంఖ్యలో ఉన్న సకశేరుకాలేవి?
   1) చేపలు 2) ఉభయచరాలు
   3) సరీసృపాలు 4) పక్షులు
7. చేపల్లో ఏవిధమైన హృదయం ఉంటుంది?
   1) సిరా హృదయం 2) ధమని హృదయం
   3) మిశ్రమ హృదయం 4) ఏదీకాదు
8. చేపల హృదయం విశిష్ట లక్షణం ఏది?
   1) మంచి రక్తం ప్రవహించడం
   2) చెడు రక్తం ప్రవహించడం
   3) మిశ్రమ రక్తం ప్రవహించడం
   4) ఎలాంటి రక్తం ప్రవహించకపోవడం
9. విచ్ఛిన్న విస్తరణను ప్రదర్శించే చేపలు ఏవి?
   1) నియోసెరటోడస్ 2) ప్రోటాప్టిరస్
   3) లెపిడో సైరస్ 4) పైవన్నీ
10. కాలేయ నూనెకు ప్రసిద్ధమైన చేప?
    1) స్టోన్ ఫిష్ 2) బ్లూవేల్
    3) కాడ్ ఫిష్ 4) సిల్వర్ ఫిష్
11. దోమ డింబకాలను ఆహారంగా తీసుకుంటూ మలేరియా వ్యాధి నివారణకు దోహదపడే చేపలు ఏవి?
    1) ఎక్సోసీటస్ 2) హిప్పోకాంపస్
    3) గాంబూసియా యుసినిస్ 4) పైవేవీ కావు
12. కింది వాటిలో నిజమైన చేపలు ఏవి?
    1) జెల్లీ ఫిష్ 2) సిల్వర్ ఫిష్
    3) కటిల్ ఫిష్ 4) షార్క్ ఫిష్
13. ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన చేప?
    1) స్టోన్ ఫిష్ 2) గోల్డెన్ ఫిష్
    3) సిల్వర్ ఫిష్ 4) స్టార్ ఫిష్
14. బెంగాలీలకు ప్రీతిపాత్రమైన హిల్సా చేప 1 కిలోల బరువు పెరుగడానికి ఎన్నేళ్లు పడుతుంది?
    1) 4 2) 3 3) 2 4) 5
15. ఇక్తియాలజీ అనేది వేటి గురించి అధ్యయనం చేసే శాస్త్రం? (Tech.Asst. in Archaeology-2012)
    1) చేపలు 2) సరీసృపాలు
    3) పక్షులు 4) క్షీరదాలు
16. బొటనవేలు లేకపోవడం అనేది కింది వాటిలో ఏ జీవి లక్షణం?
    1) కోతి 2) మానవుడు
    3) కుందేలు 4) కప్ప
17. భూమి మీద మొదట నివసించిన జీవులు ఏవి?
    1) తొండలు 2) డిప్నాయ్ చేపలు
    3) కప్పలు 4) సర్పాలు
18. రెడ్ ఇండియన్లు బాణాల చివరన విషంగా ఏ కప్ప చర్మగ్రంథుల స్రావాలను పూస్తారు?
    1) హైలా 2) రాకోఫోరస్
    3) పిల్లోబేటస్ 4) ఎలైటస్
19. కింది వాటిలో ప్రపంచంలో అత్యంత విషపూరిత ఉభయచరాల్లో ఒకటి ఏది? (Gr-II, 2005)
    1) బ్లూ డార్ట్ మండూకం 2) రాటిల్ స్నేక్
    3) స్పెర్మ్ వేల్ 4) గ్రీన్ టర్టిల్
20. బాహ్య ఫలదీకరణం జరిపే జీవులు ఏవి?
    1) చేపలు 2) కప్పలు
    3) బల్లులు–పాములు 4) 1, 2
21. టాడ్‌పోల్ లార్వా రూప విక్రియను నియంత్రించే హార్మోన్ ఏది?
    1) అడ్రినలిన్ 2) థైరాక్సిన్
    3) ఈస్ట్రోజన్ 4) ఆక్సిటోసిన్
22. 'వేసవి కాల నిద్ర' అంటే ఏమిటి?
    1) శీతాకాల సుప్తావస్థ
    2) ప్రతికూల పరిస్థితులు
    3) గ్రీష్మకాల సుప్తావస్థ 4) కోమా
23. స్పాన్ అంటే..?
    1) కప్ప అండాల సమూహం
    2) పుట్టగొడుగుల విత్తనాలు
    3) కప్ప శుక్రకణాల సమూహం 4) 1, 2
24. రెండు కర్ణికలు, ఒక జఠరికతో కూడిన హృదయం ఏ జీవుల్లో ఉంటుంది?
    1) చేపలు 2) కప్పలు
    3) పాములు 4) పక్షులు–క్షీరదాలు
25. కప్పల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
    1) ఇక్తియాలజీ 2) బాట్రకాలజీ
    3) టార్పిడాలజీ 4) ఓఫియాలజీ
26. రూప విక్రియ ప్రదర్శించే జీవి ఏది?
    1) పాము 2) కప్ప
    3) హైడ్రా 4) చేప
27. మెడ, తోక, పొలుసులు లోపించిన జీవులు ఏవి?
    1) చేపలు 2) కప్పలు
    3) సరీసృపాలు 4) పక్షులు
28. సర్పాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) కదిలే కనురెప్పలు ఉంటాయి
    2) కదలని కనురెప్పలు ఉంటాయి
    3) కనురెప్పలు ఉండవు
    4) నిమేశక పటలం ఉంటుంది
29. విషసర్పాల్లో విషగ్రంథులు వేటి రూపాంతరం?
    1) ఆస్య గ్రంథులు
    2) లాలాజల గ్రంథులు
    3) తైల గ్రంథులు 4) అశ్రు గ్రంథులు
30. కింది వాటిలో పాము కరిచినప్పుడు విరుగుడుగా పనిచేసే మంచి ఇంజెక్షన్ ఏది?
    1) పెన్సిలిన్ 2) యాంటీవీనమ్
    3) యాంటీబయాటిక్ 4) స్ట్రెప్టోమైసిన్
31. నాగుపామును దేని ఆధారంగా గుర్తిస్తారు?
    1) నలుపురంగు 2) పడగ
    3) రాళ్లలో నివసించడం వల్ల
    4) పడగ, మూడో అధిపోష్ఠ పొలుసు
32. సర్పాల్లో మధ్య చెవి ఉండదు. అవి శబ్దాలను వేటి ద్వారా గ్రహిస్తాయి?
    1) నాలుక 2) చర్మం
    3) ముట్టె 4) గాలి
33. పాము విషానికి విరుగుడు ఇంజెక్షన్లను ఎక్కడ తయారు చేస్తున్నారు?
    1) A.C.D., ఢిల్లీ
    2) IICT, హైదరాబాద్
    3) హాఫ్‌కిన్ ఇన్‌స్టిట్యూట్, ముంబై
    4) పింపు, పుణే
34. సరీసృపాలన్నింటిలో మొసళ్లలో ఉన్న ప్రత్యేక లక్షణం ఏది?
    1) దృఢమైన దవడ కండరాలు
    2) నేలమీదకు రాగలిగే శక్తి
    3) నాలుగు గదుల గుండె
    4) అండం చుట్టూ గట్టి పెంకు ఉండటం
35. పక్షుల్లో ఉండే ప్రధాన లక్షణం?
    1) ముక్కు 2) రెక్కలు
    3) పొలుసులు 4) ఈకలు
36. పాముల గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
    1) ఇక్తియాలజీ 2) ఓఫియాలజీ
    3) లెపిడాప్టరాలజీ 4) ఎంటమాలజీ
37. కింది వాటిలో శిశుత్పాదక సర్పం ఏది?
    1) కోబ్రా 2) కట్లపాము
    3) రక్తపింజర 4) రాట్ సర్పం
38. రక్తపింజర విషం ఏ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది?
    1) జీర్ణ వ్యవస్థ 2) రక్తప్రసరణ వ్యవస్థ
    3) శ్వాస వ్యవస్థ 4) విసర్జన వ్యవస్థ
39. నాగుపాము విషం ఏ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది?
    1) శ్వాస వ్యవస్థ 2) రక్తప్రసరణ వ్యవస్థ
    3) నాడీ వ్యవస్థ 4) జీర్ణ వ్యవస్థ
40. చలనంలో సర్పాలకు సహాయపడేవి ఏవి?
    1) తల 2) పొలుసులు
    3) పర్శుకలు 4) తోక
41. అతి తక్కువ కాలం చూలు మోసే జీవి?
    1) మేక 2) గుర్రం
    3) అపోజం 4) చుంచెలుక
42. కింది వాటిలో విష సర్పం కానిది?
    1) సముద్ర సర్పం 2) కట్లపాము
    3) రక్తపింజర 4) పైథాన్
43. కింది వాటిలో విష సర్పం ఏది?
    1) పైథాన్ 2) కట్లపాము
    3) ట్రీ స్నేక్ 4) రాట్ స్నేక్
44. ఒక వ్యక్తి కాలికి ఏదో జీవి కరవడం వల్ల రెండు గాట్లు పడ్డాయి. ఆ గాట్ల ఆధారంగా కింది వాటిలో అది ఏ జీవి అయి ఉండవచ్చు?
    1) తేలు 2) ఎలుక
    3) విషరహిత సర్పం 4) విషపూరిత సర్పం
45. పరిసరాలను బట్టి రంగులు మార్చేది?
    1) పిల్లి 2) ఎలుక
    3) ఊసరవెల్లి (కెమీలియాన్) 4) తొండ
46. కింది వాటిలో దీర్ఘకాలం జీవించే జంతువు?
    1) ఏనుగు 2) ఒంటె
    3) నక్క 4) తాబేలు
47. డైనోసార్ ఒక...? (UPSC-1989)
    1) సరీసృపం 2) ఉభయచరం
    3) క్షీరదం 4) పక్షి
48. 'డైనోసార్' అనే పదానికి అర్థం?
    1) ఘోర పాకుడు జంతువు
    2) భయంకరమైన పాకుడు జంతువు
    3) ఘోర బల్లి 4) అధమ పాకుడు జంతువు
49. కింది వాటిలో ఎగిరే డైనోసార్‌గా ప్రసిద్ధి చెందింది ఏది? (Polytechnic College, Lecturers)
    1) స్టైనోసారస్ 2) టైరోసారస్
    3) అర్జంటినో సారస్ 4) ఏదీకాదు
50. విషం గురించి అధ్యయనం చేసే శాస్త్రం? (Asst.social welfare officer in A.P. 2012)
    1) మార్ఫాలజీ 2) ఆస్టియాలజీ
    3) టాక్సికాలజీ 4) కాంకాలజీ
51. భూమిపై అతి పెద్ద పక్షి ఏది? (Asst.social welfare officer in A.P. 2012)
    1) ఈము 2) ఆస్ట్రిచ్
    3) ఆల్ బట్రాస్ 4) సైబీరియన్ క్రేన్
52. కింది వాటిలో దేనిలో వాతులాస్థులు ఉంటాయి?
    1) గబ్బిలం 2) తిమింగలం
    3) పక్షులు 4) ఎక్సోసీటస్
53. పక్షుల్లో కనిపించే దృష్టి లక్షణం ఏది?
    1) మోనాక్యులార్-టెలిస్కోపిక్ దృష్టి
    2) బైనాక్యులర్-మయోపిక్ దృష్టి
    3) బైనాక్యులర్-టెలిస్కోపిక్ దృష్టి
    4) మోనాక్యులర్- మయోపిక్ దృష్టి
54. పక్షుల గురించి అధ్యయనం చేసే శాస్త్రం? (Gr-II, 2012)
    1) హెర్పిటాలజీ 2) ఆర్నిథాలజీ
    3) ఇథాలజీ 4) ఫినాలజీ
55. కింది వాటిలో పక్షుల్లో ఏవి ఉండవు? (Gr-II, 2001)
    1) నరాలు 2) చెమట గ్రంథులు
    3) కనురెప్పలు 4) వాతులాస్థులు
56. నేలపై అతి వేగంగా పరుగెత్తే జంతువు? (Gr-I, 1998)
    1) లేడి 2) చిరుతపులి
    3) గుర్రం 4) పెద్దపులి
57. స్వేద గ్రంథులు లేని క్షీరదం?
    1) కోతి 2) ఆవు
    3) తిమింగలం 4) పంది
58. గబ్బిలం, తిమింగలం ఏ వర్గానికి చెందినవి?
    1) పక్షులు 2) సరీసృపాలు
    3) క్షీరదాలు 4) ఉభయచరాలు
59. కింది వాటిలో క్షీరదాల అత్యంత ప్రధాన లక్షణం ఏది?
    1) హెమియోథర్మిక్ 2) విభాజక పటలం
    3) శిశు ఉత్పాదకాలు 4) డైకాండైలిక్
60. ఏ జీవికి వేళ్లు ఉండవు కానీ, గోళ్లు ఉంటాయి?
    1) కంగారు 2) అపోజం
    3) బ్లూవేల్ 4) ఒంటె
61. గుడ్లు పెట్టే క్షీరదం?
    1) డక్‌బిల్ ప్లాటిపస్ 2) ఎకిడ్నా
    3) గబ్బిలం 4) 1, 2
62. ప్రపంచంలో అతి పెద్ద ప్రాణి ఏది? (Gr-I, 1998)
    1) ఇండియా ఏనుగు 2) బ్లూవేల్
    3) డైనోడాన్ 4) ఆఫ్రికా ఏనుగు
63. మానవుడి తర్వాత అతి తెలివైన క్షీరదం? (S.I.-2008)
    1) బ్లూవేల్-తిమింగలం 2) డాల్ఫిన్
    3) ఆఫ్రికా ఏనుగు 4) కంగారు
64. జంతువుల ప్రవర్తనను అధ్యయనం చేసే శాస్త్రం ఏది? (Gr-I, 2010)
    1) ఎంటమాలజీ 2) ఇథాలజీ
    3) ఎకాలజీ 4) యూజెనిక్స్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 3; 4) 4; 5) 4;
6) 1; 7) 1; 8) 3; 9) 4; 10) 3;
11) 3; 12) 4; 13) 1; 14) 2; 15) 1;
16) 4; 17) 3; 18) 3; 19) 1; 20) 4;
21) 2; 22) 3; 23) 4; 24) 2; 25) 2;
26) 2; 27) 2; 28) 3; 29) 2; 30) 2;
31) 4; 32) 2; 33) 3; 34) 3; 35) 4;
36) 2; 37) 3; 38) 2; 39) 3; 40) 3;
41) 3; 42) 4; 43) 2; 44) 4; 45) 3;
46) 4; 47) 1; 48) 2; 49) 2; 50) 3;
51) 2; 52) 3; 53) 1; 54) 2; 55) 2;
56) 2; 57) 3; 58) 3; 59) 2; 60) 3;
61) 4; 62) 2; 63) 2; 64) 2.

The antonym of Critical is..

BANK EXAMS

GENERAL ENGLISH



Directions (Q.No. 1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Climate change poses potentially devastating effects on India's agriculture. While the overall parameters of climate change are increasingly accepted – a 1 °C average temperature increase over the next 30 years, sea level rise of less than 10 cm in the same period, and regional monsoon variations and corresponding droughts- the impacts in India are likely to be quite site and crop specific. Some crops may respond favourably to the changing conditions, others may not. This emphasizes the need to **promote** agricultural research and create maximum flexibility in the system to permit adaptations.

The key ingredient for "drought proofing" is the managed recharge of aquifers. To ensure continued yields of important staple crops, it may also be necessary to shift the locations where these crops are grown, in response to temperature changes as well to water availability. The latter will be a key factor in making long term investment decisions.

For example, water runoff from the Himalayas is predicted to increase over the next 30 years as glaciers melt, but then decline substantially thereafter. It will be **critical** to provide incentives to plan for these large-scale shifts in agro-ecological conditions.

India needs to make long term investment in research and development in agriculture. India is likely to experience changed weather patterns in future.

1. Consider the following statements: Climate change may force the shifting of locations of the existing crops due to
   a) Melting of glaciers
   b) Water availability and temperature suitability at other locations
   c) Poor productivity of crops
   d) Wider adaptability of crop plants
   Which of the statements given above are correct?
   1) a, b, & c 2) b & c only
   3) a & d only 4) a & c
   5) a, b, c, & d
2. To promote agricultural research in India is important because:
   1) To predict variations in monsoon patterns and to manage water resources.
   2) To make long term investment decisions for economic growth.
   3) To facilitate wider adaptability of crops.
   4) To predict drought conditions and to recharge aquifers.
   5) Changed weather patterns in future.
3. The spillover from the Himalayas is due to
   1) large-scale shifts in agro-ecological conditions.
   2) changed weather patterns in future 3) productivity of crops
   4) melting of glaciers
   5) adaptability of crop plants
4. The antonym of **Critical** is
   1) waver 2) steady 3) unsure
   4) insecure 5) fasten
5. The synonym of **promote** is
   1) encompass 2) encourage
   3) entangle 4) entrust 5) encode

Directions (Q.No. 06-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. There is a ____ gap between rich and poor.
   1) vary 2) variety 3) similar
   4) reported 5) yawning
7. She ____ to escape from her office job.
   1) earned 2) yelled 3) yearned
   4) yielded 5) learn
8. The seriousness of the situation is ____ to appreciate in its ____.
   1) easy; complete
   2) different; wholesome
   3) difficult; totality
   4) hard; completeness
   5) tough; compliment
9. The new policy was adopted in the ____ of fierce ____.
   1) wake; opponent
   2) show; postponement
   3) teeth; criticism
   4) course; outcome
   5) reality; injustice
10. The computer is now an ____ tool for the family doctor.
    1) value 2) valid
    3) price 4) worth
    5) invaluable

Directions: (Q.No. 11-15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The magazine is issued year two times.
    1) year twice 2) twice yearly
    3) yearly two 4) two yearly
    5) no correction required
12. She yelled at the child to getting down from the wall.
    1) got down 2) get down
    3) getting away 4) get upon
    5) no correction required
13. All her yesterday's has vanished without a trace.
    1) Have 2) had
    3) has been 4) have being
    5) no correction required
14. My son's 13 but he's younger for his age.
    1) Youngest 2) youth
    3) older 4) young
    5) no correction required
15. When the needle enters the red zone the engine is indicator hot.
    1) Too 2) much
    3) becomes 4) left
    5) no correction required

Directions (Q.No. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. Exam results (1)/ are not the only (2)/ yard stick of a (3)/ school performance. (4)/ no error (5)
17. I have always (1)/ had a yen (2)/ to travel (3)/ around the world. (4)/ no error (5)
18. Because of the rapid progress (1)/ that science has made (2)/ the universe is slow yielding (3)/ up its secrets. (4)/ no error (5)
19. She brings to the job (1)/ a rare combination (2)/ of youth and (3)/ experiences. (4)/ no error (5)
20. The group was made up of (1)/ people with a range of age, (2)/ professions, incomes and (3)/ computer expertise. (4)/ no error (5)
21. Between 1957 and 2007 expenditures (1)/ in all 5 categories changed to some extent, (2)/ but the most marked change (3)/ was in the food category. (4)/ no error (5)
22. It seems that the man (1)/ who is dropping (2)/ off his own water bottle in the recycling bin (3)/ drove there in his car. (4)/ no error (5)
23. Reality TV shows involve real people perform (1)/ ridiculous and often dangerous acts (2)/ and generally behaving horribly (3)/ towards each other. (4)/ no error (5)
24. It is a legal requirement (1)/ for airline operators to provide (2)/ suitable refreshment (3)/ in the event of a long delay. (4)/ no error (5)
25. For some people, the huge increase in public surveillance (1)/ is a threat to the individual's social liberties (2)/ and was a sign that society (3)/ is becoming increasingly authoritarian. (4)/ no error (5)

Directions (Q.No. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. Several **alarming** (1) incidents **occurred in** recent years (2) and **was widely** (3) **reported in** (4) the press.
27. **A** (1) general public should **rise to** (2) address the **social evil of** (3) corporal **punishment.** (4)
28. The teacher **was sought** (1) not only for imparting knowledge **and** (2) skills to students **but for also** (3) shaping their minds **and character.** (4)
29. **Prolonged** (1) television **viewvers** (2) have a higher **risk of** (3) fatal pulmonary **embolism.** (4)
30. **I want to** (1) travel to **sea** (2) the world **around** (3) and appreciate new **cultures.** (4)

Directions (Q.No. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Thomas Smart conferred upon Sastri the appellation "Silver Tongued Orator of the British Empire" and he was so called all over the United Kingdom.
B) Srinivasa Sastri was known for his mastery over the English language and his oratory. As a student, he once corrected a few passages in J. C. Nesfield's "English Grammar".
C) The Master of Balliol, Arthur Lionel Smith swore that he had never realized the beauty of the English language until he heard Sastri, while Lord Balfour remarked that listening to Srinivasa Sastri made him realize the heights to which the English language could rise.
D) Whenever he was on visit to the United Kingdom, Sastri was often consulted over spellings and pronunciations.
E) Srinivasa Sastri's inspirations were William Shakespeare, Sir Walter Scott, George Eliot, John Stuart Mill, Thomas Harvey, Victor Hugo and Valmiki - Indian sage and the author of the Hindu epic Ramayana.
F) His mastery over the English language was recognized by King George V, Winston Churchill, Lady Lytton and Lord Balfour who rated him amongst the five best English-language orators of the century.

31. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
33. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
34. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) E 5) F
35. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q.No. 36-40): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) pedagogue 2) vilify
    3) extraneous 4) bucollic
    5) conundrum
37. 1) powwow 2) malignant
    3) untenable 4) capricious
    5) dissipete
38. 1) railery 2) splenetic
    3) palaver 4) lachrymose
    5) tenacity

Answers

1) 1; 2) 4; 3) 4; 4) 2; 5) 2;
6) 5; 7) 3; 8) 3; 9) 3; 10) 5;
11) 2; 12) 2; 13) 2; 14) 4; 15) 1;
16) 3; 17) 5; 18) 3; 19) 4; 20) 2;
21) 1; 22) 4; 23) 1; 24) 3; 25) 3;
26) 3; 27) 1; 28) 3; 29) 2; 30) 2;
31) 1; 32) 4; 33) 2; 34) 1; 35) 3;
36) 4; 37) 5; 38) 1;